సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 336

గురువారం 26-2-2026

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

**తప్పు చేశా.. క్షమించండి**

గేట్స్ ఫౌండేషన్ సిబ్బందికి బిల్ గేట్స్ విజ్ఞప్తి

6 లో

**ఉగ్రవాదం.. పెనుముప్పు**

దానిపై పోరులో రాజీ లేదు: మోదీ

భారత్, ఇజ్రాయెల్‌ది ఒకే వైఖరి

6 లో

## హామీలు నెరవేర్చకపోతే

# గద్దె దింపుతాం

**బాబు ప్రభుత్వానికి ఉపాధ్యాయుల హెచ్చరిక**

**ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై ఇంకెన్నాళ్లు మౌనం?**

- ప్రభుత్వం ఇదే తీరులో ఉంటే అసెంబ్లీ ముట్టడి తప్పదు
- ఒత్తిడి పెంచే విధానాలు రద్దు చేయాలి..
- ఆర్థిక ప్రయోజనాలు వెంటనే విడుదల చేయాలి
- 12వ పీఆర్సీ వెంటనే నియమించాలి.. 30 శాతం ఐఆర్ ప్రకటించాలి
- 4 పెండింగ్ డీఏల్లో కనీసం రెండింటిని వెంటనే ఇవ్వాలి
- రూ.35 వేల కోట్ల పెండింగ్ బకాయిలను ఎప్పుడు చెల్లిస్తారో స్పష్టం చేయాలి
- ఉపాధ్యాయుల మహాధర్నాతో దద్దరిల్లిన విజయవాడ

3 లో

విజయవాడలో జరిగిన ధర్నాలో భారీగా పాల్గొన్న ఉపాధ్యాయులు

## కోర్టులను మూసేయండి

- కోర్టు ఆదేశాలు అమలు చేసే ఉద్దేశం లేకపోతే ఆ పనే చేయండి
- ప్రజలకు, కక్షిదారులకు న్యాయం చేయలేకపోతే ఇక కోర్టులెందుకు?
- సీఎస్‌పై నిప్పులు చెరిగిన హైకోర్టు
- సీఎస్‌ను నాలుగు రోజులు జైల్లో ఉంచితే అందరూ దారిలోకి వస్తారు

16 లో

## అధైర్య పడొద్దు..

# వచ్చేది మన ప్రభుత్వమే

వైఎస్సార్ కడప జిల్లా నందిపల్లిలోని శ్రీ నందీశ్వర ఆలయంలో నిర్వహించిన నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో హారతి స్వీకరిస్తున్న వైఎస్ జగన్

- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు వైఎస్ జగన్ భరోసా
- టీడీపీ అరాచకాలను పార్టీ శ్రేణులు ధైర్యంగా ఎదుర్కోవాలి
- పోరాట పంథాను ఎంచుకుని ముందుకు సాగాలి
- కష్టాలు ఎల్లకాలం ఉండవు.. అందరికీ మంచి జరుగుతుంది
- చంద్రబాబు ప్రభుత్వ తీరు దారుణం
- కష్టకాలంలో కార్యకర్తలకు నేతలు అండగా నిలవాలని పిలుపు

3 లో

బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్స్ వల్ల కలిగే ప్రయోజనాలు

- ఈక్విటీ మరియు డెట్ ఇన్‌స్ట్రుమెంట్స్‌లో పెట్టుబడి
- మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా డైనమిక్ ఎసెట్ కేటాయింపులు
- కాల క్రమేణా హెచ్చుతగ్గులను అదుపుచేయడమే లక్ష్యం

మరిన్ని వివరాలు తెలుసుకోవడానికిడస్కాన్ చేయండి

ఇన్వెస్టర్‌కి విద్య మరియు అవగాహన కల్పించే కార్యక్రమం

SIP – సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ | మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడిపెట్టేందుకు ఒకసారి కావలసిన నో యువర్ కస్టమర్ (కెవైసి) పూర్తిచేసే ప్రక్రియ గురించి మరింతగా తెలుసుకునేందుకు https://www.hdfcfund.com/information/key-know-how సందర్శించండి. రిజిస్టర్డు మ్యూచువల్ ఫండ్స్‌తో మాత్రమే ఇన్వెస్టర్‌లు డీల్ చేయాలి, వీటి వివరాలను సెబీ వెబ్‌సైట్‌లో (www.sebi.gov.in/intermediaries.html) నిర్ధారించుకోవచ్చు. ఏవైనా ప్రశ్నలు, ఫిర్యాదులు మరియు గ్రీవెన్స్ పరిష్కారం కోసం, ఇన్వెస్టర్‌లు ఎఎంసిలు మరియు/లేదా ఇన్వెస్టర్ రిలేషన్స్ ఆఫీసర్స్‌ని సంప్రదించవచ్చు. ఇంకా, ఇన్వెస్టర్‌లు నేరుగా ఎఎంసిలకు ఫిర్యాదు చేయవచ్చు. ఒకవేళ ఎఎంసిలు ఇచ్చిన పరిష్కారాలతో వాళ్ళు అసంతృప్తిగా ఉంటే https://scores.sebi.gov.in/లో స్కోర్స్ పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు. ఇన్వెస్టర్‌లు సెబీ వద్ద ఆన్‌లైన్‌లో ఫిర్యాదు దాఖలు చేసేందుకు మరియు ఆ తరువాత దాని స్టేటస్‌ని తెలుసుకునేందుకు స్కోర్స్ పోర్టల్ వీలు కల్పిస్తుంది. ఒకవేళ ఎఎంసిలకు నేరుగా లేదా స్కోర్స్ పోర్టల్ ద్వారా లేవనెత్తిన ఫిర్యాదులను పరిష్కరించడానికి సంబంధించి ఇన్వెస్టర్ సంతృప్తిచెందకపోతే, వాళ్ళు ఫిర్యాదు దేనినైనా స్మార్ట్ ఓడిఆర్‌లో https://smartodr.in/login లో దాఖలు చేయవచ్చు. బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్స్– ఈక్విటీ మరియు డెట్ ఇన్‌స్ట్రుమెంట్స్‌లో పెట్టుబడి పెడుతున్న ఓపెన్ ఎండెడ్ బ్యాలెన్స్‌డ్ స్కీమ్

మరిన్ని వివరాల కొరకు ఎంఎఫ్‌డి/ఆర్ఐఎని సంప్రదించండి | ఎస్ఐపిల గురించి తెలుసుకోండి: hdfcfund.com/sip

మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు మార్కెట్ రిస్క్‌కి లోబడి ఉంటాయి, స్కీముకు సంబంధించిన దస్తావేజులన్నింటిని జాగ్రత్తగా చదవండి.

ALLEN Results Validated by
EY
Shape the future with confidence
ALLEN విజయవాడ
జేఈఈ మెయిన్ 2026 (సెషన్-1)
ఛాంపియన్లు
8 out of 12 Overall 100%ilers from ALLEN
18 State Toppers
1 Perfect Scorer
100 %ile Rajasthan Topper
PERFECT 300 300 SCORER
Kabeer Chhillar
Classroom Course
My teachers encouraged me to do better.
100 %ile Rajasthan Topper
Arnav Gautam
Classroom Course
I honestly felt at home at Allen
100 %ile Bihar Topper
Shubham Kumar
Classroom Course
The Allen environment kept me motivated.
100 %ile Odisha Topper
Bhavesh Patra
Classroom Course
My every doubt got cleared right on time.
100 %ile Rajasthan Topper
Chiranjib Kar
Classroom Course
Regular tests helped me improve consistently.
100 %ile Gujarat Topper
Purohit Nimay
Classroom Course
Allen gave my preparation the right direction.
100 %ile Haryana Topper
Anay Jain
Classroom Course
1:1 mentorship kept me focused every day.
100 %ile Delhi (NCT) Topper
Shreyas Mishra
Online Recorded + Test Series Course
The practice Qs. on the Allen app built my confidence!
Personal Attention
Not crowded classrooms. Focused mentoring.
• Limited Batch Size – Only 50 Students
• Dedicated Senior Faculty Doubt Counter
• Classes by Experienced Teachers
National Academic System
True Kota-level system. Now in Vijayawada.
• Standardized ALLEN Academic System
• Proven Pedagogy Delivered Across India
Expert Faculty - IITs, NITs & Medical Backgrounds | 6+ Years Avg. Exp.
Transparent Model
Clear structure. Clear path. Clear results.
• Day Scholar & Residential Programs
• Transparent Fee Structure
• Integrated Board & Competitive Exam Preparation Support
Academic Opportunities
Admissions Open Limited Seats
• Upcoming EAPCET Crash Course
• NEET Crash Course
• NEET, JEE & EAPCET 8 to 10 Foundation Courses
THEY MADE IT POSSIBLE WITH ALLEN, NOW IT'S YOUR TURN
అడ్మిషన్స్ ఓపెన్ Class 11, 12 & long term courses
(NEET, JEE & EAPCET) 8 to 10 Foundation Courses (Olympiads)
For test dates & course start dates visit website or nearest center.
SIGN UP FOR ASAT
GET UP TO 90% SCHOLARSHIP*
Test Dates 01 & 08 March 2026
Join ALLEN's 45 Day
NEET & EAPCET Crash Course
Limited Time. Maximum Impact.
Batch Starts: 19 March 2026
ALLEN
86906 60111
allen.in
*Subject to the scholarship rules and the T&Cs.
ALLEN Vijayawada
92570 60728, 96060 45068
allen.ac.in/vijayawada
Our Campuses :
Benz Circle , Gayatri Nagar (Day Scholars)
Edupugallu (Sankalpa Residential Campus)
Zonal Office
ALLEN Bengaluru
95137 63144
allen.ac.in/bengaluru
Disclaimer: We provide an academic ecosystem and environment to prepare students for their target examinations. Studying in a coaching institute does not guarantee selection for the examination. Selection depends on preparation, admission seats in competitive exam and the number of applicants appearing. All the students mentioned are part of paid courses. DLP: Distance Learning Program.

అశేష జనసందోహానికి అభివాదం చేస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

తీర్థం స్వీకరిస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్

నందీశ్వరుడికి హారతి ఇస్తున్న వైఎస్ జగన్

హోమశాలలో పూజలు చేస్తున్న వైఎస్ జగన్

# అధైర్య పడొద్దు.. వచ్చేది మన ప్రభుత్వమే

## వైఎస్సార్‌సీపీ శ్రేణులకు వైఎస్ జగన్ భరోసా

## టీడీపీ అరాచకాలను పార్టీ శ్రేణులు ధైర్యంగా ఎదుర్కోవాలి

సాక్షి ప్రతినిధి కడప : 'ఎవరూ అధైర్య పడొద్దు.. మంచి రోజులు వస్తాయి.. సమస్యలు శాశ్వతం కాదు.. వచ్చేది మన ప్రభుత్వమే.. అప్పుడు అందరికీ మంచి జరుగుతుంది' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు భరోసా కల్పించారు. టీడీపీ అరాచకాలను పార్టీ శ్రేణులు ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. కష్టాలు ఎల్లకాలం ఉండవని, ప్రతి ఒక్కరూ పోరాట పంథాను ఎంచుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలోని భాకరాపురం క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులతో మమేకమయ్యారు. వారిని ఆప్యాయంగా పలకరిస్తూ.. బాధలు, కష్టాలు, సమస్యలు వింటూ ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం చాలా దారుణంగా వ్యవహరిస్తోందని, అరాచక పాలన సాగిస్తోందని.. అకారణంగా దాడులు చేస్తోందని పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు వైఎస్ జగన్ వద్ద వాపోయారు. అందుకు ఆయన స్పందిస్తూ ఎవరూ అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు. చంద్రబాబు ప్రభుత్వం తీరు దారుణంగా ఉందని, హింసాత్మక రాజకీయాలకు పాల్పడటం మంచిది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కష్ట కాలంలో కార్యకర్తలకు అండగా నిలబడాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులకు సూచించారు.

### సమస్యలు వింటూ.. ధైర్యం చెబుతూ..

వివిధ ఇబ్బందులు ఎదుర్కొంటున్న పలువురు వైఎస్ జగన్ వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. వారి కష్టాలు విన్న ఆయన స్వయంగా పరిష్కరించగల వాటికి తక్షణమే స్పందించారు. వారి సమస్య పరిష్కారానికి ఏమి చెయ్యాలో పక్కనే ఉన్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి సూచించారు. ప్రభుత్వం నుంచి తమకు ఒక్క మేలు కూడా జరగలేదని వచ్చిన వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని వర్గాలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా నిచ్చిన వైఎస్ జగన్.. వారి పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధ పడుతున్న దివంగత వైఎస్ రాజారెడ్డి సోదరి కమలమ్మను ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. సింగిల్ విండో మాజీ చైర్మన్ ఈశ్వరయ్యను కూడా ఆయన నివాసంలో పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

నందిపల్లి నందీశ్వరాలయం వద్ద ప్రజలకు వైఎస్ జగన్ అభివాదం

### నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు

వేంపల్లె మండలం నందిపల్లిలోని శ్రీ నందీశ్వర ఆలయంలో నిర్వహించిన నూతన విగ్రహ ప్రతిష్ఠ (శ్రీ పార్వతీ దేవి సమేత మహా నందీశ్వర స్వామి), కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమంలో వైఎస్ జగన్ పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి హోమాలు, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తి శ్రద్ధలతో స్వామి వారికి అర్చన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం స్వీకరించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. దేవాలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, భక్తి మార్గం ద్వారా సమాజంలో శాంతి పెంపొందుతుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణం ద్వారా ఆధ్యాత్మిక చైతన్యం మరింత విస్తరిస్తుందని తెలిపారు. నూతన విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆలయ కమిటీ చైర్మన్ మారం శ్రీకాంత్ రెడ్డి, కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమం గ్రామ ప్రజల ఐక్యతకు నిదర్శనమని, శ్రీ నందీశ్వర స్వామి వారి కృపా కటాక్షాలు ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు.

అభిమానతరంగం వెంట రాగా..

# హామీలు నెరవేర్చకపోతే గద్దె దింపుతాం

- ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై ఇంకెన్నాళ్లు మౌనం?
- ఉపాధ్యాయుల మహాధర్నాతో దద్దరిల్లిన విజయవాడ

సాక్షి, అమరావతి: చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఉద్దేశ పూర్వకంగా నిర్లక్ష్యం చేస్తోందని ఉపాధ్యాయులు మండిపడ్డారు. తమకు ఇస్తానన్న ఆర్థిక ప్రయోజనాల విషయంలోనూ దాటవేత ధోరణి అవలంబిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు దాటుతున్నా నిర్లిప్తత ప్రదర్శిస్తోందని, తమ సమస్యలపై స్పష్టమైన ప్రకటన చేయకపోతే 'చలో అసెంబ్లీ' చేపట్టక తప్పదని హెచ్చరించారు. తమ ప్రయోజనాలను విస్మరిస్తే అధికారం నుంచి దించుతామని చంద్రబాబు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఏపీ ఎస్టీయూ) ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో ఉపాధ్యాయులు మూడో దశ మహా ధర్నాకు దిగారు. రాష్ట్ర వ్యాప్తంగా తరలి వచ్చిన ఉపాధ్యాయులు తమ సమస్యలపై ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ కదం తొక్కారు. 'సమర శంఖం' పేరుతో నిర్వహించిన ఈ ధర్నాలో పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లు రఘునాథరెడ్డి, ఎల్.సాయిశ్రీనివాస్‌తో పాటు మాజీ ఎమ్మెల్సీలు, ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొని ప్రభుత్వ తీరును ఎండగట్టారు. హామీలు ఇచ్చి అధికారంలోకి రావడం, తర్వాత వాటిని విస్మరించి, ఉద్యోగులను పట్టించుకోకుండా గాలికి వదిలేయడం పరిపాటిగా మారిందని మండిపడ్డారు. ఎంటీఎస్, కాంట్రాక్టు ఉపాధ్యాయులకు సరైన వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం వేధిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐఎస్టీఎఫ్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు కత్తి నరసింహారెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి జి.సదానంద్ గౌడ్, జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు మాట్లాడుతూ.. ఉద్యమాలు, పోరాటాల ద్వారా సాధించుకున్న ప్రయోజనాలకు మంగళం పాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులను పరాయి వారిగా చూడడం ప్రభుత్వానికి తగదన్నారు.

### హైస్కూల్ ప్లస్‌లు నిర్వీర్యం

20 నెలల కాలంలో విద్యా రంగాన్ని పూర్తిగా దిగజార్చారని, బాలికల విద్యను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం హైస్కూల్ ప్లస్‌లను ప్రారంభిస్తే.. ఈ ప్రభుత్వం వాటిల్లో ఉపాధ్యాయులను లేకుండా చేసిందని ఉపాధ్యాయ నేతలు మండిపడ్డారు. సమరశంఖం ఉద్యమానికి సంఘీభావం ప్రకటించిన ఏపీ జేఏపీ చైర్మన్, ఏపీఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ.. సమస్యలపై రాజీలేని పోరాటం చేసి సాధించుకోవాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జరిగే పోరాటాలకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ ధర్నాలో ఏపీ ఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమణ, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లె రవీంద్రనాథ్, ఎస్టీయూ అనుబంధ సంఘాల నాయకులు, రాష్ట్ర వ్యాప్తంగా తరలి వచ్చిన ఉపాధ్యాయులు భారీగా పాల్గొన్నారు.

విజయవాడలో మహాధర్నాకు హాజరైన ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల మహాధర్నాకు సంఘీభావం తెలుపుతున్న ఎన్జీవో, ఇతర సంఘాల నాయకులు

### ప్రధాన డిమాండ్లు ఇవే..

- వెంటనే 12వ పీఆర్సీ కమిషన్ నియమించాలి. 30 శాతం ఐఆర్ ప్రకటించాలి.
- నాలుగు పెండింగ్ డీఏల్లో కనీసం రెండింటిని వెంటనే ప్రకటించాలి. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాల్సిందే.
- ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన రూ.35 వేల కోట్ల పెండింగ్ బకాయిలను ఎప్పుడు చెల్లిస్తారో స్పష్టం చేయాలి. పే స్లిప్పుల్లో ఆ వివరాలు పొందుపరచాలి.
- ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెన్షన్ ప్రయోజనాలు చెల్లించకుండా వేధించడం ఆపాలి. ఉద్యోగ విరమణ చేసిన మరుసటి రోజే పెన్షన్ ప్రయోజనాలను చెల్లించాలి.
- ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని అన్ని రకాల వ్యాధులకు, అన్ని ఆస్పత్రుల్లో అనుమతించాలి.
- అర్థం లేని పనులు, యాప్‌ల భారం తగ్గించాలి. ఆదివారం కూడా పని చేయించడం ఆపాలి.
- కేజీబీవీలు, సమగ్రశిక్ష, మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్ తదితర పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి.
- కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలి.
- కారుణ్య నియామకాలను జిల్లా యూనిట్‌గా చేపట్టి, అర్హులైన వారందరికీ జూనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగాలు ఇవ్వాలి.

### ఒక్క హామీ అమలు చేయలేదు

కూటమి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టి 20 నెలలైనా ఒక్క హామీని నిలబెట్టుకోలేదు. హామీలన్నీ అమలు చేస్తామని, ఉపాధ్యాయులకు అండగా ఉంటామని ఎన్నికలప్పుడు కల్లబొల్లి మాటలు చెప్పి అధికారాన్ని చేపట్టారు. ప్రధానంగా ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత నాలుగు డీఏలు ఇవ్వాల్సి ఉంది. వాటి గురించి ప్రస్తావనే లేదు. ప్రభుత్వం వీటిపై తక్షణం స్పందించి, పరిష్కారానికి రోడ్డు మ్యాప్ ప్రకటించాలి.

– మల్లు రఘునాథరెడ్డి,
రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ఎస్టీయూ

### ఆత్మహత్యలు చేసుకుంటున్నారు

రాష్ట్రంలో ప్రభుత్వం పెడుతున్న ఒత్తిడిని భరించలేక ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కొంత మంది ప్రయాణాల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. కొంత మంది అధికారులు సైతాన్‌లా వ్యవహరిస్తూ ఉపాధ్యాయులను అధిక ఒత్తిడికి గురి చేస్తున్నారు. డెప్యూటీ సీఎం సైతం అనేక వాగ్దానాలు చేశారు. ఆయన సైతం అమలుకు ముందుకు రావటం లేదు. ఉపాధ్యాయుల ఆవేదనను ప్రభుత్వం గమనించాలి. లేదంటే అన్ని సంఘాలను కలుపుకొని అసెంబ్లీని ముట్టడిస్తాం

– ఎల్ సాయి శ్రీనివాస్,
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ ఎస్టీయూ

### బడ్జెట్‌లో ఒక్క పైసా లేదు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలకు సంబంధించి ఒక్క పైసా కూడా కేటాయింపు చూపించలేదు. పక్కన తెలంగాణలో ప్రతి నెలా బకాయిలు చెల్లిస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఉపాధ్యాయుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేశ్‌లు ఉపాధ్యాయులకిచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి.

– సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు,
రాష్ట్ర నేత, ఏపీ ఎస్టీయూ

## బెంగళూరులో అజీం ప్రేమ్‌జీ వర్సిటీ ముట్టడి

- ఏబీవీపీ కార్యకర్తల ఆందోళన
- దేశ వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణ

బొమ్మనహళ్లి: బెంగళూరు నగర శివార్లలోని సర్జాపుర సమీపంలో విప్రో సంస్థకు చెందిన అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ దేశ వ్యతిరేక కార్యక్రమాలకు వేదికైందని ఆరోపిస్తూ అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కార్యకర్తలు ముట్టడించారు. మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో పెద్దసంఖ్యలో యువకులు వర్సిటీ ప్రాంగణంలోకి చొరబడ్డారు. దేశ విభజన శక్తులకు ఈ వర్సిటీ నిలయంగా మారిందని వర్సిటీ బోర్డు మీద నలుపు రంగు పూశారు. ఈ వర్సిటీని నిషేధించాలని నినాదాలు చేశారు. గేటు ముందు బైఠాయించి ధర్నా చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారిని తరలించారు. కాగా, 1991లో జమ్మూకశ్మీర్‌లో కునాన్–పోష్‌పురాలో మహిళలపై సైనిక బలగాలు సామూహిక అత్యాచారాలకు పాల్పడితే, ఇప్పటివరకు ఒక్కరికి కూడా శిక్ష పడలేదు అనే అంశంతో ఓ విద్యార్థి సంఘం వర్సిటీలో చర్చాగోష్ఠికి ఏర్పాట్లు చేసింది. మరికొద్దిసేపట్లో చర్చ జరుగుతుండగా ఏబీవీపీ కార్యకర్తలు దాడి చేశారని సమాచారం.

బోర్డు మీద నల్లరంగు పూస్తున్న కార్యకర్తలు



నిన్న నేను తెలివైనవాడిని: కనుక ఈ ప్రపంచాన్ని
మార్చాలని అనుకున్నాను. నేడు నేను వివేకవంతుడిని;
కనుక నన్ను నేను మార్చుకుంటున్నాను.

– జలాలుద్దీన్ రూమీ



సాక్షి

గురువారం, 26 ఫిబ్రవరి 2026

# ఇవి పాలకుల పా'పాలు'

ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది భక్తుల మనోభావాలతో ముడిపడే ఉండే తిరుమలేశుని లడ్డూ ప్రసాదంపై ఏ ముహూర్తాన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తప్పుడు ఆరోపణలకు దిగారో గానీ... అప్పటి నుంచి రాష్ట్రంలో జరగని అనర్థాలంటూ లేవు. వైఎస్సార్ కాంగ్రెస్ నేతలపై, కార్యకర్తలపై దాడులు, తప్పుడు కేసులు, అరెస్టులు వగైరాలతో ముఖ్యమంత్రి మొదలుకొని అందరికందరూ బిజీగా ఉంటే రాజమండ్రి సమీపంలోని లాలాచెరువు చుట్టుపట్ల కల్తీ పాల బారినపడి ఆరుగురు మరణించారు. మరో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉంది. గత ఆదివారం దీని తీవ్రత వెల్లడైనా, అంతక్రితం వారం నుంచి అనేకమంది ఆసుపత్రుల్లో చేరుతూనే ఉన్నారు. కాస్త ఆలస్యంగా స్థానిక అధికారులైనా మేల్కొన్నారేమోగానీ... అమరావతిలో కొలువుదీరిన యంత్రాంగం నిద్ర లేవడానికి మరికొన్ని రోజులు పట్టింది. తీరిగ్గా ఇప్పుడు రాష్ట్రవ్యాప్త తనిఖీలు మొదలయ్యాయి. తిరుమల లడ్డూ వ్యవహారంలో శాసనసభలో పచ్చి అబద్ధాలు వల్లెవేయటానికి కావలసిన సరంజామా సిద్ధం చేసుకుని, ఎవరు ఏ అసత్యాలతో రక్తి కట్టించాలో తేల్చుకుని, స్క్రిప్టులు బట్టీ పట్టడంలో కూటమి నేతలు తంటాలు పడుతుంటే, అడిగిందల్లా అందించటంలో యంత్రాంగమంతా తరించింది. ఇక కల్తీ పాలపై, కలుషిత నీటిపై పట్టించుకొనే నాథుడేడి? చివరకు కుప్పం కేంద్రంగా సాగే కల్తీ పాల దందాను కూడా కర్ణాటక పోలీసులు వచ్చి బట్టబయలు చేయాల్సి వచ్చింది.

పాలకుల పాపాలు, వారి అసమర్థత ప్రజలకు శాపాలెలా అవుతాయో తెలియాలంటే 2024 సెప్టెంబర్‌లో లడ్డూ ప్రసాదంలో కల్తీ ఆరోపణ మొదలుకొని సాగుతున్న వరస పరిణామాలు గమనించాలి. నిరుడు జనవరిలో తిరుపతిలో వైకుంఠద్వార దర్శనం టోకెన్లు జారీ సమయంలో తీవ్ర తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు మరణించారు. 40 మందికి పైగా గాయపడ్డారు. అటుతర్వాత ఏప్రిల్‌లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సింహాచలంలో చందనోత్సవం కోసం నిర్మించిన నాసిరకం గోడ కూలి ఏడుగురు భక్తులు దుర్మరణం పాలయ్యారు. నిరుడు నవంబర్‌లో కాశీబుగ్గ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో తొక్కిసలాట జరిగి 9 మంది భక్తులు మరణించారు. ఈ ఉదంతాలకు సాటిరాగలది 2015 పుష్కరాల్లో రాజమండ్రిలో చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటన. అందులో 25 మంది మహిళలు సహా 29 మంది మరణించగా, 60 మంది గాయపడ్డారు. ఈ దుర్ఘటన సమయంలో బాబు కుటుంబసమేతంగా అక్కడ ఉండటమే కాదు... తన షూటింగ్ కోసం భక్తుల్ని గంటల తరబడి ఆపటం వల్లే ఇలా జరిగిందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.

ఎంతో ఆరోగ్యంతో నిక్షేపంలా ఉండే సామాన్య పౌరులు ఒక్కసారిగా అస్వస్థులు కావటం, వారికి రోజుకు రెండుసార్లు డయాలసిస్ చేసే పరిస్థితి తలెత్తటం ఎంత విషాదకరం! అన్నిటికన్నా ఘోరమేమంటే... రాజమండ్రికి చెందిన ఆరేళ్ల బాలుడికి ఆరు రోజుల్లో ఏకంగా 63 సార్లు డయాలసిస్ అవసరమైంది. ఆ లేత ప్రాణం దీన్ని తట్టుకోలేక కన్నుమూసింది. డయాలసిస్ సాగుతున్న పిల్లల్లో మూడేళ్లలోపు వారు కూడా ఉన్నారంటే ఉదంతం తీవ్రతేమిటో తెలుస్తుంది. పాలలో కలిపిన ఇథిలీన్ గ్లైకాల్ అనే పదార్థం వల్లే బాధితుల రక్తంలో ప్రమాదకర స్థాయిలో యూరియా, క్రియాటిన్‌లు ఉన్నాయని చెబు తున్నారు. రక్తంలో గరిష్ఠంగా 24 మిల్లీగ్రాములు ఉండాల్సిన యూరియా దాదాపు 140 మిల్లీ గ్రాములు... గరిష్ఠంగా 1.3 మిల్లీగ్రాములు ఉండాల్సిన సీరమ్ క్రియాటిన్ ఏకంగా 9 మిల్లీ గ్రాములు ఉందంటే యంత్రాంగం కళ్లు ఎంతగా మూసుకుపోయాయో అర్థం చేసుకోవచ్చు.

ఇదింకా సద్దుమణగక ముందే గత అయిదు రోజులుగా శ్రీకాకుళం నగరంలో కలుషిత నీరు తాగి భారీ సంఖ్యలో ప్రజలు డయేరియా వాతబడ్డారు. నగరంలోని సగం ప్రాంతానికి కలుషిత నీరు సరఫరా కావటమే ఇందుకు కారణమంటున్నారు. 2024 జూలైలోనే అక్కడి బీసీ హాస్టల్‌లో ఇలాంటి కారణంతోనే పలువురు విద్యార్థులకు డయేరియా సోకింది. అప్పుడు కాస్తయినా శ్రద్ధపెట్టి ఉంటే ఇప్పుడు ఇది పునరావృతమయ్యేది కాదు. కల్తీ మాటలతో అధికారంలోకొచ్చి, ఆ బాణీనే కొనసాగిస్తున్న పాలకుల అసమర్థత అన్నిటినీ కల్తీమయం చేస్తోంది. ఇప్పటికైనా పాలించటం మొదలెడతారో లేదో బాబు అండ్ కో తేల్చుకోవాలి.

## గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, **తిథి:** శు.దశమి రా.12.41 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** మృగశిర ప.12.38 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** రా.8.30 నుండి 10.00 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.21 నుండి 11.07 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.36 వరకు, **అమృత ఘడియలు:** రా.1.43 నుండి 3.13 వరకు.

**సూర్యోదయం:** 6.25
**సూర్యాస్తమయం:** 6.01
**రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు
**యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు

## సోషల్ టాక్

### ముందుచూపు



డబ్బు అవసరం చెప్పి రాదు. కనుక పొదుపు చేయండి. మార్పు తప్పనిసరి ; కనుక మారేందుకు సిద్ధంగా ఉండండి. అనూహ్యాలను మనం నియంత్రించలేం ; కనుక మనల్ని మనమే నియంత్రించుకోవాలి. కాస్త ముందుచూపు, ఒక ముందడుగుతో ఇవన్నీ సాధ్యమే!

– శక్తికాంత దాస్, ఆర్బీఐ మాజీ గరవ్నర్

### కళాఖండం

ఈ ప్రపంచంలో జీవించటం, అందులోని గందరగోళానికి గురి కాకుండా ఉండటం అనేది ఒకరు సృష్టించగలిగిన గొప్ప కళాఖండం. తుపాను తర్వాత ఇంద్రధనుస్సు ఆకాశాన్ని ప్రశాంతపరచినట్లే, కళ మానవుని అంతర్గత కల్లోలాన్ని నెమ్మదింపజేస్తుంది.

– ప్రతీక్షా అపూర్వ్, చిత్రకారిణి

### అనుమతి

నాయకత్వం వహించటానికి అనుమతి కోసం వేచి ఉండకండి. మీకు ఏదైనా ఖాళీగా అనిపిస్తే అందులోకి అడుగుపెట్టండి. 'మీ వల్ల కాదు' అని చెప్పే వ్యక్తులు ఎల్లప్పుడూ ఉంటారు. మీ పని ఏమిటంటే, వారు తప్పు అని నిరూపించటం కాదు. జనం వెనుక నిలబడటం!

– హెలెన్ క్లార్క్, న్యూజిలాండ్ మాజీ ప్రధాని

### అతిథి



విజయం అతిథి లాంటిది. వచ్చివెళుతుంది, గుర్తుండిపోతుంది. కానీ కష్టపడి పని చేయటం మీ శాశ్వత సహ నివాసి. తెరపై మీరు చెప్పే సంభాషణలు చుట్టపుచూపు పాత్రలు. తెర వెనుక మీరు ఎలా వ్యవహరిస్తారన్నదే మీ అసలైన పాత్ర.

– శివాజీ రాజా, నటుడు

### ఓర్పు



ఢిల్లీ ఎండల్లో మినరల్ వాటర్ బాటిళ్లు అమ్మిన నా కాలేజ్ రోజులను నేను ఎప్పటికీ మర్చిపోలేను. ఏ ఉద్యోగాన్నీ తక్కువగా అనుకోకండి. నిజాయతీగా కష్టపడి చేసే ప్రతి పనీ ఉద్యోగమే. ఇక కష్టాల్లో జీవితం మనకిచ్చే ఒక అపురూపమైన వరం... ఓర్పు.

– ప్రవేష్ రాణా, టీవీ హోస్ట్

### కుస్తీ

నేను తొమ్మిదేళ్ల పాటు ఫోన్‌కి దూరంగా ఉన్నాను. మనం ఏదైనా సాధించాలని అనుకున్నప్పుడు మన ఆలోచన ఇక దానిపైనే ఉండాలి. అది కూడా కుస్తీ లాంటిదే ; మనం 'త్యాగం' చేసిన ఇష్టాలతో మనం పట్టే కుస్తీ! అందులో గెలిస్తే, ఎందులోనైనా గెలుస్తాం.

– బజరంగ్ పునియా, రెజ్లర్–ఒలింపిక్ విజేత

# ఇన్ని అబద్ధాలా? ఇంత విషమా?

అభిప్రాయం

భూమన కరుణాకరరెడ్డి

అబద్ధాలు చెప్పడం చంద్రబాబు గారి జన్మహక్కు. దాన్ని మనం కాదన్నా ఆయన ఒప్పుకోరు. అందుకే అసెంబ్లీలోనూ, బయటా, దేవుడి ముందూ, దేవుడి మీదా కూడా అబద్ధాలు చెప్పగలరు. కోట్లాది మంది భక్తితో మొకరిల్లే తిరుమల శ్రీవారికే పంగనామం పెట్టగల సమర్థత బాబు గారి సొత్తు.

మంగళవారం జరిగిన ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో తిరుమల గురించి గుక్క తిప్పుకోకుండా అబద్ధాలు చెప్పారు. వైఎస్ రాజశేఖరరెడ్డి గారు తిరుమలను రెండు కొండలుగా ప్రకటించారని ఘోరమైన అసత్యం ప్రకటించారు. దాదాపు 20 ఏళ్లుగా ఈ ప్రచారం చేస్తూనే ఉన్నారు. ఒక అబద్ధాన్ని కోట గోడలా కట్టి, నమ్మించడం చంద్రబాబు స్పెషాలిటీ. గోడలు బద్దలు కొట్టకపోతే దేవుడు మమ్మల్ని క్షమించడు.

**బ్రిటిష్ వారి మాన్యువల్ లెక్క**

ఏడుకొండలపై వెలసిన తిరుమల క్షేత్రం సువిశాలమైంది. శేషాచలం కొండలు సమస్తం శ్రీవారి నిలయమే. దైవానికీ, భక్తికీ పరిధి లేదు. అయితే బ్రిటిష్ వారి నార్త్ ఆర్కాట్ మాన్యుయల్‌లో తిరుమల పరిధి 27 చదరపు కిలోమీటర్లు అని లిఖితమై ఉంది. టీటీడీ నిర్మాణాలకు అవసరమైన అనుమతులన్నీ కేంద్ర అటవీ శాఖ నుంచి లభించేవి కాబట్టి ఎప్పుడూ ఏ సమస్యా రాలేదు.

స్వాతంత్ర్యానికి ముందూ, తర్వాతా పాలకులూ, ముఖ్యమంత్రులూ వచ్చారు. టీడీపీ ఎన్టీఆర్ హయాంలోనూ, తొమ్మిదేళ్ల చంద్రబాబు హయాంలోనూ కూడా బ్రిటిష్ వారి లెక్కల ప్రకారమే తిరుమల ఉండింది. ఎవరికీ ఏ సందేహం లేదు, రాలేదు. ఇది దైవ కార్యం కాబట్టి!

వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత, చంద్రబాబు దిగజారి తిరుమలను రాజకీయం చేయడం మొదలు పెట్టారు. కొండపై పంచాయతీ ఎన్నికల విషయమై జయచంద్ర నాయుడు అనే తెలుగుదేశం నాయకుడితో కోర్టులో పిటిషన్ వేయించారు. ఈ సందర్భంగా అప్పటి పంచాయతీ రాజ్ సెక్రటరీ శామ్యూల్ జీవో నంబర్ 338 విడుదల చేశారు. శతాబ్దాలుగా ఉన్న బ్రిటిష్ వారి ఉత్తర్వుల్లోని 27 చ.కి.మీ. పరిధినే జీవోలో తెలిపారు.

ఇదే అదనుగా చంద్రబాబు గగ్గోలు పెట్టి బురద చల్లడం ప్రారంభించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి తిరుమలను రెండు కొండలుగా మార్చాడని అబద్ధం ప్రచారంలోకి తెచ్చారు. అయితే ఆ రెండు కొండలు ఏమిటి? మినహాయించిన ఐదు కొండల పేర్లను చంద్రబాబు జన్మలో చెప్పలేరు. ఎందుకంటే, అటువంటి ఆలోచనే జరగలేదు కాబట్టి!





◆ తిరుమల వేంకటేశ్వరుడి పవిత్రతను కాపాడ్డానికి వైఎస్ రాజశేఖరరెడ్డి నిరంతరం పాటుపడ్డారు. కానీ, శ్రీవారి పాదాల చెంత ఉన్న నారావారిపల్లెలో పుట్టి, తెల్లారి లేస్తే స్మరించుకుంటానని అబద్ధాలు చెప్పే చంద్రబాబు తిరుమలకు పంగ నామం పెట్టడం తప్ప చేసిందేమీ లేదు.

**వైఎస్‌తో బాబుకు పోలికా!**

అయితే చంద్రబాబు కుటిలత్వాన్నీ, దేవుణ్ణి రాజకీయానికి వాడుకునే దుర్మార్గాన్నీ అప్పటి టీటీడీ అధ్యక్షుడిగా ఉన్న నేను గుర్తించాను. అప్పటి ఈవో కేవీ రమణాచారి, ఎండోమెంట్ సెక్రటరీ ఐవీ సుబ్బారావు గార్లతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్‌తో స్వయంగా చర్చించాం. చంద్రబాబు దురుద్దేశాన్ని వివరించాం. వెంటనే ఆయన తిరుమల పరిధిని 352 చదరపు కిలోమీటర్లుగా నిర్దేశిస్తూ జీవో 746, తిరుమలలో అన్య మత ప్రచారాన్ని నిషేధిస్తూ జీవో నంబర్ 747ను విడుదల చేశారు.

తిరుమల శ్రీవారికి భక్తితో వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతో చేశారు. ఏడుకొండల చట్టం తెచ్చింది ఆయనే. అన్యమత ప్రచారాన్ని నిషేధించింది ఆయనే. వైఎస్ హయాంలోనే, నేను టీటీడీ చైర్మన్‌గా ఉన్నపుడు, టీటీడీలో హిందువులు తప్ప మిగతా మతస్థులతో ఉద్యోగాల నియామకాలు చేపట్టకూడదని చట్టం తెచ్చాం. ఎన్టీఆర్ హయాంలో గొల్లపల్లి, పైడిపల్లి, తిరుపతమ్మ, పెద్దింటి కుటుంబాల వంశ పారంపర్య మిరాశీ హక్కును రద్దు చేశారు. 2007లో దేవుణ్ణి నమ్ముకున్న ఆ కుటుంబాల ఆనువంశిక హక్కును వైఎస్ రాజశేఖర రెడ్డి పునరుద్ధరించారు. హైందవ ధర్మ పరిరక్షణ కోసం సాధు పుంగవుల సమ్మేళనం నిర్వహించింది వైఎస్సార్ హయాంలోనే!

తిరుమల వేంకటేశ్వరస్వామి పవిత్రతను కాపాడ్డానికీ, ధర్మాన్ని, విశ్వాసాల్ని పరిరక్షించడానికీ వైఎస్ రాజశేఖరరెడ్డి నిరంతరం పాటుపడ్డారు. ఆయన పాదాల చెంత ఉన్న నారావారిపల్లెలో పుట్టి, తెల్లారి లేస్తే స్మరించుకుంటానని అబద్ధాలు చెప్పే చంద్రబాబు తిరుమలకు పంగనామం పెట్టడం తప్ప, చేసిందేమీ లేదు.

**దేవుడి పేరుతో ఇంత రాజకీయమా?**

అలిపిరి సంఘటనలో వేంకటేశ్వరస్వామి చంద్రబాబును కాపాడిన మాట నిజమే. అయితే దేవుణ్ణి రాజకీయాలకు వాడే ఆయన స్వభావానికి అది శ్రీవారు చేసిన హెచ్చరిక కూడా! ఆ తర్వాత కూడా తిరుమల శ్రీనివాసుడిని రాజకీయాలకు వాడారు, ఇంకా వాడుతున్నారు.

బ్రహ్మోత్సవాల్లో శ్రీవారికి వస్త్రాలు భక్తితో తీసుకెళ్లిన వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన కుమారుడు వైఎస్ జగన్ ఇద్దరూ తిరుమలను రాజకీయాలకు వాడలేదు. ఇపుడు కూడా చంద్రబాబు నిందలకు సమాధానం మాత్రమే చెబుతున్నాం. ఎందుకంటే అబద్ధాన్ని నిజమని నమ్మించడంలో భారత రాజకీయాల్లోనే ఆయన్ని మించినవారు లేరు, ఇప్పట్లో రారు. 2009లో జరిగిన రాజకీయ సభలో జీవోలు 746, 747 రద్దు చేస్తానని చెప్పిన చంద్రబాబే, అసెంబ్లీలో జంకు లేకుండా మాట్లాడుతున్నారు. ఇదంతా సిగ్గుగా అనిపించదా?

పీవీ నరసింహారావు గారితో సహా ఎందరో మహనీయుడిగా భావించే పెజావర్ స్వామి ఈ జీవోల మీద వైఎస్‌ను ప్రశంసించారు. హైందవ ప్రచారానికి వైఎస్ చేసిన కృషిని పత్రికా సమావేశంలో కొనియాడారు.

చంద్రబాబుకు బురద రాజకీయమే తెలుసు. మాకు గౌరవ రాజకీయాలు మాత్రమే తెలుసు. అందుకే ఆయన కుమారుడు లోకేశ్ పెళ్లికి, ఆయన వియ్యంకుడు నందమూరి బాలకృష్ణ కోరిక మేరకు శేషాద్రి స్వామిని, తిరుమల అర్చకుల్ని స్వయంగా నేనే ఏర్పాటు చేశాను. బాలకృష్ణ కూడా సౌకర్యాలకు ధన్యవాదాలు తెలిపారు. కానీ చంద్రబాబు మాత్రం దర్శన ఏర్పాట్లు ఘోరంగా ఉన్నాయని చెప్పారు. ఇదే విషయం బాలకృష్ణతో చెబితే, 'రాజకీయాలతో నాకు సంబంధం లేదు. మనస్ఫూర్తిగా చెబుతున్నా, మీ ఏర్పాట్లు బాగున్నాయి' అన్నారు.

ధైర్యం ఉంటే జగన్‌తో రాజకీయంగా తలపడండి. మతాన్నీ, దేవుడినీ అడ్డు పెట్టుకుని అబద్ధాల్ని చెప్పకండి చంద్రబాబూ! ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. దేవుడు ఇంకా బాగా గమనిస్తున్నాడు. తిరుమల క్షేత్రం చాలా శక్తిమంతమైనది. ఆ దైవం ప్రతిసారీ మిమ్మల్ని క్షమించక పోవచ్చు!

వ్యాసకర్త టీటీడీ పూర్వ అధ్యక్షులు

# సైనిక ఓటమా? సైద్ధాంతిక వైఫల్యమా?

సందర్భం



డానీ

నడుస్తున్న చరిత్రలో కొన్ని దశలు మన కళ్లముందే మూసుకుపోతాయి. తుపాకీతో ప్రారంభమైన దశ, తలవంచి ముగిసిన దశగా మారిపోతుంటే అది కేవలం సంఘటన కాదు– ఒక యుగాంత సంకేతం.

పోరాట సంసిద్ధత క్షీణించినప్పుడు, విజయంపై విశ్వాసం సన్నగిల్లినప్పుడు నక్సలైట్లు లొంగిపోవడం కొత్త విషయం కాదు. గతంలోనూ లొంగుబాట్లు జరిగాయి. అయితే అవి నిశ్శబ్ద ఘటనలు. ముఖం చాటేసి, ప్రధాన స్రవంతి జీవితంలో కలిసిపోయే వ్యక్తిగత నిర్ణయాలు.

ఇప్పుడు దృశ్యం భిన్నంగా ఉంది. సరళీకృత ఆర్థిక విధానాల కాలం ఇది. లొంగుబాటు ఇక ఏమాత్రం వ్యక్తిగత నిర్ణయం కాదు; అదొక ప్రజా ప్రదర్శన. తుపాకీని ప్రభుత్వానికి అప్పగించడం కూడా ఒక సిద్ధాంత విజయం అన్నట్టు ప్రచారం. ఒకప్పుడు 'తుపాకీ గొట్టం ద్వారానే విప్లవం' అన్నవాళ్లు, ఇప్పుడు 'తుపాకీ స్వాధీనం ద్వారానే శాంతి' అంటున్నారు. ఇప్పుడు మావోయిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీతో సహా మరో నలుగురు కీలక నేతలు లొంగిపోవడం ఆ శ్రేణిలో తాజా పరిణామం. ఆ పార్టీ కేంద్ర కమిటీ పూర్వ కార్యదర్శి ముప్పాళ్ల లక్ష్మణ రావు అలియాస్ గణపతి సహా మరో 11 మంది ముఖ్య నాయకుల లొంగుబాటుకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నట్టు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి మీడియా ముందు ప్రకటించారు. ఇది యాదృచ్ఛికమా? లేక ఒక సంకేతమా?

దేవ్ జీ మావోయిస్టు పార్టీకి కేంద్ర కమిటీ కార్యదర్శి అయ్యారనో, అవుతున్నారనో ఇటీవల వార్తలు వచ్చాయి. పీపుల్స్ వార్ గ్రూపు కేంద్ర కమిటీ కార్యదర్శిగా పని చేసిన కేజీ సత్యమూర్తి 1990లో అజ్ఞాత జీవితం ముగించి బయటకు వచ్చారు. కానీ లొంగుబాటు కార్యక్రమం జరపలేదు. ఆ పార్టీ వ్యవస్థాపకులైన కొండపల్లి సీతారామయ్య 1995లో జైలు నుండి విడుదలయ్యారు. ఆయనకూ లొంగుబాటు సంస్కారం అవసరం రాలేదు. కానీ పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి హోదాలో ఉండగా లొంగిపోవడం – ఇది మొదటిసారి. కానీ అది గర్వించదగిన రికార్డా? లేక చరిత్రలో ఒక మలుపా? ఒకరు లొంగిపోతే యాదృచ్ఛికం. ఇద్దరు లొంగిపోతే వ్యక్తిగత వైఫల్యం. వరుసగా నాయకత్వం లొంగిపోతే అది ధోరణి. ధోరణిపై సైద్ధాంతిక చర్చ తప్పనిసరి. గణపతి అనారోగ్యంతో చాలాకాలం క్రితమే కేంద్ర కమిటీ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. అసలు ప్రశ్న వ్యక్తుల గురించి కాదు, ఉద్యమం గురించి! ఈ ముగింపు సైనిక ఓటమా? లేక సైద్ధాంతిక వైఫల్యమా?

నిజానికి 1990 వరకు భారత దేశంలో అనేక మార్పులకు కమ్యూనిస్టులు దోహదం చేశారు. అయితే 1990ల తర్వాత ప్రపంచం మారిపోయింది. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణలతో భారత సామాజిక–ఆర్థిక నిర్మాణం పూర్తిగా మారింది. కానీ, పోరాట కార్యక్రమం మారిందా?

అర్ధ–వలస, అర్ధ–భూస్వామ్య వ్యవస్థ నిర్ధారణ, నాలుగు వైరుధ్యాలు, వ్యావసాయిక విప్లవం, నూతన ప్రజాస్వామిక విప్లవం – ఈ సిద్ధాంత భాష అంతా 1970లది. గట్టిగా మాట్లాడితే చైనాలో 1930ల నాటిది. 2020ల నాటి భారతదేశానికి అది పనికి వస్తుందా? ఇక్కడే భారత కమ్యూనిస్టు పార్టీల నాయకత్వం సృజనాత్మకతను కోల్పోయింది. పాత మ్యాప్‌తో కొత్త భూభాగాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించింది. ఇది సైద్ధాంతిక వైఫల్యం.

మావోయిస్టులను అంతం చేస్తామని కేంద్ర ప్రభుత్వం గడువు పెట్టి, బలగాలను ఒకే ప్రాంతంలో – దంతెవాడలో – మోహరించినప్పుడు, వ్యూహాత్మక చాతుర్యం అవసరం. కానీ అన్ని శక్తులనూ ఒకే ప్రదేశంలో దించి, చుట్టుముట్టే పరిస్థితిని తెచ్చుకున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. కానీ సైనిక పరాజయం తాత్కాలికం. సిద్ధాంత పరాజయం అంతకన్నా పెద్ద దెబ్బ. ఒక పార్టీ కథ ముగిసిపోవచ్చు. ఒక దశ చరిత్రలోకి వెళ్లిపోవచ్చు. కానీ ప్రజల మీద అణచివేత ముగిసిందా? అసమానత అంతరించిందా?

అణచివేత ఉన్నంతకాలం పోరాటం అంతరించదు. కేవలం రూపం మారుతుంది. సిద్ధాంతం మారుతుంది. చరిత్ర ఖాళీని సహించదు. పాత సిద్ధాంతం విఫలమైతే ఆ స్థానంలో కొత్తది వస్తుంది. పాత పార్టీ ఆయుధాలను వదిలేసి లొంగిపోతే కొత్త పార్టీ వస్తుంది. పోరాడే సమూహాలు మారుతాయి. ఇప్పుడు ప్రశ్న ఒక్కటే; కొత్తగా వస్తున్న సిద్ధాంతం ఏమిటీ? కొత్తగా పోరాడే శక్తులు ఏవీ?

వ్యాసకర్త సామాజిక–రాజకీయ విశ్లేషకులు

# దేశాన్ని కదిలించిన కోటేశు

ఇన్ బాక్స్

కంచికచర్ల కోటేశుగా పిలవబడుతున్న కోటేశు అసలు పేరు ఆరుకుట్ల కోటేశు. మాదిగ కులస్థుడు. బాల కార్మికుడు. కోటేశు ఊరు కృష్ణా జిల్లా కంచికచర్ల పక్కన పరిటాల గ్రామం. కంచికచర్లలో కూలి పనులకు వెళ్ళేవాడు. ఇత్తడిచెంబు దొంగతనం చేసి, హోటల్ యజమానికి తాకట్టు పెట్టి, భోజనం చేసినట్టు కంచికచర్ల ఆసాములు కోటేశుపై నేరారోపణ చేశారు. ఆధిపత్య కులం ఆడ పిల్లతో కోటేశు మాట్లాడటమే అసలు కారణమని లోకులు అనుకుంటూంటారు. దీంతో సుమారు పదిమంది టీనేజి యువకుడైన కోటేశును చేతులు కట్టివేసి, ఒంటిపై కిరోసిన్ పోసి, సజీవ దహనం చేశారు. ఇది జరిగింది 1968 ఫిబ్రవరి ఇరవై నాలుగున. విజయవాడ గవర్నమెంట్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ 1968 ఫిబ్రవరి 26న కోటేశు చనిపోయాడు.

ఈ సంగతి తెలిసిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు వేముల జార్జి మాస్టర్ చలించిపోయారు. కుల పెద్దలయిన తంగిరాల షడ్రక్, కనకాల వెంకటరత్నం వంటి వారిని వెంటబెట్టుకుని, టెలిగ్రామ్స్ ద్వారా అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌కు, అధికారులకు సమాచారం పంపించాడు. 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక ఆ కాలంలో స్విట్జర్లాండ్‌లో చెంచా దొంగిలించిన నెపంతో ఒక నల్ల జాతీయుడిపై జరిగిన హత్యోదంతంతో పోల్చుతూ, కంచికచర్ల సంఘటనపై వార్త ప్రచురించింది. బీబీసీలో వార్తలు ప్రసారం అయ్యాయి. దీనితో భారత దేశంలోని ప్రభుత్వ వ్యవస్థలు కదిలాయి. నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ, కేంద్ర మంత్రి జగ్జీవన్ రామ్ కంచికచర్ల సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఎస్సీల దుర్భర పరిస్థితులు గమనించి, దారిద్ర్య నిర్మూలనా కార్యక్రమం, ఇరవై సూత్రాల పథకాన్ని ప్రవేశపెట్టారు. నాటి ఎంపీ కోట పున్నయ్య రాజ్యసభలో 1968 మార్చి ఇరవైన సంధించిన పలు ప్రశ్నలకు నాటి కేంద్ర హోమ్ శాఖామంత్రి వైబీ చవాన్ ఏడు పేజీల సమాధానం చెప్పాల్సి వచ్చింది.




కోటేశు కేసులో ఏడుగురు ముద్దాయిలపై మచిలీపట్నం జిల్లా కోర్టు నుంచి హైకోర్టు, సుప్రీమ్ కోర్టుల దాకా విచారణ సాగింది. ముగ్గురికి మాత్రమే శిక్షలు పడ్డాయి. సరైన సాక్ష్యాలు లేవని హైకోర్టు నలుగురిని నిర్దోషులుగా తేల్చింది. అలాగే కోటేశు పోలీసులకు ఇచ్చిన మరణ వాంగ్మూలంలో దోషుల పేర్లు చెప్పలేక పోయాడు. కోటేశు సజీవదహన సంఘటన నాటి సమాజాన్ని తీవ్రంగా కదిలించింది. రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో కొత్త చైతన్యం వెల్లివిరిసింది. దిగంబర కవులు వారి కవిత్వాన్ని కంచికచర్ల కోటేశుకు అంకితమిచ్చారు. ఇది కోటేశు 58వ వర్ధంతి సంవత్సరం. అన్యాయాల పట్ల ప్రతిఘటించే చైతన్యం పెంచుకోవడమే మనం కోటేశుకి అర్పించే నివాళి.

– కృపాకర్ మాదిగ | సామాజిక కార్యకర్త

## కనబడనివారి 'రాజధాని'

డేటా సాయింట్

ఏటా సుమారు ఇరవై వేల మంది ఢిల్లీలో కనబడకుండా పోతున్నట్టు 'నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో' గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఇందులో ఆరు వేల మంది పిల్లలు. 2017–23 మధ్యకాలంలో సగటున రోజుకు 62 మంది వ్యక్తులు (ఇందులో 16 మంది పిల్లలు) కనబడకుండా పోయారు. మళ్లీ వీళ్లలోనూ మహిళలు, బాలికల సంఖ్య అధికంగా ఉంది.




సంవత్సరాల వారీగా దేశంలో కనబడకుండా పోయినవారిలో ఢిల్లీ వాటా

| 2017 | 2018 | 2019 | 2020 | 2021 | 2022 | 2023 |
|---|---|---|---|---|---|---|
| 9.3% | 9.2% | 7.2% | 7.1% | 7.1% | 7.4% | 7.1% |

# దైవరక్షణ

దత్తబోధ

శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

సర్వసామాన్యంగా మానవులు మోహావిష్టులయి ప్రవర్తిస్తారు. మోహం అవివేకం వలన కలుగుతుంది. అవివేకం పూర్తిగా నశిస్తే కానీ మోహం తొలగదు. మోహం మంచు తెరలాగా బుద్ధిని కప్పివేయటం చేత ప్రతివాడూ అన్నింటికీ తానే కర్తను అనుకొంటాడు. సత్యదృష్టితో పరికిస్తే ఇదంతా సరియైన ఆలోచన కాదు. భ్రాంతి వల్ల అనుకోవటమే! సర్వశక్తిమంతుడైన భగవంతుడే సర్వ జీవరాశిని సృష్టిస్తున్నాడు, పోషిస్తున్నాడు, రక్షిస్తున్నాడు. చివరికి తనలో కలుపుకొంటున్నాడు. ఇది పరమ సత్యం. మనిషి అనుకున్నదల్లా కావాలని లేదు. నా వంతు నేను చేస్తే దైవం సహకరిస్తాడనుకొంటేనే అది సదాలోచన అవుతుంది.

ఒక యోగి ఎక్కువకాలం ధ్యానంలో కాలం గడుపుతూ ఒక నిర్ణీతకాలం మాత్రమే ఆశ్రమం నుంచి బయటకు వస్తూండేవాడు. అతని ఆశ్రమమంటే ఒక చిన్న పర్ణ కుటీరం. అక్కడ దొరికే పళ్ళు తిని, నీరు తాగి, అనాసక్తుడై దైవధ్యానంలోకి వెళుతూ ఉంటాడు. అతడిని ఒక రోజున ఆ దేశపు రాజు చూచాడు. యోగిలో బ్రహ్మతేజస్సు ప్రకాశిస్తోంది. ఆ యోగిని పలకరించి నమస్కరించాడు. 'అయ్యా! మీరు గొప్ప యోగులు. ఊరు చివర నిర్జన ప్రదేశంలో ఎండావానలకు పనికిరాని ఈ చిన్న కుటీరంలో ఉండవలసిన ఖర్మయెందుకు? నాతో రండి. మీకు సకల సదుపాయాలతో మంచి భవనం, విలువైన వలువలు, మృష్టాన్న భోజనం వంటి సుఖాలన్నీ కలిగిస్తాను' అని అన్నాడు. అందుకు యోగి 'రాజా! నాకింతవరకూ కావలసినవన్నీ ఇచ్చే వాడొకడున్నాడు. నాకెలాంటి లోపం రానివ్వకుండా కంటికి రెప్పలాగా కాపాడుతున్నాడు. ఆయనే మీకు కూడా సర్వమూ సమకూరుస్తున్నాడు. పైగా నాకు జ్ఞానం కూడా ఆయనే ఇస్తున్నాడు' అని సమాధానం చెప్పాడట.

**'యదాజ్ఞ యాగ్నిర్దహతి ప్రకామం / యదాజ్ఞ యావాతి సదాగతిశ్చ'** ఆ దైవం ఆదేశానుసారమే అగ్ని మండుతున్నది. వాయువు వీస్తున్నది. పంచభూతాలు ఆయన ఆజ్ఞ చేతనే ప్రవర్తిస్తూ సర్వ జీవరాశిని సంరక్షిస్తున్నాయి. ఇవన్నీ ఆ దైవం శక్తులే! ఇలా అనుక్షణం దైవం జీవుల్ని కాపాడుతున్నాడనే ఎరుక ఉండాలి.

## మద్యం దుకాణం వద్దంటూ రోడ్డెక్కిన మహిళలు

తమ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ మహిళలు రోడ్డెక్కారు. ఏలూరులోని దక్షిణపు వీధి జ్వాలా పరమేశ్వరి కాలనీలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు బుధవారం రాస్తారోకో చేశారు. ఈ కాలనీలో నూరుశాతం కార్మిక వర్గం ప్రజలే ఉంటున్నారని, ఇటువంటి ప్రాంతంలో బార్‌లకు అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు. మద్యం దుకాణం ఏర్పాటును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. – ఏలూరు (టూటౌన్)

# 28 నుంచి హెచ్‌పీవీ వ్యాక్సిన్

**దేశవ్యాప్తంగా పంపిణీ చేయనున్న కేంద్ర ప్రభుత్వం**

**రాష్ట్రంలో 3.45 లక్షలమంది బాలికలకు వ్యాక్సిన్**

**దీంతో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి రక్షణ**

**సాక్షి, అమరావతి:** గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్ నివారణకు దేశంలో 14 ఏళ్లు నిండిన బాలికలకు హ్యూమన్ పాపిలోమా వైరస్(హెచ్‌పీవీ) వ్యాక్సిన్‌ను కేంద్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయనుంది. ఈ పంపిణీని ఈ నెల 28న దేశవ్యాప్తంగా కేంద్ర ఆరోగ్యశాఖ ప్రారంభించనుంది. రాష్ట్రంలోని 3.45 లక్షలమంది బాలికలకు ఈ వ్యాక్సిన్ ఇవ్వాల్సి ఉంటుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ అంచనా వేస్తోంది. గ్రామ/వార్డు సచివాలయాల శాఖ సమాచారం ప్రకారం అత్యధికంగా కర్నూలు జిల్లాలో 23,957 మంది, అత్యల్పంగా పోలవరం జిల్లాలో 2,777 మంది బాలికలు ఉన్నారు. 1,683 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సిన్ పంపిణీ కోసం ఇప్పటికే వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. 0.5 ఎంఎల్ వ్యాక్సిన్‌ను ఇంజక్షన్ రూపంలో ఇస్తారు. సుమారు మూడు నెలలు జరిగే వ్యాక్సిన్ డ్రైవ్‌కు తొలివిడత కింద కేంద్రం నుంచి 1,90,890 డోసుల వ్యాక్సిన్ వెయిల్స్ రాష్ట్రానికి చేరుకున్నాయి. వ్యాక్సిన్ ఇచ్చే ముందు తల్లిదండ్రుల్లో ఒకరి సమ్మతి తప్పనిసరి అని నిబంధన ఉంది. పీహెచ్‌సీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య వ్యాక్సిన్ ఇస్తారు. వ్యాక్సిన్ పంపిణీ వివరాలను యూవిన్ డిజిటల్ పోర్టల్‌లో నమోదు చేస్తారు.

**వైఎస్ జగన్ హయాంలో కీలక ముందడుగు**

రాష్ట్రంలో క్యాన్సర్ నివారణ దిశగా వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే కీలక ముందడుగు పడింది. ఆరోగ్యశ్రీ పథకం పరిధిలోకి అన్ని రకాల క్యాన్సర్ చికిత్సలను తెచ్చారు. క్యాన్సర్‌ను ప్రారంభదశలోనే గుర్తించి ప్రాణాపాయాన్ని తప్పించడంతో పాటు, చికిత్స వ్యయాలకు అడ్డుకట్ట వేసేదిశగా అడుగులు వేశారు. ఇందులో భాగంగా సామూహిక క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమానికి అప్పట్లో శ్రీకారం చుట్టారు. పైలెట్ ప్రాజెక్టుగా పలు జిల్లాల్లో స్క్రీనింగ్ కూడా చేశారు. 18 ఏళ్లు పైబడిన పౌరులందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ చేపట్టేందుకు విశాఖలోని హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రితో ఎంవోయూ కుదుర్చుకుని వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే గ్రామాల్లో వైద్యసేవలు అందించే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, వైద్యులకు శిక్షణనిచ్చారు. సామూహిక క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రారంభించడానికి సర్వం సన్నద్ధం చేసిన సమయంలోనే సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో స్క్రీనింగ్ వాయిదా పడింది. ఎన్నికల తర్వాత వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం కమ్యూనికబుల్, నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ (సీడీ–ఎన్‌సీడీ–3.0) సర్వేలో భాగంగా క్యాన్సర్ స్క్రీనింగ్ అంటూ హడావుడి చేసింది. స్క్రీనింగ్ నిర్వహణలో ఘోరంగా విఫలం అయింది. వైద్యశాఖ తప్పులతడకగా స్క్రీనింగ్ చేపట్టడంతో మరోమారు స్క్రీనింగ్ చేయాల్సి వచ్చింది.

## రామతీర్థ స్వామిజీ అదృశ్యం

చింతమనేని బాలాజీ

**ఐరాల:** చిత్తూరు జిల్లా ఐరాల మండలం గుండ్లపల్లె సమీపంలోని రామతీర్థ సేవాశ్రమం, సిద్ధగిరి క్షేత్రం ఆలయ స్వామిజీ చింతమనేని బాలాజీ (60) మంగళవారం అదృశ్యమయ్యారు. దీనిపై బుధవారం ఎస్‌ఐ జయశ్రీ మిస్సింగ్ కేసు నమోదుచేశారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. స్వామిజీ మంగళవారం ఉదయం పాల కోసం వెళ్లి తిరిగి ఆశ్రమానికి రాలేదు. ఆశ్రమ నిర్వాహకులు చుట్టుపక్కల వెతికినా ఎక్కడా ఆచూకీ లభించలేదు. అయితే, స్వామిజీ ఫోన్ ఆశ్రమం సమీపంలోని చెరువు గట్టుపై పడి ఉంది. దీంతో చెరువులో గాలించినా ఆచూకీ దొరకలేదు. ఆశ్రమ నిర్వహకుడు రాజేంద్రనాయుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ప్రేమా.. తల్లిదండ్రులా..?

**తేల్చుకోలేక ఫిజియోథెరపీ విద్యార్థిని ఆత్మహత్య**

రజిని (ఫైల్)

**పెదగంట్యాడ:** ప్రేమించిన వ్యక్తి ఒకవైపు. తల్లిదండ్రులు మరోవైపు. ఎవరు కావాలో తేల్చుకోలేక తన ఆవేదనను సూసైడ్ నోట్‌లో రాసి, ఒక ఫిజియోథెరపీ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన ఇది. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లాకు చెందిన పైడి సత్యం కుటుంబం విశాఖ వుడా కాలనీలోని వినాయకనగర్‌లో నివసిస్తోంది. హెచ్‌పీసీఎల్‌లో సబ్ కాంట్రాక్ట్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. పెద్ద కుమార్తె పైడి రజిని (20) మధురవాడలోని ఓ కళాశాలలో ఫిజియోథెరపీ రెండో సంవత్సరం చదువుతోంది. ప్రిపరేషన్ హాలీడేస్ ఇవ్వడంతో ఇంటికొచ్చింది. సత్యం భార్య, చిన్న కుమార్తె బుధవారం శ్రీకాకుళంలోని స్వగ్రామానికి వెళ్లారు. కుమారుడిని స్కూల్ ఆటో ఎక్కించి, సత్యం డ్యూటీకి వెళ్లాడు. అనంతరం కుమార్తె రజినీకి ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఆందోళన చెంది, ఎదురింటివారికి ఫోన్ చేశాడు. వారు డోర్ కొట్టినా తీయకపోవడంతో.. కిటికీలోంచి చూడగా రజిని చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. సమాచారం అందుకున్న సత్యం హుటాహుటిన ఇంటికి చేరుకున్నాడు. డోర్ పగులగొట్టి లోపలకి వెళ్లారు. అప్పటికే రజిని చనిపోయింది. ఇంట్లో రజిని సూసైడ్ నోట్ దొరికింది. సమాచారం అందుకుని ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**సూసైడ్ నోట్‌లో రజినీ ఆవేదన:** డాడీ.. మమ్మీ.. నాకు ఏమీ తెలియడం లేదు. నేను తప్పు చేశా. లవ్ చేశా. నేను మిమ్మల్ని మోసం చేయడం కరెక్ట్ అనిపించలేదు. అందుకే ఆ అబ్బాయిని వదిలేశా. కానీ.. అతనితోనే నాకు ఉండాలని ఉంది. కానీ నాకు వద్దు. ఎందుకంటే మీరే ఇంపార్టెంట్ నాకు. నేను మీ కోసం ఏమీ చేయలేకపోయా. కానీ తప్పు అయితే చేయాలని అనుకోవట్లేదు. నేనే లేకపోతే తప్పు అవ్వదు కదా. అందుకే బై. చెల్లి, తమ్ముడు జాగ్రత్త.

# రూ.16కోట్ల కష్టాన్ని జయించిన పసిమొగ్గ

**మానవతావాదుల స్పందన... రూ.కోట్ల సహాయం** | **కేంద్ర సహాయం రూ.50 లక్షలు** | **త్వరలో చికిత్స ప్రారంభం**

పునర్విక‌శ్రీతో తండ్రి సురేశ్

**వెల్దుర్తి:** మానవతావాదుల స్పందనతో పసిమొగ్గకు వచ్చిన రూ.16 కోట్ల కష్టం కేవలం మూడు నెలల్లో తొలగిపోయింది. కర్నూలు జిల్లా వెల్దుర్తి పట్టణానికి చెందిన సురేశ్, పుష్పావతి దంపతుల కుమార్తె పునర్విక‌శ్రీ. పుట్టుకతోనే జన్యు సంబంధిత వెన్నెముక కండరాల వ్యాధికి గురైంది. పుట్టినప్పటి నుంచి కదలలేని స్థితి. రెండేళ్లలోపు రూ.16 కోట్ల ఇంజక్షన్ ఇస్తే మామూలు స్థితికి చేరుకుంటుందని వైద్యులు తెలిపారు. పాప 8 నెలల వయసులో.. డిసెంబర్ 2025లో పేద తండ్రి సురేశ్ తన పాపను కాపాడమంటూ చేసిన అభ్యర్థన మానవతావాదులను కదిలించింది.

**సాక్షి కథనంతో వెల్లివిరిసిన దాతృత్వం**

సాక్షిలో డిసెంబర్ 8వ తేదీ 'పసిమొగ్గకు రూ.16కోట్ల కష్టం' శీర్షికన కథనం వెలువడింది. ఈ కథనానికి స్వచ్ఛంద సంస్థలు, ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలు, వివిధ వర్గాలు సైతం విరివిగా స్పందించాయి. పాప సహాయానికి 'సేవ్ పునర్విక' అంటూ అర్థించాయి. దీంతో మూడు నెలల్లోనే చిన్న చిన్న విరాళాలే పెద్ద మొత్తంగా పాప చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం అందింది. పునర్విక చికిత్సకు కేంద్ర ఆరోగ్య శాఖ రూ.50 లక్షలు ప్రకటించినట్లు ఎంపీ బైరెడ్డి శబరి తెలిపారు. ఇందుకు సహకరించిన కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు కృతజ్ఞతలు తెలిపారు.

> **విరాళాలు ఇక వద్దు**
>
> నేను కోరినప్పటి నుంచి ఇప్పటి వరకు వివిధ ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలు, దాతల సమీకరణల ద్వారా అలాగే ప్రత్యక్షంగా నా అకౌంట్‌కు వచ్చిన మొత్తం రూ.9 కోట్లకు మించిపోయింది. దీంతో త్వరలో పాపకు చికిత్స ప్రారంభం కానుంది. ఆర్థిక సహాయం చేసిన వారందరికీ కృతజ్ఞతలు. ఇకపై విరాళాలు వద్దు. చికిత్స ప్రారంభించిన తరువాత వివరాలు తెలుపుతాను. – సురేశ్, పునర్విక‌శ్రీ తండ్రి

## పింఛన్ ఇప్పించండి మహాప్రభో!

భార్య, పిల్లలతో గణేష్

**పొదిలి రూరల్:** పింఛన్ ఇప్పించాలంటూ సీఎం చంద్రబాబును కలిసేందుకు ఓ దివ్యాంగుడు బుధవారం మార్కాపురంలోని సీఎం సభా ప్రాంగణానికి చేరుకున్నాడు. ఇందుకు పోలీసులు అనుమతించకపోవడంతో నిరాశతో వెనుదిరిగాడు. మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గం పుల్లలచెరువు మండలం ఎండపల్లి గ్రామానికి చెందిన గణేష్‌కు రెండేళ్ల కిందట కాళ్లు చచ్చుపడిపోయాయి. నరాలు బలహీనంగా ఉండడంతో అవస్థలు పడుతున్నాడు. పింఛన్ కోసం ఎన్నిసార్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం కనిపించలేదు. కుటుంబ పోషణ కష్టంగా మారడంతో సీఎంను కలిసేందుకు భార్య బిడ్డలతో కలిసి బుధవారం సీఎం సభా ప్రాంగణానికి చేరుకున్నాడు. చంద్రబాబును కలిసి తన గోడును చెప్పుకుంటానంటూ గణేష్ అక్కడ విధుల్లో ఉన్న పోలీసులను కోరాడు. వారు అనుమతించకపోవడంతో నిరాశతో వెనుదిరిగాడు.

## భార్యను వేధిస్తున్నాడని కారుతో ఢీకొట్టాడు

**చింతపల్లి:** తన భార్యను వేధిస్తున్నాడనే ఆగ్రహంతో మెడికల్ షాపు నిర్వాహకుడిని విద్యాశాఖ ఉద్యోగి కారుతో ఢీకొట్టిన ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం తాజంగిలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాజంగి పంచాయతీ చెరువూరు గ్రామానికి చెందిన దురియా ధర్మారావు, అతని భార్య కన్నయ్యమ్మ తాజంగిలో నివాసం ఉంటున్నాడు. ధర్మారావు చింతపల్లి మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఐఎస్ (మండల ఇన్ఫర్మేషన్ సిస్టమ్)గా పనిచేస్తుండగా.. అతడి కన్నయ్యమ్మ లంబసింగి పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తోంది. చింతపల్లికి చెందిన నీటిపల్లి ఈశ్వరరావు కొన్నేళ్లుగా భార్యతో కలిసి తాజంగిలో మెడికల్ షాపు నిర్వహిస్తున్నారు. కాగా.. ఈశ్వరరావు కొంతకాలంగా తనను లైంగికంగా వేధిస్తున్నాడని, భర్త లేని సమయంలో ఫోన్ చేసి ఇబ్బంది పెడుతున్నాడని కన్నయ్యమ్మ ఆరోపించింది. వేధింపులు భరించలేక జరిగిన ఈ విషయాన్ని తన భర్తకు వివరించినట్టు ఆమె మీడియాకు తెలిపింది. మంగళవారం సాయంత్రం ధర్మారావు కారులో వస్తుండగా.. ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఈశ్వరరావును గమనించి కారుతో బలంగా ఢీకొట్టాడు. ఈశ్వరరావు కింద పడిపోయినప్పటికీ ధర్మారావు పదేపదే కారుతో అతనిపైకి దూసుకెళ్తూ విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఈశ్వరరావును చికిత్స నిమిత్తం విశాఖలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని, అపస్మారక స్థితిలో ఉన్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈశ్వరరావు భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వెంకటరమణ వెల్లడించారు.

## ఏసీఏకి ఆలయ భూమి ఇవ్వడంపై హైకోర్టు స్టే

**కాకినాడ జిల్లా సర్పవరంలోని 16.55 ఎకరాలు ఏసీఏకి లీజుకిచ్చిన సర్కారు**

**కాకినాడ రూరల్:** కాకినాడ జిల్లా సర్పవరంలోని శ్రీరాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి ఆలయానికి చెందిన 16.55 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం క్రికెట్ స్టేడియం కోసం ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ)కు ఇవ్వడంపై ఇటీవల హైకోర్టు స్టే విధించింది. సర్వేనంబర్లు 113, 115ల్లోని ఆలయ భూమిని 33 సంవత్సరాలకు లీజుకు ఇస్తూ జనవరిలో జీవో నంబరు 55 జారీచేసింది. సంవత్సరానికి ఎకరానికి రూ.50 వేల లీజు నిర్ణయించి, మూడేళ్లకు ఒకసారి 33 శాతం పెంచి దేవస్థానం ఖాతాలో లీజు సొమ్మును క్రమం తప్పకుండా జమచేయాలని పేర్కొంది. క్రికెట్ స్టేడియానికి ప్రభుత్వం భూమి కేటాయించడంతో పాటు కేబినెట్‌లో తీర్మానం చేయడంతో ఏసీఏకి అప్పగించేందుకు జిల్లా యంత్రాంగం వేగంగా పావులు కదిపింది. ఇటీవల కలెక్టర్ ద్వారా దేవస్థానం ఖాతాకు అడ్వాన్స్‌గా ఏడాది లీజు సొమ్ము రూ.8,27,500 చెల్లించడంతో సర్పవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీఏకి లీజు రిజిస్ట్రేషన్ చేశారు. ఏపీ ధార్మిక, హిందూ మతసంస్థల ఎండోమెంట్స్ భూములను ఏసీఏకి ఇవ్వాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ విజయవాడకు చెందిన వలివర్తి దుర్గాప్రసాద్, అల్లవరపు దుర్గాభరత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు యథాతథస్థితిని కొనసాగించాలని ఆదేశించింది.

## 'మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్స్' కింద కేసు కొట్టేసేందుకు యత్నించడం దారుణం

**మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి**

**గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్):** ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో సీఎం చంద్రబాబు ఏ తప్పూ చేయకపోతే విచారణను ఎదుర్కోవాలని మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) సవాల్ చేశారు. చంద్రబాబుపై కేసులు వేసిన ఫిర్యాదుదారులను భయపెట్టి, బెదిరించి సీఐడీ అధికారులు కేసులు మూసివేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా చంద్రబాబు చేతిలో ఉందని.. ఆయనపై నమోదైన కేసులు మూసేయాలని పోలీసులను ఆదేశిస్తున్నారన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆర్కే మీడియాతో మాట్లాడుతూ.. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చంద్రబాబుపై పూర్తి ఆధారాలతో రెండు కేసులు వేశానని.. దీంతో చంద్రబాబు, నారాయణ, లింగమనేనితోపాటు సుమారు 18 మందిపై సీఐడీ అప్పట్లో చార్జిషీట్ దాఖలు చేసిందన్నారు. కానీ, చంద్రబాబు ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారన్నారు. 2024లో అధికారం మారిన తర్వాత ఈ కేసులు వెనక్కు తీసుకోవాలని తనను బెదిరించారని, తనపై ఒత్తిళ్లు తెస్తున్నారని ఆర్కే చెప్పారు. ఈ కేసులో ఏం లేదని, తప్పుడు ఫిర్యాదు చేశారని చెబుతూ కేసు మూసేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. రూ.2,500 కోట్ల భారీ అవినీతి కేసును మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్స్ కింద కొట్టేసేందుకు ఎలా ప్రయత్నిస్తారని ఆయన ప్రశ్నించారు. నాటి అధికారులే తనది తప్పుడు ఫిర్యాదు అని కోర్టులో మెమో దాఖలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబుకు భయపడే పోలీసులు ఈ కేసులు మూసివేస్తున్నారని ఆర్కే ఆరోపించారు. ఈ కేసుకు సంబంధించి ఈనెల 27న కోర్టుకు రావాలని ఏసీబీ కోర్టు న్యాయమూర్తి చెప్పారన్నారు. ఏసీబీ కోర్టులో తనకు న్యాయం జరగకపోతే హైకోర్టును ఆశ్రయిస్తానని స్పష్టంచేశారు. తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, సమయం వచ్చినప్పుడు వాటిని బయటపెడతానన్నారు.

## నారా లోకేశ్ బెయిల్ రద్దు చేయండి

**ఏసీబీ న్యాయస్థానంలో ఆళ్ల పిటిషన్**

**విజయవాడ లీగల్:** ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో ఎ–14 నిందితుడుగా ఉన్న నారా లోకేశ్‌కు ఇచ్చిన బెయిల్ రద్దు చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తరఫున ప్రముఖ న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ ఏసీబీ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో సీఐడీ అధికారులను ప్రభావితం చేసి కేసును మూసివేసే ప్రయత్నం చేస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. లోకేశ్‌కు బెయిల్ మంజూరు చేసే సమయంలో ఈ కేసులో సాక్షులను ప్రభావితం చేయవద్దంటూ ఆదేశాలు జారీచేశారు. 548 పేజీల ఆధారాలతో హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసిన సీఐడీ అధికారులు ఇప్పుడు ఆధారాలు లేవంటూ విచారణ ముగించడం కేసును ప్రభావితం చేయడమేనని ఫిర్యాదులో పేర్కొన్నారు. లోకేశ్ పాత్రను స్పష్టంగా విశదీకరిస్తూ హైకోర్టు, ఏసీబీ కోర్టులో వందల పేజీల మెమోను సీఐడీ దాఖలు చేసిందని, లోకేశ్‌కు ఇచ్చిన స్టేషన్ బెయిల్‌ను రద్దు చేయాల్సిందిగా లోగడ సీఐడీ న్యాయస్థానాన్ని కోరిందని, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రావడంతో విచారణను పూర్తిస్థాయిగా ప్రభావితం చేసి బెయిల్ నిబంధనలను అధిగమించారని పిటిషన్‌లో పేర్కొన్నారు.

**తిరుమల తిరుపతి దేవస్థానములు : తిరుపతి**
చీఫ్ ఇంజినీర్ ఆఫీస్
ఇ–ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ADV No.66/D3/CE/TTD/2025-26 Dt: 23-02-2026
TTD ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో నలభై మూడు (43) పనుల కోసం ఇ–ప్రొక్యూర్‌మెంట్‌పై ఇ–టెండర్లు కోరబడుచున్నవి: SE-I: NIT నం.99 నుండి 102/SE-I/2025-26 (4 పనులు), SE-II: NIT నం.1045 నుండి 1057/SE-II/2025-26 (13 పనులు), EE-I: NIT నం.154/EE-I/2025-26 (1 పని), EE-VII: NIT నం.77 నుండి 81/EE-VII/2025-26 (5 పనులు), EE-XII: NIT నం.203 నుండి 204/EE-XII/2025-26 (2 పనులు), DE(Elec)-I: NIT నం.313 నుండి 318/DE(Elec)-I/2025-26 (6 పనులు), DE(Elec)-II: NIT నం.549 నుండి 558/DE(Elec)-II/2025-26 (10 పనులు), DE(Elec)-TML: NIT నం.396 నుండి 397/DE(Elec)-TML/2025-26 (2 పనులు), వివరాల కోసం www.tirumala.org కి లాగాన్ చేయండి మరియు పని వివరాల కోసం https://tender.apeprocurement.gov.in కు లాగిన్ చేయండి.
TTD-40021/10/2025-PRO SEC (Adv.No.414) Dt: 25-02-2026
ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

## నేనేం 'పాప'ం చేశా అమ్మ..! నన్నెందుకు చంపేశావమ్మ..

- ప్రేమ మోజులో ఓడిన మాతృత్వం
- అక్రమ బంధానికి అడ్డుగా ఉందని రెండేళ్ల బిడ్డను చంపిన కర్కశ తల్లి

చిన్నారి (ఫైల్)

**తిరుపతి క్రైం:** అమ్మ.. ఈ పదంలో అనంతమైన ప్రేమ దాగి ఉంది. బిడ్డ ఈ ప్రపంచాన్ని చూడకముందే ప్రేమించేది అమ్మే. మరి అలాంటి అమ్మే మరణశాసనం రాస్తే..! ఇటీవల సోషల్ మీడియా ప్రేమలు శృతిమించి అమ్మతనానికి మచ్చ తెస్తున్నాయి. అక్రమంగా ఏర్పడిన వారి ప్రేమబంధాలకు అడ్డుగా ఉన్నారనే సాకుతో నవమోసాలు మోసి.. తాము కన్న పిల్లలనే చంపుతున్న ఘటనలు యావత్ సమాజాన్ని కలవర పెడుతున్నాయి. తాజాగా మాతృత్వానికి మచ్చ తెచ్చే ఘటన తిరుపతిలో వెలుగు చూసింది. అమ్మఒడిలో అల్లారుముద్దుగా పెరుగుతూ బుడిబుడి అడుగులు వేస్తున్న ఆ బిడ్డతో అమ్మ అని పిలిపించుకోక ముందే ప్రేమ మోజులో పడి ఓ తల్లి తన చేతులతోనే రెండున్నరేళ్ల కన్నకూతురినే కిరాతకంగా హతమార్చింది. ఈ ఘటనపై తిరుపతి ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశారు. సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాలుగేళ్ల క్రితం తిరుపతి ఆటోనగర్‌కు చెందిన ఓ మహిళకు వివాహం కాగా దంపతుల మధ్య విభేదాలు రావడంతో భర్త వేరే వివాహం చేసుకున్నాడు. ఆమె ఒంటరిగా జీవిస్తోంది. అయితే ఆమెకు సోషల్ మీడియా ద్వారా ఏర్పేడు మండలం చెన్నంపల్లికి చెందిన రెడ్డికుమార్ అనే వ్యక్తితో ఏర్పడిన పరిచయం.. ప్రేమగా మారింది. గత కొద్దికాలంగా ఇద్దరూ కలిసి సహజీవనం ప్రారంభించారు. కానీ అప్పటికే బుడిబుడి అడుగులు వేస్తూ.. వచ్చీరాని మాటలతో అమ్మ అని పిలిచే ఆ చిన్నారి వారి ప్రేమ బంధానికి అడ్డుగా కనిపించింది.

**గొంతు నులిమి.. దిబ్బలో పూడ్చి..**

''బిడ్డ లేకపోతే మనం సంతోషంగా జీవించగలం'' అంటూ సహచర భాగస్వామి రెడ్డికుమార్(21) చేసిన ఒత్తిడికి తలొగ్గిన ఆ మహిళ మాతృత్వాన్ని మరిచింది. తల్లిగా బిడ్డను కంటికి రెప్పాలా కాపాడాల్సింది పోయి బిడ్డ భారమని భావించింది. ఈ నెల 19న ఇంట్లో ఎవరూ లేని సమయంలో చిన్నారి తలపై దాడి చేసి, అనంతరం గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి ఏర్పేడు మండలంలోని పాపానాయుడుపేట సమీప ఇసుక దిబ్బల్లో పూడ్చిపెట్టారు. చిన్నారి కనిపించడం లేదని చెప్పినప్పటికీ నిందితుల ప్రవర్తనలో వచ్చిన అనుమానాస్పద మార్పులు పోలీసులకు క్లూ ఇచ్చాయి. అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. నిందితులు చూపిన ప్రదేశంలో మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. కేసులో తల్లి, సహజీవన భాగస్వామిని అరెస్ట్ చేయగా, మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అమ్మ చేతుల్లోనే అల్లారుముద్దుగా పెరగాల్సిన ఆ చిన్నారి తల్లి చేతుల్లోనే ప్రాణాలు కోల్పోవడం స్థానికుల కంట కన్నీరు పెట్టిస్తోంది. 'కన్నబిడ్డను కాపాడాల్సిన తల్లే ప్రాణాలు తీస్తే మానవత్వం ఎక్కడికి పోతోంది?' అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రేమ పేరుతో మాతృత్వం ఓడిపోయిన ఈ ఘటన ఒక కుటుంబ విషాదం మాత్రమే కాదు.. యావత్ సమాజాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిన ఘటనగా మిగిలింది.

## బీమా టెండర్‌కు ఆరు బిడ్‌లు దాఖలు

**సాక్షి, అమరావతి:** రాష్ట్ర వైద్య శాఖ పిలిచిన బీమా టెండర్‌కు బుధవారంతో గడువు ముగియగా, ఆరు బిడ్‌లు దాఖలయ్యాయి. ఇండస్ ఇండ్, నేషనల్ ఇన్సూరెన్స్, బజాజ్ అలయన్స్, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్, టాటా ఏఐజీ, గో డిజిట్ సంస్థలు బిడ్‌లు దాఖలు చేశాయి. ఆరోగ్యశ్రీ పథకాన్ని ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా బీమా విధానంలో అమలు చేయడం కోసం చంద్రబాబు ప్రభుత్వం ఈ టెండర్లు పిలిచింది.

## జీతాల కోసం 'అమరావతి' నిర్మాణ కార్మికుల ఆందోళన

కార్మికులతో మాట్లాడుతున్న సీఐ

**తాడికొండ:** రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో పాలుపంచుకుంటున్న నిర్మాణ కార్మికులు జీతాల కోసం ఆందోళనకు దిగిన వైనమిది. వివరాల్లోకి వెళితే.. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం నేలపాడులో రాజధాని నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇక్కడ ఎన్జీవో టవర్స్ నిర్మాణ కాంట్రాక్ట్‌ను షాపూర్‌జీ–పల్లోంజీ సంస్థ దక్కించుకుని పనులు చేయిస్తోంది. ఆ సంస్థలో పని చేసే నిర్మాణ కార్మికులు ఐదు నెలలుగా జీతాలు చెల్లించడం లేదంటూ బుధవారం ఆందోళనకు దిగారు. జీతాలు చెల్లిస్తేనే పనులు కొనసాగిస్తామని కార్మికులు తేల్చి చెప్పారు. ఈ విషయం బయటకు పొక్కకుండా యాజమాన్యం జాగ్రత్త పడింది. సమాచారం అందుకున్న తుళ్లూరు సీఐ కొంకా శ్రీనివాసరావు అక్కడికి వెళ్లి యాజమాన్యంతో చర్చలు జరిపారు. మీడియాను లోపలికి అనుమతించకపోవడంతో ఏం జరిగిందనే వివరాలు బయటకు రాలేదు.

**भारतीय वायु सेना ఇండియన్ ఎయిర్ ఫోర్స్**
**అగ్నివీర్‌వాయుగా ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో చేరండి**

**గుంటూరు (ఆంధ్రప్రదేశ్) వద్ద అగ్నివీర్‌వాయు (సైన్స్ కాకుండా ఇతరమైనవి) ఇన్‌టేక్ 02/2026 గా IAF లో చేరుట కొరకు 09 మార్చి 2026 నుండి 16 మార్చి 2026 వరకు జరిగే రిక్రూట్‌మెంట్ ర్యాలీలో హాజరుకావల్సిందిగా అవివాహిత భారతీయ పురుషులు మరియు మహిళా అభ్యర్థులను ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఆహ్వానిస్తోంది.**

| | | |
|---|---|---|
| 1. | వేదిక / ప్రదేశం | మెయిన్ గేట్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, NH-16, నాగార్జున నగర్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్–522510. |
| 2. | వైవాహిక స్థితి మరియు పుట్టిన తేది బ్లాక్ | అభ్యర్థి అవివాహితులై ఉండాలి మరియు **2 జూలై 2005 మరియు 02 జనవరి 2009** మధ్య జన్మించి ఉండాలి **(రెండు తేదీలతో సహా).** |
| 3. | విద్యార్హత | అభ్యర్థులు కనీసం 50% మార్కులు మొత్తంగా మరియు ఇంగ్లీష్‌లో 50% మార్కులు కలిగి కేంద్ర, రాష్ట్ర మరియు UT ద్వారా గుర్తింపు పొందిన ఎడ్యుకేషన్ బోర్డుల నుండి ఏదైనా స్ట్రీమ్/ సబ్జెక్టులో ఇంటర్మీడియట్/ 10+2/ తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.<br>**లేదా**<br>ఒకేషనల్ కోర్సులో కనీసం 50% మార్కులు మొత్తంగా మరియు ఇంగ్లీష్‌లో 50% మార్కులు కలిగి కేంద్ర, రాష్ట్ర మరియు UT ద్వారా గుర్తింపు పొందిన ఎడ్యుకేషన్ బోర్డుల నుండి రెండు సంవత్సరాల ఒకేషనల్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి (లేదా ఒకేషనల్ కోర్సులో ఇంగ్లీష్ సబ్జెక్ట్ కాకుంటే, ఇంటర్మీడియట్/మెట్రిక్యులేషన్‌లో).<br>**లేదా**<br>డిప్లొమా కోర్సులో మొత్తం 50% మార్కులు మరియు ఇంగ్లీష్‌లో 50% మార్కులు కలిగి కేంద్ర, రాష్ట్ర మరియు UT గుర్తింపు పొందిన పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్ నుండి మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సు ఇన్ ఇంజినీరింగ్ (మెకానికల్ /ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ ఆటోమొబైల్/కంప్యూటర్ సైన్స్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి (లేదా డిప్లొమా కోర్సులో ఇంగ్లీష్ సబ్జెక్ట్ కాకుంటే, ఇంటర్మీడియట్/ మెట్రిక్యులేషన్‌లో).<br>**గమనిక–1.** ఎంపిక పరీక్ష తేదీ నాటికి కేంద్ర, రాష్ట్ర మరియు UT ద్వారా గుర్తింపు పొందిన ఎడ్యుకేషన్ బోర్డులు మాత్రమే అనుమతించబడతాయి.<br>**గమనిక–2.** 10+2/ ఇంటర్మీడియట్/ తత్సమాన పరీక్ష/ మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సు/ రెండు సంవత్సరాల ఒకేషనల్ కోర్సులోని మార్క్స్ షీట్‌లో వ్రాసిన విధంగా డెసిమల్‌కు ముందు మార్కుల ఖచ్చితమైన మొత్తం శాతం లేదా సంబంధిత ఎడ్యుకేషన్ బోర్డు/ పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్ యొక్క నియమాల ప్రకారం లెక్కించబడినది మాత్రమే పరిశీలించబడుతుంది (49.99% ఉదాహరణ కొరకు 49%గా తీసుకోబడుతుంది మరియు రౌండ్ ఆఫ్ చేసిన 50% కాదు). |
| 4. | స్ట్రీమ్ | అగ్నివీర్‌వాయు (సైన్స్ కాకుండా ఇతరమైనవి) |
| 5. | ర్యాలీ సమయం, తేది | ర్యాలీ వేదిక వద్ద రిపోర్టింగ్ సమయం: **మార్చి 9న ఉ. 6 గం. (మహిళల కొరకు), 12 మార్చి మరియు 15 మార్చి 26 (పురుషుల కొరకు)** (పేరా 6లో దిగువ ఇచ్చిన వివరాల ప్రకారం) & రిపోర్ట్ చేయుటకు చివరి సమయం **1000 గం.** |
| 6. | కవరయ్యే స్థిర నివాస రాష్ట్రాలు | **09 మార్చి 26:** ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని జిల్లాల మహిళా అభ్యర్థులు.<br>**12 మార్చి 26:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల పురుష అభ్యర్థులు.<br>**15 మార్చి 26:** తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల పురుష అభ్యర్థులు. |

సవివరమైన ప్రకటన కొరకు వెబ్‌పోర్టల్ **https://agnipathvayu.cdac.in**కు లాగాన్ చేయవలెను.
సవివరమైన సమాచారం కొరకు QR కోడ్ స్కాన్ చేయండి.
CBC 10803/11/0029/2526

# న్యాయవ్యవస్థను మసకబార్చే ప్రయత్నం సహించం: సుప్రీం

- 8వ తరగతి కొత్త పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలో అవినీతి'పాఠం చేర్చడంపై సీరియస్
- సుమోటోగా స్వీకరిస్తామన్న సీజేఐ
- ఆ అంశాలను తొలగిస్తామన్న ఎన్‌సీఈఆర్‌టీ

**సాక్షి, న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా న్యాయవ్యవస్థలో అవినీతి అత్యధికమవుతోందంటూ 8వ తరగతి సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకంలో ''న్యాయవ్యవస్థలో అవినీతి''అనే అంశాన్ని జాతీయ విద్యా పరిశోధనా శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్‌టీ) చేర్చడంపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. న్యాయస్థానాల్లో అవినీతి, పెండింగ్ కేసులు, న్యాయ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు తదితరాలతో కొత్త పుస్తకం రూపొందించారని సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీలు న్యాయస్థానంలో ప్రస్తావించడంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థకు తక్కువచేసేలా పాఠ్యపుస్తకంలో వ్యాఖ్యానాలు ఉన్నాయని, ఈ అంశాన్ని తక్షణం విచారణకు స్వీకరించాలని లాయర్లు చేసిన అభ్యర్థనను సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం.పంఛోలీల ధర్మాసనం పరిశీలించింది. పాఠ్యపుస్తకంలోని ఆ చాప్టర్‌లో 'న్యాయమూర్తులు కోర్టులోనే కాదు వాటి వెలుపల సైతం నైతిక నియమావళికి కట్టుబడి ఉండాలి'అని హితబోధ చేస్తూ వ్యాఖ్యానాలు పొందుపరచడంపై సీజేఐ సూర్యకాంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ''న్యాయవ్యవస్థను, న్యాయ వ్యవస్థ సమగ్రతను మసకబార్చే ఎలాంటి ప్రయత్నాన్ని అయినా మేం అనుమతించబోం. ఈ విషయాన్ని సుమోటో స్వీకరిస్తాం. న్యాయవ్యవస్థను అపకీర్తిపాలుజేసే చర్యలను అడ్డుకుంటా''అని వ్యాఖ్యానించారు.

సీజేఐ సూర్యకాంత్

### చాలా కాల్స్, మెసేజ్‌లు వస్తున్నాయి..

''ఈ పాఠం విషయం తెల్సి నాకు బార్ నుంచి బెంచ్‌దాకా పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదుల నుంచి నాకు అనేక ఫోన్ కాల్స్, మెసేజ్‌లు వస్తున్నాయి. అవినీతి అనేది ఒక్క న్యాయవ్యవస్థలోనే ఉందా? ఇంకా ఏ వ్యవస్థలోనూ లేదా?. ఇటువంటి బోధనల వలన చిన్నారుల్లో న్యాయ వ్యవస్థపై గౌరవం పోతుంది'' అని సీజేఐ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సూమోటోగా వెంటనే స్వీకరించాలని సిబల్ కోరగా సీజేఐ ''ఈ ఒక్కరోజు ఆగండి. ఈ విషయంలో యావత్ న్యాయవ్యవస్థ ఆందోళన వ్యక్తంచేస్తోంది. న్యాయ వ్యవస్థలో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరూ తమ అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఈసమస్యను ఎలా ఎదుర్కోవాలో తమకు బాగా తెలుసని, ఈవ్యవహారంపై ఇప్పటికే సూమోటాగా కేసును నమోదు చేయాలని ఆదేశించా''అని సీజేఐ తెలిపారు. ''ఉద్దేశ పూర్వకంగా పా ఠ్యాంశాన్ని చేర్చినట్లుగా ఉంది. పక్కా ప్రణాళికతో, వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఇంతకుమించి మేం వ్యాఖ్యానించబోం. ఏదేమైనా ఇలాంటి కీలక అంశాన్ని కోర్టు దృష్టికి తెచ్చినందుకు మిమ్మల్ని అభినందిస్తున్నా''అని లాయర్లతో సీజేఐ అన్నారు.

### మేము చాలా బాధపడ్డాం

''న్యాయవ్యవస్థను అవమానక రీతిలో చిత్రించిన కొత్త పాఠ్యాంశాన్ని చూసి మేం చాలా కలత చెందాం''అని న్యాయవాదులు సింఘ్వీ, సిబల్ ధర్మాసనం ఎదుట చెప్పారు. ''న్యాయవ్యవస్థలో అవి నీతి ఉందంటూ విద్యార్థులకు బోధించడం అత్యంత ఆందోళన కలిగించే అంశం''అని సిబల్ అన్నారు. ''పాఠ్యపుస్తకంలోని అంశాలు రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణ సూ త్రాలకు వ్యతిరేకంగా ఉన్నట్లు కనిపిస్తున్నాయి''అని జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీ ఆందోళన వ్యక్తం చేశారు. సీజేఐ వ్యాఖ్యలను కేంద్ర మాజీ న్యాయ శాఖ మంత్రి అశ్వినీ కుమార్ స్వాగతించారు.

### యూటర్న్ తీసుకున్న ఎన్‌సీఈఆర్‌టీ

సర్వోన్నత న్యాయస్థానం సహా పలు హైకోర్టుల జడ్జీలు, న్యాయవాదులు, పలు వర్గాల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవడంతో ఎన్‌సీఈఆర్‌టీ తన నిర్ణయాన్ని వెనక్కితీసుకుంది. తమ వెబ్‌సైట్ నుంచి వివాదాస్పద పాఠ్యపుస్తకాన్ని తొలగించింది. వివాదాస్పద అంశాలను తొలగించాలని భావిస్తోంది. ఇప్పటికే పుస్తకాల ముద్రణ పూర్తయినప్పటికీ వాటిని తొలగించి మళ్లీ కొత్తగా ముద్రించాలని యోచిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ పాఠ్యాంశాన్ని బోధించాలా వద్దా అనే విషయంపై తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని ఢిల్లీలోని పలు పాఠశాలల యాజమాన్యాలు బుధవారం వెల్లడించాయి. ఈ పాఠ్యాంశాన్ని రచించిన విషయ నిపుణులను రప్పించి అసలు వీటికి తుది అనుమతులు ఇచ్చిందెవరు అనేది తేల్చేందుకు ఎన్‌సీఈఆర్‌టీ అంతర్గత సమావేశం నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై ఎన్‌సీఈఆర్‌టీ చైర్మన్ దినేశ్ ప్రసాద్ సాక్లానీ నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. పాఠ్యాంశంపై మోదీ సర్కార్ సైతం అసంతృప్తిగా ఉందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. సుప్రీంకోర్టులో సుమారు 81 వేలు, హైకోర్టుల్లో 62.40 లక్షలు, జిల్లా, సబార్డినేట్ కోర్టులో ఏకంగా 4.70 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, న్యాయవ్యవస్థలో అవినీతి మేటవేసిందని, జడ్జి పోస్టుల భర్తీ సవ్యంగా జరగకపోవడంతో సమస్యలను ఎదుర్కొంటోందని ఆ పాఠ్యాంశంలో పొందుపరిచిన విషయం విదితమే.

# ఉగ్రవాదం పెనుముప్పు!

## దానిపై పోరులో రాజీ లేదు: మోదీ

- భారత్, ఇజ్రాయెల్‌ది ఒకే వైఖరి
- ఆ దేశానికి దన్నుగా నిలుస్తాం
- గాజా శాంతి చర్చలకు మద్దతు
- ఇజ్రాయెల్ పార్లమెంటు కెనెసెట్‌లో ప్రధాని ప్రసంగం

**జెరూసలెం:** ఉగ్రవాదం ఏ మూలన, ఏ రూపంలో ఉన్నా ప్రపంచమంతటికీ అది పెను ముప్పేనని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ''ఉగ్రవాదంపై పోరులో రాజీ పడే ప్రసక్తే లేదు. దాన్ని అన్ని రూపాల్లోనూ సమూలంగా అంతం చేయడమే భారత లక్ష్యం. ఈ విషయంలో భారత్, ఇజ్రాయెల్‌లది ఒకే వైఖరి'' అని స్పష్టం చేశారు. ఇజ్రాయెల్ పర్యటనలో భాగంగా ఆయన బుధవారం ఆ దేశ పార్లమెంటు కెనెసెట్‌లో ప్రసంగించారు. కెనెసెట్ సభ్యులంతా గౌరవ సూచకంగా లేచి నిలబడి మరీ మోదీని స్వాగతించారు. 'మోదీ', 'మోదీ' అంటూ నినాదాలతో హోరెత్తించారు. అనంతరం ప్రధాని మాట్లాడుతూ, ''ఉగ్రవాదం సమాజాలనే అస్థిరపరుస్తుంది. అభివృద్ధికి విఘాతంగా మారుతుంది. విశ్వాసాన్ని రూపుమాపుతుంది. అలాంటి ఉన్మాద భూతంపై పోరులో ద్వంద్వ ప్రమాణాలు పనికి రావు. దాన్ని రూపుమాపాలంటే ప్రపంచ స్థాయిలో పూర్తి సమన్వయంతో కూడిన ప్రయత్నాలు తప్పనిసరి'' అని కుండబద్దలు కొట్టారు. పశ్చిమాసియాలో శాంతి సాధనకు ఉద్దేశించిన గాజా శాంతి చర్చలకు సంపూర్ణ మద్దతు పలికారు. చిరకాల మిత్ర దేశమైన ఇజ్రాయెల్‌కు భారత్ ఈ విషయంలో పూర్తిగా దన్నుగా నిలుస్తుందని ప్రకటించారు. గాజా శాంతి చర్చలు పశ్చిమాసియా అంతటా సుస్థిర, చిరకాల శాంతికి బాటలు పరుస్తాయని ఆయన ఆశాభావం వెలిబుచ్చారు. ఐరాస ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ప్రయత్నాలు పాలస్తీనా సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాయన్న నమ్మకం తనకుందన్నారు. ''శాంతిమార్గం అంత సులువైనది కాదు. అయితే సదుద్దేశంతో కూడిన ప్రయత్నాలకు తెలివిడి, ధైర్యం, మానవత్వం తోడైతే విజయం సునిశ్చితం'' అని పేర్కొన్నారు. పశ్చిమాసియాలో శాంతి కోసం కొన్నేళ్ల క్రితం ఇజ్రాయెల్ 'అబ్రహం అకార్డ్స్'పై సంతకం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రధాని గుర్తు చేశారు. ''ఇజ్రాయెల్ చేపట్టిన ఆ చర్య దశాబ్దాల పాటు అట్టుడికిన పశ్చిమాసియాలో కొత్త ఆశలకు నాంది పలికింది. నాటినుంచి ఈ ప్రాంతంలో పరిస్థితులు అనూహ్యంగా మెరుగుపడ్డాయి'' అంటూ హర్షం వెలిబుచ్చారు. ఇజ్రాయెల్ ధైర్యసాహసాలు, దశాబ్దాలుగా ఆ దేశం సాధిస్తున్న ఘన విజయాలంటే భారత్‌లో అందరికీ గొప్ప ఆరాధనా భావముందని చెప్పారు. ఇరుదేశాల నడుమ 2,000 ఏళ్లకు పైగా సన్నిహిత బంధాలున్నాయని గుర్తు చేశారు.

కెనెసెట్‌లో మాట్లాడుతున్న మోదీ

### హమాస్ దాడితో మేమూ ఆక్రోశించాం

2023 అక్టోబర్ 7న హమాస్ ఉగ్ర సంస్థ జరిపిన పాశవిక దాడిలో భారీ సంఖ్యలో ఇజ్రాయెలీలు ప్రాణాలు కోల్పోవడం భారతీయులందరినీ కలచివేసిందని ప్రధాని అన్నారు. ''వారి కుటుంబీకులకు తనతో పాటు భారతీయులందరి తరఫునా ఈ సందర్భంగా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. ఎవరేమన్నా, ఎన్ని చెప్పినా ఉగ్రవాదం ఏ విధంగానూ సమర్థనీయం కాదు. ఈ విషయంలోమరో మాటకు తావు లేదు. ఇజ్రాయెలీలపై హమాస్ పాల్పడ్డ ఆటవిక దాడి తాలూకు బాధను భారతీయులందరమూ అనుభవించాం. ఇజ్రాయెలీ సోదరులు అంతులేని ఆవేదనను మేమంతా పంచుకున్నాం. ఎందుకంటే ఉగ్రవాద తాలూకు నొప్పిని భారత్ చాలాకాలంగా అనుభవిస్తూ వస్తోంది. ముంబై ఉగ్ర దాడుల్లో భారతీయులతో పాటు పలువురు ఇజ్రాయెలీ సోదరులు కూడా నిష్కారణంగా ప్రాణాలు కోల్పోయారు. ఈ బాధాకర క్షణాల్లోనూ, ఇకముందు కూడా ఇజ్రాయెల్‌కు భారత్ అన్ని విషయాల్లోనూ పూర్తిస్థాయిలో అండగా, వెన్నుదన్నుగా నిలుస్తుంది'' అని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో పాటు సభ్యుల హర్షధ్వానాల నడుమ మోదీ ప్రకటించారు. ''ఆర్థిక, సాంకేతిక రంగాల్లో భారత్ అపార ప్రగతి సాధిస్తోంది. ఇన్నోవేషన్లు, టెక్నాలజీ నాయకత్వ రంగాల్లో ఇజ్రాయెల్‌కు తిరుగు లేదు. కనుక పలు రంగాల్లో ఇరుదేశాల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకుంటాం. త్వరలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటాం'' అని వెల్లడించారు. భారత్, ఇజ్రాయెల్, యూఏఈ, అమెరికాలతో కూడిన ''మిడిల్ ఈస్ట్ యూరప్ ఎకనామిక్ కారిడార్', 'ఐ2యూ2 ఫ్రేమ్‌వర్క్'ల్లో కూడా మరింత చురుగ్గా భాగస్వాములం అవుతామన్నారు.

### మోదీకి అత్యున్నత పురస్కారం

ప్రధాని మోదీకి ఇజ్రాయెల్ అత్యున్నత పురస్కారం 'స్పీకర్ ఆఫ్ ద కెనెసెట్ మెడల్' దక్కింది. ఆ దేశ పార్లమెంటు 'కెనెసెట్' అందజేసే ఈ అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న తొలి భారత ప్రధాని ఆయనే. కెనెసెట్ స్పీకర్ అమీర్ ఒహానా మోదీకి ఆ మెడల్‌ను ప్రదానం చేశారు. ఇరుదేశాల మధ్య సంబంధాల బలోపేతానికి చేస్తున్న కృషికి గుర్తింపుగా ఆయనకు ఈ పురస్కారం అందజేసినట్టు పేర్కొన్నారు. 2018లో పాలస్తీనా కూడా మోదీకి తమ అత్యున్నత పౌర పురస్కారం 'గ్రాండ్‌కాలర్ ఆఫ్ ద స్టేట్ ఆఫ్ పాలస్తైన్' అందజేసింది. ఆ రెండు శత్రు దేశాల నుంచీ అత్యున్నత పురస్కారాలు అందుకుతున్న అరుదైన నాయకునిగా మోదీ నిలిచారు. ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రసంగించిన తొలి భారత ప్రధాని కూడా ఆయనే.

బుధవారం విమానాశ్రయంలో మోదీకి ఆత్మీయంగా స్వాగతం పలుకుతున్న నెతన్యాహు దంపతులు

### రెడ్‌కార్పెట్ స్వాగతం

అంతకుముందు ప్రధాని మోదీకి ఇజ్రాయెల్‌లో రెడ్‌కార్పెట్‌తో ఘనస్వాగతం లభించింది. టెల్ అవీవ్‌లోని బెన్ గురియన్ విమానాశ్రయంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తన భార్యతో కలిసి మోదీకి స్వయంగా స్వాగతం పలకడం విశేషం. 'ప్రియమైన మిత్రునికి స్వాగతం' అంటూ మోదీని ఆయన ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. భారత ప్రధానికి స్వాగతం పలకడాన్ని గొప్ప గౌరవంగా భావిస్తున్నట్టు చెప్పారు. ఆయనతో తనకు వ్యక్తిగతంగా కూడా అతి సన్నిహిత బంధముందని అనంతరం ఎక్స్ పోస్టులో నెతన్యాహు గుర్తు చేసుకున్నారు. తనకు లభించిన ఘనస్వాగతం పట్ల మోదీ హర్షం వెలిబుచ్చారు. అనంతరం విమానాశ్రయంలోనే నేతలిద్దరూ భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలతో పాటు పశ్చిమాసియాలో తాజా పరిస్థితులు తదితరాలపై లోతుగా చర్చించారు. నెతన్యాహుతో భేటీ అద్భుతంగా సాగిందని మోదీ పేర్కొన్నారు. వ్యవసాయం, టెక్నాలజీ, నీటి నిర్వహణతో పాటు పలు అంశాల్లో పరస్పర సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవాలని నిర్ణయించుకున్నట్టు వెల్లడించారు. గురువారం వారిద్దరూ మరో దఫా భేటీ కానున్నారు. ఆ సందర్భంగా పలు కీలక ఒప్పందాలపై సంతకాలు జరిగే అవకాశముంది. గత తొమ్మిదేళ్లలో ఇజ్రాయెల్‌లో మోదీకి ఇది రెండో పర్యటన.

### 'మోదీ హగ్' ప్రపంచ ప్రసిద్ధం! - నెతన్యాహు

కెనెసెట్‌లో మోదీని ఆహ్వానిస్తూ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్వాగతోపన్యాసం చేశారు. 'మోదీ నా మిత్రుడు మాత్రమే కాదు, ప్రియమైన సోదరుడు కూడా' అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. ''ప్రపంచ వేదిక లపై మోదీ గొప్ప నేతగా వెలుగుతున్నారన్నారు. ముఖ్యంగా 'మోదీ కౌగిలి' చాలా ప్రత్యేకమైనది. అది ప్రపంచమంతటా ప్రసిద్ధి చెందింది'' అంటూ చమత్కరించారు! ''ఇజ్రా యెల్‌లో మోదీ గత పర్యటన సందర్భంగా ఇద్దరమూ మధ్యధరా సముద్ర తీరంలో విహరించాం. చెప్పులు విడిచి నీళ్లలో నడుద్దామా అని మోదీని అడిగాను. మేమిద్దరం నీళ్లలో నడవలేదు గానీ ద్వైపాక్షిక సంబంధాల విషయంలో అద్భుతాలు చేస్తూ వస్తున్నాం. వర్తకాన్ని రెండింతలు, సహకారాన్ని మూడింతలు, అవగాహనను నాలుగింతలు పెంచాం'' అన్నారు.

# జార్ఖండ్ సీఎం సోరెన్‌కు ఊరట

**క్రిమినల్ కేసులో దర్యాప్తుపై స్టే ఇచ్చిన సుప్రీం**

**న్యూఢిల్లీ:** క్రిమినల్ కేసులో జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు సుప్రీంకోర్టులో ఊరట దక్కింది. చట్టవిరుద్ధమైన మైనింగ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో దర్యాప్తునకు హాజరు కావాలని ఆదేశిస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఇచ్చిన సమన్లకు ఉద్దేశపూర్వకంగా స్పందించలేదని పేర్కొంటూ ఆయనపై గతంలో క్రిమినల్ కేసు నమోదయ్యింది. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ హేమంత్ సోరెన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈడీ పదేపదే తనకు సమన్లు జారీ చేస్తుండడాన్ని సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. సోరెన్‌పై దర్యాప్తునకు నిలిపివేస్తూ ఆదేశాలిచ్చింది. ఈ మేరకు ఈడీకి నోటీసు జారీ చేసింది. అంతకముందు ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ అనిల్ కౌశిక్ వాదనలు వినిపించారు. ఏడుసార్లు సమన్లు జారీ చేసినప్పటికీ సోరెన్ స్పందించలేదని, ఈడీ ఎదుట విచారణకు హాజరు కాలేదని చెప్పారు. మనీ లాండరింగ్ కేసులో దర్యాప్తు చాలావరకు పూర్తయ్యిందని, ఒకే ఒక్క సాక్షిని ప్రశ్నించాల్సి ఉందని పేర్కొన్నారు. అనంతరం జస్టిస్ సూర్యకాంత్ స్పందించారు. ఈడీ చాలా ఫిర్యాదులు చేస్తున్నట్లు వార్తా పత్రికల్లో చదివామని, ముందుగా వాటిపై దృష్టి పెట్టాలని సూచించారు.

# భారత్, పాక్ యుద్ధం ఆపకుంటే... కోట్ల మంది చనిపోయేవారు!

## పాక్ ప్రధానే చెప్పారు ● డొనాల్డ్ ట్రంప్ నోట మళ్లీ పాత పాట

**న్యూయార్క్/వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి పాత పాటే పాడారు. భారత్, పాకిస్తాన్ నడుమ యుద్ధాన్ని తానే ఆపానని చెప్పుకున్నారు. కాకపోతే ఈసారి దానికి తనదైన శైలిలో మరిన్ని విశేషణాలు జోడించారు. ''నేనే గనక జోక్యం చేసుకోకపోతే ఆ రెండు దేశాల మధ్య ఘర్షణ ఘోర అణుయుద్ధానికి తారి తీసేది. అప్పుడు ఏకంగా 3.5 కోట్ల మందికి పైగా ప్రాణాలు కోల్పోయేవారు. ఈ మాట పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ నాతో స్వయంగా చెప్పారు''అంటూ గొప్పలకు పోయారు. మంగళవారం ట్రంప్ అమెరికా కాంగ్రెస్‌ను ఉద్దేశించి వార్షిక ప్రసంగం చేశారు. అధ్యక్షునిగా రెండోసారి బాధ్యతలు చేపట్టాక తొలి 10 నెలల్లోనే ప్రపంచవ్యాప్తంగా ఏకంగా 8 యుద్ధాలను ఆపానని పునరుద్ఘాటించారు. కంబోడియా–థాయ్‌లాండ్, కొసావో–సెర్బియా, ఇజ్రాయెల్–ఇరాన్, ఈజిప్ట్–ఇథియోపియా, అర్మనియా–అజర్‌బైజాన్, కాంగో–రువాండా, గాజా యుద్ధాల గురించి చెబుతూ భారత్, పాక్ ప్రస్తావన కూడా తెచ్చారు. దాయాదుల మధ్య యుద్ధాన్ని తానే ఆపానని గత ఏడాది కాలంలో ట్రంప్ కనీసం 100 సార్లకు పైగా చెప్పుకోవడం తెలిసిందే. ఆపకపోతే కోటి మంది మరణించి ఉండేవారని ఒకసారి, 2.5 కోట్ల మంది చనిపోయేవారని మరోసారి చెప్పుకొచ్చిన ఆయన.. ఈసారి ఆ సంఖ్యను 3.5 కోట్లకు పెంచేయడం విశేషం! ట్రంప్ ప్రకటనలను భారత్ ఎప్పుడో ఖండించింది. పాక్ దిగొచ్చి స్పష్టంగా విజ్ఞప్తి చేసినందుకే ఆపరేషన్ సిందూర్‌కు స్వస్తి పలికినట్టు స్పష్టం చేసింది.

### బాబోయ్, మరీ ఇన్ని విజయాలా!

అధ్యక్షునిగా రెండోసారి బాధ్యతలు చేపట్టాక తాను సాధించిన విజయాలు తదితరాలను ఏకరువు పెడుతూ కాంగ్రెస్‌ను ఉద్దేశించి ట్రంప్ ఏకంగా 100 నిమిషాలకు పైగా మాట్లాడారు! తద్వారా తన గత రికార్డును తానే అధిగమించారు. ఏడాది పాలనలో అమెరికాను తిరిగి అత్యంత శక్తిమంతంగా తీర్చిదిద్దినట్టు చెప్పుకున్నారు. ''ఇంటాబయటా అమెరికన్ల భద్రతను ఎన్నడూ లేనంతగా బలోపేతం చేసుకోగలిగాం. ఉపాధి నుంచి ఉత్పత్తి దాకా అన్ని రంగాల్లోనూ విజయ పరంపరలు కొనసాగిస్తున్నాం. టారిఫ్‌లతో దేశాలను దారికి తెచ్చి మనమేంటో చూపించాం. దేశం మళ్లీ గెలుపు బాటకు మళ్లింది. ఎన్నెన్ని విజయాలు సాధిస్తున్నామో చెప్పలేను! అందుకే ఏయే అంశాలను ప్రస్తావించాలో కూడా నాకే తెలియడం లేదు. ప్రజలు కూడా అదే అంటున్నారు. 'బాబోయ్, ఇన్ని విజయాలా!? ప్రెసిడెంట్! మనం మరీ ఎక్కువ విజయాలు సాధిస్తున్నాం. ఇంతకుమించి తట్టుకోవడం మావల్ల కాదు. ప్లీజ్, ప్లీజ్, ప్లీజ్!'అని వేడుకుంటున్నారు''అని చెప్పుకొచ్చారు. అమెరికాలో నవంబర్‌లో మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో దేశవ్యాప్తంగా నానాటికీ పడిపోతున్న తన రేటింగ్స్‌ను పెంచుకోవడమే లక్ష్యంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసినట్టు భావిస్తున్నారు.

### టారిఫ్‌లు కొనసాగుతాయ్

ప్రపంచ దేశాలపై తన టారిఫ్‌లను కొట్టేసిన సుప్రీంకోర్టు తీర్పును ట్రంప్ మరోసారి తూర్పారబట్టారు. సుంకాల రూపంలో దేశానికి భారీగా ఆదాయం వచ్చి పడుతూ అంతా బాగా సాగుతున్న వేళ పనికిమాలిన తీర్పు వచ్చి పడిందంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ ఆమోదంతో నిమిత్తం లేకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వాటిని కొనసాగించి తీరతానని పునరుద్ఘాటించారు. అంతే కాదు, ''ఏదో ఒకనాడు నా టారిఫ్‌లు ఆధునిక ఆదాయ పన్ను వ్యవస్థ స్థానాన్ని భర్తీ చేస్తాయి. చూస్తుండండి! అప్పుడు అందరూ నన్ను గొప్పగా ప్రస్తుతిస్తారు''అని చెప్పుకొచ్చారు. ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేసుకోవడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించే ప్రసక్తే లేదని ట్రంప్ హెచ్చరించారు.

అమెరికా కాంగ్రెస్‌ను ఉద్దేశించి మాట్లాడుతున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

### ఇది మూడో టర్మ్ కావాల్సింది!

కాంగ్రెస్‌ను ఉద్దేశించి ప్రసంగం సందర్భంగా ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అధ్యక్షునిగా తనకిది నిజానికి మూడో టర్మ్ కావాల్సిందని చెప్పుకొచ్చారు. ''అనుకోనివి జరుగుతుంటాయి. ఏం చేస్తాం!''అంటూ నిట్టూర్చారు. 2020 అధ్యక్ష ఎన్నికల్లో జో బైడెన్ చేతిలో ఓటమిని ట్రంప్ అంగీకరించకపోవడం, క్యాపిటల్ హిల్ భవనంపై దాడికి తన మద్దతుదారులను రెచ్చగొట్టడం తెలిసిందే. దాన్ని ఉద్దేశించి తాజాగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఒక వ్యక్తి రెండుసార్లకు మించి అధ్యక్షుడు అయ్యేందుకు అమెరికా రాజ్యాంగం అనుమతించదు.

# ఈ-వీసాలు ఉంటేనే యూకే ప్రయాణం

**అమల్లోకి వచ్చిన డిజిటల్ ట్రావెల్ వ్యవస్థ**

**లండన్:** యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) వీసాల విషయంలో కొత్త నిబంధనలు బుధవారం నుంచే అమల్లోకి వచ్చాయి. పూర్తిస్థాయిలో డిజిటలీకరణ ప్రారంభమైంది. డిజిటల్ ట్రాన్సిట్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. భారతీయ పర్యాటకులు ఇకపై తప్పనిసరిగా ఈ-వీసాలు పొందాల్సి ఉంటుంది. వీసా అవసరం లేని పర్యాటకులైతే ఎలక్ట్రానిక్ ట్రావెల్ ఆథరైజేషన్(ఈటీఏ) తీసుకోవాలి. పేపర్ ఆధారిత వీసా స్టిక్కర్లు ఇకపై ఉండవు. అయితే, బయోమెట్రిక్ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తుదారులు వీసా జారీ కేంద్రానికి స్వయంగా వెళ్లాల్సిందే. యూకే వెళ్లాలంటే కచ్చితంగా డిజిటల్ అనుమతి తీసుకోవాలి. ఈ-వీసా గానీ, ఈటీఏ గానీ, సరైన డాక్యుమెంటేషన్ గానీ లేకపోతే విమానం ఎక్కడానికి అనుమతి ఉండదు. ఈ-వీసా వ్యవస్థను యూకే ప్రభుత్వం గత ఏడాది ప్రారంభించింది. దశల వారీగా అమల్లోకి తీసుకొచ్చింది. ఇప్పటిదాకా ఫిజికల్ డాక్యుమెంట్లు కూడా స్వీకరించారు. ఇకపై ప్రక్రియ మొత్తం యూకే వీసా, ఇమిగ్రేషన్(యూకేవీఐ) సిస్టమ్‌లోనే పూర్తవుతుంది. ఒకవేళ ఈ-వీసా గనుక చోరీకి గురైనా, ఎక్కడైనా కనిపించకుండాపోయినా వెంటనే ఇమిగ్రేషన్ హక్కులు నిరూపించుకోవాలి. కొత్త నిబంధనల వల్ల యూకే ప్రయాణం మరింత సులభతరంగా మారుతుందని యూకే ఇమిగ్రేషన్, సిటిజెన్‌షిప్ శాఖ మంత్రి మైక్ ట్యాప్ చెప్పారు. ఈ-వీసాలు పొందినవారు, ఈయూ సెటిల్‌మెంట్ స్కీమ్ స్టేటస్ ఉన్నవారు యూకేవీఐ అకౌంట్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని యూకే హోంశాఖ సూచించింది. అమెరికా, కెనడా, ఫ్రాన్స్ వంటి కొన్ని దేశాల పౌరులు యూకేలో పర్యటించాలంటే వీసా అవసరం లేదు. ఈటీఏ ఉంటే సరిపోతుంది.

# ఇద్దరి కంటే ఎక్కువ సంతానమున్నా పోటీ చేయొచ్చు

**జైపూర్:** ఇద్దరి కంటే ఎక్కువ సంతానముంటే పంచాయతీ ఎన్నికల్లో పోటీకి అనర్హులన్న నిబంధనను రాజస్తాన్‌రద్దు చేసింది. సంబంధిత బిల్లును రాష్ట్ర కేబినెట్ బుధవారం ఆమోదించింది. ''1991–94కాలంలో సంతాన సాఫల్యరేటు ఏకంగా 3.6 శాతముండేది. ఇప్పుడది రెండు శాతానికి పడిపోయింది. ఈ నేపథ్యంలో పాత నిర్ణయాన్ని ఇప్పటికీ అమలుచేయడం సహేతుకం కాదు. అందుకే పాత నిబంధనలను మార్చాం. పంచాయతీ రాజ్ చట్టం 1994లోని సెక్షన్ 19ను మారుస్తూ, రాజస్థాన్ మున్సిపాలిటీల చట్టం1994లోని సెక్షన్ 24ను సవరిస్తూ కొత్త బిల్లులు తీసుకొస్తున్నాం'' అని మంత్రి జోగారాం పటేల్ మీడియాకు వెల్లడించారు. ఆర్థిక నేరాల కట్టడికి, ఆర్థిక క్రమశిక్షణ ధ్యేయంగా పాత రాష్ట్ర రెవిన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ స్థానంలో కొత్తగా రెవిన్యూ ఇంటెలిజెన్స్, ఎకనమిక్ అఫెన్సెస్ డైరెక్టరేట్‌ను ఏర్పాటుకు కూడా కేబినెట్ ఆమోదముద్ర వేసింది.

# బ్లాక్‌బాక్సు లేని 40 ఏళ్ల విమానం

**జార్ఖండ్ ప్రమాదంపై దర్యాప్తునకు అవరోధాలు**

**న్యూఢిల్లీ:** జార్ఖండ్‌లో ఏడుగురి మృతికి కారణమైన 40 ఏళ్ల నాటి బీచ్‌క్రాఫ్ట్ సీ90ఏ విమానంలో బ్లాక్ బాక్సు (కాక్‌పిట్ వాయిస్ రికార్డర్, ఫ్లైట్ డేటా రికార్డర్లు) లేదని డీజీసీఏ వెల్లడించింది. దానికి చివరిసారిగా 1987లో అర్హత సర్టిఫికెట్ జారీ చేసినట్లు పేర్కొంది. రెడ్‌బర్డ్ ఎయిర్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన బీచ్‌క్రాఫ్ట్ సీ90ఏను ఎయిర్ అంబులెన్స్‌గా ఉపయోగిస్తున్నారు. ఈ నెల 23న జార్ఖండ్ నుంచి ఢిల్లీకి అత్యవసరంగా బయలుదేరగా మధ్యలోనే కూలిపోయింది. ఆ సమయంలో విమానంలో ఐదుగురు ప్రయాణికులు, ఇద్దరు సిబ్బంది ఉన్నారు. ఈ ఘటనపై డీజీసీఏ దర్యాప్తు ప్రారంభించింది. ఈ విమానాన్ని 1987లో తయారు చేసినట్లు గుర్తించారు. అర్హత సమీక్ష సర్టిఫికెట్ వచ్చే ఏడాది జనవరి 20దాకా చెల్లుబాటు అవుతుందని అధికారులు వెల్లడించారు. అయితే, విమానంలో బ్లాక్‌బాక్సు లేకపోవడం దర్యాప్తునకు అవరోధంగా మారింది. విమానానికి సంబంధించిన కీలక సమాచారం అందుబాటు లేకుండాపోయింది. నిబంధనల ప్రకారం.. 5,700 కిలోల కంటే బరువు ఉన్న విమానంలో కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ కచ్చితంగా ఉండాలి. ప్రమాదానికి గురైన విమానం బరువు 4,583 కిలోలుగా తేల్చారు. విమానంలో లోపాలు, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నట్లు డీజీసీఏ వర్గాలు స్పష్టంచేశాయి.

# తప్పు చేశా.. క్షమించండి

- గేట్స్ ఫౌండేషన్ సిబ్బందికి బిల్‌గేట్స్ విజ్ఞప్తి
- ఎప్‌స్టీన్‌ను కలవడం నేను చేసిన పెద్ద తప్పు
- అతడి నేరాల్లో ఏనాడూ పాలుపంచుకోలేదు
- ఎప్‌స్టీన్ మహిళలతో నాకు ఎలాంటి సంబంధాల్లేవు
- ఇద్దరు రష్యా మహిళలతో సంబంధాలున్న మాట నిజమే

**న్యూయార్క్:** సెక్స్ కుంభకోణం సూత్రధారి, అమెరికా ఫైనాన్షియర్ జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో తనకు సంబంధాలున్న మాట నిజమేనని మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ ఎట్టకేలకు అంగీకరించారు. ఇద్దరు రష్యా మహిళలతో సంబంధాలు కొనసాగించినట్లు వెల్లడించారు. అయితే, చట్టవిరుద్ధమైన పనులేవీ చేయలేదని పేర్కొన్నారు. ఎప్‌స్టీన్ నేరాల్లో తాను పాలుపంచుకోలేదని స్పష్టంచేశారు. అయినప్పటికీ తన వల్ల 'గేట్స్ ఫౌండేషన్'కు చెడ్డ పేరు వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఎప్‌స్టీన్‌ను కలవడం తప్పేనని, తనను పెద్ద మనసుతో క్షమించాలని ఫౌండేషన్ సిబ్బందికి విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు ఫౌండేషన్ ప్రతినిధి వ్యాఖ్యలను ఉటంకిస్తూ ఓ వార్తా సంస్థ ఒక నివేదికను తాజాగా బహిర్గతం చేసింది. తనపై వచ్చిన ఆరోపణలపై మంగళవారం జరిగిన టౌన్‌హాల్ సమావేశంలో బిల్ గేట్స్ వివరణ ఇచ్చారని పేర్కొంది. ''ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో భాగంగా విడుదల చేసిన ఫొటోల్లో మహిళలతో నేను ఉన్నట్లు చూపించారు. ఆ ఫొటోల్లో మహిళల ముఖాలను తారుమారు చేశారు. నిజానికి ఎప్‌స్టీన్ సహాయకులతో ఫొటో దిగాను. ఎప్‌స్టీన్ వినతి వల్లే దిగాల్సి వచ్చింది. అతడి చుట్టూ ఉన్న మహిళలతో ఏనాడూ నేను కాలం గడపలేదు. ఎప్‌స్టీన్ బారిన పడిన బాధిత మహిళలతో నాకు ఎలాంటి సంబంధం లేదు. ఎప్‌స్టీన్‌ను కలవడం ద్వారా పెద్ద తప్పు చేశా. అతడితో సమావేశాలకు గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధులను కూడా తీసుకెళ్లడం ఇంకా పెద్ద తప్పు. మైనర్లతో వ్యభిచారం కేసులో ఎప్‌స్టీన్ 2008లో దోషిగా తేలాడు. మూడేళ్ల తర్వాత.. 2011లో అతడిని కలిశా. అతడి నేపథ్యం గురించి సరిగ్గా తనిఖీ చేసుకోలేదు. ఎప్‌స్టీన్‌తో సంబంధాల గురించి 2013లో నా భార్య మెలిండా ఆందోళన వ్యక్తంచేసింది. అయినప్పటికీ 2014 దాకా అతడిని పలుమార్లు కలిశా. ఎప్‌స్టీన్‌తో కలిసి ప్రైవేట్ జెట్ విమానాల్లో ప్రయాణించా. జర్మనీ, ఫ్రాన్స్, న్యూయార్క్, వాషింగ్టన్‌లో అతడితో సమావేశమయ్యా. కానీ, ఎప్‌స్టీన్ ఐలాండ్‌లో ఏనాడూ ఒక్కరాత్రి కూడా గడపలేదు. నా వల్ల గేట్స్ ఫౌండేషన్‌కు మచ్చ రావడం బాధగా ఉంది. నా వ్యవహార శైలి, ప్రవర్తన ఫౌండేషన్ విలువలకు, లక్ష్యాలకు విరుద్ధంగానే ఉన్నాయి. చివరిసారిగా 2014లో ఎప్‌స్టీన్‌ను కలిశా. ఎప్‌స్టీన్ విషయంలో నా భార్య మెలిండాకు మొదటినుంచీ అనుమానాలు న్నాయి. ఎప్‌స్టీన్‌తో సంబంధాల వల్ల నా పేరు ప్రతిష్టలు మంట గలుస్తున్నాయని చివరికి గ్రహించా. ఇద్దరు రష్యా మహిళలతో సంబంధాలు కొనసాగించిన సంగతి నిజమే. వారిలో ఒకరు బ్రిడ్జ్ ప్లేయర్. బ్రిడ్జ్ ఈవెంట్లలో ఆమె నన్ను కలిశారు. మరొకరు న్యూక్లియర్ ఫిజిసిస్ట్. బిజినెస్ కార్యక్రమాల్లో భాగంగా మేము కలుసుకున్నాం''అని బిల్ గేట్స్ వ్యాఖ్యానించిట్లు వార్తా సంస్థ స్పష్టంచేసింది.

### లక్షలాది పత్రాలు విడుదల

ఎప్‌స్టీన్ ఫైళ్లను అమెరికా న్యాయ శాఖ గత నెలలో బయటపెట్టిన సంగతి తెలిసిందే. పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు, టెక్నాలజీ రంగ దిగ్గజాలు ఎప్‌స్టీన్‌తో సన్నిహితంగా మెలిగారని తెలియజేసింది. ఎప్‌స్టీన్‌తో బిల్ గేట్స్‌కు కూడా సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు ఈ దస్త్రాల్లో తేలడంతో సంచలనాత్మకంగా మారింది.

## శ్రీవారి వార్షికోత్సవాలు

దుగ్గిరాల: రైలుపేట కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాలలో బుధవారం హనుమంతుని హోమం ఘనంగా నిర్వహించారు.



## సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 538.60 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 40,593 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

## నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్ యార్డులో బుధ వారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5500, గరిష్ట ధర రూ.7000, మోడల్ ధర రూ.6200 వరకు పలికింది.

## రంజాన్ వేళలు

| | ఇఫ్తార్ (గురు) | సహరి (శుక్ర) |
|---|---|---|
| నరసరావుపేట | 6.21 | 5.12 |
| గుంటూరు | 6.19 | 5.10 |
| బాపట్ల | 6.19 | 5.10 |

## రాజాధిరాజ వాహనంపై నృసింహుడు

### వైభవంగా బ్రహ్మోత్సవాలు

రాజాధిరాజ వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత స్వామివారు

మంగళాద్రిలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజైన బుధవారం స్వామి వారు రాజాధిరాజ వాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాన్ని తిలకించిన వారు సుఖ సంతోషాలతో వెలుగొందుతారని నమ్మకం. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి కె. సునీల్‌కుమార్ పర్యవేక్షించారు. ఉత్సవ కైంకర్యపరులుగా దుగ్గిరాల మండలం పెదపాలెం గ్రామానికి చెందిన పెమ్మసాని శైలేంద్ర వ్యవహరించారు.

**నేడు యాలి వాహనంపై.....**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు గురువారం రాత్రి యాలి వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవాలను భక్తులు తిలకించి స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆలయ అధికారులు కోరారు. – మంగళగిరి టౌన్

ఉత్సవానికి హాజరైన భక్తులు

## న్యూస్‌రీల్

### విజయకీలాద్రిపై ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు

మంగళగిరి టౌన్: గుంటూరు జిల్లా సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారం ఐదవ రోజుకు చేరుకున్నాయి. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్నజీయర్‌స్వామి స్వీయ పర్యవేక్షణలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి, శ్రీ భూనీళా సమేత వైకుంఠనాథ్ పెరుమాళ్, శ్రీ లక్ష్మీ హయగ్రీవ స్వామి వారు, శ్రీ యోగాంజేయ స్వామి వార్ల ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించబడుతున్నాయని తెలిపారు. బుధవారం ఉదయం శ్రీ నారసింహ హవనం, పూర్ణాహుతి, తీర్థ ప్రసాద గోష్టి కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి, స్వామివారి మంగళ శాసనాలు అందుకున్నారన్నారు.

### గుంటూరుకు కేంద్ర అధికారి

గుంటూరు ఎడ్యుకేషన్ : జెడ్పీ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న జిల్లా పంచాయతీ రిసోర్స్ సెంటర్ (డీపీఆర్‌సీ) భవనాన్ని కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి సుశీల్ కుమార్ లోహాని బుధవారం పరిశీలించారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు గుంటూరు జిల్లాకు వచ్చిన సుశీల్ కుమార్ లోహాని డీపీఆర్‌సీ నిర్మాణ పనుల ప్రగతి, నిర్మాణ వ్యయం తదితర అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు జెడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసరావు, డీపీవో నాగ సాయి కుమార్, డ్వామా పీడీ వి.శంకర్ పాల్గొన్నారు.

### ఇంటర్ పరీక్ష కేంద్రాలు తనిఖీ చేసిన జేసీ



గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా బుధవారం ప్రథమ సంవత్సర ఇంగ్లిష్ పేపర్–1కు గుంటూరు జిల్లా వ్యాప్తంగా 87 కేంద్రాల పరిధిలో 35,306 మంది హాజరయ్యారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని ఎస్‌ఆర్ కళాశాల, అయ్యప్ప స్వామి గుడి ఎదుట ఉన్న నారాయణ జూనియర్ కళాశాల కేంద్రాలను జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తనిఖీ చేసి పరీక్షలు జరుగుతున్న తీరును గమనించారు. ఆయా కేంద్రాలలో వసతులు పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌ఐవో జి.సునీత ఉన్నారు.

### రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామి కల్యాణం



నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : స్థానిక మారుతీనగర్‌లోని కంచి కామకోటి పీఠ మారుతీ దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న 40వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఏడవ రోజుకు చేరాయి. శ్రీబ్రహ్మానంద సరస్వతి స్వామి (విజయవాడ) జ్యోతిప్రజ్వలనతో వేడుకలు ప్రారంభించారు. సామూహిక తులసి పూజలు చేపట్టారు. శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామి కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

# కన్నీటి వేతనం

- పారిశుద్ధ్య కార్మికులకు నెలలుగా అందని జీతాలు
- అప్పులు పుట్టక.. ఆకలి తీరక నానా కష్టాలు
- జీతాలివ్వాలని మొర పెట్టుకుంటున్నా ఫలితం శూన్యం
- గత్యంతరం లేక విధుల బహిష్కరణ
- ఊరంతా పేరుకుపోయిన చెత్త
- నిలిచిపోయిన తాగునీటి సరఫరా
- సర్కారు తీరుతో ప్రజలకు తప్పని వెతలు

వారంతా పారిశుద్ధ్య కార్మికులు.. నిత్యం చెత్తలోనే బతుకు పయనం.. వారికి నెల నెలా సక్రమంగా వేతనాలివ్వకున్నా ఆకలి బాధలు భరిస్తూ నిత్యం 'స్వచ్ఛ'మైన బతుకు పోరాటం చేస్తున్నారు. ఇటు పాలకులుగానీ, అటు అధికారులుగానీ కనీసం వారిపై కనికరం కూడా చూపడం లేదు. వారి నిరసన ప్రభావంతో స్థానికులకూ ఇబ్బందులు తప్పడం లేదు.

కార్మికులు మూడు రోజులుగా విధులను బహిష్కరించడంతో ప్రత్తిపాడు మెయిన్ రోడ్డులో పేరుకుపోయిన చెత్త

ప్రత్తిపాడు: ఆకలి కేకలతో కడుపు మండిన కార్మికులు విధిలేని పరిస్థితుల్లో విధులను బహిష్కరించారు. దీంతో వీధులన్నీ చెత్త కుప్పలతో నిండాయి. వారితో పాటు వాటర్ మోటర్ ఆపరేటర్లు, విద్యుత్ సిబ్బంది కూడా విధులకు దూరంగా ఉండటంతో ప్రత్తిపాడు వాసుల వెతలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

ప్రత్తిపాడు పంచాయతీలో పదిహేను మంది పారిశుద్ధ్య కార్మికులు, నలుగురు వాల్వ్ ఆపరేటర్లు, ఒక ఫిట్టర్ ఆపరేటర్లు, ఒక ఎలక్ట్రీషియన్‌తో పాటు నలుగురు స్వీపర్లు పని చేస్తున్నారు. వీరిలో పారిశుద్ధ్య కార్మికులకు సుమారు ఐదు నెలలుగా, పంపు ఆపరేటర్లకు ఏడు నెలలుగా, విద్యుత్ సిబ్బందికి నాలుగైదు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. వారు అడిగిన ప్రతిసారి ఏదో ఒక కారణం చెప్పడం, తరువాత ఒక్కొక్కరికి రూ. 5 వేలో, రూ.10 వేలో ఇచ్చి నెట్టుకొస్తుండటం పరిపాటిగా మారింది. పంచాయతీ నుంచి వేతనాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో కార్మికులు స్థానికంగా ఉన్న దుకాణాల్లో అప్పులు చేసి సరుకులు తెచ్చుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ సారి నెలల తరబడి కార్మికుల వేతనాలను అధికారులు చెల్లించకపోవడంతో కిరాణా దుకాణాలలో కూడా అప్పులు పుట్టడం లేదని కన్నీటి పర్యంతం అవుతున్నారు.

పంచాయతీ కార్యాలయం ఎదుట నిలిచిన పారిశుద్ధ్య వాహనం

పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు

### వృద్ధాల కుప్పలు.. నీటి కోసం తిప్పలు

పంచాయతీ సిబ్బంది వేతనాల కోసం నిరసనకు దిగారు. ఇటీవల కొద్ది రోజుల కిందట మండల పరిషత్ కార్యాలయం వద్ద కార్మికుల జీతాల పంచాయతీ జరిగింది. అయినా ఇప్పటికీ పూర్తిగా పరిష్కారం కాలేదు. తాజాగా సోమవారం పంచాయతీలో పని చేస్తున్న సిబ్బంది అంతా విధులను బహిష్కరించి కార్యాలయం ఎదుట బైఠాయించారు. మంగళవారం, బుధవారం కూడా విధులకు హాజరు కాకపోవడంతో ప్రత్తిపాడులో ఎటు చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. అలానే నీటి సిబ్బంది కూడా వాటర్ వదలక పోవడంతో ఊరంతా తాగు నీటి కోసం దిక్కులు చూడాల్సిన దుస్థితి చోటుచేసుకుంది. ఇప్పటికైనా అధికారులు పంచాయతీ కార్మికులపై కనికరం చూపి వేతనాలు చెల్లించాలని ప్రజలు, కార్మికులు కోరుతున్నారు.

### ఏడు నెలలుగా వేతనాల్లేవు

మాకు పది నెలల జీతాలు రావాలి. అందులో మూడు నెలలు అడ్వాన్సుగా ఇచ్చారు. ఇంకా ఏడు నెలలవి రావాల్సి ఉంది. బతుకే కష్టంగా మారింది. సరుకుల కోసం షాపులకు వెళ్లాలన్నా ఇబ్బందిగా మారింది. పెంచుతామన్న జీతం కూడా ఇంత వరకూ పెంచలేదు.

– వి. భాస్కర్ (నీటి సరఫరా ఆపరేటర్)

### జీతాలు సక్రమంగా ఇవ్వాలి

పారిశుద్ధ్య కార్మికులకు నాలుగు నెలలుగా జీతాల్లేవు. ఎరియర్లు కూడా ఇవ్వలేవు. ప్రతి నెల మా జీతాలు బ్యాంకు ఖాతాలకు జమ చేసేలా చూడాలి. ఒక పూట సెలవు అవకాశం ఉంది. దానిని కూడా అమలు చేయాలి. నెల నెలా సక్రమంగా జీతాలు చెల్లించాలి.

– సీహెచ్ థామస్ (పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు)

### ఏఎన్‌యూలో పీజీ సమన్వయకర్త తనిఖీలు

ఏఎన్‌యూ (పెదకాకాని): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పరీక్షలపై వస్తున్న వరుస కథనాలకు స్పందించిన పీజీ కోర్సుల సమన్వయకర్త ఆచార్య మన్నం సుబ్బారావు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో కొన్ని లోపాలను గుర్తించినట్లుగా ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఓ విభాగంలో సదరు అధ్యాపకులు ఉన్నప్పటికీ పరిశోధక విద్యార్థులతో పరీక్షల పరిశీలన చేయించడం గుర్తించామన్నారు. ఎవరికి కేటాయించిన డ్యూటీలను వారే చేయాలని, సమస్యలు తలెత్తితే సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలని తెలిపారు. ప్రశ్నపత్రాల్లో తప్పులపై స్పందించకపోవడం గమనార్హం.

### ఆంధ్రా అబ్బాయి.. సింగపూర్ అమ్మాయి..!

చీరాల: ఆంధ్రా అబ్బాయి.. సింగపూర్ అమ్మాయి ఇద్దరూ పెళ్లి పీటలెక్కారు. బాపట్ల మండలం కంకటపాలేనికి చెందిన యార్లగడ్డ వెంకట సుబ్బారావు కుమారుడు సాయి సూర్య, సింగపూర్ దేశానికి చెందిన ఎన్‌జీ షా చ్యూ–వాంగ్ క్వీయిన్ దంపతుల కుమార్తె రోయని ఎన్‌జీలువో యాన్ ప్రేమించుకున్నారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో పెళ్లి బుధవారం చీరాల్లో వివాహం చేసుకున్నారు. బుధవారం ఉదయం 10.29 నిమిషాలకు తెలుగు సంప్రదాయ పద్ధతిలో వీరి వివాహం జరిగింది.

## విజన్ యాక్షన్ ప్లాన్ అమలుకు ప్రణాళిక

**జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా**

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

గుంటూరు వెస్ట్: జిల్లాలో విజన్ యాక్షన్ ప్లాన్ పక్కాగా అమలు చేయడానికి చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. బుధవారం సచివాలయం నుంచి రాష్ట్ర ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాట్లాడుతూ.. జీరో పావర్టీ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించామని పేర్కొన్నారు. నియోజక వర్గ స్థాయిలో విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు జిల్లా స్థాయి వాటిని వినియోగించుకుంటాయని చెప్పారు. జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన పలు అంశాలలో మార్పుచేర్పులు అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, అధికారులు పాల్గొన్నారు.

## 'ఎర్ర' బంగారానికి 'సౌర' రక్షణ

మిర్చి కల్లాల్లో ఓ రైతు ఏర్పాటు చేసిన సోలార్ సీసీ కెమెరా, దీపాలు

తాడికొండ: ఈ ఏడాది మిర్చి పంటకు తెగుళ్ల బెడద లేకపోవడంతో నాణ్యత కలిగిన కాయలు కోతకు వస్తున్నాయి. దీంతో ధరలు కూడా రూ.20 వేలు–రూ.23 వేల వరకు వివిధ రకాలు పలుకుతుండటంతో రైతులు తమ ఎర్ర బంగారాన్ని కాపాడుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా తాడికొండ మండలం రావెల గ్రామంలో ఓ రైతు సౌర విద్యుత్తుతో వెలిగే దీపాలు, సీసీ కెమెరాను స్తంభానికి ఏర్పాటు చేయించారు. ఏటా మిర్చి కల్లాల్లో కాయలు చోరీకి గురవుతుండటంతో రైతులు ఆందోళన చెందుతుండే వారు. దీనికి చెక్ పెడుతూ రైతు తీసుకున్న నిర్ణయం పలువురిని ఆలోచింపజేస్తోంది. రావెల, మందపాడు తదితర గ్రామాల్లో పనుల కోసం కర్నూలు ప్రాంతం నుంచి వలస కూలీలు రాక పెరగడంతో పొలాల్లోనే తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఏటా అంధకారంలోనే గడిపేవారు. ఇప్పుడు వారుంటున్న ప్రాంతాల్లో రైతులు సౌర విద్యుద్దీపాలు ఏర్పాటు చేయడంతో రాత్రివేళ పొలాల్లో వెలుగులు విరజిమ్ముతున్నాయి.

# తడిస్తే జారే.. ఎండితే బేజారే!

- రాజధాని ప్రాంతంలో రహదారులపై నల్లమట్టి
- అక్రమార్కుల దందాతో రోడ్లన్నీ గుల్లగుల్ల
- తడిగా ఉంటే జారిపోతున్న వాహన చోదకులు
- పొడిగా ఉంటే దుమ్ములేస్తున్న రోడ్లు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

రాజధాని ముఖద్వారమైన మంగళగిరి నియోజకవర్గంలో ఉండవల్లి, పెనుమాక, యర్రబాలెం, నవులూరు, బేతపూడి, నిడమర్రు తదితర గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజామున కురిసిన చిన్నపాటి వర్షానికి రోడ్లన్నీ బంకమట్టితో జారుడు బండల్లా తయారయ్యాయి. ఆ మార్గాల్లో ప్రయాణిస్తున్న వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎండలు ఉన్నప్పుడు ఈ మార్గాల్లో దుమ్ములేచి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మట్టి మాఫియాతో వారికి కష్టాలు తప్పడం లేదు.

నల్లమట్టిని తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

గుంటూరు చానల్ బ్రిడ్జిపై ఉన్న నల్లమట్టి బురద

తాడేపల్లి రూరల్: రాజధాని ప్రాంతంలో పలుచోట్ల సక్రమంగా, అక్రమంగా నల్లమట్టిని ఇతర ప్రాంతాలకు తరలించే సమయంలో లారీ యజమానులు నిబంధనలకు విరుద్ధంగా ఓవర్ టన్నేజీతో నల్లమట్టి రవాణా చేస్తున్నారు. దీంతో రాజధాని ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. నిన్నమొన్నటి వరకు రహదారుల దుమ్ము ధూళితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం వల్ల మంగళవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఈదురు గాలితో చిన్నపాటి వర్షం పడింది. ఈ ప్రభావానికి రాజధాని ప్రధాన రహదారులతోపాటు పలు ప్రాంతాల్లోని చిన్న సందుల్లో అక్రమంగా నల్లమట్టి తరలించిన మార్గాల్లో మట్టి తడిసిపోయింది. వాహనాలు ప్రయాణించే సమయంలో జారుతోంది. ఉదయం సమయంలో మట్టి లారీలు సైతం ఆ రోడ్డులపై జారడంతో లారీలను మూడు గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు నిలిపివేశారు. ఉదయం సమయంలో రాజధానిలోని 29 గ్రామాలతోపాటు అమరావతి చుట్టుపక్కల నుంచి విజయవాడకు ద్విచక్రవాహనాలు, కార్లలో వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు పాఠశాలల బస్సులు ఎక్కేందుకు విద్యార్థులు అవస్థలు పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పడంతో రోడ్డుపై బురదలో పడుతున్నారు. అధికారులు ఈ నల్లమట్టి తవ్వకాలను నిర్వహించే లారీ యజమానులపై చర్యలు తీసుకోవాలని, రోడ్డుపై మట్టి పడకుండా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వాహనం జారడంతో యువకుడి అవస్థలు

**కార్మికులకు కష్టాలు**

రాజధాని ప్రాంతంలో అక్రమంగా మట్టి తరలించే కొంతమంది నిబంధనలకు విరుద్ధంగా ఈ మట్టి తవ్వకాలు నిర్వహిస్తూ రోడ్లన్నీ నల్ల మట్టిమయం చేస్తున్నారు. ఆ నల్లమట్టి తోలే మాఫియా వారే అధికారులకు ఫోన్ చేసి రోడ్లు బాగాలేదు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు, మీరు ఏం చేస్తున్నారంటూ తమదైన శైలిలో పార్టీ పేరు చెప్పి పారిశుద్ధ్య కార్మికులను కష్టాలపాలు చేస్తున్నారు. నల్లమట్టిని తొలగించాల్సి రావడంతో అష్టకష్టాలు పడుతున్నారు. బురద ఉంటే దానిని తొలగించడం, ఎండిపోతే రోడ్డుపై మట్టిని తీసి ఊడ్చటం వంటి పనులు చేయాల్సి వస్తోంది. ఆరోగ్యం చెడిపోతోందని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## మిర్చి యార్డు సమాచారం
(బుధవారం ధరలు)

| | |
|---|---|
| వచ్చిన బస్తాలు | 72,040 |
| అమ్మకాలు | 75,233 |
| నిల్వ | 23,140 |

**నాన్ ఏసీ కామన్ రకం** క్వింటా (రూ.)

| | |
|---|---|
| 334 | 13,500–21,000 |
| నంబరు–5 | 13,500–21,000 |
| 341 | 14,000–21,500 |

**ఏసీ కామన్ రకం** క్వింటా (రూ.)

| | |
|---|---|
| 334 | 13,000–19,500 |
| నంబరు–5 | 13,000–20,000 |
| 341 | 14,000–20,500 |

**నాన్ ఏసీ ప్రత్యేక రకాలు** క్వింటా (రూ.)

| | |
|---|---|
| తేజ | 13,000 – 18,000 |
| బాడిగ–355 | 14,000 – 21,000 |
| దేవనూరు డీలక్స్ | 15,500 – 21,500 |
| ఆర్మూర్ | 13,000 – 16,500 |
| తాలుకాయలు | 8,000 – 11,000 |

**ఏసీ ప్రత్యేక రకాలు** క్వింటా (రూ.)

| | |
|---|---|
| తేజ | 13,000–17,000 |
| బాడిగ – 355 | 14,000–20,500 |
| తాలు | 8,500 – 10,000 |

–కొరిటెపాడు (గుంటూరు)

### 28న ఐటీ కెరీర్‌పై గైడెన్స్, జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్‌: కోడింగ్‌ ట్యూటర్‌ ఆధ్వర్యంలో ఐటీ రంగంలో ఉద్యోగాలను సాధించేందుకు అవసరమైన గైడెన్స్‌తో పాటు జాబ్‌ మేళాను ఈనెల 28న నిర్వహిస్తున్నట్లు సంస్థ సీఈఓ ఫణిరాజ్‌ జాలిగాము బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అరండల్‌పేటలోని హోటల్‌ వీ రాయల్‌ పార్క్‌లో జరిగే కెరీర్‌ గైడెన్స్‌లో పాల్గొనేందుకు సెల్‌ నంబరు 96979 89788 లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్‌ చేసుకుని హాజరు కావాలని సూచించారు.

## విమర్శలకు దాడి
# జవాబు కాదు

నగరంపాలెం (గుంటూరు వెస్ట్‌)/ నెహ్రూనగర్‌ (గుంటూరు ఈస్ట్‌): గుంటూరు సిద్ధార్థనగర్‌లో మాజీ మంత్రి, వైఎస్సార్‌ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబును బుధవారం వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు సాకే శైలజానాథ్‌, పార్టీనేత వంగవీటి నరేంద్ర, ఎమ్మెల్సీలు పాలవలస విక్రాంత్‌, పీవీవీ సూర్యనారాయణ, అనంత బాబు, రేపల్లె సమన్వయకర్త ఈవూరు గణేష్‌, సినీ నటుడు జోగినాయుడు పరామర్శించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు.

- సాకే శైలజానాథ్‌ మాట్లాడుతూ, రాజకీయాలలో విమర్శలు, ప్రతి విమర్శలు ఉండాలి కానీ, దాడులు చేయడం మంచి విధానం కాదని అన్నారు. పోలీసుల సమక్షంలో ఏడు గంటలకు పైగా అంబటి ఇల్లు, కార్యాలయంపై దాడి జరగడం బాధాకరమని చెప్పారు. అన్యాయాన్ని ఎదురించేదుకు ఉన్నానని అంబటి వ్యాఖ్యానించడం మంచి మాటగా భావిస్తున్నానని పేర్కొన్నారు. అసెంబ్లీలో చంద్రబాబు నోటీస్‌పై ప్రకారం పచ్చి అబద్ధాలు మాట్లాడారని మండిపడ్డారు. లడ్డూలో అసలు కల్తీ లేదని, ఆయనవ్వటిని దుర్మార్గంగా మాట్లాడేందుకు ప్రయత్నించారని ఆరోపించారు.
- వైఎస్సార్‌ సీపీ నేత వంగవీటి నరేంద్ర మాట్లాడుతూ ఒక అన్యాయాన్ని ప్రశ్నిస్తే టీడీపీ ప్రభుత్వం అడ్డగోలు అరెస్ట్‌లు, శిక్షలు జరుగుతాయనేది స్పష్టంగా తెలుస్తుందని అన్నారు. మంచి వాతావరణం కలిసి కట్టుగా ఉన్నామని, టీడీపీ చేసిన తప్పులను, అక్రమాలను ప్రజలకు తెలియజేస్తామని చెప్పారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి సాకే శైలజానాథ్‌ పక్కన వంగవీటి నరేంద్ర, అంబటి రాంబాబు

- మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఇల్లు, కార్యాలయంపై దాడి గురించి చెప్పేందుకు రాష్ట్ర డీజీపీ, ఏడీజీపీ, గుంటూరు జిల్లా ఎస్పీకి ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అనేకసార్లు ఫోన్‌ చేసినా ఎవరూ ఫోన్‌ లిఫ్ట్‌ చేయలేదన్నారు. దాడికి పాల్పడిన వారు క్రిమినల్స్‌ కాదని, చంద్రబాబు, లోకేష్‌, డీజీపీ, ఐజీ, గుంటూరు జిల్లా ఎస్పీ క్రిమినల్స్‌ అని మండిపడ్డారు. ఆ రోజు నా ఇంటి దగ్గర వరకు జిల్లా ఎస్పీ వచ్చి వెనక్కి వెళ్లారని అన్నారు. చంద్రబాబుకి టచ్‌లో ఉండే పచిలో జిల్లా ఎస్పీ ఉన్నారని ఆరోపించారు. రాష్ట్రంలో లా అండ్‌ ఆర్డర్‌ ఫెయిల్‌ అయిందని ఆరోపించారు.
- రేపల్లె సమన్వయకర్త ఈవూరు గణేష్‌ మాట్లాడుతూ తిరుపతి లడ్డూ అంశాన్ని డైవర్ట్‌ చేయడానికే చంద్రబాబు ప్రభుత్వం అంబటి రాంబాబుపై దాడి చేయించారని, ఇది కేవలం డైవర్షన్‌ పాలిటిక్స్‌ మాత్రమేనని, ప్రజలు దీనిని గమనించాలన్నారు.

### నేటి నుంచి యార్డులో రైతులకు ఉచిత భోజనం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్‌ యార్డులో గురువారం నుంచి రైతులకు ఉచిత భోజన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత భోజనానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఉచిత భోజనంతో పాటు ఉదయం అల్పాహారం కూడా రైతులకు అందించడం జరుగుతోందని ఆమె వెల్లడించారు.

## అత్యవసర వైద్య సేవల కోసం మొబైల్‌ యాప్‌

- కార్డియాలజిస్ట్‌ డాక్టర్‌ గొట్టిపాటి నాగార్జున
- ఘనంగా శ్రేష్ఠ హాస్పటల్స్‌ రెండో వార్షికోత్సవం

కేక్‌ కట్‌ చేస్తున్న డాక్టర్‌ గొట్టిపాటి నాగార్జున, డాక్టర్‌ లక్ష్మణస్వామి, వైద్యులు

గుంటూరు మెడికల్‌: రోగులకు అత్యవసర సమయంలో వైద్య సహాయం వెంటనే అందేలా ఎమర్జెన్సీ ఎస్‌ఓఎస్‌ సౌకర్యంతో రోగుల కోసం మొబైల్‌ యాప్‌ తీసుకొస్తున్నామని శ్రేష్ఠ హాస్పటల్స్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌, ఇంటర్వెన్షనల్‌ కార్డియాలజిస్ట్‌ డాక్టర్‌ గొట్టిపాటి నాగార్జున చెప్పారు. బుధవారం గుంటూరు గుజ్జనగుండ్లలోని శ్రేష్ఠ హాస్పటల్స్‌ ద్వితీయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్‌ గొట్టిపాటి నాగార్జున మాట్లాడుతూ రెండేళ్లుగా రోగుల సంరక్షణ అధిక ప్రాధాన్యత ఇస్తూ, ఆధునిక అత్యుత్తమ వైద్యాన్ని ప్రజలకు అందిస్తూ వారి నమ్మకాన్ని సొంతం చేసుకున్నామని చెప్పారు. హాస్పటల్‌ ఫౌండర్‌, సీనియర్‌ ఆర్థోపెడిక్‌ సర్జన్‌ డాక్టర్‌ యడ్లపల్లి లక్ష్మణస్వామి సమాజానికి అవసరమైన మంచి వైద్యాన్ని అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. ద్వితీయ వార్షికోత్సవ సందర్భంగా శ్రేష్ఠ హాస్పటల్స్‌ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలకు ఫస్ట్‌ ఎయిడ్‌ కిట్లు అందజేశారు. ప్రజలందరికీ ఆరోగ్యంపై అవగాహన కల్పించేలా ఆరోగ్య అవగాహన పోస్టర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మెప్మా నిందితులపై క్రిమినల్‌ చర్యలు?

పల్నాడు జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్న మెప్మా విభాగం

నరసరావుపేట: జిల్లాలో పలు చోట్ల నకిలీ గ్రూపులు సృష్టించి కోట్ల నిధులు బ్యాంకుల నుంచి మింగిన ఉద్యోగులపై క్రిమినల్‌ చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అధికారులు జిల్లా కలెక్టర్‌ డాక్టర్‌ కృతికా శుక్లాకు నివేదిక సమర్పించేందుకు సిద్ధం చేశారు. కలెక్టర్‌ ఆదేశాలతో డీఎస్‌పీ, ఆర్‌డీఓ, మెప్మా పీడీలతో ఏర్పాటైన త్రిసభ్య అధికారుల బృందం ఇచ్చిన నివేదిక మేరకు ఈనెల 10న ఎనిమిది మంది ఉద్యోగులను మెప్మా పీడీ మురళీకృష్ణ సస్పెండ్‌ చేశారు. సస్పెండ్‌ అయిన వారిలో నరసరావుపేట, చిలకలూరిపేట, పిడుగురాళ్ల సిటీ మిషన్‌ మేనేజర్లు తుమ్మా దీప, ఉమర్‌వలి, జి.శ్రీనివాసరావు, చిలకలూరిపేట, నరసరావుపేట, గురజాల కమ్యూనిటీ ఆర్గనైజర్లు ఎం.మల్లికార్జున రావు, జి.భూదేవి, బి.విజయ ప్రశాంతి, కె.శ్రీనివాసరావు, డి.బాలాజి నాయుడు ఉన్నారు. వారిపై ఈనెల 17న పట్టణ పోలీసు స్టేషన్‌లో జిల్లా సమైక్య ప్రెసిడెంట్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఫ్‌ఐఆర్‌ నమోదు చేశారు. దీని ప్రకారం రూ.9.4 కోట్ల వరకు కుంభకోణానికి పాల్పడ్డారని నిర్ధారించారు. అయితే మెప్మా విభాగం తరఫున జరిగిన కుంభకోణంపై నివేదిక సిద్ధం చేశారు. నిధుల కైంకర్యం ఇంకా జరిగిందని నిర్ధారించినట్లు విశ్వసనీయ సమాచారం. దీని ప్రకారం ఉద్యోగులతో పాటు నకిలీ గ్రూపులకు నిధులు విడుదల చేసిన బ్యాంకు ఉద్యోగులపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అందరిపై క్రిమినల్‌ చర్యలు తీసుకొని వారికి సంబంధించిన ఆస్తులను జప్తుచేసే అవకాశం ఉంది.

### వెంగళాయపాలెం కాలువలో యువకుడు గల్లంతు

గుంటూరు రూరల్‌: ఈతకోసం వచ్చి ప్రమాదవశాత్తు కాలువలో పడి యువకుడు గల్లంతైన సంఘటన బుధవారం వెంగళాయపాలెం శైలానగరి రోడ్డులోని కాలువ వద్ద చోటు చేసుకుంది. యువకుడి తండ్రి, భార్య తెలిపిన వివరాల ప్రకారం... పెదకాకాని మండలం పెదకాకానికి చెందిన సంధ్యాల దయాకర్‌ (22) తన మిత్రులు చిన్న, తేజ లతో కలిసి అప్పుడప్పుడు వెంగళాయపాలెం సమీపంలోని కాలువలో ఈతకు వెళ్లి వస్తూ ఉండేవాడు. అదేవిధంగా బుధవారం మధ్యాహ్నం సమయంలో ఈతకోసం వచ్చి కాలువలో దిగారు. ఈతపేస్తూ దయాకర్‌ కాలువ గట్టు ఎక్కి అందరూ ఈతవేస్తున్న ప్రదేశం కంటే కొంచెం ముందు నీరు పారుదల ఎక్కువగా ఉన్న ప్రాంతంలో దూకాడు. అయితే నీటి ప్రవాహ వేగాని కొట్టుకు పోయాడు. స్నేహితులు ఎంత వెదికినా కనిపించకపోవటంతో స్థానికుల సహాయంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనాస్థలానికి చేరుకున్న నల్లపాడు పోలీసులు గత ఈతగాళ్లతో, గ్రౌండ్‌చారిటబుల్‌ ట్రస్ట్‌ సభ్యులతో రాత్రి వరకూ వెతికినా ఫలితం లేకుండా పోయింది. నీటిపారుదల ఎక్కువగా ఉండటంతో కొట్టుకు పోయాడని పోలీసులు భావిస్తున్నారు. విషయం తెలిసిన దయాకర్‌ తండ్రి శంకర్‌, కుటుంబ సభ్యులతో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని వారు సైతం వెతుకులాట ప్రారంభించారు. దయాకర్‌ భార్య కుసుమ గర్భిణి అని ఇటువంటి సమయంలో గల్లంతు వార్తతో ఆ కుటుంబలో విషాదఛాయలు అలుముకున్నాయి. చీకటి ఎక్కువగా ఉండటంతో గురువారం ఉదయం గజ ఈతగాళ్లతో వెతికే ప్రయత్నం చేస్తామని పోలీసులు తెలిపారు.

### మత సామరస్యానికి ప్రతీకలు ఈ ఆలయాలు

అద్దేపల్లి(భట్టిప్రోలు): మసీదు–దేవాలయం పక్క పక్కనే ఉంటూ మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి. ఒక అడ్డు గోడతో తరాలు తరబడి సాగుతూ ఆదర్శంగా నిలిచిన కట్టడాలు ఇవి. అద్దేపల్లి పొలిమేర పక్కనే మసీదు, శివాలయంను తరాల కిందట నిర్మించారు.

- ఖాళీ స్థలంలో మసీదు నిర్మించేందుకు అప్పట్లో ముస్లింలు చేసిన ప్రయత్నాలకు ఎలాంటి అవాంతరాలు తెలుపకుండా హిందువులు తోడ్పడటంతో మసీదు నిర్మాణం జరిగినట్లు పెద్దలు చెబుతుంటారు.
- ఈ కట్టడాలు నిర్మించిన వేళా విశేషం ఏమోగాని ఎన్నితరాలైన వీటి కారణంగా ఇరు వర్గాల వారికి కేవలం వీసమంతైనా మాట కూడా రాక పోవడం గమనార్హం.
- మసీదు, శివాలయాల నిర్వహణ విధానం క్రమబద్ధంగా ఉంటుంది. ప్రతిరోజు మసీదులో 5 సార్లు నమాజులు జరుగుతుంటాయి.
- శివాలయంలో ప్రతి ఏటా కార్తీక మాసంలో ఏకాదశ మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు జరుగుతాయి. అలాగే దసరా సందర్భంగా దేవీ శరన్నవ రాత్రి మహోత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తారు.
- భట్టిప్రోలులో కొలువైన శ్రీ భ్రమరాంభ సమేత మల్లేశ్వర స్వామి వారి అత్తవారి ఇల్లు అద్దేపల్లి కావటం గమనార్హం. ప్రతి ఏటా ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి నాడు స్వామివారి దివ్య రథోత్సవం అద్దేపల్లి వరకు వెళ్లి తిరిగి సన్నిధికి చేరుకుంటుంది.

### డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయండి

గుంటూరు వెస్ట్‌, సౌత్‌ డీఎస్పీలకు ఆదేశాలు

నగరంపాలెం (గుంటూరు వెస్ట్‌): గుంటూరు వెస్ట్‌ డీఎస్పీ కె.అరవింద్‌, గుంటూరు సౌత్‌ డీఎస్పీ జి.భానోదయలను డీజీపీ ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని బుధవారం ఆదేశాలు వెలువడ్డాయి. ఏపీ హైకోర్టు ఉత్తర్వుల మేరకు 2018 గ్రూప్‌–1లో సెలెక్టయిన డీఎస్పీలు రాష్ట్రంలోని పలు చోట్ల విధులు నిర్వహిస్తున్న 25 మందిని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దానిలో భాగంగా జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు డీఎస్పీలను రిపోర్టు చేయాలని సూచించారు.


**ది విశాఖపట్నం కోఆపరేటివ్‌ బ్యాంకు లిమిటెడ్‌**
గుంటూరు-1 టౌన్‌ బ్రాంచి, గుంటూరు, ఫోన్‌ : 0863-2210221

**APPENDEX IV [RULE 8(1)]**
**స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)**

సెక్యూరిటైజేషన్‌ అండ్‌ రీకన్‌స్ట్రక్షన్‌ ఆఫ్‌ ఫైనాన్షియల్‌ ఎసెట్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంటు ఆఫ్‌ సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ చట్టము 2002 క్రింద ది విశాఖపట్నం కోఆపరేటివ్‌ బ్యాంకు లిమిటెడ్‌, గుంటూరు-1 టౌన్‌ బ్రాంచి యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ (ఎన్‌ఫోర్స్‌మెంటు) రూల్స్‌ 2002 అందలి రూల్‌ 3 తో కలిపి చదువవలసిన సెక్షన్‌ 13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ ఒక డిమాండు నోటీసు తేది 03-09-2025 న ఇచ్చియున్నారు. ఆ నోటీసు తేది నుండి 60 రోజుల లోపుగా రూ. 14,93,155/- (అక్షరముల పద్నాలుగు లక్షల తొంభై మూడు వేల ఒక వంద యాభై అయిదు రూపాయిలు మాత్రమే) తేది 31-08-2025 నాటికి చెల్లించవలసినదిగా ఋణగ్రహీతలు/కో-ఆబ్లిగెంట్స్‌/హామీదారులు అయిన 1) శ్రీ నంబూరు వెంకటేశ్వర్లు, S/o. సీతాపతి, 2) శ్రీమతి ఎన్‌. మేరీ విజయకుమారి, W/o. ఎన్‌. వెంకటేశ్వర్లు వారిని కోరడమైనది.

కానీ ఋణగ్రహీతలు/ కోఆబ్లిగెంట్స్‌/హామీదారులు ఋణమును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీతలకు/కోఆబ్లిగెంట్స్‌/హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా సదరు రూల్‌ యొక్క 8వ రూల్‌తో కలిపి చదువుకోవాల్సిన సదరు యాక్ట్‌ యొక్క సెక్షన్‌ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొంటూ దిగువ సంతకందారు దిగువ వివరించిన ఆస్థిపై తేది 20-02-2026 న స్వాధీనత తీసుకొని యున్నారు.

కావున సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలకు/ కోఆబ్లిగెంట్స్‌/ హామీదారులకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్థితో ఎట్టి లావాదేవీలు జరుపరాదు. మరియు సదరు ఆస్తికి సంబంధించిన ఎట్టి లావాదేవీలైనా రూ. 14,93,155/- మొత్తానికి మరియు తేది 01-09-2025 నుండి దాని మీద దర్శలా వడ్డీ మరియు ఖర్చులు ది విశాఖపట్నం కోఆపరేటివ్‌ బ్యాంక్‌ లిమిటెడ్‌, గుంటూరు-1 టౌన్‌ బ్రాంచి, గుంటూరు వారి చార్జీకి లోబడి ఉంటాయి.

**స్థిరాస్థి వివరములు :** గుంటూరు మున్సిపల్‌ కార్పొరేషన్‌, D నెం. 209/E1, టి.ఎస్‌. నెం. 7/2 పరిధిలో గుంటూరు, బుచ్చయ్యతోట, బ్లాక్‌ నెం.1, మున్సిపల్‌ వార్డు నెం.5, డోర్‌ నెం.8-3-261/7 (కొత్త డోర్‌ నెం. 8-3-261/7A)గాగల ఆర్‌.సి.సి. స్లాబ్‌ ఇల్లు.
**హద్దులు :** తూర్పు : ఉమ్మడి నడకదారి, దక్షిణం : డి-షెడ్యూల్‌ ఆస్థి, పడమర : రైల్వే ప్రహరీగోడ, ఉత్తరం : రైల్వే ప్రహరీగోడ. **విస్తీర్ణం : 65 చ॥గజములు**

తేది: 25-2-2026, గుంటూరు — అధీకృత అధికారి, గుంటూరు-1 టౌన్‌ బ్రాంచి


### రోడ్డుప్రమాదంలో జేఎల్‌ఎం మృతి

రాజారత్నం(ఫైల్‌ )

నకరికల్లు: ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీబస్సు ఢీకొన్న ఘటనలో విద్యుత్‌ శాఖ ఉద్యోగి మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని దేచవరం సమీపంలో నరసరావుపేట రోడ్డులో బుధవారం జరిగింది. నకరికల్లుకు చెందిన జూపల్లి రాజారత్నం (38) గత ఆరేళ్లుగా గుండ్లపల్లి గ్రామంలో గ్రేడ్‌–2 జేఎల్‌ఎం (ఎనర్జీ అసిస్టెంట్‌)గా పనిచేస్తున్నాడు. కాగా నరసరావుపేటలోని అక్కయ్య వాళ్లింటికి వెళ్లాడు. మండలంలోని త్రిపురాపురం గ్రామంలో విద్యుత్‌బిల్లుల డ్యూటీ ఉండడంతో విధుల్లో హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై నకరికల్లుకు తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో దేచవరం మిద్దె సమీపంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ కె.సతీష్‌తో పాటు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. విద్యుత్‌శాఖ ఈఈ రాంబొట్లు, డీఈఈ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఈ సుచరిత, పలువురు లైన్‌మెన్‌లు మృతదేహానికి ఘననివాళులు అర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

### ఆటో పల్టీ.. పలువురికి గాయాలు

వక్కపట్లవారిపాలెం వద్ద ఘటన

ప్రమాద ఘటనలో కాలుకు తీవ్ర గాయాలైన ప్రయాణికుడు

నాగాయలంక: మండలంలోని నాగాయలంక – అవనిగడ్డ మెయిన్‌ రోడ్డుపై వక్కపట్లవారి పాలెం సమీపంలో బుధవారం ప్రయాణికులతో వస్తున్న ఆటోలో సాంకేతిక లోపాల కారణంగా ఆకస్మికంగా పల్టీ కొట్టిందని ఎస్‌ఐ కలిదిండి రాజేష్‌ తెలిపారు. బాపట్ల జిల్లా అల్లపర్రు గ్రామం నుంచి నాగాయలంక మండలంలోని పర్రచివర గ్రామంలో ఓ కార్యక్రమానికి వెళ్తున్న క్రమంలో పాలెం సమీపంలోని ఐస్‌ ఫ్యాక్టరీ వద్ద రోడ్డుపై పంటకాలువ వైపు బోల్తా పడింది. ఆ సమయంలో ఆటోలో పది మంది ప్రయాణికులు ఉన్నారు. వీరిలో వర్రే శివయ్య(60)కు కాలు విరిగిందని, బండ్రెడ్డి రాఘవమ్మ(60) మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయని ఎస్‌ఐ చెప్పారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో అవనిగడ్డ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారందరూ అలపర్రుకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన బంధువులని, ఆటో కూడా ఆ సభ్యుల్లో ఒకరిదని కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

### ధాన్యం వ్యాపారి అనుమానాస్పద మృతి

రేపల్లె: వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు అమర్తలూరు మండలం ఇంటూరు గ్రామానికి చెందిన ధాన్యం వ్యాపారి జహీరుద్దీన్‌ (55) నేషనల్‌ హైవే రహదారి పేటేరు బస్సు షెల్టర్‌ సమీపంలో అనుమానాస్పద స్థితిలో పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు జహీరుద్దీన్‌ను పరిశీలించగా.. అప్పటికే మృతి చెంది ఉన్నాడు. క్రిమిసంహార ముందు తాగి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అయితే ధాన్యంకు సంబంధించిన నగదు చెల్లింపులపై ఇటీవల పోటుమేరక గ్రామానికి చెందిన రైతులు బలవంతం పెట్టి అతని కుమారుడు జాఫర్‌వలిపై దాడిచేసి బంధించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. నగదు చెల్లించి కుమారుని తీసుకువెళ్లాలని ఒత్తిడి చేయడంతో జహీరుద్దీన్‌ ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు.


**SHRIRAM Finance — శ్రీరామ్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌**
ఆఫీస్‌ చిరునామా : జోనల్‌ ఆఫీస్‌, శ్రీరామ్‌ ఎన్‌క్లేవ్‌, అన్నపూర్ణ నగర్‌, 5వ లేన్‌, ఇన్నర్‌ రింగ్‌ రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034.

**డిమాండ్‌ నోటీసు**
సెక్యూరిటైజేషన్‌ అండ్‌ రీకన్‌స్ట్రక్షన్‌ ఆఫ్‌ ఫైనాన్షియల్‌ అసెట్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఆఫ్‌ సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ చట్టం 2002 లోని సెక్షన్‌ 13(2) క్రింద ప్రకటన

మెస్సర్స్‌ శ్రీరామ్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌ (గతంలో "శ్రీరామ్‌ సిటీ యూనియన్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌" గా పిలువబడేది, ఎన్‌సిఎల్‌టి బెంచ్‌-II చెన్నై, తేది.09-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్‌ ట్రాన్స్‌పోర్ట్‌ ఫైనాన్స్‌ కంపెనీ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్‌ ట్రాన్స్‌పోర్ట్‌ ఫైనాన్స్‌ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేదీ నాటి కార్పొరేట్‌ ఫైనాన్స్‌ మంత్రిత్వ శాఖ లేఖ) ద్వారా శ్రీరామ్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిష్టర్డు కంపెనీ అయి ఉన్నాము మరియు శ్రీ టవర్స్‌, ప్లాట్‌ నెం.14ఎ, సౌత్‌ ఫేజ్‌, ఇండస్ట్రియల్‌ ఎస్టేట్‌, గిండి, చెన్నై-600032 వద్ద తన రిజిష్టర్డు ఆఫీసును మరియు శాఖా కార్యాలయాన్ని చిలకలూరిపేట వద్ద కలిగి, నాన్‌ - బ్యాంకింగ్‌ ఫైనాన్స్‌ బ్యాంకింగ్‌ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిష్టరై ఉన్నాము. ఋణగ్రహీతలు/సహ-ఋణగ్రహీతలు/హామీదార్లు/ దిగువ తెలుపబడినవారు శ్రీరామ్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు/హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్‌ అండ్‌ రీకన్‌స్ట్రక్షన్‌ ఆఫ్‌ ఫైనాన్షియల్‌ అసెట్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఆఫ్‌ సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ చట్టం, 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ (ఎన్‌ఫోర్స్‌మెంట్‌) రూల్స్‌ 2002 లోని రూలు 8తో చదువబడు సెక్షన్‌ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా చెల్లింపు తేదీ వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్చువల్‌ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/హామీదార్లు/తనఖా రుణగ్రస్తులను కోరుతూ SARFAESI చట్టం, 2002 లోని సెక్షన్‌ 13(2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్‌ నోటీసులు జారీ చేశారు.

వారి చివరిగా తెలిపిన చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్‌ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్‌ 13 యొక్క సబ్‌-సెక్షన్‌ (8) యొక్క నిబంధనలను గమనించవల్సిందిగా రుణగ్రహీతలకు విజ్ఞప్తి.

| ఋణగ్రహీత పేరు మరియు చిరునామా | ఎన్‌పిఎ తేది / ఋణ మొత్తం | డిమాండ్‌ నోటీసు తేది / తేది.17.12.2025 నాటికి బకాయి మొత్తం |
|---|---|---|
| **Loan A/c No.: CHLPTTF1805290002** 1.తాడిబోయిన సాంబ శివరావు, తండ్రి: కృష్ణరావు, డి.నెం.2-82-22, తుమ్మలపాలెం, ఉన్నవ, ప్రత్తిపాడు మండలం, గుంటూరు జిల్లా-522233. 2.తాడిబోయిన సదా శివ లక్ష్మి, భర్త: సాంబశివరావు, డి.నెం.2-82-22, తుమ్మలపాలెం, ఉన్నవ, ప్రత్తిపాడు మండలం, గుంటూరు జిల్లా-522233. 3.మల్లెబోయిన కోటేశ్వరరావు, తండ్రి: శివయ్య, డి.నెం.2-82, 36/ఎ, తుమ్మలపాలెం గ్రామం, ప్రతిపాడు మండలం, గుంటూరు జిల్లా-522233 | 30.04.2020 / రూ. 12,00,000/- | 17.12.2025 / రూ.41,14,889/- (అక్షరాల నలభై ఒక లక్షల పద్నాలుగు వేల ఎనిమిది వందల ఎనభై తొమ్మిది రూపాయలు మాత్రమే) |

స్థిరాస్తి షెడ్యూలు వివరములు : కొమెర రాములు గారికి చెందిన ఆస్తి : గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు సబ్‌ డిస్ట్రిక్ట్‌, తుమ్మలపాలెం గ్రామ పంచాయితీ ఏరియాలోని నడింపాలెం గ్రామం, నడింపాలెం గ్రామం, డి.నెం.289/2లోని ఎ.1.00 సెంట్లు లేదా 0.40 హెక్టార్లు డ్రై భూమిలోని ఎ.0.91 సెంట్లు లేదా 4404.4 చ॥గ॥ల వ్యవసాయేతర భూమి. హద్దులు: తూర్పు : చిమట శివయ్య గారి భూమి, దక్షిణం : తాడిబోయిన సిద్ధయ్య గారి భూమి, పడమర : కోనంకి కాసరావు గారి భూమి, ఉత్తరం : సర్కార్‌ డొంక.

పైన పేర్కొన్న ఎ.0.91 సెంట్లు లేదా 4404.4 చ॥గ॥లు విస్తీర్ణంల వ్యవసాయేతర భూమి మాత్రమే(ఈ ఆస్తి ప్రత్తిపాడు ఎస్‌.ఆర్‌.ఓ పరిధిలోని డాక్యుమెంట్‌ నెం.3623/2011లోని భాగానికి సంబంధించినది)

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోగా భవిష్యత్‌ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతో పాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ-ఋణగ్రహీతలు మరియు/లేదా వారి గ్యారంటార్ల (వర్తించినచోట)కు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది లేనిచో, సెక్యూరిటైజేషన్‌ అండ్‌ రీకన్‌స్ట్రక్షన్‌ ఆఫ్‌ ఫైనాన్షియల్‌ అసెట్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఆఫ్‌ సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ చట్టం 2002 లోని సెక్షన్‌ 13(4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా రుణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్‌ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్‌ అసెట్స్‌ మీద ఈ నోటీసు తేదీ నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును. సదరు చట్టంలోని సెక్షన్‌ 13(13) క్రింద, సెక్యూర్డ్‌ క్రెడిటార్‌ యొక్క ముందస్తు వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన అతని సెక్యూర్డ్‌ అసెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ రుణగ్రహీతా బదిలీ చేయరాదని గమనించగలరు.

ప్రదేశం : గుంటూరు — అధీకృత అధికారి, శ్రీరామ్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌



**SHRIRAM Finance — శ్రీరామ్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌**
ఆఫీస్‌ చిరునామా : జోనల్‌ ఆఫీస్‌, శ్రీరామ్‌ ఎన్‌క్లేవ్‌, అన్నపూర్ణ నగర్‌, 5వ లేన్‌, ఇన్నర్‌ రింగ్‌ రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034.

**డిమాండ్‌ నోటీసు**
సెక్యూరిటైజేషన్‌ అండ్‌ రీకన్‌స్ట్రక్షన్‌ ఆఫ్‌ ఫైనాన్షియల్‌ అసెట్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఆఫ్‌ సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ చట్టం 2002 లోని సెక్షన్‌ 13(2) క్రింద ప్రకటన

మెస్సర్స్‌ శ్రీరామ్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌ (గతంలో "శ్రీరామ్‌ సిటీ యూనియన్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌" గా పిలువబడేది, ఎన్‌సిఎల్‌టి బెంచ్‌-II చెన్నై, తేది.09-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్‌ ట్రాన్స్‌పోర్ట్‌ ఫైనాన్స్‌ కంపెనీ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్‌ ట్రాన్స్‌పోర్ట్‌ ఫైనాన్స్‌ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేదీ నాటి కార్పొరేట్‌ ఫైనాన్స్‌ మంత్రిత్వ శాఖ లేఖ) ద్వారా శ్రీరామ్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిష్టర్డు కంపెనీ అయి ఉన్నాము మరియు శ్రీ టవర్స్‌, ప్లాట్‌ నెం.14ఎ, సౌత్‌ ఫేజ్‌, ఇండస్ట్రియల్‌ ఎస్టేట్‌, గిండి, చెన్నై-600032 వద్ద తన రిజిష్టర్డు ఆఫీసును మరియు శాఖా కార్యాలయాన్ని గుంటూరు-2 వద్ద కలిగి, నాన్‌ - బ్యాంకింగ్‌ ఫైనాన్స్‌ బ్యాంకింగ్‌ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిష్టరై ఉన్నాము. ఋణగ్రహీతలు/సహ-ఋణగ్రహీతలు/హామీదార్లు/ దిగువ తెలుపబడినవారు శ్రీరామ్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు/హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్‌ అండ్‌ రీకన్‌స్ట్రక్షన్‌ ఆఫ్‌ ఫైనాన్షియల్‌ అసెట్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఆఫ్‌ సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ చట్టం, 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ (ఎన్‌ఫోర్స్‌మెంట్‌) రూల్స్‌ 2002 లోని రూలు 8తో చదువబడు సెక్షన్‌ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా చెల్లింపు తేదీ వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్చువల్‌ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/హామీదార్లు/తనఖా రుణగ్రస్తులను కోరుతూ SARFAESI చట్టం, 2002 లోని సెక్షన్‌ 13(2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్‌ నోటీసులు జారీ చేశారు.

వారి చివరిగా తెలిపిన చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్‌ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్‌ 13 యొక్క సబ్‌-సెక్షన్‌ (8) యొక్క నిబంధనలను గమనించవల్సిందిగా రుణగ్రహీతలకు విజ్ఞప్తి.

| ఋణగ్రహీత పేరు మరియు చిరునామా | ఎన్‌పిఎ తేది / ఋణ మొత్తం | డిమాండ్‌ నోటీసు తేది / తేది.29.01.2026 నాటికి బకాయి మొత్తం |
|---|---|---|
| **Loan A/c No.: GNTR4TF2408140001** 1.నల్లూరి చిరంజీవులు, భర్త: వెంకటేశ్వర్లు, డినెం.1-128, లైబ్రరీ సెంటర్‌, పల్లపాడు గ్రామం, వట్టిచెరుకూరు మండలం, గుంటూరు జిల్లా-522017. 2.నల్లూరి వెంకటేశ్వర్లు, తండ్రి: సుబ్బయ్య, డినెం.1-128, లైబ్రరీ సెంటర్‌, పల్లపాడు గ్రామం, వట్టిచెరుకూరు మండలం, గుంటూరు జిల్లా-522017. 3.నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, తండ్రి: రామకోటయ్య, డినెం.7-3-150, వైష్ణవి కస్తూరి ఎన్‌క్లేవ్‌, నాల్గవ అంతస్తు ఎఫ్‌-1, ఎల్‌ఐసి కాలనీ, 2వ లైన్‌, స్తంభాలగరువు, రెవెన్యూ వార్డు-3, గుంటూరు జిల్లా-522006. | 07.10.2025 / రూ. 20,00,000/- | 29.01.2026 / రూ.22,74,882/- (అక్షరాల ఇరవై రెండు లక్షల డెబ్బై నాలుగు వేల ఎనిమిది వందల ఎనభై రెండు రూపాయలు మాత్రమే) |

స్థిరాస్తి షెడ్యూలు వివరములు : నల్లూరి వెంకటేశ్వర్లు గారికి చెందిన ఆస్తి : గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు సబ్‌ డిస్ట్రిక్ట్‌, పల్లపాడు గ్రామం పంచాయితీ ఏరియా, పల్లపాడు గ్రామం, డి.నెం.38/6లోని ఎ.0.10 సెంట్లు మరియు డి.నెం.38/7లోని ఎ.0.25 సెంట్లు మొత్తం ఎ.0.35 సెంట్లు లేదా 1694 చ॥గ॥లు విస్తీర్ణంల ఇంటి స్థలం అందు పాత డోర్‌ నెం.1-128, ప్రస్తుత డోర్‌ నెం.1-106, పాత అసెస్‌మెంట్‌ నెం.112 మరియు ప్రస్తుత అసెస్‌మెంట్‌ నెం.106తో గల రైస్‌ మిల్లు. హద్దులు: తూర్పు : కొర్రపాటి వెంకటయ్య మరియు సూర్యనారాయణ గారి ఆస్తి, దక్షిణం : కొర్రపాటి సత్యనారాయణ మరియు కొర్రపాటి ఏకాంత రావు గార్ల ఆస్తి, పడమర : కొర్రపాటి ఏకాంత రావు మరియు కొర్రపాటి వెంకయ్య గారి ఆస్తి, ఉత్తరం : కొర్రపాటి సత్యనారాయణ మరియు కొర్రపాటి ఏకాంత రావు గార్ల ఆస్తి.

పైన పేర్కొన్న 1694 చ॥గ॥లు లేదా 1416 చ॥మీ॥లు స్థలంలో 1240 చ॥అ॥ల ప్లింత్‌ ఏరియాలోని రైస్‌ మిల్‌తో పాటు, దానిలోని యంత్ర సామాగ్రి, ఎస్‌.సి.నెం.76 మరియు సీటి ట్యాప్‌ల కలిపి. 372 చ॥అ॥ల విస్తీర్ణంలో నిర్మించబడిన ఆర్‌సిసి నిర్మాణం, 286 చ॥అ॥ల విస్తీర్ణంలో హస్క్‌ గది, 1280 చ॥అ॥ల విస్తీర్ణంలో టైల్స్‌ వేసిన ఇల్లు, 506 చ॥అ॥ల విస్తీర్ణంలో గడ్డి ఇల్లు మరియు 48 చ॥అ॥ల విస్తీర్ణంలో టిన్‌ షైకప్పుతో మరుగుదొడ్డి, దక్షిణ వైపు చెరువుకు చేరుకోవడానికి కేవలం 9 అ॥ల వెడల్పు నడవ ద్వారా ప్రవేశం మరియు నిష్క్రమణ హక్కుతో కలిపి మాత్రమే(ఈ ఆస్తి ప్రత్తిపాడు ఎస్‌.ఆర్‌.ఓ పరిధిలోని డాక్యుమెంట్‌ నెం.1107/2011 లోని భాగానికి సంబంధించినది)

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోగా భవిష్యత్‌ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతో పాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ-ఋణగ్రహీతలు మరియు/లేదా వారి గ్యారంటార్ల (వర్తించినచోట)కు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది లేనిచో, సెక్యూరిటైజేషన్‌ అండ్‌ రీకన్‌స్ట్రక్షన్‌ ఆఫ్‌ ఫైనాన్షియల్‌ అసెట్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఆఫ్‌ సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ చట్టం 2002 లోని సెక్షన్‌ 13(4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా రుణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్‌ అస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్‌ అసెట్స్‌ మీద ఈ నోటీసు తేదీ నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును. సదరు చట్టంలోని సెక్షన్‌ 13(13) క్రింద, సెక్యూర్డ్‌ క్రెడిటార్‌ యొక్క ముందస్తు వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన అతని సెక్యూర్డ్‌ అసెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ రుణగ్రహీతా బదిలీ చేయరాదని గమనించగలరు.

ప్రదేశం : గుంటూరు — అధీకృత అధికారి, శ్రీరామ్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌



**సాక్షి క్లాసిఫైడ్స్‌**

**REAL ESTATE**
- NH-16 చిలకలూరిపేట దగ్గర DTCP ప్లాట్స్‌ (ఆఫర్‌) బ్యాంక్‌ లోను సౌకర్యం కలదు. బుకింగ్స్‌ జరుగుతున్నవి. సంప్ర॥ 8801545629, 9398873045

**PLOT FOR SALE**
- గుంటూరు 16వ డివిజన్లో వెంచర్‌. నారా కోడూరు వెళ్లే రోడ్డుకి దగ్గర్లో, 30 అ. రోడ్లు, ఫెన్సింగ్‌, ఎంట్రన్స్‌ గేట్లు. చ. గజం రూ. 13,500/- మాత్రమే. స్పాట్‌ రి. ✆ 83175 28192

**TO-LET COMMERCIAL**
- 3000చ॥అ॥ల కమర్షియల్‌ స్పేస్‌ బ్యాంకులకు / హాస్పిటల్స్‌కు అద్దెకు ఇవ్వబడును. రిషీ వాల్యు హోమ్స్‌, జి.టి.రోడ్‌. ✆9394101244, 9390827957

**SERVICES**

**GOLD FINANCE**
- బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్‌ ధర ప్రకారం కొనబడును. (స్పాట్‌ క్యాష్‌) ఫోన్‌ : 81422 92071
- బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టు లో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం ✆ 83338 33368

**PASSPORT MISSING**
- పల్నాడు జిల్లా రెంటచింతల మండలం గ్రా॥ చెందిన సంకూరు మేరిసురేఖ D/o ప్రసాదరావు అనునాకు సంబంధించిన W8883001 నెంబరు గల పాస్‌పోర్ట్‌ 22-2-26 వ తేదీన టూవీలర్‌ పై మా ఇంటి నుండి జిరాక్స్‌ సెంటర్‌కు వెళ్ళుచుండగా దారిలో పోయినది. దొరికినవారు సంప్ర: 96769 79224

**WANTED**
- గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్‌ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు, హౌస్‌ వైఫ్స్‌, 10th పాస్‌, 50సం॥ వయస్సు వారు కావలెను. 7036761665
- గుంటూరు మాస్టర్‌మైండ్స్‌ కాలేజ్‌ నందు వార్డెన్స్‌, హాస్టల్‌ ఇన్‌ఛార్జ్‌లుగా పనిచేయుటకు స్త్రీలు కావలెను. జీతము: 10000/- నుండి 13000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్‌ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్‌ నెంబర్‌: 92487 33329
- LTD కంపెనీల్లో రిసెప్షనిస్ట్‌, టెలికాలర్స్‌, కం॥ ఆపరేటర్స్‌, అకౌంటెంట్స్‌, సూ॥వైజర్స్‌, ఆఫీస్‌ అడ్మిన్‌, HR అసిస్టెంట్స్‌, ఆఫీస్‌బాయ్స్‌, హెల్పర్స్‌, జీ. 10-30వేలు. Ph: 79939 76590
- గుంటూరు మాస్టర్‌మైండ్స్‌ కాలేజ్‌ నందు క్లాస్‌ ఇన్‌ఛార్జ్‌స్‌ మరియు క్యాంపస్‌ ఇన్‌ఛార్జ్‌స్‌ గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 14000/- నుండి 21000/- వరకు ఇవ్వబడును. అర్హతలు: ఇంటర్‌ నుండి పి.జి వరకు, వయస్సు: 22 సంవత్సరాల నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్‌ వ్యక్తి అయ్యి ఉండాలి. వివరములకు సంప్రదించగలరు. ఫోన్‌ నెంబర్‌: 89784 80429
- గుంటూరు మాస్టర్‌మైండ్స్‌ కాలేజ్‌ నందు కంప్యూటర్‌ ఆపరేటర్‌ గా పనిచేయుటకు స్త్రీలు మరియు పురుషులు కావలెను. జీతము: 13000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. విద్యార్హతలు: ఇంటర్‌ మరియు డిగ్రీ. వయస్సు: 22 సంవత్సరాల పైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్‌ నెంబర్‌: 91546 93478
- గుంటూరు మాస్టర్‌మైండ్స్‌ కాలేజ్‌ నందు సీనియర్‌ సివిల్‌ ఇంజనీర్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 50,000/- నుండి 60,000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: సివిల్‌ ఇంజనీరింగ్‌ వయస్సు: 30 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్‌ నెంబర్‌ : 8978480429
- బెంజ్‌ మరియు ఫార్చ్యూనర్‌ కార్లు నడుపుటకు అనుభవం గల డ్రైవరు కావలెను. ✆ 9398991579
- ప్రముఖ డెంటల్‌ హాస్పిటల్‌లో వర్క్‌ చేయుటకు అనుభవం గల లేడీ టెలికాలర్స్‌ కావలెను. సంప్ర: కొత్తపేట, గుంటూరు. ఫోన్‌: 97013 79339
- శ్రీ త్రినేత్ర టీవీ ఛానల్‌లో పని చేయుటకు సిబ్బంది కావలెను. యాంకర్లు, కెమెరామెన్‌, టెలికాలర్లు, స్క్రిప్టు రచయితలు, విలేఖరులు గ్రాఫిక్‌ డిజైనర్లు, జిల్లా వారీగా మార్కెటింగ్‌ సిబ్బంది కావలెను. సంప్రదించండి. సెల్‌ : 93928 04200.
- Wanted B.Com or MBA Candidates to work as an Accountant in Medical distribution firm in Guntur City. Contact : 6300975241
- Wanted B or D Pharmacy Candidates to work in a Pharmacy in Guntur City. PCI Registration mandatory. 6300975241
- Lady Staff Wanted B.Tech/ MBA, Study Abroad Consultancy Salary upto 15k, Good Communication Skills Exp./ Freshers. 93819 85468
- ఇంగ్లీషు, కంప్యూటర్‌, మాథ్స్‌, హిందీ టీచర్స్‌ & లేడీ రిసెప్షనిస్ట్‌ కావలెను. స్త్రీలకు స్పోకెన్‌ ఇంగ్లీషు & కంప్యూటర్‌ కోర్సు ఫ్రీగా నేర్పి జాబ్స్‌ ఇవ్వబడును. గుంటూరు, మంగళగిరి, చెరుకుపల్లి, వినుకొండ, తెనాలి. 8639024439
- మండాడి, మాచర్ల, నాగార్జునసాగర్‌ ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్‌ కావలెను. జీతం: 14000/- సంప్ర: ✆ 7569673994
- స్థానిక లక్ష్మీపురం 4వ లైన్‌ మాంటిస్సోరి స్కూల్‌ నందు పని చేయుటకు వాచ్‌మెన్‌ ఫ్యామిలీ (వసతి కలదు) ఆయమ్మలు కావలెను. ✆ 81214 00100
- Wanted Lady Telecallers,Age:25+, Salary: 10k,Timing 10:00 a.m - 6:00 p.m. and recovery executives part time or full time Guntur Locals only Cont: 9480419685, 8121502699
- మంగళగిరి DGP office సమీపంలో పని చేయుటకు సెక్యూరిటీ guards కావలెను. జీ: 16000/- , pf & esi కటింగ్‌ పోను,Qul : 10th ,age :45 below ✆ 88014 97437
- తాడేపల్లి ఏరియాలో ప్రముఖ హాస్పిటల్‌ నందు పనిచేయుటకు అనుభవజ్ఞులైన సెక్యూరిటీ గార్డ్స్‌ & ఆయాలు కావలెను ✆ 8247 66 22 99. 9866614236
- మా ఆఫీస్‌ యొక్క షాపింగ్‌ మాల్స్‌ మార్ట్‌ గ్రోసరి గురించి అడ్వర్టైజ్మెంట్‌ ఇవ్వడానికి మెసేజెస్‌ కాల్స్‌ మాట్లాడడానికి స్త్రీలు ఏజ్‌ 25–50 కావలెను. సెల్‌: 9581228644.
- హరేకృష్ణ హోంకేర్‌ నందు వృద్ధులను,పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్‌ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం:17K.Ph:9640648899, 9848899184.
- డ్వాక్రా మహిళలకు, నిరుద్యోగులకు, ఇంట్లో ఉంటూ పెట్టుబడి మీరే పెట్టుకొని కొవ్వొత్తులు, పెన్సిల్స్‌ తయారు చేసి మాకు ఇవ్వండి. వీక్లీ పేమెంట్‌. 9640729906.
- St. Ann's School, Ponnur needs Qualified Teachers for Various Subjects and Non Teaching Staff. Submit Resume at School Office.

గుంటూరు 7075167663 7075167541

**గమనిక**
సాక్షి తెలుగు దినపత్రికలో ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలను చదివి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించాలి.

## క్లుప్తంగా

### పాలకేంద్రాల తనిఖీ

**ఫిరంగిపురం:** మండలంలోని గ్రామాల్లో ఉన్న పాలకేంద్రాలను బుధవారం నుదురుపాడు పశువైద్యాధికారి పీర్ అహ్మద్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాజమండ్రిలో కల్తీపాల విక్రయాల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాల కేంద్రాలు తనిఖీ చేశామన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పాల సేకరణ, విక్రయం వంటి వివరాలు, పాలకేంద్రాల నిర్వహన గురించి పూర్తి సమాచారం సేకరించి ఉన్నతాధికారులకు తెలియజేయనున్నట్లు వివరించారు. కల్తీ పాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

### అనారోగ్యంతో సీపీఎం నాయకుడు మృతి

**మంగళగిరి టౌన్:** మంగళగిరి మండలం నిడమర్రు గ్రామానికి చెందిన సీపీఎం రాజధాని డివిజన్, సీఐటీయూ రాజధాని డివిజన్ కార్యదర్శి మంచికలపూడి భాగ్యరాజు(38) అనారోగ్య కారణాలతో మృతిచెందారు. గత కొన్ని రోజులుగా విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన బుధవారం తుదిశ్వాస విడిచారు. కళాశాలలోనే సమస్యలపై పోరాటం చేసిన వ్యక్తి అని, సుదీర్ఘకాలం పాటు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని పలువురు నాయకులు కొనియాడారు. భాగ్యరాజు మృతిపై పార్టీ వర్గాలు, కార్మిక సంఘాల్లో విషాద వాతావరణం నెలకొందని, ఆయన మృతిపై పలువురు నాయకులు, కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సానుభూతి తెలిపిన వారిలో మంగళగిరి, తాడేపల్లి మండలాల సీపీఎం నాయకులు, కార్మిక సంఘం నాయకులు ఉన్నారు. కాగా భాగ్యరాజు అంతిమ యాత్ర నిడమర్రు గ్రామం నుంచి మంగళగిరి ఎయిమ్స్ వరకు సాగింది. ఆయన పార్థివదేహంపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పార్టీ పతాకాన్ని కప్పి నివాళులర్పించారు. మృతదేహాన్ని మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి వైద్య విద్యార్థుల పరిశోధనల నిమిత్తం తండ్రి అప్పగించి కన్నీటి పర్యంతమయ్యారు.

### సామాజిక చైతన్యం వేమన పద్యాల లక్షణం

**తెనాలిరూరల్:** సామాజిక చైతన్యం వేమన పద్యాల లక్షణమని, మాతృభాష తల్లితో సమానమని పలువురు సంస్కృత, ఆంధ్ర ఉపన్యాసకులు పేర్కొన్నారు. స్థానిక రామలింగేశ్వరపేట గురవయ్య కాలనీలో కోట లక్ష్మయ్య నాయుడు సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో వేమన జయంతి, అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు వినాయక రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దేవయజనం మురళీకృష్ణ మాట్లాడుతూ వేమన ప్రజాకవి అని లోకనీతులు సమాజానికి అందించారన్నారు. ఆయన కవిత్వంలో స్పృశించని అంశం లేదని, అన్ని సమస్యలను భిన్న కోణాల్లో దర్శించి తన పద్యాలలో ప్రదర్శించిన మహాకవి అన్నారు. వినాయకరావు మాట్లాడుతూ మాతృభాష తల్లితో సమానమని తెలుగు చాలా చరిత్ర ఉందన్నారు. పరభాషలను గౌరవించడం తెలుగువారి గొప్పతనమని పేర్కొన్నారు. తెలుగువారుగా పుట్టిన ప్రతి ఒక్కరు తెలుగు భాషను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో పండితులు చిలుమూరు రామలింగేశ్వర రావు, బృందావనం గోపాల ఆచార్యులు, లక్కరాజు లక్ష్మణరావు, మేడూరి శ్రీనివాస మూర్తి, దీవి కృష్ణమాచార్యులు, ఈఎల్‌వీ అప్పారావు, సామ్రాజ్యలక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

### ప్రతిరోజు కాల్వలను శుభ్రం చేయండి

**మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు**

**తెనాలిఅర్బన్:** కాల్వలను ప్రతి రోజు బాగు చేయాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు సూచించారు. 10వ వార్డులో జరుగుతున్న పూడికతీత పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణంలోని అన్ని ప్రధాన కాల్వల పూడికతీత పనులు చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వార్డుల్లో గ్యాంగ్ వర్క్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సెక్రటరీ ప్రియదర్శిని, సిబ్బంది ఉన్నారు.

## సోషల్ మీడియాను జాగ్రత్తగా వినియోగించుకోవాలి

పాఠశాల విద్యార్థినులతో కేఎల్‌యూ విద్యార్థులు

విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రొఫెసర్ మాధవరావు

**మంగళగిరి టౌన్:** నేడు సోషల్ మీడియా జీవితంలో ఒక భాగమైందని.. విద్యార్థులు సోషల్ మీడియాను జాగ్రత్తగా వినియోగించుకోవాలని కేఎల్‌యూ విద్యార్థులు సూచించారు. విజయవాడలోని బిషప్ అజరయ్య ఉన్నత పాఠశాలలో కేఎల్‌యూ ఎంసీఏ విభాగం విద్యార్థులు బుధవారం మహిళల భద్రత, విద్యార్థుల ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల భద్రతకు సంబంధించిన చట్టపరమైన హక్కులు, అత్యవసర సహాయ నంబర్‌లు, నేరాల నుంచి రక్షణ చర్యలు వంటి పద్ధతుల గురించి పాఠశాల విద్యార్థులకు వివరించారు. రుతుక్రమం, ఆరోగ్య సమస్యలపై ఉన్న అపోహలను తొలగిస్తూ, రుతుక్రమం సహజమైన శరీర ప్రక్రియ అని, శుభ్రత, శానిటరీ ప్యాడ్స్ వినియోగం, సరైన ఆరోగ్య అలవాట్లు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. రుతుక్రమం ఎడ్యుకేషన్ ద్వారా బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణపై చైతన్యం కలిగించారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థినులు ధైర్యంగా తమ సమస్యలను పంచుకోవాలని, అవసరమైతే సహాయం కోరాలని ప్రోత్సహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, కేఎల్‌యూ విద్యార్థులు, పాఠశాల బాలికలు పాల్గొన్నారు.

**ఏఐపై విద్యార్థులకు అవగాహన సదస్సు..**

**దుగ్గిరాల:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్సు, మెషిన్ లెర్నింగ్ రంగాలు ప్రస్తుత డిజిటల్ యుగంలో ఎంతో ముఖ్యమైనవని కేఎల్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మాధవరావు అన్నారు. బుధవారం దుగ్గిరాల మండలం చింతలపూడి గ్రామంలోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐ సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు సెమినార్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఏఐ ప్రాముఖ్యత వివరించారు. విద్యార్థులు ప్రాజెక్టులు, పరిశోధనలపై ఎక్కువ దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీకాంత్‌బాబు, జీవన్, రవికుమార్, సరోజ , విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజధానిలో ఏడీబీ బ్యాంకు బృందం పర్యటన

**తాడికొండ:** ఆసియా అభివృద్ధి బ్యాంకు ప్రతినిధుల బృందం బుధవారం రాజధాని అమరావతిలో పర్యటించింది. ఏడీబీ(మనీలా), ఇండియా రెసిడెంట్ మిషన్ నుంచి మొత్తం అయిదుగురు సభ్యుల బృందం అమరావతిలో పర్యటించగా ఉదయం ఏడీబీ బృందం ఉండవల్లి పంప్ హౌస్, అమరావతి ట్రంక్ ఇన్ఫ్రా పనులు, ఎల్‌పీఎస్ జోన్‌లలో జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు వివిధ సైట్లలో జరుగుతున్న పనులను పరిశీలించింది. ఏపీ సీఆర్డీఏ, ఏడీసీఎల్‌లోని ముఖ్య అధికారులు బృందంలోని సభ్యులకు అమరావతిలో ప్రణాళికాయుతంగా పనులు జరుగుతున్న తీరును వివరించారు. అనంతరం బ్యాంకు బృందం రాయపూడిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ కె.కన్నబాబు, అడిషనల్ కమిషనర్ ఎ.భార్గవతేజ, సీఆర్డీఏ, ఏడీసీఎల్‌ల నుంచి పలు విభాగాల ముఖ్య అధికారులతో భేటీ అయ్యారు. రాజధాని అమరావతిలోని వివిధ ప్రాజెక్టులు, ట్రంక్ ఇన్ఫ్రా పనులలో పురోగతిని కమిషనర్ బృందానికి వివరించారు. అనంతరం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, పురపాలక–పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్లను కలిశారు. ఏడీబీ బృందం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనీలా, ఎల్.సత్యశ్రీనివాస్, అడ్వైజర్ పొన్నురాజ్, ఏడీబీ ఇండియా రెసిడెంట్ మిషన్ కంట్రీ డైరెక్టర్ మియో ఒకా, ప్రిన్సిపల్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ సంజయ్ దివాకర్ జోషి, సీనియర్ ప్రాజెక్టు ఆఫీసర్ అశ్విన్ హోసూర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వివరాలు తెలుసుకుంటున్న ఆసియా అభివృద్ధి బృందం

## మొరాయించిన పోలీస్ వాహనం

స్థానిక కొత్తపేటలోని కోర్టుల ప్రాంగణానికి రిమాండ్ ఖైదీలను తీసుకు వచ్చిన పోలీస్ ఎస్కార్ట్ వాహనం కొద్దిసేపు మొరాయించింది. జిల్లా జైలులో కేసుల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారిని పోలీసులు ఎస్కార్ట్ వాహనంలో బుధవారం తెనాలి కోర్టులకు తీసుకువచ్చారు. ఖైదీలను వాయిదాలకు న్యాయమూర్తుల ఎదుట హాజరుపరచి తిరిగి జైలుకు తీసుకువెళ్లేందుకు సిద్ధమవుతుండగా వాహనం మొరాయించింది. అదే సమయంలో కోర్టుల సమీపంలోని స్కూలు విద్యార్థులు పరీక్షలకు వెళ్లాల్సి ఉంది. దీంతో చేసేది లేక పోలీసు సిబ్బంది మినీ బస్సును తోసుకుంటూ కొంత దూరం వెళ్లగా ఇంజిన్ స్టార్ట్ అయ్యింది. తెనాలి సబ్‌జైలు నిర్మాణంలో ఉండడంతో కేసుల్లో నిందితులను గుంటూరు జిల్లా జైలు, నర్సరావుపేట సబ్ జైలు వంటి ఇతర జైళ్లకు పంపుతున్న సంగతి తెలిసిందే. –తెనాలిరూరల్

## వైద్యశాలల్లో కాన్పులు ఎక్కువగా నమోదు చేయాలి

**జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయకర్త రంగారావు**

**కొల్లిపర:** సామాజిక ఆరోగ్య కేంద్రంలో కాన్పులు తక్కువగా నమోదు అవుతున్నాయని జిల్లా ఆసుపత్రిసేవల సమన్వయకర్త డాక్టరు బి.వి.రంగారావు అన్నారు. బుధవారం కొల్లిపర గ్రామంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. రికార్డులు, వైద్యుల పనితీరు పరిశీలించారు. వైద్యసేవలు ఎలా ఉన్నాయి అన్న అంశాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆషా కార్యకర్తలు ఇంక నుంచి కాన్పులు ఎక్కువగా నమోదు చేయాలని, కాన్పులు శాతం పెరగకపోతే వైద్యులపై, సిబ్బందిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యశాలలో పూర్తిస్థాయిలో వైద్యులు అందుబాటులో ఉండాలని, ఖాళీగా ఉన్న వైద్యులను ఏర్పాటు చేయడానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. వైద్యశాలల్లో ఆరోగ్యశ్రీ కేసులను మెరుగుపరచాలని, ఆ దిశగా వైద్యులకు, సిబ్బందికి సలహాలు ఇవ్వటం జరిగిందన్నారు. ఈసారీ మళ్లీ తాను తనిఖీలకు వచ్చే సమయానికి ఇప్పుడు అందించే సూచనలు ప్రకారం వైద్యులు మెరుగుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టరు శ్రావణి, ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న రంగారావు

## కుంచవరంలో కేంద్ర బృందం పర్యటన

**కొల్లిపర:** మండల పరిధిలోని కుంచవరం, దంతలూరు గ్రామాలల్లో గుంటూరు జిల్లాలో మొదటిసారిగా రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్, ఉపాధి హామీ పథకం ద్వారా రూ.32 లక్షల వ్యయంతో నూతన పంచాయతీ భవన నిర్మాణ పనులు అధికారులు చేపట్టారు. దీంతో బుధవారం కేంద్రం బృందం కుంచవరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న భవనాన్ని జిల్లా యంత్రాంగంతో కలసి పరిశీలించి, క్షేత్రస్థాయిలో నిర్మాణ విషయాలను అడిగి తెలుసుకున్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా కేంద్రం నుంచి అడిషినల్ సెక్రటరీ మినిస్ట్రీ ఆఫ్ పంచాయతీరాజ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సునీల్ కుమార్‌హాని, కమిషనర్ మైలవరపు కృష్ణచైతన్య పంచాయతీ భవరం నిర్మాణ పనులను, నాణ్యతను, రికార్డులను పరిశీలించారు. పంచాయతీ భవన నిర్మాణ పనులు ఏవిధంగా చేస్తున్నారు అన్న అంశాలను అధికారులను, కాంట్రక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ నాణ్యాత విషయంలో తగిన జాగ్రత్తలు ఉండాలని హెచ్చరించారు. బృందం వెంట జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్, డివిజనల్ పంచాయతీ అధికారి కుసుమ శ్రీదేవి, డీఎల్‌పీవో స్వరూపరాణి, పంచాయతీ రాజ్ ఏఈ అవుతు సాంబిరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవోలు భార్గవ్, దానయ్య, సచివాలయం సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుంచవరంలో పంచాయతీ భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

## జనసేన సభ్యత్వం లేనివారికి నామినేటెడ్ పదవులు

**జనసేన పార్టీ నాయకులు**

**మంగళగిరి టౌన్:** జనసేన పార్టీలో సభ్యత్వం లేనివారికి నామినేటెడ్ పదవులు లభించాయని జనసేన పార్టీ నాయకులు కాపరౌతు సుందరయ్య విమర్శించారు. మంగళగిరి పట్టణ పరిధిలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జనసేన పార్టీని మంగళగిరి నియోజకవర్గంలో ఎదగనీయకుండా ఉండేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని, వారికి జనసేన పార్టీలోనే కొందరు మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. పార్టీ సభ్యత్వం లేని పలువురికి మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ట్రస్ట్ బోర్డు, వ్యవసాయ మార్కెట్ కమిటీలలో నామినేటెడ్ పదవులు వరించాయని అన్నారు. 2014 నుంచి పార్టీలో పనిచేస్తున్న వారికి పదవులు దక్కలేదని, 2024లో ఎన్నికల తరువాత ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి, సభ్యత్వం లేని వారికి పదవులు ఇవ్వడం దుర్మార్గమని అన్నారు. పార్టీలో ఉన్న లోపాలను ఎత్తిచూపినందుకు యర్రబాలెం గ్రామ అధ్యక్ష పదవి నుంచి తనని తప్పించారని వాపోయారు.

### ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత ప్రచారం

**దుగ్గిరాల:** ఆర్థిక అక్షరాస్యత డిజిటల్ అవగాహన కార్యక్రమాన్ని కళాజాత ద్వారా కళాజాత బృందం ప్రజలకు అవగాహన కల్పించారు. బుధవారం మండల కేంద్రలోని దుగ్గిరాల గ్రామంలో లైబ్రరీ దగ్గర మస్తాన్ బృందం ఆర్థిక అక్షరాస్యత కళాజాత నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని.. కేంద్ర ప్రభుత్వ ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన ద్వారా రూ.20 రూపాయలతో ప్రీమియం చెల్లిస్తే ప్రమాదవశాత్తు మరణం, అంగవైకల్యం సంభవిస్తే రూ.2 లక్షల వరకు బీమా లభిస్తుందని మస్తాన్ కళాజాత ద్వారా వివరించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, వీరాంజనేయులు, సుందరి బృంద సభ్యులు పాల్గొన్నారు.

### 2న శాంతి కల్యాణం

**మున్నంగి (కొల్లిపర):** మండల పరిధిలోని మున్నంగి గ్రామంలో వేంచేసి ఉన్న లక్ష్మి తిరుపతాంబ సమేత శ్రీ గోపయ్య స్వామి వారి శాంతి కల్యాణ మహోత్సవం మార్చి 2న ఉదయం 11:20 నిమిషాలకు జరుగుతున్నట్లు ఆలయ కమిటీ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు 1వ తేదీ సాయంత్రం స్వామి వారితో గ్రామోత్సవం నిర్వహించటం జరుగుతుందన్నారు. శాంతి కల్యాణ మహోత్సవం అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**వేణుగోపాల స్వామివారికి..**

**మున్నంగి(కొల్లిపర):** మున్నంగి గ్రామంలోని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి వార్షిక తిరు దివ్య కల్యాణ మహోత్సవం ఆలయంలో శుక్రవారం రాత్రి 8 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బి.పద్మలతాశ్రీ అన్నారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆమె మాట్లాడుతూ స్వామి వారి కల్యాణ మహోత్సవాల సందర్భంగా గురువారం ఉదయం 9 గంటలకు స్వామి వారిని వేదపండితులు పెండ్లి కుమారుడిగా అలంకరిస్తారన్నారు.

### బయోప్లాంట్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలి

**మున్సిపల్ ఆర్డీ సూర్యదేవర హరికృష్ణ**

**తెనాలిఅర్బన్:** బయో ప్లాంట్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని మున్సిపల్ శాఖ గుంటూరు రీజనల్ డైరెక్టర్ సూర్యదేవర హరికృష్ణ ఆదేశించారు. బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్టు యార్డును బుధవారం ఆయన పరిశీలించారు. వర్మీ కంపోస్టు, బయో కంపోస్టు, కోకో పిట్ యూనిట్‌లను ఆయన పరిశీలించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో ఉత్పత్తి అయిన చెత్తను జిందాల్‌కు తరలించాలని సూచించారు. కంపోస్టు యార్డులో చెత్త నిల్వలు ఉండకుండా చూడాలన్నారు. తడి చెత్త ద్వారా చేస్తున్న ఎరువు పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎక్కడ సమస్యలు తలెతకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు, సిబ్బంది ఉన్నారు.

## ఎస్ఆర్ఎంలో టెక్నో కల్చరల్ ఫెస్ట్ ప్రారంభం

**మంగళగిరి టౌన్:** ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో టెక్నో కల్చరల్ ఫెస్ట్‌ను బుధవారం ప్రారంభించినట్లు వర్సిటీ ఉపకులపతి ఆచార్య సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ఇన్ఫిటస్–2026 పేరిట విద్యార్థుల టెక్నో కల్చరల్ ఫెస్ట్ నాలుగు రోజుల పాటు జరుగుతుందని అన్నారు. ప్రారంభ కార్యక్రమానికి విద్యార్థి వ్యవహారాల విభాగ డైరెక్టర్ మేజర్ జనరల్ గురుప్రీత్ సింగ్ నారంగ్, రిజిస్ట్రార్ ప్రేమ్‌కుమార్‌లతో పాటు ముఖ్యఅతిథిగా స్విస్‌రే కంపెనీ వైస్ ప్రెసిడెంట్ విజయ్ తిరుమల హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. నాలుగు రోజుల పాటు జరిగే ఈ కల్చరల్ ఫెస్ట్‌లో విద్యార్థుల కోసం వివిధ టెక్నికల్ పోటీలు, హై ఎనర్జీ షోలు, సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయని పేర్కొన్నారు. విద్యార్థుల మానసిక వికాసానికి ఈ ఫెస్ట్ దోహదపడుతుందన్నారు. ఫెస్ట్‌లో భాగంగా రెండు రోజుల పాటు విద్యార్థులకు హ్యాక్‌థాన్ కోడింగ్, ఫొటోగ్రఫీ ఫ్యాషన్ షో పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈనెల 28న సాయంత్రం జరిగే సినీ సంగీత గాయకుల మ్యూజికల్ షోలో గాయకుడు కార్తీక్, డీజే గౌతమ్, జ్యోతిగాంధీ తదితరులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో స్టూడెంట్ అఫైర్స్ అసోసియేట్ డైరెక్టర్ రేవతి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న వర్సిటీ ప్రతినిధులు

## కార్మికుల సమస్యను పరిష్కరించాలి

**మంగళగిరి టౌన్:** ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులు సుభాని, గురవయ్య, సాంబశివరావు, నాగేశ్వరరావులతో కలిసి ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం కార్మికులకు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్మికులు 449 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్నారని, కార్మికులకు యాజమాన్యం నుంచి రావాల్సిన బకాయిలను ప్రభుత్వం చొరవ చూపించి ఇప్పించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన మంత్రి నారా లోకేష్ తన హామీని నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు మాణిక్యరావు, బాషా, పిచ్చయ్య, ఖాసిం, హగ్గయ్య, శివకుమారి, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు. దీక్షలో ఇమాంబి, శారమ్మ, నవనీతమ్మ, శారద, కాసమ్మ తదితరులు కూర్చున్నారు.

కార్మికులకు సంఘీభావం తెలియజేస్తున్న యూనియన్ నాయకులు

## స్వచ్ఛ మంగళగిరి 2.0 పోస్టర్ ఆవిష్కరణ

**మంగళగిరి టౌన్:** మంత్రి నారా లోకేష్ తన క్యాంపు కార్యాలయంలో ఎంటీఎంసీ అధికారులతో కలిసి బుధవారం 'స్వచ్ఛ మంగళగిరి 2.0' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. మంగళగిరిని పరిశుభ్రతలో రాష్ట్రానికి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. స్వచ్ఛ మంగళగిరి మొదటి దశ ప్రజల్లో పరిశుభ్రతపై చైతన్యం కలిగించడంలో కీలకపాత్ర పోషించిందని, ఇప్పుడు 2.0 దశలో మరింత సమర్థంగా నిర్వహించేందుకు చర్యలు చేపడతామని అన్నారు. వార్డు, గ్రామస్థాయి ప్రత్యేక పరిశుభ్రత డ్రైవ్‌లు, ప్లాస్టిక్ నిర్మూలన చర్యలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు.. ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తామని, స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర విజన్ సాధనలో మంగళగిరి ముందంజలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఇది సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా, సూపరింటెండెంట్ ఇంజినీర్ లీలా కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ మంగళగిరి 2.0' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి లోకేష్, అధికారులు

## సమస్యలపై బాలల పార్లమెంట్ గ్రూప్ వినతిపత్రం అందజేత

**అనంతవరం(తాడికొండ):** తుళ్లూరు మండలం అనంతవరం గ్రామంలో బుధవారం బాలల పార్లమెంట్ గ్రూపు సభ్యుల సమావేశం నిర్వహించారు. గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో తమ గ్రామంలో ఉన్న 3 ప్రధాన సమస్యలను గుర్తించిన చిన్నారులు ఆయా సమస్యలపై గ్రామ సచివాయలంలో వినతిపత్రం అందజేశారు. గ్రామంలో కుక్కలు, కోతుల బెడద, దోమలు అధికంగా ఉన్న నేపథ్యంలో ఆరుబయట నిలవలేని పరిస్థితి ఉందని.. మురుగు కాలువల పూడికతీత తీయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గుడ్ షెపర్డ్ సభ్యులు మాట్లాడుతూ.. పిల్లలకు ఇలాంటి సమాజ శ్రేయస్సుకు సంబంధించిన విషయాలు నేర్పించడం ద్వారా వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. కార్యక్రమంలో గుడ్ షెపర్డ్ సిబ్బంది పి.అనీల్‌కుమార్, సచివాలయ సిబ్బంది శివకుమారి, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బాలల పార్లమెంట్ గ్రూపు చిన్నారులు

## ఆయిల్‌ఫాం సాగుతో స్థిర ఆదాయం

**తెనాలిరూరల్:** ఆయిల్‌ఫాం సాగుతో రైతులు స్థిరమైన ఆదాయం పొందవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి బి. రవీందర్ బాబు అన్నారు. బుధవారం మండలంలోని అంగలకుదురు గ్రామంలో నిర్వహించిన రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అయిల్‌ఫాం సాగును ప్రోత్సహించేందుకు ఉద్యానవన శాఖ అధికారులతో కలసి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రాయోజిత పథకం సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్ (ఎంఐడిహెచ్) నాణ్యమైన విత్తనాలు, ఆధునిక సాంకేతికత, కోత అనంతర నిర్వహణతో పాటు మార్కెటింగ్ సౌకర్యాలను కల్పిస్తూ రైతులకు ఆర్థిక సాయం అందిస్తుందని తెలిపారు. ఆయిల్‌ఫాం సాగు ద్వారా రైతులు స్థిరమైన ఆదాయం పొందవచ్చని, కొత్తగా సాగు చేసే రైతులకు ప్రభుత్వం నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్–ఆయిల్‌ఫాం పథకం (ఎన్ఎంఈఓ– ఓపీ) ద్వారా రూ. 29 సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. 9–9 మీటర్ల దూరంలో హెక్టారుకు 143 మొక్కలు నాటాల్సి ఉంటుందని వివరించారు. మొదటి నాలుగు ఏళ్లలో అంతర పంటల సాగుకు హెక్టారుకు సుమారు రూ. ఐదు వేలు రాయితీ లభిస్తుందని తెలియజేశారు. సబ్సిడీపై మొక్కలు పంపిణీ, డ్రిప్ ఇరిగేషన్, ఎరువుల రాయితీ, అంతర్ పంటల సాగు అలాగే చీడపీడల నివారణపై అయిల్‌ఫాం కంపెనీ జోనల్ మేనేజరు కె వరద రాజు రైతులకు అవగాహన కల్పించారు. మొక్కలను ఉచితంగా అందజేయడంతో పాటు పాం ఆయిల్ గెలలను సంస్థ నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో తెనాలి హార్టికల్చర్ అధికారి శ్రీ నిత్య, హెచ్ఈఓ మాన్వి, తెనాలి ఏఈవోలు మురళి, శ్రీనివాస్, వీహెచ్ఏ శివ, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రవీందర్ బాబు

### ఫుట్‌పాత్ వ్యాపారులకు పోలీసుల హెచ్చరిక

**తెనాలిరూరల్:** తెనాలి–చందోలు రహదారిపై పట్టణ పరిధిలో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిని పోలీసులు హెచ్చరించారు. వ్యాపారులు పోటీ మధ్య వారిలో వారు ఘర్షణ పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, సర్దుకుపోయి వ్యాపారం చేసుకోవాలని లేదంటే కబేళా వంతెన వద్దకు వ్యాపారాలను తరలించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ఉండాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## క్లుప్తంగా...

### కర్ణాటక, తెలంగాణ ప్రాజెక్టులపై బాబు నోరుమెదపరే?

**సాకే శైలజానాథ్ ధ్వజం**

**సాక్షి, అమరావతి:** కృష్ణా నదిపై కర్ణాటక, తెలంగాణ ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు నోరుమెదపడం లేదని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'రాయలసీమ నీటి సమస్యపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలి. ఆల్మట్టి ప్రాజెక్టు నీటి నిల్వ పెంపుపై చంద్రబాబు ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడం లేదు. అప్పర్ తుంగభద్ర ప్రాజెక్టు నుంచి వచ్చే ఏడాది సాగునీరు అందకపోవచ్చనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. రాయలసీమ ప్రాంతానికి నీటి భద్రత కల్పించేందుకు ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యామ్నాయ మార్గాలను రూపొందించాలి. ముఖ్యమంత్రులం మాట్లాడుకొని రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేశామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటనకు చంద్రబాబు సమాధానం చెప్పాలి. ఈ పథకాన్ని ఆపేయడం వల్ల రాయలసీమ ప్రాంతంలోని 10 లక్షల ఎకరాల ఆయకట్టుకు భరోసా లేకుండా పోయే ప్రమాదం ఏర్పడింది. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు కొత్త ప్రాజెక్టులు నిర్మిస్తుంటే, చివరకు శ్రీశైలం డ్యామ్‌కు నీరు వస్తుందా లేదా అన్న ఆందోళన నెలకొంది' అని పేర్కొన్నారు. బనకచర్ల ఎత్తిపోతల సహా ప్రత్యామ్నాయ నీటి సరఫరా మార్గాలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని ఈ సందర్భంగా శైలజానాథ్ డిమాండ్ చేశారు.

### గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలి

**పీడీఎఫ్ ఎమ్మెల్సీ గోపీమూర్తి**

**సాక్షి, అమరావతి:** ఏజెన్సీలో గిరిజన యువతకు ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి డిమాండ్ చేశారు. మండలిలో బుధవారం ప్రత్యేక ప్రస్తావనల సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎటువంటి అనుభవంలేని డీఎస్సీ–2025 ఉపాధ్యాయులను గిరిజన ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో డిప్యూటీ వార్డెన్‌గా నియమించడం సరికాదన్నారు. రెగ్యులర్ వార్డెన్, ఏఎన్‌ఎంలను నియమించాలన్నారు. అవుట్‌సోర్సింగ్ టీచర్లకు జీతాలు, గురుకులాల్లో పనిచేస్తున్న రెగ్యులర్ టీచర్స్ పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని కోరారు. ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న సీఆర్టీలకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ వారిని క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేశారు.

### ఏపీ టాపర్‌గా తిరుమల విద్యార్థి

**జేఈఈ మెయిన్ బి.ప్లాన్ ఫలితాల్లో సత్తా**

పైలా హర్షాదిత్య

గొల్లా ప్రభవ్‌తేజ్

గన్నమనీడి వాత్సల్య

లాగుడు నిఖిల్

**రాజమహేంద్రవరం రూరల్:** జేఈఈ మెయిన్ బి.ఆర్క్ అండ్ బి.ప్లానింగ్ జనవరి సెషన్ ఫలితాల్లో తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థి ఆంధ్రప్రదేశ్ టాపర్‌గా నిలిచాడని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు బుధవారం తెలిపారు. బి.ప్లానింగ్ విభాగంలో పైలా హర్షాదిత్య 99.95 పర్సంటైల్ సాధించి ఆంధ్రప్రదేశ్ టాపర్‌గా నిలిచాడన్నారు. గొల్లా ప్రభవ్‌తేజ 99.92 పర్సంటైల్, గన్నమనీడి వాత్సల్య 99.57 పర్సంటైల్, గెద్దం రాజనవీన్‌తేజ 99.42 పర్సంటైల్, లాగుడు నిఖిల్ 99.16 పర్సంటైల్ సాధించారని వివరించారు. 95 పర్సంటైల్ పైన 51మంది, 90 పర్సంటైల్ పైన 123 మంది సాధించారని తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను నున్న తిరుమలరావు, అకడమిక్ డైరెక్టర్ వి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి అభినందించారు.

### ప్రభుత్వం ఏమీ చేయలేదు

**గన్నవరం టీడీపీ ఎమ్మెల్యే యార్లగడ్డ**

**సాక్షి, అమరావతి:** ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం ఏమీ చేయలేదని గన్నవరం టీడీపీ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బుధవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో యార్లగడ్డ మాట్లాడుతూ.. నైపుణ్యాభివృద్ధి చేసినా జాబ్‌మేళాలు మనమే తెచ్చుకోవాలని.. ప్రభుత్వం ఏమీ చేయలేదని, ఉద్యోగాలు కల్పించలేదని చెప్పారు. ఇప్పటికీ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ కూడా కల్పించలేకపోతోందన్నారు. ఐదేళ్ల కిందట కేడీసీసీ బ్యాంకుల్లో 120 మందికి ఇంటర్న్‌షిప్ ఇస్తే వాళ్లలో 40 మందికి హైదరాబాద్‌లోని వెల్స్ ఫార్గో వంటి కంపెనీలో ఉద్యోగాలు వచ్చాయన్నారు. గతంలో అత్యధిక పన్ను చెల్లింపు కృష్ణా జిల్లా నుంచి ఉండేదని.. ఇప్పుడు రాయలసీమలోని అనంతపురం కూడా అభివృద్ధి చెందుతుంటే కృష్ణా జిల్లా ర్యాంకు అట్టడుగు స్థాయికి దిగజారిపోతోందన్నారు.

# అతిసారం విషాదంపైనా అవే డ్రామాలు

## తప్పు కప్పిపుచ్చుకునేందుకు బాబు సర్కారు ఆపసోపాలు

- కలుషిత నీరే కాలకూట విషమై నలుగురు బలైనా కానరాని పశ్చాత్తాపం
- మరణాలను తగ్గించి చూపేందుకు తీవ్ర యత్నం
- అతిసారం వల్ల ఒక్కరే మరణించినట్టు ప్రకటన
- శ్రీకాకుళంలో అదుపులోకి రాని డయేరియా
- 162కు చేరిన బాధితుల సంఖ్య.. మరో ఆరుగురి పరిస్థితి విషమం!
- అర్ధరాత్రి టీడీపీ నేతల హడావుడి
- కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్‌పై నెపం నెట్టేసి సస్పెన్షన్ వేటు

శ్రీకాకుళంలోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

**సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :** శ్రీకాకుళంలో కలుషిత నీరే కాలకూట విషమై అతిసారం ప్రబలి నలుగురు మరణించినా చంద్రబాబు సర్కారులో పశ్చాత్తాపం కానరావడం లేదు. తక్షణం స్పందించి వ్యాధి వ్యాప్తిని అరికట్టి బాధితులకు సాంత్వన కల్పించాల్సిన సర్కారు ఆ పని చేయకుండా జరిగిన ఘటనలో తన తప్పిదాన్ని కప్పిపుచ్చుకునేందుకు శతవిధాలా యత్నిస్తోంది. తీవ్రతను ఎలాగైనా నీరుగార్చి ప్రజాగ్రహం నుంచి తప్పించుకోవాలని కుట్రలు చేస్తోంది. దీనిలోభాగంగానే మరణాలను నిర్ధారించే విషయంలో అధికారులు దోబూచులాడారు. కేవలం ఒక్కరే మరణించినట్టు ప్రకటించారు. మిగతా వారి మరణాలపై విశ్లేషించాల్సి ఉందని చెబుతున్నారు. దీనిపై మృతుల కుటుంబీకుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన చేపడతామని వారు హెచ్చరిస్తున్నారు. సర్కారు నిర్లక్ష్యానికి కుటుంబ సభ్యులు బలై పుట్టెడు దుఃఖంలో ఉన్న తమను ఓదార్చి, అండగా ఉండాల్సింది పోయి ప్రభుత్వం కుంటిసాకులు వెతుక్కోవడంపై మండిపడుతున్నారు. అధికారం చేపట్టినప్పటి నుంచి రక్షిత మంచినీటి సరఫరాపై తీవ్ర అలసత్వం ప్రదర్శించిన సర్కారు ఇప్పుడు ఈ ఘటనకు 14 రోజుల కిందట బాధ్యతలు స్వీకరించిన కార్పొరేషన్ కమిషనర్‌ను బాధ్యుడిని చేస్తూ సస్పెన్షన్ వేటు వేయడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

### పెరుగుతున్న కేసులు

మరోవైపు అతిసారాన్ని అదుపు చేసేందుకు సర్కారు సరైన చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా డయేరియా కేసులు పెరుగుతున్నాయి. దీంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అధికారిక లెక్కల ప్రకారం మంగళవారం నాటికి 68 కేసులు నమోదైతే బుధవారానికి 102కి చేరుకున్నాయి. అనధికారిక లెక్కల ప్రకారం 162 మందికిపైగా అస్వస్థతకు గురైనట్టు తెలుస్తోంది. చాలా మంది వేర్వేరు ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నట్టు సమాచారం. మరికొందరు ఇళ్లల్లో ఉండే మందులు వాడుతున్నట్టు తెలుస్తోంది. ఆ బాధితుల లెక్క పరిగణనలోకి రాలేదని అధికారులు చెబుతున్నారు.

### కొత్త ప్రాంతాలకు విస్తరిస్తున్న డయేరియా

శ్రీకాకుళంలో మిగతా ప్రాంతాలకూ డయేరియా విస్తరిస్తోంది. మంగళవారం నాటికే సగం నగరం అతిసారం బారిన పడింది. బుధవారం కొత్త ప్రాంతాల్లో కేసులు వెలుగులోకి వచ్చాయి. నగరంలోని 10 నెట్‌వర్క్ ఆస్పత్రులు ప్రస్తుతం డయేరియా రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. మొత్తం బాధితుల్లో ఇప్పటివరకు 13 మంది మాత్రమే డిశ్చార్జి అయ్యారు.

### అసలైన బాధ్యులను వదిలి.. కమిషనర్ బలి

కలుషిత నీటి సరఫరాకు కారణమైన ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులను వదిలేసిన ప్రభుత్వం.. 14 రోజుల కిందట కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన హనుమంతు కూర్మారావును బలి పశువును చేస్తూ నిర్ణయం తీసుకుంది. నగరంపైన, కార్పొరేషన్ పాలనపైన అవగాహన చేసుకునే లోపే డయేరియా ప్రబలడానికి బాధ్యుడిని చేస్తూ నెపం ఆయనపైకి నెట్టేసి సస్పెన్షన్ వేటు వేసింది.

### కాలవకూట విషమే కారణం !

డయేరియా ప్రబలడానికి కారణాలను చంద్రబాబు ప్రభుత్వం బయటకు చెప్పలేకపోతోంది. శాంపిల్స్ పంపించాం, ఫలితాలు ఇదిగో వస్తాయి అదిగో వస్తాయి అని చెప్పడమే గానీ నాలుగు రోజులవుతున్నా అసలు కారణం వెల్లడించలేదు. వాస్తవానికి మురుగు కాలవల్లోని నీరు పైప్‌లైన్ ద్వారా తాగునీటితో కలుషితం కావడం వల్లే ప్రమాదకర పరిస్థితులు చోటు చేసుకున్నాయని అధికారులకు, పాలకులకు తెలుసు. కానీ నీరు కలుషితమైందని చెబితే ప్రభుత్వ వైఫల్యం బట్టబయలవుతుందని, కార్పొరేషన్ మంచినీళ్లు తాగి ప్రజలు చనిపోయారనే సంకేతాలు బలంగా ప్రజల్లోకి వెళ్తాయని వాస్తవాలను దాచేసేందుకు సర్కారు కుట్ర చేస్తోంది. ఇదిలా ఉంటే మంగళవారం సాయంత్రం వరకు క్షేత్రస్థాయిలో కనిపించని టీడీపీ నాయకులు ఆ తర్వాత హడావుడి చేయడం మొదలుపెట్టారు. ఎమ్మెల్యేతో సహా పలువురు నాయకులు ఆస్పత్రులు, వ్యాధి ప్రబలిన ప్రాంతాల బాట పట్టారు. అధికారులతో సమీక్షలంటూ అర్ధరాత్రి హడావుడి చేశారు.

# నలుగురు చనిపోతే ఒక్కరేనంటూ అబద్ధాలా?

**మృతులందరి కుటుంబాలకూ రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి**

**బాబు సర్కారుపై వైఎస్సార్‌సీపీ నేతల ధ్వజం**

డయేరియా వల్ల మరణించిన మోనంగి సంతోష్ తల్లిదండ్రులతో మాట్లాడుతున్న మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్, సీదిరి అప్పలరాజు

**శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):** చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసిందని, ఫలితంగా ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. బుధవారం వీరు ముగ్గురూ కలిసి శ్రీకాకుళం నగరంలోని డయేరియా ప్రబలిన ప్రాంతాల్లో పర్యటించారు. మృతుల కుటుంబాలను, వ్యాధి బారిన పడ్డ బాధితులను పరామర్శించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. డయేరియాతో నలుగురు చనిపోతే, ఒక్కరే చనిపోయాడని ప్రభుత్వం అబద్ధాలు చెప్పడం దారుణమన్నారు. మృతులందరి కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, బాధితులకు ఉచితంగా వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. గత డిసెంబర్‌లోనే డయేరియా ప్రబలి ఒకరు మరణిస్తే అప్పుడు సర్కారు పట్టించుకోలేదని విమర్శించారు. ఎంతసేపూ రూ.వేల కోట్లతో రాజధాని అంటూ బీరాలు పలుకుతున్న చంద్రబాబు ముందు ప్రజారోగ్య వ్యవస్థను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం ఆస్పత్రిలో డయేరియా బాధితులకు మాత్రలు ఇచ్చే దిక్కులేదని విమర్శించారు. రక్షిత మంచినీటి పథకాల్లో ఇసుక బెడ్లు పడకేసి కలుషిత నీరు సరఫరా అవుతోందని, గార ప్రాంతంలో తాగునీటి పథకం నుంచి పదిరోజులుగా నీరు ఎర్రగా వస్తోందని, తక్షణం చర్యలు చేపట్టకపోతే అక్కడా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రి లోకేశ్, స్థానిక ఎమ్మెల్యే కన్నుసన్నల్లో ఇసుకాసురులు చెలరేగిపోతున్నారని, ఇసుకను తోడేస్తున్నారని విమర్శించారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో డయేరియా ప్రబలి ప్రజల ప్రాణాలు పోతుంటే.. కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ విజయవాడలో కబడ్డీ ఆడుకోవడం సిగ్గుచేటన్నారు. శ్రీకాకుళం కార్పొరేషన్‌లో హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## పోలీసులు రాలేదు.. పోస్టుమార్టం ఆగిపోయింది

- రాజమహేంద్రవరం బాలుడి మృతదేహం కోసం మార్చురీ వద్ద కుటుంబీకుల పడిగాపులు

**మహారాణిపేట(విశాఖపట్నం):** రాజమహేంద్రవరం కల్తీ పాలు ఘటనలో మంగళవారం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన బాలుడు డి.మనోహర్ మృతదేహానికి బుధవారం నాటికి కూడా పోస్టుమార్టం నిర్వహించలేదు. రాజమహేంద్రవరంలోని స్వరూప్ నగర్‌కు చెందిన ఆరేళ్ల బాలుడు కల్తీ పాలు తాగి కిడ్నీలు ఫెయిలవడంతో ఈ నెల 18న చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌లో అతడి కుటుంబీకులు చేర్పించారు. మనోహర్ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిన విషయం విదితమే. ఈ విషయమై రాజమహేంద్రవరం పోలీసులకు సమాచారం అందించినట్టు విశాఖ వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. మనోహర్ శవ పంచనామ కోసం రాజమహేంద్రవరం పోలీసులు ఇక్కడకు రావాల్సి ఉంది. బాలుడు మరణించి 24 గంటలు దాటిపోయినా అక్కడి పోలీసులు రాకపోవడంతో బుధవారం కూడా పోస్టుమార్టం నిర్వహించలేదు. పోలీసులు ఎప్పుడు వస్తే ఆ రోజు పంచనామా నిర్వహించి.. పోస్టుమార్టం చేపడతామని వైద్యులు తెలిపారు. బాలుడు మనోహర్ మృతదేహం కోసం తల్లి అర్చన, కుటుంబ సభ్యులు కేజీహెచ్‌లో మార్చురీ వద్ద పడిగాపులు పడుతున్నారు.

## పాల కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు

- పాలిథిన్ కవర్లలో పాలు ప్యాకింగ్
- కవర్లపై ఎలాంటి వివరాలు లేకుండా విక్రయం
- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఫుడ్‌సేఫ్టీ అధికారుల హెచ్చరిక

**సాక్షి, సీతంపేట (విశాఖపట్నం)/అమరావతి:** రాజమహేంద్రవరంలో కల్తీ పాల వల్ల మరణాలు సంభవించిన నేపథ్యంలో ఫుడ్ అండ్ సేఫ్టీ విభాగం అధికారులు బుధవారం విశాఖ నగరంలోని లూజు పాల విక్రయ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ జీవీ అప్పారావు, అసిస్టెంట్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కల్యాణ చక్రవర్తి అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్‌లో ఉన్న భవానీ డెయిరీ, కృషి డెయిరీ, సీతమ్మధారలోని ఆంథోనీ డెయిరీ, శివాజీపాలెంలోని రబ్బానీ మిల్క్ ఫుడ్స్, రామాటాకీస్ వద్ద ఉన్న భారతి మిల్క్ ఫుడ్స్ తదితర కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. పాల శాంపిల్స్ సేకరించి పరీక్ష నిమిత్తం హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ కమిషనర్ వీరపాండియన్ ఆదేశాలతో రాష్ట్రవ్యాప్త తనిఖీల్లో భాగంగా విశాఖ జిల్లాలో మూడు బృందాలతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బుధవారం 5 పాల డెయిరీల్లో తనిఖీలు చేశామని, లూజు పాలను పాలిథిన్ కవర్లలో ప్యాక్ చేస్తున్నారని, కవర్‌పై ఎటువంటి వివరాలు లేవని చెప్పారు. తయారీ తేదీ, ఎక్స్‌పైరీ తేదీ, బ్యాచ్ నంబర్, ఎఫ్ఎస్ఎస్ లైసెన్స్ వివరాలు, పాలు పాడైతే ఎవరిని సంప్రదించాలి, ఎవరికి ఫిర్యాదు చేయాలి, కస్టమర్ కేర్ నంబర్ వంటి వివరాలు ముద్రించడం లేదని గుర్తించామన్నారు.

### ఇతర ప్రాంతాల్లోనూ తనిఖీలు

రాజమహేంద్రవరం కల్తీ పాల ఘటన నేపథ్యంలో ఫుడ్ కంట్రోల్ విభాగం బుధవారం రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు చేపట్టింది. సుమారు 150 నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్, చెన్నై, కాకినాడలోని గుర్తింపు పొందిన ల్యాబ్స్‌కు పంపించినట్టు వైద్య శాఖ ప్రకటించింది. అనంతపురంలో రెండుచోట్ల సుమారు వంద లీటర్ల పాలలో నాణ్యత లోపించినట్టు గుర్తించి పారబోశారు. మచిలీపట్నంలో మరో 20 లీటర్ల బాదం పాలలోనూ నాణ్యత లోపించినట్టు అధికారులు వెల్లడించారు. కాకినాడలో నాణ్యతలేని ఐదు కేజీల మిల్క్ పౌడర్ సీజ్ చేశారు. తనిఖీలను వారంపాటు కొనసాగిస్తామని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ డైరెక్టర్ నీలకంఠారెడ్డి చెప్పారు.

# వీడని కల్తీ పాల ఆందోళన

## ఇప్పటికే ఆరుగురి మృతి

వివిధ ఆస్పత్రుల్లో 15 మందికి చికిత్స ● వారిలో 9 మంది పరిస్థితి విషమం

ఐసీయూలో ఆరుగురు బాధితులు ● మరో 8 మందికి వెంటిలేటర్, డయాలసిస్ సేవలు

వెంటిలేటర్‌కే పరిమితమైన మరొకరు ● కల్తీ గుట్టు రట్టయ్యేదెప్పుడో

ఇంకా వెలువడని ల్యాబ్ నివేదికలు ● ఇథలీన్ గ్లైకాల్ కలిసిందంటూ ప్రచారం

యూరియా కలిసిందని మరికొందరి అనుమానం

**సాక్షి, రాజమహేంద్రవరం/కంబాలచెరువు (రాజమహేంద్రవరం):** రాజమహేంద్రవరంలో కల్తీపాల కలకలం కొనసాగుతోంది. ఎప్పుడు ఏం జరుగుతుందో.. ఎవరు మృత్యువాత పడతారో అన్న ఆందోళన నెలకొంది. కల్తీ పాలు తాగి 21 మంది ఆస్పత్రుల్లో చేరగా.. ఇప్పటికే ఆరుగురు మృతి చెందిన విషయం విదితమే. ప్రస్తుతం 15 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వారిలో 9 మంది పరిస్థితి విషమంగా ఉంది. అధికారులు విడుదల చేసిన హెల్త్ బులెటిన్ ప్రకారం.. శనివారం నుంచి ముగ్గురికి డయాలసిస్ చేస్తుండగా బుధవారం నాటికి ఆ సంఖ్య 6కు పెరిగింది. వెంటిలేటర్, డయాలసిస్ సేవలు పొందుతున్న వారు ముగ్గురు ఉండగా.. బుధవారం ఆ సంఖ్య 8కి చేరింది. మరొకరు వెంటిలేటర్ మీద ఉన్నారు.

### దయనీయ స్థితిలో ముగ్గురు చిన్నారులు

రాజమహేంద్రవరంలోని కిమ్స్ ఆస్పత్రిలో 8 మంది బాధితులకు.. రెయిన్‌బో ఆస్పత్రిలో ముగ్గురు చిన్నారులకు వైద్యం అందిస్తున్నారు. వీరిలో 5 నెలల పసికందు పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. బొడ్డు నుంచి రోజుకు రెండుసార్లు డయాలసిస్ చేస్తున్నారు. అచేతనావస్థలో ఉన్న చిన్నారులను చూసి తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. 'ఎప్పటికి లేచి తిరుగుతారు కన్నా..' అంటూ ఆందోళన చెందుతున్నారు.

చౌడేశ్వరి నగర్‌లో కొనసాగుతున్న వైద్య శిబిరం

### రక్త నమూనా నివేదికలు వచ్చేదెప్పుడో!

నగరంలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్, వెంకటేశ్వర నగర్ తదితర ప్రాంతాల్లో 110 కుటుంబాలకు కోరుకొండకు చెందిన గణేష్ పాలు పోశారు. ఈ కుటుంబాల పరిధిలో 315 రక్త నమూనాలు తీసుకున్నారు. పాల శీతలీకరణ యంత్రంలో లీకేజీ ఏర్పడి ఇథలీన్ గ్లైకాల్ పాలలో కలిసి ప్రమాదం జరిగిందంటూ ఆ పాలను, అస్వస్థతకు గురైన వారి రక్త నమూనాలు పరీక్షల నిమిత్తం ముంబైలోని ఫోరెన్సిక్స్ ల్యాబ్‌కు పంపారు. బాధితులకు అత్యవసరంగా ఇవ్వాల్సిన ఇంజెక్షన్లను రూ.లక్షలు వెచ్చించి ముంబై నుంచి హుటాహుటిన రప్పించారు. అయితే.. ఆ ఇంజెక్షన్లు నిరుపయోగంగా ఉన్నాయి. కల్తీపాలు తాగి ఆస్పత్రి పాలైన బాధితుల శరీరంపై ఇథలీన్ గ్లైకాల్ ప్రభావం ఉంటే మాత్రమే ఆ ఇంజెక్షన్లు చేయాలి. అలా కాకుండా కల్తీ జరిగి ఉంటే ఈ ఇంజెక్షన్లు పనిచేయవు. రక్త నమూనాలకు సంబంధించిన ల్యాబ్ రిపోర్టులు రావడంలో జాప్యం జరుగుతుండటంతో ఆ ఇంజెక్షన్లు ఉపయోగించలేని పరిస్థితి. ఈ సందిగ్ధ స్థితి బాధితులకు ప్రాణ సంకటంగా మారుతోంది. పాల కల్తీపై నేటికీ స్పష్టత రాకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

### తిరుపతి ల్యాబ్‌కు రక్త నమూనాలు

ముంబై ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి రిపోర్టులు రావడం ఆలస్యం అవుతుండటంతో అధికారులు బాధితుల నుంచి మరోసారి రక్త నమూనాలు సేకరించి తిరుపతిలోని ల్యాబ్‌కు పంపారు. వాటి నివేదిక గురువారం సాయంత్రానికి అందే అవకాశం ఉంది. దానిని బట్టి వైద్యం ఏవిధంగా చేయాలో నిర్ణయిస్తారు.

### భయం గుప్పిట్లో బాధితులు

కల్తీ పాల ఘటన జరిగి ఇప్పటికే 10 రోజులు అవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. విషమంగా ఉన్న 8 మంది ఆరోగ్యంపై బంధువులు ఆందోళన చెందుతున్నారు. ఆస్పత్రిలో చేరిన వారే కాకుండా గణేష్ వద్ద పాలు వినియోగించిన వారినీ భయం వెంటాడుతోంది. తమపై కల్తీ పాలు దుష్ప్రభావం చూపిస్తాయా అన్న ఆందోళనతో వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు.

### నేతల కూలెంట్ లీకేజీ ప్రచారం

ల్యాబ్ రిపోర్టులు ఇంకా బహిర్గతం కాలేదు. అయినా.. కూటమి నేతలు, ప్రజాప్రతినిధులు అందరూ ఒకే పాట అందుకున్నారు. వరలక్ష్మి డెయిరీలో 'కూలెంట్ లీకేజీ' జరిగి పాలల్లో ఇథలీన్ గ్లైకాల్ కలిసిందంటూ బహిరంగ ప్రకటనలు చేస్తున్నారు. అధికారుల దర్యాప్తులోనూ ఇదే వెల్లడైనట్టు ఎంపీ పురందేశ్వరి సహా ఎమ్మెల్యేలు, కూటమి ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. ల్యాబ్ రిపోర్టులు అందకముందే ఇలాంటి ప్రచారం విస్తృతం చేయడం వెనుక ఏదో ఆంతర్యం దాగుందని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపిస్తున్నారు. పొరపాటుగా కల్తీ జరిగిందని, ఇందులో ప్రభుత్వ పాత్ర లేదని చెప్పేందుకే కూలెంట్ వాదన తెరపైకి తెచ్చారన్న ఆరోపణలున్నాయి. తద్వారా ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా చూడాలన్న ఉద్దేశంతో కూలెంట్ లీకేజీ ప్రచారం చేస్తున్నారన్న అనుమానాన్ని వైఎస్సార్‌సీపీ నేతలు వ్యక్తం చేస్తున్నారు. ఘటన వెలుగు చూసిన వెంటనే అధికారులు బాధితుల రక్తంలో యూరియా, క్రియాటినిన్ అవశేషాలు ఉన్నాయని చెప్పారు. వైద్యుల నివేదికల్లోనూ ఇదే స్పష్టమైనట్టు వెల్లడించారు. తాజాగా ఇథలీన్ గ్లైకాల్ కలిసిందంటూ ప్రచారం చేస్తున్నారు.

## సచివాలయ ఉద్యోగులకు జీతాలివ్వద్దు

- అధికారులకు చంద్రబాబు ప్రభుత్వం ఆదేశాలు
- యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పూర్తి కాలేదంటూ కక్షపూరిత చర్యలు
- సర్వే చేయని సిబ్బందిపై నివేదికలు ఇవ్వాలని హుకుం
- ఉద్యోగుల ఆగ్రహం



జీతాలు నిలిపేయాలని ఓ ఎంపీడీవో ఇచ్చిన సర్క్యులర్

**సాక్షి, అమరావతి:** సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసిన చంద్రబాబు ప్రభుత్వం, ఆ ఉద్యోగులపై వేధింపుల్లో మరో పర్వానికి తెరతీసింది. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే వంద శాతం పూర్తి చేయని గ్రామ వార్డు సచివాలయాల (ప్రస్తుత పేరు స్వర్ణ గ్రామ – స్వర్ణ వార్డు) ఉద్యోగుల వేతనాలు నిలుపుదల చేయాలంటూ సంబంధిత డీడీవోలకు రాష్ట్రంలో పలుచోట్ల ఎంపీడీఓలు ఆదేశాలు జారీ చేశారు. సర్వే చేయని సిబ్బందిపై నివేదికలు తయారు చేయాలంటూ ఆదేశించారు. సర్వే పూర్తి కాలేదని చెబుతూ జీతాలు ఆపమని నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ఉద్యోగులు ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రభుత్వ వైఫల్యం వల్లే కల్తీపాల దుర్ఘటన

- వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీ మార్గాని భరత్



**సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం) :** రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటనను చంద్రబాబు ప్రభుత్వం నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ ఆరోపించారు. సర్కారు వైఫల్యంవల్లే ఈ దుర్ఘటన చోటుచేసుకుందని మండిపడ్డారు. ఆయన బుధవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. పుష్కరాల తొక్కిసలాటలో 29 మంది మరణాలు సంభవిస్తే, అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు అత్యుత్సాహంతో ఆ ఘటన జరిగిందంటూ తేలిగ్గా తీసిపారేశారని గుర్తుచేశారు. పోలీసు శాఖ వీడియో ఫుటేజ్‌ను మాయం చేసిందన్నారు. ఇలాంటి నీచ రాజకీయాలు చేయడంలో చంద్రబాబు సిద్ధహస్తుడన్నారు. ఇక కల్తీపాలు తాగి అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న వృద్ధులు, చిన్నారుల పరిస్థితి హృదయవిదారకంగా ఉందన్నారు. అందరికంటే ముందు ఆస్పత్రిలో చేరి మరణించిన 80 ఏళ్ల కనకరత్నం పేరును మృతుల జాబితాలో ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. చనిపోయిన వారికి రూ.10 లక్షల పరిహారం చెల్లించి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. ఈ ఘటనపై వైఎస్సార్‌సీపీ వెంటనే స్పందించడంవల్లే ఈ పరిహారం ప్రకటించారని, లేకపోతే తూతూమంత్రంగా కానిచ్చేసేవారని చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వం ఈ ఘటనను నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని.. ఇందులో భాగంగానే రాజమహేంద్రవరం సిటీ టీడీపీ ప్రెసిడెంట్ కల్తీ పాలు తాగారని, అతనికి ఏ ఇబ్బందీ రాలేదని డైవర్షన్ మాటలు మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. మరోవైపు.. ఇక్కడి ప్రభుత్వాసుపత్రిలో కనీస వైద్య సదుపాయాల్లేవన్నారు. సిటీలో ఇంత దారుణం జరిగితే కనీసం వైద్యశాఖ మంత్రి జాడలేదన్నారు. రాజమహేంద్రవరంలో వెంటనే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని మార్గాని భరత్ డిమాండ్ చేశారు.

## కాంట్రాక్టు ఉద్యోగులకు జీతాలు కష్టమే!

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు వచ్చే నెల వేతన కష్టాలు తప్పేటట్టు లేదు. ప్రభుత్వం సకాలంలో నిర్ణయం తీసుకోకపోవడంతో ఫిబ్రవరి నెల జీతం అందుకోలేని పరిస్థితి తలెత్తింది. కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలకు సంబంధించి ప్రతినెలా 19 నుంచి 25 వరకు వేతన బిల్లులు ట్రెజరీకి పంపిస్తారు. అనంతరం ఏపీ సీఎఫ్ఎంఎస్ ద్వారా బిల్లులు ప్రాసెస్ చేసి వేతనాలు చెల్లిస్తారు. కాగా ఈ నెల వేతనాలను 'నిధి' పోర్టల్ నుంచి చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. వేతన బిల్లులు సమర్పించే సమయంలో ఈనెల 19న ఆదేశాలు జారీ చేయడంతో పాటు సీఎఫ్ఎంఎస్ ప్రక్రియను నిలిపివేసింది. బుధవారంతో బిల్లుల సమర్పణ గడువు ముగిసిపోయింది. ప్రభుత్వం నిర్లక్ష్యం ఫలితంగా వేతనాల బిల్లులు సమర్పించలేని పరిస్థితి తలెత్తింది. బిల్లులు సమర్పించే సమయంలో నూతన ప్రక్రియను ప్రకటించడం శాపంగా మారింది. మరో వైపు ఎస్‌వోపీపై తలెత్తిన సమస్యలను ఆర్థికశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో వివిధ శాఖల హెచ్‌వోడీలు సైతం తమకెందుకన్నట్టు వదిలేశారు. దీంతో కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలు ఆగిపోయే పరిస్థితి నెలకొంది.

### అవగాహన లేకుండా ఆదేశాలివ్వడం వల్లే..

నూతన పోర్టల్‌లో బిల్లులు సమర్పించాలంటే హెచ్‌వోడీ, డీడీవోలు, సంబంధిత ట్రెజరీ అధికారుల మధ్య సమన్వయం ఉండాలి. అలాంటి దీర్ఘకాలిక ప్రక్రియపై ప్రభుత్వం, ఆర్థికశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ పరిస్థితి నెలకొందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా వివిధ శాఖల్లో పనిచేస్తున్న దాదాపు 50 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఫిబ్రవరి నెల వేతనాలు అందుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఫిబ్రవరి నెల వరకు సీఎఫ్ఎంఎస్ ద్వారా అందించి, వచ్చేనెల (మార్చి) నుంచి 'నిధి' పోర్టల్ ద్వారా ఇచ్చేలా నిర్ణయం తీసుకుని ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# What were the political arrangements done in Lebanon?

## POWER-SHARING

### 8 MARKS QUESTIONS

**1. What are the different forms of power sharing in modern democracies? Give an example of each of these.**

**A.** Forms of power-sharing: Power sharing forms are 4 types.

**i. Horizontal Division of Power:**
1. Power is shared among legislature, executive and judiciary.
2. It is called as horizontal distribution of power.
3. For example: India.

**ii. Vertical Division of Power:**
1. Power can be shared among governments at different levels.
2. A government for the country is called federal government.
3. In India, we refer to it as the Central or Union Government.

**iii. Community government:**
1. Power may also be shared among different religious and linguistic groups.
2. Ex: 'Community government' in Belgium.

**iv. Power-sharing among political parties:**
1. Power sharing arrangements can also be seen in the way political parties, pressure groups and movements control or influence those in power.
2. Ex: NDA and UPA governments.

**2. State one prudential reason and one moral reason for power sharing with an example from the Indian context.**

**i. Prudential Reason:**
1. India is a multicultural society.
2. The distribution of power is necessary to maintain peace.
3. In India, some seats are reserved for SC and STs.
4. It enables all social groups to manage the government.

**ii. Moral Reason:**
1. India is a democratic country.
2. It upholds the ideals of democracy.
3. In a democracy, the people themselves are the rulers.

**3. "Panchayati Raj will strengthen the foundations of our democracy." – Comment.**
1. Panchayati Raj establishes true democracy.
2. It reduces the conflicts among the social groups in the village.
3. There will be no violence.
4. The political stability will be established.
5. It increases administrative efficiency.
6. Local people have greater control over the schemes.
7. It eliminates the corrupt middlemen.
8. Thus, Panchayati Raj will strengthen the foundations of our democracy.

**4. What's wrong if the majority community rules? If Sinhalas don't rule in Sri Lanka, where else will they rule?**
1. In democracy, the government runs by the majority only.
2. In Sri Lanka, Sinhalas are the major community.
3. They have bigger share in the government.
4. In Sri Lanka, Sinhalas neglected the rights of native Tamilians.
5. It created tension between Sinhalas and Tamilians.

**5. So, you are saying that sharing of power makes us more powerful. Sounds odd! Let me think.**
1. Yes, sharing of power makes us more powerful.
2. It strengthens the unity between the institutions involved.
3. Power sharing is very effective in the long run.
4. It maintains stability in the political order.
5. It reduces conflicts between diverse social groups.
6. It reduces concentration of power in single organ or body.

**6. Would you adopt the 'regular' rules followed everywhere, as Khalil suggests? Or stick to the old rules? Or do something else?**
1. There is justice in Khalil suggestions.
2. But Lebanon situation is different.
3. Lebanon sticked on an agreement to control conflicts.
4. I would stick on the rules made by the Lebanon communities.
5. Thus, I don't adopt the 'regular' rules followed everywhere.

**7. What were the demands of the Sri Lankan Tamils?**
1. The recognition of Tamil as an official language
2. Regional autonomy
3. Equal of opportunities in education and jobs.
4. By 1980s they demanded for an independent Tamil state.

**8. What were the consequences of the civil war in Sri Lanka?**
1. Thousands of people of both the communities have been killed.
2. Many families were forced to leave the country as refugees.
3. Many more lost their livelihoods.
4. A terrible setback to the social, cultural and economic life.

**9. Why power sharing is desirable?**
1. Social conflict often leads to violence and political instability.
2. Power sharing is a good way to ensure political stability.
3. Power sharing is good for democracies.
4. Power sharing is the spirit of democracy.

**10. Evaluate the power sharing system in India.**
1. India is a sovereign country.
2. It follows a power-sharing system.
3. It divides the powers into three organs of government.
4. Power is not concentrated into a single organ.
5. India since independence has a proper power-sharing system.
6. Legislature is responsible for the formulation of laws.
7. Judiciary is responsible for interpreting the laws.
8. Executive is responsible for executing the laws.

**11. What were the political arrangements done in Lebanon?**
1. Lebanon capital is Beirut.
2. Lebanon's leaders agreed to some basic rules.
3. The country's President must be a Catholic Christian.
4. The Prime Minister must be a Sunni Muslim.
5. The Deputy Prime Minister must be a Orthodox Christian.
6. The Speaker must be a Shi'a Muslims.
7. The Christians agreed not to seek French protection.
8. The Muslims agreed not to seek unify with Syria.

**12. Compare Belgium and Sri Lanka on power sharing.**

**Belgium**
1. Belgium shared power between Dutch and French people.
2. Both groups got equal seats in the government.
3. It helped to keep peace in the country.
4. The Central and State Governments have their own powers.
5. The State Governments are not under the Central Government.
6. Brussels has its own special government.
7. Belgium has a "community government".
8. These arrangements have kept Belgium peaceful and united.

**Sri Lanka**
1. Sri Lanka gave more importance to the Sinhala community.
2. Tamil people faced unfair treatment.
3. This caused big conflict.
4. Sri Lanka became independent in 1948.
5. Sinhala leaders wanted more power for Sinhala people.
6. In 1956, Sinhala became the only official language.
7. Tamils were not given equal jobs or rights.
8. Because of this, Tamils felt left out and unsafe.

**13. Power sharing is the essence of democracy. Explain.**
1. Power is not kept with one person.
2. Power is shared among different levels.
3. Power sharing stops conflicts.
4. It encourages strength in the government.
5. It protects the rights of the minorities.
6. It protects the rights of people.
7. It keeps the country united.
8. Example: India shares power between Centre and States.

Continued on next page..

# FEDERALISM

## KEY POINTS

1. In federalism the power is divided between a central and states.
2. First category is known as 'Coming together' federations.
3. Examples are USA, Switzerland and Australia.
4. Second category is known as 'holding together' federations.
5. Examples are India, Spain and Belgium.
6. The Constitution declared India as a Union of States.
7. Union Government has power to legislate on the 'residuary' subjects.
8. States such as Assam, Nagaland, Arunachal Pradesh and Mizoram enjoy special status under Article 371.
9. The special powers are to the protection of land rights.
10. Who are not permanent residents of this State cannot buy land here.
11. UTs Chandigarh, Lakshadweep, Delhi enjoy very little power.
12. Nagaland, Uttarakhand and Jharkhand were created to recognise differences based on culture, ethnicity or geography.
13. Hindi was identified as the official language.
14. There are 22 languages recognised by the Constitution of India.
15. According to the Constitution, the use of English for official purposes was to stop in 1965.
16. The Central Government responded by agreeing to continue the use of English along with Hindi for official purposes.
17. The 2011 census recorded more than 1300 distinct languages which people mentioned as their mother tongues.
18. Bhojpuri, Magadhi, Bundelkhandi, Chhattisgarhi, Rajasthani and many others were grouped together under 'Hindi'.
19. After the grouping, we found 121 major languages.
20. 22 languages are now included in the 8th Schedule.
21. Hindi, is the mother tongue for 44 %, Bengali - 8.03, Telugu - 6.70.
22. Hindi as the 2nd or 3rd language : less than 50 % in 2011.
23. English as the 2nd or 3rd language : 11 %.
24. In population, Uttar Pradesh is bigger than Russia.
25. Maharashtra is as big as Germany.
26. When power is taken away from Central and State governments and given to local government, it is called decentralisation.
27. A major step towards decentralization was taken in 1992.
28. Rural local government is known as Panchayati raj.
29. Gram panchayat ward members are called as Panch.
30. Gram panchayat head is called the president or sarpanch.
31. All the voters in the village are the gram Sabha members.
32. The gram Sabha has to meet at least twice or thrice in a year.
33. A few gram panchayats are grouped together to form called a panchayat samiti or block or mandal.
34. All the mandals in a district together constitute the zilla parishad.
35. Members of the Lok Sabha and MLAs of that district and some other officials of other district level bodies are its members.
36. Municipal chairperson is the political head of the municipality.
37. Mayor is the political head of the municipal corporation.

## 1 MARK QUESTIONS

**1. What is unitary form of government?**
**A.** Under the unitary system, either there is only one level of government, or the sub-units are subordinate to the central government.

**2. Define the term Jurisdiction.**
**A.** The area over which someone has legal authority. The area may be defined in terms of geographical boundaries or in terms of certain kinds of subjects.

**3. Which federations do not give equal power to its constituent units?**
**A.** 'Holding together'.

**4. Which states have special status?**
1. Assam.
2. Nagaland.
3. Arunachal Pradesh.
4. Mizoram.

**5. Which article explains about special status?**
**A.** Article 371.

**6. Name the Union Territories which enjoy very little power.**
1. Chandigarh, Lakshadweep, Delhi

**7. Who has the power to legislate on the 'residuary' subjects?**
**A.** The Union Government.

**8. What are Coming together Federations?**
**A.** Independent States coming together on their own to form a bigger unit, so that by pooling sovereignty and retaining identity they can increase their security.

**9. What are holding together federations?**
**A.** A large country decides to divide its power between the constituent States and the national government.

**10. What is Residuary List?**
**A.** Include all subjects that came up after the constitution was made and they do not fall in any of the three lists.

**11. Find the odd one out with reference to the form of government:**
***(Canada, Brazil, Britain, India)***
**A.** Britain (Unitary state).

**12. Find out odd one:**
***A. Defence of the country, B. Foreign Affairs, C. Police, D. Banking:***
A. C. Police.

**13. What is the Telugu speaking percentage?**
**A.** 6.70%.

**14. In which year, the regional governments were given constitutional powers?**
**A.** In 1993.

**15. Which country shifted from a unitary to a federal form of government?**
**A.** Belgium.

**16. Expand SRC.**
**A.** State Reorganization Commission.

**17. Give examples for "Coming together' federations.**
1. USA, Switzerland, and Australia

**18. How the Constitution declared India?**
**A.** As a Union of States.

**19. Give examples for "holding together' federations.**
1. India, Spain, and Belgium.

**20. Which language was identified as the official language?**
**A.** Hindi.

**21. How many languages recognised as Scheduled Languages by the Constitution of India?**
**A.** 22 languages.

**22. In which state anti Hindi movement took a violent form.**
**A.** In Tamil Nadu.

**23. How many distinct languages are recorded in 2011 census?**
**A.** 1300 languages.

**24. Name the languages which are grouped under Hindi.**
**A.** 1. Bhojpuri 2. Bundelkhandi
3. Rajasthani. 4. Magadhi
5. Chhattisgarhi

**25. How many languages are included in the 8th Schedule of the Constitution?**
**A.** 22 languages.

**26. In which year, a major step towards decentralization was taken?**
**A.** In 1992.

**27. Who is Gram panchayat head?**
**A.** The president or sarpanch.

**28. Who are the Gram Sabha members?**
**A.** All the voters in the village.

**29. How many times has to meet the Gram Sabha in a year?**
**A.** At least twice or thrice.

**30. What is panchayat samiti?**
**A.** A few gram panchayats are grouped together to form called a panchayat samiti.

**Prepared by**
K. Suresh,
Subject Expert

## Daily Quiz

సమాధానాలు రాయడానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

**1. Belgium shifted from a unitary to:**
A. Democratic
B. Federal
C. Autocratic
D. Beurocratic

**2. The head of the municipal corporation:**
A. Mayor
B. MLA
C. Sarpanch
D. Governor

**3. Who can interpret the constitution:**
A. Central government
B. Judiciary
C. State government
D. Governor

**4. Scheduled Languages in India:**
A. 15 B. 22
C. 25 D. 21

**5. The head of the gram panchayat.**
A. Sarpanch
B. Commissioner
C. Collector
D. Mayor

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా.. మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 2125 9899

టన్నుల్లో చంద్రబాబు అబద్ధాలు..

# వెలిగొండలో క్రెడిట్ చోరీ

## వెలిగొండ ప్రాజెక్టును పరుగులు పెట్టించానంటూ మార్కాపురం సభలో సీఎం చంద్రబాబు పచ్చి అబద్ధాలు

- 2014-19 మధ్య ధరల సర్దుబాటుతో కాంట్రాక్టర్లకు దోచిపెట్టింది రూ.630.57 కోట్లు
- వైఎస్సార్ హయాంలోనే ప్రాజెక్టుకు రూ.3,581.58 కోట్ల ఖర్చు
- నల్లమల సాగర్‌తో పాటు సొరంగాల్లో చాలా వరకు పనులు పూర్తి
- కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ రికార్డు సమయంలో ఆసియాలోనే అతి పెద్ద సొరంగాలను పూర్తి చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- రూ.992 కోట్లతో పునరావాసం కల్పించి 2024 సీజన్‌లో శ్రీశైలం నుంచి నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలను తరలించేలా ప్రణాళిక
- వైఎస్ జగన్‌కు పేరొస్తుందనే దుగ్ధతోనే పునరావాసం కల్పించకుండా, వెలిగొండకు కృష్ణా జలాలు ఇవ్వకుండా 21 నెలలుగా జాప్యం చేస్తున్న బాబు సర్కారు

2014-19 మధ్య చంద్రబాబు అధికారంలో ఉండగా వెలిగొండ సొరంగాల్లో తవ్వింది కేవలం **6.686 కి.మీ.**

వైఎస్సార్, మాజీ సీఎం వైఎస్ జగన్ హయాంలో వెలిగొండ టన్నెల్‌లో జరిగిన పనులు **30.901 కి.మీ.**

మరి చిత్తశుద్ధితో పనులు చేసిందెవరు..? కోవిడ్‌లోనూ పరుగులు తీయించిందెవరు..? టన్నులు టన్నులు అబద్ధాలు చెబుతోంది ఎవరు..?

వెలిగొండ ఫీడర్ కెనాల్

**సాక్షి, అమరావతి:** మరో 'క్రెడిట్' చోరీకి సిద్ధమైన ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం మార్కాపురం సభ వేదికగా వెలి'కొండంత' అసత్యాలు వల్లె వేశారు. వెలిగొండ ప్రాజెక్టుకు 1996లో తానే శంకుస్థాపన చేశానని.. 2014–19 మధ్య పనులను పరుగులు పెట్టించానని.. కానీ 2019–24 మధ్య పనులు మూలన పడ్డాయని తనకు అలవాటైన రీతిలో అలవోకగా అబద్ధాలు చెప్పుకొచ్చారు. నిజానికి 1996 నుంచి 2004 వరకూ ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు వెలిగొండ పనులకు చేసిన వ్యయం అక్షరాలా రూ.పది లక్షలు మాత్రమే. అదీ శంకుస్థాపన సందర్భంగా నిర్వహించిన సభ ఏర్పాట్ల కోసం ఖర్చు చేసిందే. ఇక 2014–19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం పనుల పేరుతో కాంట్రాక్టర్లకు రూ.630.57 కోట్లు దోచిపెట్టింది. జీవో 22 (ధరల సర్దుబాటు), జీవో 63 (పనుల పరిమాణం ఆధారంగా బిల్లుల చెల్లింపు) వర్తింపజేసి కాంట్రాక్టర్లకు ఉత్తినే రూ.630.57 కోట్లు దోచిపెట్టారని కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) నివేదికలో కడిగిపారేయడమే అందుకు తార్కాణం. అలాంటి అవినీతి బాగోతాలు ఇంకా ఎన్నో ఉన్నాయి. 2017 నాటికే వెలిగొండను పూర్తి చేస్తామని ప్రకటించి రోజుకు సగటున 10 మీటర్ల పొడవున సొరంగం తవ్వేందుకు టీబీఎం (టన్నెల్ బోరింగ్ మెషీన్) మరమ్మతుల పేరుతో కాంట్రాక్టర్లకు రూ.68.44 కోట్లను ఇచ్చేసి కమీషన్లు వసూలు చేసుకున్నారు. కానీ మరమ్మతులు చేయకపోవడం వల్ల టీబీఎంలు రోజుకు సగటున ఒకటి రెండు మీటర్ల పొడవున కూడా సొరంగాలను తవ్విన దాఖలాలు లేకపోవడం గమనార్హం..! ఇక సొరంగాలను నల్లమలసాగర్‌ను అనుసంధానం చేసే ఫీడర్ కెనాల్‌లో చేసిన పనులూ నాసిరకమే. 2017.. 2018.. 2019.. ఇలా వెలిగొండను పూర్తి చేస్తామంటూ ఎప్పటికప్పుడు చంద్రబాబు ముహూర్తాలు మార్చుకుంటూ వచ్చారు. రెండో సొరంగం పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌ను తొలగించి మిగిలిన పనుల అంచనా వ్యయాన్ని పెంచి అధిక ధరలకు మరో కాంట్రాక్టర్‌కు కట్టబెట్టారు. అనంతరం కమీషన్లు వసూలు చేసుకుని ప్రాజెక్టు పనులను గాలికి వదిలేశారని సాగునీటిరంగ నిపుణులు, రైతులు అప్పట్లో తీవ్ర స్థాయిలో ఆక్షేపించడం గమనార్హం. గతేడాది కురిసిన వర్షాలకు ఫీడర్ కెనాల్ బలహీనంగా ఉన్న చోట్ల కోతకు గురవడంతో ఇప్పుడు దానికి రిటైనింగ్ వాల్, కాంక్రీట్ లైనింగ్ పనులకు రూ.456 కోట్ల వ్యయంతో శంకుస్థాపన చేశారు. ఆ పనులను తనకు అత్యంత సన్నిహితుడైన గన్నమనేని దొరయ్యకు చెందిన జీడీఆర్ ప్రాజెక్ట్స్‌కు కట్టబెట్టారు.

### రూ.992 కోట్లతో పునరావాసం కల్పించి ఉంటే.. 2024 ఆగస్టులోనే నల్లమలసాగర్‌కు కృష్ణా జలాలు

దశాబ్దాల స్వప్నం వెలిగొండ సాకారమైందని.. శ్రీశైలం నుంచి జంట సొరంగాల ద్వారా కృష్ణా జలాలు నల్లమలసాగర్‌కు చేరడంతో తమ కష్టాలు కడతేరుతాయనుకున్న ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, వైఎస్సార్ కడప జిల్లాల ప్రజల ఆశలను చంద్రబాబు ప్రభుత్వం అడియాశలు చేసింది. ఈ ప్రాజెక్టులో అత్యంత సంక్లిష్టమైన జంట సొరంగాలను (ఆసియాలోనే అతి పొడవైనవి) రికార్డు సమయంలో నాటి సీఎం వైఎస్ జగన్ పూర్తి చేసి 2024 మార్చి 6న జాతికి అంకితం చేశారు. నల్లమలసాగర్‌లో ముంపునకు గురయ్యే 11 గ్రామాల్లోని 7,321 నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించడానికి 2024 నాటికే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాలనీలను సిద్ధం చేసింది. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద నిర్వాసితులకు పరిహారం చెల్లించింది. రూ.992 కోట్లు వ్యయం చేసి పునరావాసం కల్పించింది. 2024 సీజన్‌లో శ్రీశైలం ప్రాజెక్టులో నీటిమట్టం 841 అడుగులకు చేరగానే సొరంగాల ద్వారా కృష్ణా జలాలను నల్లమలసాగర్‌కు తరలించి దుర్భిక్ష ప్రాంతాలను సుభిక్షం చేసేలా ప్రణాళిక సిద్ధం చేసింది. కేవలం వైఎస్ జగన్‌కు మంచి పేరొస్తుందనే దుగ్ధతోనే నల్లమలసాగర్ నిర్వాసిత కుటుంబాలకు 21 నెలలుగా పునరావాసం కల్పించకుండా చంద్రబాబు సర్కార్ జాప్యం చేస్తోందని సాగు నీటి నిపుణులు, రైతులు, రైతు సంఘాల నేతలు ఆక్షేపిస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టులోకి 2024–25లో 1,439 టీఎంసీలు, 2025–26లో 1,936.79 టీఎంసీల ప్రవాహం రాగా.. ప్రకాశం బ్యారేజీ మీదుగా సముద్రంలోకి 2024–25లో 848.96 టీఎంసీలు, 2025–26లో 1,652.12 టీఎంసీలు కలిశాయని గుర్తు చేస్తున్నారు. అదే చంద్రబాబు సర్కారు నిర్వాసితులకు పునరావాసం కల్పించి ఉంటే 2024–25తోపాటు 2025–26లోనూ కృష్ణా వరదను ఒడిసి పట్టి నల్లమలసాగర్‌కు తరలించి దుర్భిక్ష ప్రాంతాలను సుభిక్షం చేసే అవకాశం ఉండేదని స్పష్టం చేస్తున్నారు.

### కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ రికార్డు వేగంతో జంట సొరంగాలు పూర్తి

- వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తానని పాదయాత్రలో హామీ ఇచ్చిన వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఐదేళ్ల పాలనలో రెండేళ్లు కరోనా మహమ్మారి ప్రభావం వల్ల పనులు చేయలేని పరిస్థితి. అయినా సరే.. మొదటి సొరంగం పనుల్లో మిగిలిన 2.883 కిలోమీటర్ల పనులను 2019 నవంబర్‌లో ప్రారంభించి కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ 2021 జనవరి 13 నాటికి పూర్తి చేయించారు. 2014–19 మధ్య టీడీపీ సర్కార్ హయాంలో మొదటి సొరంగం రోజుకు సగటున 2.41 మీటర్ల మేర తవ్వితే.. వైఎస్సార్‌సీపీ హయాంలో రోజుకు సగటున 4.12 మీటర్ల మేర తవ్వడం గమనార్హం. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి మొదటి సొరంగం ద్వారా నల్లమలసాగర్‌కు నీటిని విడుదల చేసే హెడ్ రెగ్యులేటర్ పనులను వైఎస్ జగన్ 2021లోనే పూర్తి చేయించారు.
- రెండో సొరంగంలో మిగిలిన పనుల అంచనా వ్యయాన్ని 2019 ఎన్నికలకు ముందు భారీగా పెంచేసిన చంద్రబాబు.. వాటిని అధిక ధరలకు కట్టబెట్టి ప్రజాధనాన్ని దోచి పెట్టారు. వాటిని రద్దు చేసిన వైఎస్ జగన్.. రివర్స్ టెండరింగ్ నిర్వహించి, టీడీపీ సర్కార్ అప్పగించిన ధరల కంటే రూ.61.76 కోట్లు తక్కువకు 7.698 కిలోమీటర్ల సొరంగం పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. తద్వారా చంద్రబాబు అక్రమాలను ప్రజల ముందు పెట్టారు. రెండో సొరంగంలో టీబీఎం (టన్నెల్ బోరింగ్ మెషీన్)కు కాలం చెల్లడంతో రోజుకు ఒక మీటర్ కూడా పని జరగడం కష్టంగా మారింది. దాంతో 2022లో మనుషుల ద్వారా పనులు చేయించాలని అధికారులకు వైఎస్ జగన్ దిశా నిర్దేశం చేసి రికార్డు సమయంలో 7.685 కి.మీల పొడవున సొరంగం తవ్వకం పనులను 2024 జనవరి 21 నాటికి పూర్తి చేయించారు. హెడ్ రెగ్యులేటర్ పనులు కూడా పూర్తి చేశారు. శ్రీశైలానికి వరద వచ్చేలోగా రెండో సొరంగం నుంచి టీబీఎంను బయటకు తీయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. 2014–19 మధ్య చంద్రబాబు సర్కార్ రెండో సొరంగం రోజుకు సగటున 1.31 మీటర్ల మేర తవ్వితే.. వైఎస్ జగన్ హయాంలో రోజుకు 7.25 మీటర్లు (టీబీఎం ద్వారా 1.45, మనుషుల ద్వారా 6.80 మీటర్లు) తవ్వడం గమనార్హం.
- ఇక 2014–19లో టీడీపీ సర్కార్ చేపట్టకుండా నిర్లక్ష్యం చేసిన తీగలేరు కాలువను నల్లమల సాగర్‌కు అనుసంధానం చేసేలా సొరంగం, హెడ్ రెగ్యులేటర్, తూర్పు ప్రధాన కాలువను నల్లమల సాగర్‌కు అనుసంధానం చేసేలా సొరంగం తవ్వకం పనులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించింది. శ్రీశైలంలోకి కృష్ణా వరద జలాలు వచ్చిన వెంటనే.. సొరంగాల ద్వారా నల్లమలసాగర్‌కు తరలించి.. ఆయకట్టుకు నీళ్లందించడానికి లైన్ క్లియర్ చేశారు. 2019–24 మధ్య కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ.. ఆర్థిక ఇబ్బందుల్లోనూ వెలిగొండ ప్రాజెక్టుకు రూ.1,046.46 కోట్లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖర్చు చేసింది. ప్రాజెక్టు పనులకు పెట్టిన ప్రతి పైసా సద్వినియోగమయ్యేలా జాగ్రత్తలు తీసుకుని శరవేగంగా పూర్తి చేయించింది. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయడం ద్వారా ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాల్లో దుర్భిక్ష ప్రాంతాల్లోని 4.47 లక్షల ఎకరాలకు సాగునీటి సరఫరాకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. ఆ మూడు జిల్లాల్లోని 30 మండలాల్లో 15.25 లక్షల మంది తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపింది.



### 'కొండంత' కలను సాకారం చేసిన వైఎస్సార్..

- శ్రీశైలం ప్రాజెక్టుకు వరద వచ్చే 45 రోజుల్లో రోజుకు 85 క్యూమెక్కులు (3,001 క్యూసెక్కులు) చొప్పున తరలించే సామర్థ్యంతో 7 మీటర్ల వ్యాసం, 18.80 కి.మీల పొడవుతో సొరంగం తవ్వి.. వెలిగొండ కొండల్లో నిర్మించే నల్లమల సాగర్‌కు తరలించి.. ప్రకాశం జిల్లాలో దుర్భిక్ష ప్రాంతాలకు సాగు, తాగునీళ్లు అందించాలని 1993–94లో డీపీఆర్ (సమగ్ర ప్రాజెక్టు నివేదిక) రూపొందించారు. కానీ.. 2004 వరకు ఈ ప్రాజెక్టు పనులను ఎవరూ చేపట్టలేదు.
- జలయజ్ఞంలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టుకు రూ.3,581.58 కోట్లు ఖర్చు చేసి.. నల్లమల సాగర్‌తోపాటు సొరంగాల్లో చాలా వరకు పనులు పూర్తి చేయించారు. సొరంగాలను నల్లమలసాగర్‌కు అనుసంధానం చేసేలా 21.8 కి.మీల పొడవున 11,585 క్యూసెక్కులను తరలించేలా ఫీడర్ ఛానల్, తీగలేరు కెనాల్, తూర్పు, పశ్చిమ ప్రధాన కాలువ, గొట్టిపడియ కెనాల్ పనులను చేపట్టారు.
- మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరించాక నదీ జలాలను మళ్లించి తెలుగు నేలను సుభిక్షం చేయడానికి జలయజ్ఞం చేపట్టారు. ఈ క్రమంలో వెలిగొండ ప్రాజెక్టు డీపీఆర్‌ను సమూలంగా మార్చేశారు. కృష్ణా నదికి వరద రోజులు క్రమేణ తగ్గుతున్న నేపథ్యంలో.. శ్రీశైలానికి వరద వచ్చే 45 రోజుల్లోనే రోజుకు 11,584 క్యూసెక్కులు చొప్పున 43.50 టీఎంసీలను తరలించేలా జంట సొరంగాలు (మొదటిది 85 క్యూమెక్కుల సామర్థ్యం, రెండోది 243 క్యూమెక్కుల సామర్థ్యం) తవ్వి.. కొత్తగా 53.85 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే నల్లమలసాగర్‌లో నిల్వ చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. తద్వారా ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాల్లో వర్షాభావ ప్రాంతాల్లో 4,47,300 (తీగలేరు కెనాల్ ద్వారా 62 వేలు, తూర్పు ప్రధాన కాలువ ద్వారా 3,70,800, గొట్టిపడియ కాలువ ద్వారా 9,500 ఎకరాలు) ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించడంతోపాటు.. ఆ మూడు జిల్లాల్లో 30 మండలాల్లోని 15.25 లక్షల మంది దాహార్తిని శాశ్వతంగా తీర్చాలనే లక్ష్యంతో వైఎస్ రాజశేఖరరెడ్డి 2004 అక్టోబర్ 27న పనులకు శ్రీకారం చుట్టారు.

### వెలిగొండ సొరంగాల తవ్వకం పనులు ఇలా..

| పనులు | 2004–14(కి.మీ.లలో) (వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో) | 2014–19(కి.మీ.లలో) (చంద్రబాబు హయాంలో) | 2019–24(కి.మీ.లలో) (వైఎస్ జగన్ హయాంలో) | మొత్తం (కి.మీ.లలో) |
|---|---|---|---|---|
| టన్నెల్-1 | 11.586 | 4.331 | 2.883 | 18.800 |
| టన్నెల్-2 | 8.747 | 2.355 | 7.685 | 18.787 |
| మొత్తం | 20.333 | 6.686 | 10.568 | 37.587 |

### నేడు నెల్లూరుకు వైఎస్ జగన్

**సాక్షి, అమరావతి:** మాజీ సీఎం వైఎస్ జగన్ గురువారం నెల్లూరులో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు ఆయన నెల్లూరుకు చేరుకుని స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి కుమారుడి వివాహ వేడుకకు హాజరవుతారు. మధ్యాహ్నం తిరుగు పయనమవుతారు.

### 'మార్చి 5 నుంచి సహాయ నిరాకరణ'

**సాక్షి, అమరావతి:** తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని.. లేనిపక్షంలోమార్చి 5 నుంచి సహాయ నిరాకరణ చేస్తామని గ్రామ సర్వేయర్ల సంఘం ప్రభుత్వాన్ని హెచ్చరించింది. హామీ ఇచ్చి 22 రోజులైనా పదోన్నతుల ప్రతిపాదనలు తయారుకాలేదని సంఘం నేతలు మధుబాబు, మహేశ్ మండిపడ్డారు.

ఇవాంజాట్

శతమానం భవ! నువ్వయినా మన రాజధానిని చూడాలి

## వెలిగొండపై మాట్లాడే నైతిక హక్కు చంద్రబాబుకు లేదు

**వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్**

**సాక్షి, అమరావతి:** వ్యవసాయం దండగ.. అన్న సీఎం చంద్రబాబునాయుడుకు రాష్ట్రంలో ఏ ప్రాజెక్టుల గురించి మాట్లాడే హక్కులేదని, ముఖ్యంగా వెలుగొండ ప్రాజెక్టు గురించి మాట్లాడే నైతికహక్కు అసలు లేదని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ చెప్పారు. ప్రకాశం జిల్లా పర్యటనలో సీఎం చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టు గురించి దగాకోరు మాటలు మాట్లాడారని మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 1996 నుంచి 2004 వరకు సీఎం చంద్రబాబు వెలిగొండపై పెట్టిన ఖర్చు కేవలం రూ.10 లక్షలేనని చెప్పారు. '4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షలమందికి తాగునీరు లక్ష్యంగా ఈ ప్రాజెక్టుకు దివంగత సీఎం వైఎస్సార్ 2004లో శంకుస్థాపన చేశారు. రెండు సొరంగాల పనులను 50 శాతం పూర్తిచేశారు. 2014లో సీఎం అయిన చంద్రబాబు రెండు సొరంగాలను కేవలం ఆరున్నర కిలోమీటర్లు తవ్వించి రూ.వేలకోట్లు కేటాయించినట్లు ప్రచారం చేసుకున్నారు. 2019లో జగన్ సీఎం కాగానే వెలిగొండ ప్రాజెక్టు పనులు ప్రారంభమై టన్నెళ్లు, రిజర్వాయర్లు పూర్తయ్యాయి. ఇప్పుడు చంద్రబాబు వచ్చాక నామమాత్రపు పనులు చేసి మొత్తం తానే చేశాననటం ఎంతవరకు సమంజసం? అసెంబ్లీ సాక్షిగా రూ.4 వేలకోట్ల పనులు పెండింగ్ అని మోసపు మాటలు మాట్లాడారు' అని చెప్పారు. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం వెచ్చించింది కేవలం రూ.200 కోట్లేనని తెలిపారు. జూలైలో ప్రాజెక్టును ప్రారంభిస్తామంటున్నారంటే.. మిగిలిన పనులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తిచేసినట్లే కదా అని ఆయన పేర్కొన్నారు.

## వెలిగొండపై బాబు పచ్చి అబద్ధాలు

**వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు**

**సాక్షి, అమరావతి:** ప్రకాశం జిల్లా మార్కాపురం పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టుపై పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు మండిపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వెలిగొండ ప్రాజెక్టుకు ప్రాణం పోసిందే వైఎస్సార్ కుటుంబమన్నారు. ప్రాజెక్టు ప్రతి అడుగులోనూ వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్ ముద్ర ఉందని చెప్పారు. 2004 అక్టోబరు 27న వైఎస్సార్ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి, రూ.3,581 కోట్లతో నిర్మాణానికి శ్రీకారం చుట్టారని.. అయితే, 2014–19 మధ్య అధికారంలో ఉన్న చంద్రబాబుకు దీనిని పూర్తిచేసే అవకాశమున్నా పట్టించుకోలేదని విమర్శించారు. తిరిగి వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక మొదటి రెండు సొరంగాలను పూర్తిచేసి జాతికి అంకితం చేశారని గుర్తుచేశారు. మరోవైపు.. చంద్రబాబు ప్రభుత్వం వచ్చి 20 నెలలైనా ఇంతవరకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా ప్రాజెక్టు పూర్తయిందని ప్రకటించడాన్ని తూమాటి తప్పుబట్టారు. నిర్వాసితులకు పరిహారం పూర్తిగా చెల్లించామన్న సీఎం మాటలు పచ్చి అబద్ధమని.. నిజంగా చెల్లిస్తే ప్రాజెక్టును ప్రారంభించకుండా, కేవలం కెనాల్‌ను ఎందుకు ప్రారంభించారని ఆయన ప్రశ్నించారు. ప్రకాశం జిల్లాకు జరిగిన ప్రతీ మేలు వైఎస్ జగన్ హయాంలోనే జరిగిందని తేల్చిచెప్పారు. రామాయపట్నం పోర్టు, ఇండోసోల్ కంపెనీ, వెలిగొండ ప్రాజెక్టు పూర్తికావడం వంటివి వైఎస్ జగన్ చొరవ వల్లే సాధ్యమయ్యాయన్నారు. ఇక మండలికి సంబంధించి ఫేక్ వీడియోలు ప్రసారం చేసిన ఈనాడు, ఆంధ్రజ్యోతిపై ఏ చర్యలు తీసుకున్నారని తూమాటి మాధవరావు ప్రశ్నించారు.

## జూలైకి వెలిగొండ నీళ్లిస్తాం

- నేనే మొదలుపెట్టి పూర్తి చేస్తున్నా: సీఎం చంద్రబాబు
- గంటవానిపల్లెలో ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు శంకుస్థాపన

వెలిగొండ ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం చంద్రబాబు

**మార్కాపురం, పెద్దదోర్నాల:** ఈ ఏడాది జూలై నాటికి వెలిగొండ ద్వారా నీళ్లిస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. 1996 మార్చి 5న తాను వెలిగొండకు శంకుస్థాపన చేశానని, మళ్లీ తానే పూర్తి చేసి నీళ్లిస్తానన్నారు. ఇప్పటి వరకు వెలిగొండ ప్రాజెక్టు కోసం రూ.5,455 కోట్లు ఖర్చు చేశామని, ఇంకా రూ.2,540 కోట్లు అవసరమన్నారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి రూ.930 కోట్లు, లైనింగ్ పనులకు రూ.430 కోట్లు, హెడ్‌రెగ్యులేటరీ పనులకు రూ.70 కోట్లు, టన్నెల్ 1, టన్నెల్ 2 తదితరాలకు ఖర్చు చేయాల్సి ఉందన్నారు. ఎన్ని కష్టాలొచ్చినా పేదల కోసం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నానని చెప్పారు. బుధవారం మార్కాపురం జిల్లా తర్లుపాడు రోడ్డులో నిర్వహించిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడారు. తాను ఎంత అభివృద్ధి చేసినా యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గాల్లో టీడీపీ ఓటమి చెందడం బాధగా ఉందన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకొని మార్కాపురం జిల్లా చేశానని, కార్యాలయాల ఏర్పాటుకు రూ.50 కోట్లు కేటాయిస్తున్నానని చెప్పారు. యర్రగొండపాలెం నియోజకవర్గం గంటవానిపల్లెలో వెలిగొండ ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఫీడర్ కెనాల్ పనులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. సొరంగం నిర్మాణ పనులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిశీలించారు.

## వైద్యులు మానవతా విలువలతో సేవలందించాలి

**గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్**

పట్టా అందజేస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, డాక్టర్ చంద్రశేఖర్, కాటూరి సుబ్బారావు

**గుంటూరు మెడికల్:** వైద్యులు మానవతా విలువలతో రోగులకు సేవలందించాలని ఏపీ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ చెప్పారు. బుధవారం గుంటూరు జిల్లా చినకొండ్రుపాడులోని కాటూరి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో 22వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ.. వైద్య వృత్తిలో నైతికత, కరుణ, సహానుభూతి మూడు స్తంభాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో వైద్యం వేగంగా మారుతోందని, సాంకేతికతను సహాయకుడిగా ఉపయోగించాలని, వైద్యానికి మానవీయత, నైతికత తప్పనిసరి అని పేర్కొన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రోగులకు సేవలందించేందుకు ముందుకు రావాలని కోరారు. మెడికల్ కాలేజీ చైర్మన్ కాటూరి సుబ్బారావు మాట్లాడుతూ.. మానవత్వంతో రోగులకు సేవలందించాలని, వైద్య వృత్తిలో క్రమశిక్షణ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ చైతన్య, డాక్టర్ హేమసుందర్ మాట్లాడారు. అనంతరం ఎంబీబీఎస్ డిగ్రీ పట్టాలను గవర్నర్ అబ్దుల్ నజీర్, డాక్టర్ చంద్రశేఖర్ విద్యార్థులకు అందజేశారు. మెడికల్ కాలేజీ ఎండీ డాక్టర్ స్వైరారావు, డీన్ డాక్టర్ చల్లా మోహన్ రావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఫణీంద్ర, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అజయ్ పాల్గొన్నారు.

### రాత్రికి రాత్రే గేటు గుర్తులు మాయం

**వైఎస్సార్‌సీపీ ట్వీట్**

**సాక్షి, అమరావతి:** కల్తీ నెయ్యి పేరుతో తిరుమల లడ్డూ వ్యవహారంలో జరిగిన తెరవెనుక బాగోతాలను వైఎస్సార్‌సీపీ నిత్యం బయటపెడుతోంది. దీనిపై చర్చకు వైఎస్సార్‌సీపీ పట్టుబడితే కూటమి ప్రభుత్వం ఇన్నాళ్లూ భయంతో పారిపోతూ వచ్చింది. అయినా.. తిరుమల లడ్డూ వ్యవహారం, ఇందాపూర్–హెరిటేజ్ డెయిరీల అనుబంధం గురించి మండలిలో చర్చించాలని వైఎస్సార్‌సీపీ పట్టుబడుతూనే ఉంది. కానీ, సీఎం చంద్రబాబు ఈ అంశంపై అసెంబ్లీ సాక్షిగా పచ్చి అబద్ధాలు చెప్పారు. మండలిలో చర్చకు వైఎస్సార్‌సీపీ పట్టుబడుతుండడంతో వాయిదా తీర్మానాలను ఐదు రోజులుగా తిరస్కరిస్తూనే ఉన్నారు. అయితే, మండలి చైర్మన్ వద్ద చర్చకు అంగీకరించి సభలో మాత్రం చర్చించకుండా పారిపోతున్నారు. ఈలోపు ఆధారాలను చెరిపేసే పనిలో సీఎం చంద్రబాబు పడ్డారంటూ వైఎస్సార్‌సీపీ తన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో బుధవారం పోస్టు చేసింది. పోస్టులో ఏముందంటే.. 'పునబాక గ్రామంలోని శ్రీ వైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్ ప్రైవేట్ లిమిటెడ్ చుట్టూ ప్రస్తుతం అనేక అనుమానాలు తలెత్తున్నాయి. కల్తీనెయ్యి వ్యవహారంలో ఈ కంపెనీ పేరు బయటకురావడం.. అలాగే, దీనికి సంగం డెయిరీతో సంబంధాలున్నట్లు నివేదికలు అందడం తీవ్ర చర్చకు దారితీసింది. ఈ వ్యవహారంలో మరింత అనుమానం కలిగించే అంశం ఏంటంటే.. ఈ సంబంధాల గురించి వార్తలు బయటకొచ్చిన వెంటనే కంపెనీ యాజమాన్యం స్పందించిన తీరు. అప్పటివరకు కంపెనీ వివరాలతో స్పష్టంగా ఉన్న గేటుకు రాత్రికి రాత్రే రంగులు వేసి ఆ గుర్తులను చెరిపేయడం గమనార్హం. ఇలా హడావుడిగా చేస్తున్న మార్పులు పారదర్శకతను పెంచకపోగా, మరిన్ని సందేహాలకు తావిస్తున్నాయి'.. అంటూ వైఎస్సార్‌సీపీ ఆ ట్వీట్‌లో పేర్కొంది.

● టెక్నోభారత్

## స్వదేశీ విశ్వరూపం

# సర్వం విజయం

**దిల్లీ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 సాక్షిగా 'సర్వం ఏఐ' సగర్వంగా చెప్పకనే చెప్పింది. 'వరల్డ్-క్లాస్ హార్డ్ టెక్నాలజీ ఇండియాలో కూడా సాధ్యమే' అని! ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ 'సర్వం' విజయం ఆ కంపెనీ వ్యవస్థాపకుల సమర్థతకు మాత్రమే పరిమితమైన విజయం కాదు. 'మన దేశం-మన కంపెనీ' అని కలలు కనే ఔత్సాహిక ఎంటర్‌ప్రెన్యూర్‌ల విజయం. 'మేధోవలస'కు చేయి అడ్డు పెట్టి...'ఎక్కడో ఎందుకు? మన దేశంలోనే అద్భుతాలు సృష్టించవచ్చు' అని ధైర్యాన్ని ఇచ్చే విజయం....**

'పీహెచ్‌డీలు ముఖ్యం కాదు. కంపెనీకి సరిగ్గా అవసరమైన వారే ముఖ్యం' అంటూ ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా స్వదేశంలో ప్రయాణం మొదలుపెట్టిన వివేక్ రాఘవన్, ప్రత్యూష్ కుమార్‌లు 'సర్వం ఏఐ'తో సత్తా చాటారు. లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎం) నుంచి నిన్నా మొన్నటి 'సర్వం కేజ్' స్మార్ట్‌గ్లాసెస్ వరకు, ఏ.ఐ మోడల్స్ శిక్షణకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో గ్రామీణ మహిళల ప్రతిభను వెలుగులోకి తీసుకురావడం వరకు... సర్వం సాంకేతికమయం!

### సర్వం సక్సెస్ మంత్రా

ఒక స్టార్టప్ సక్సెస్ కావడానికి, సూపర్ సక్సెస్ కావడానికి ఏం ఉండాలి? 'సర్వం ఏఐ' ఫౌండర్‌లలో ఒకరైన వివేక్ రాఘవన్ మాటల్లో చెప్పాలంటే 'ఏదైనా చేయగలననే నమ్మకం ఉండాలి'

ఇండియా నుంచి వరల్డ్ క్లాస్ మోడల్స్‌ను నిర్మించాలనే లక్ష్యంతో బయలుదేరింది సర్వం. 'మా విజయం ఎలా ఉండాలంటే ఇతర డెవలపర్‌లు, స్టార్టప్‌లు కూడా యస్...మేము కూడా ప్రపంచంతో పోటీ పడుతూ వరల్డ్-క్లాస్ మోడల్స్‌ను నిర్మించగలం అనే నమ్మకాన్ని పాదుకొల్పేంతగా' అన్నారు వివేక్. 'వీరి ఆత్మవిశ్వాసం ఆకాశమంత ఎత్తులో కనిపిస్తుంది. సాధించగలరా?' అని కొందరికి సందేహం వచ్చింది.

పగటి కలలకే పరిమితమై ఉంటే వారి కలలు కలలుగానే ఉండేవి. అయితే వారు రాత్రనకా, పగలనకా కష్టపడ్డారు.

### ఇది యువత విజయం

తొలి అడుగులు వేస్తున్నప్పుడు 'సర్వం' టీమ్‌లో ఉన్నది సాంకేతిక ఉద్దండులు కాదు. నవ యువకులు!

'వీరితో విజయం సాధ్యమా?' అని కూడా కొందరికి సందేహం వచ్చింది. 'కచ్చితంగా సాధ్యమే' అని నిరూపించింది సర్వం. అందుకే...''మా సంస్థ విజయాన్ని భారతదేశ యువత విజయంగా కూడా నేను భావిస్తున్నాను' అంటారు వివేక్. ఎంటర్‌ప్రెన్యూర్‌గా సిలికాన్ వ్యాలీలో గెలుపు జెండా ఎగరేసిన తరువాత స్వదేశీ బాట పట్టారు. రచ్చ గెలిచి ఇంట గెలవడానికి బయలుదేరారు.

### పీహెచ్‌డీ... పెద్ద విషయం కాదు!

'మీ ఇద్దరికీ పీహెచ్‌డీ ఉంది. సిలికాన్ వ్యాలీలో ఉన్నట్లు పీహెచ్‌డీ చేసిన డీప్-టెక్ వ్యవస్థాపకులు మన దేశంలో పెద్దగా కనిపించరు' అనే ప్రశ్నకు 'నిజమే!' అని కాలర్ ఎగరేయలేదు వివేక్. 'పీహెచ్‌డీ అనేది పెద్ద విషయం కాదు. సంస్థకు పనికొచ్చే సామర్థ్యమే ముఖ్యం. పీహెచ్‌డీ వరకు ఎందుకు? హైస్కూల్ స్థాయిలో కూడా అద్భుత ప్రతిభ చూపుతున్న విద్యార్థులను మనం చూస్తూనే ఉన్నాం. నాకు పీహెచ్‌డీ ఉన్నప్పటికీ దానిలో ప్రత్యేకంగా ఏమీ లేదని నేను అనుకుంటున్నాను. పీహెచ్‌డీలు చేసినవారు ఎంతోమంది ఉన్నారు. కంపెనీకి అవసరమైన సరియైన వ్యక్తిని ఎంచుకోవడమే ముఖ్యం' అంటారు వివేక్.

వివేక్ రాఘవన్, ప్రత్యూష్ కుమార్‌లు వ్యవస్థాపనలో బెంగళూరు కేంద్రంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ 'సర్వం' 2023లో ప్రారంభమైంది. భారతీయ భాషలలో లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎం)ను అభివృద్ధి చేసింది. స్పీచ్-టు-టెక్స్ట్, విజన్-లాంగ్వేజ్ మోడల్స్‌లాంటి మల్టీ మోడల్స్‌ను, సిస్టమ్స్‌ను కూడా కంపెనీ డెవలప్ చేసింది. 'సర్వం విజన్' పేరుతో విజన్-లాంగ్వేజ్ మోడల్‌ని పరిచయం చేసింది.

గత సంవత్సరం సర్వం ఏఐ 'ఇండియా ఏఐ మిషన్'కు ఎంపికైంది. డొమెస్టిక్ ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మోడల్ డెవలప్‌మెంట్‌కు ఈ మిషన్ సపోర్ట్ చేస్తుంది. 'ఏఐ ఫర్ భారత్'తో పాటు లాంగ్వేజ్ డాటాబేస్, స్పీచ్ రిసెర్చ్‌కు సంబంధించి విద్యాసంస్థలతో కలిసి పనిచేసింది సర్వం. ●

### ఇద్దరూ ఇద్దరే

వివేక్ రాఘవన్ ఐఐటీ-దిల్లీ నుండి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ, కార్నెగీ మెలన్ యూనివర్శిటీలో పీహెచ్‌డీ చేశారు. ఐఐటీ-బాంబే ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ అయిన ప్రత్యూష్ కుమార్‌కు కంప్యూటర్ సైన్స్ పరిశోధనకు సంబంధించి పదిహేను సంవత్సరాల అనుభవం ఉంది. జ్యూరిచ్ యూనివర్శిటీలో పీహెచ్‌డీ చేశారు. ఇద్దరు ప్రతిభావంతులు ఒక దగ్గర చేరితే అద్భుతాలు జరుగుతాయనేది నిజమే అయినా, ఆ ప్రతిభావంతులు తమలాంటి వారి కోసం అన్వేషించి, తమ జట్టులో చేర్చుకోవడమే అసలుసిసలు అద్భుతం.

### ఇండస్

స్వదేశీ స్టార్టప్ సర్వం ఏఐ 'ఇండస్' అనే కొత్త ఏఐ చాట్‌బాట్ యాప్‌ను తీసుకువచ్చింది. 'భారతీయ వినియోగదారుల కోసం భారత్‌లో రూపొందించిన యాప్ ఇది' అని ప్రకటించింది కంపెనీ. చాట్‌జీపీటీ, జెమినివంటి ప్రసిద్ధ చాట్‌బాట్‌ల మాదిరిగానే 'ఇండస్'లో ఫీచర్‌లు ఉన్నాయి. యూజర్‌లు వాయిస్ కమాండ్‌లు ఇవ్వవచ్చు. ప్రశ్నలను టైప్ చేయడానికి బదులుగా మాట్లాడవచ్చు. ఏఐ వెబ్‌లో శోధించవచ్చు. స్పష్టమైన సమాధానాలను తెలుసుకోవచ్చు. లోతైన పరిశోధన చేయవచ్చు. నేరుగా యాప్‌లోనే డాక్యుమెంట్లు రాయవచ్చు. ఇమేజ్‌లు, పీడీఎఫ్‌లు, ఫైళ్లను అప్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్‌లోని మరో ప్రత్యేకత భాషా సౌలభ్యం.

### నెట్ అవసరం లేదండీ!

'ఎడ్జ్' అనే కొత్త ఆన్-డివైజ్ ఏఐ మోడల్‌ను ఆవిష్కరించింది సర్వం ఏఐ. ఇంటర్నెట్ కనెక్షన్ అవసరం లేకుండా నేరుగా స్మార్ట్‌ఫోన్, లాప్‌టాప్‌లలో పనిచేసేలా దీన్ని రూపొందించారు. స్పీచ్ రికగ్నిషన్, ట్రాన్స్‌లేషన్, టెక్స్ట్-టు-స్పీచ్ లాంటి పనులెన్నో చేస్తుంది. డివైజ్‌లోనే డాటా ప్రాసెస్ చేయబడినందున యూజర్‌లు సమాచారాన్ని క్లౌడ్‌కు పంపాల్సిన అవసరం లేదు. 'ఈ మోడల్ వేగం, గోప్యత, విశ్వసనీయతపై దృష్టి సారిస్తుందని, అదే సమయంలో ప్రధాన భారతీయ భాషలకు మద్దతు ఇస్తుంది' అని కంపెనీ ప్రకటించింది.

### రిస్క్ తీసుకోకపోవడమే పెద్ద రిస్క్!

సిలికాన్ వ్యాలీ తన ఆలోచన తీరును మార్చింది అంటారు వివేక్ రాఘవన్. 'మనల్ని మనం నిరూపించుకోవాలనుకుంటే కచ్చితంగా రిస్క్ తీసుకోవాలి' అనేది సిలికాన్ వ్యాలీ చెప్పిన పాఠం. 'ఇతరత్రా రిస్క్‌లతో పోల్చితే టెక్నాలజీ రిస్క్ అనేది భిన్నమైది' అనే విషయం తెలిసినా 'సై' అంటూ స్వదేశీ బాట పట్టారు వివేక్ రాఘవన్.

● మన(సు)లో మాట

## బలమైన మానసిక బంధమే వివాహ బంధానికి పునాది!

డాక్టర్ గారూ, నా కూతురికి ప్రస్తుతం 34 సంవత్సరాలు. కాలేజీలో చదువుతున్నప్పుడు ఒక అబ్బాయిని ప్రేమించింది. అతను సామాజికంగా, ఆర్థికంగా మా స్థాయిలో లేనందువల్ల మేము ఆ పెళ్లికి ఒప్పుకోలేదు. ఆ తర్వాత మా అమ్మాయి చాలా సంబంధాలను తిరస్కరించింది. చివరికి మేము తీవ్రంగా ఒత్తిడి చేసి, ''ఇలా అయితే మేము బతకం'' అని చెప్పిన తర్వాత గత సంవత్సరం మేము కుదిర్చిన వ్యక్తిని పెళ్లి చేసుకుంది. కానీ పెళ్లి అయిన తర్వాత ఆమె తన భర్తతో దాంపత్యంలో దూరంగా ఉంది. తన పాత ప్రేమ విషయం కూడా భర్తకు చెప్పింది. భర్త మంచి మనసుతో ''గతాన్ని మర్చిపోయి కొత్త జీవితం మొదలుపెడదాం'' అని చెప్పినా, మా అమ్మాయి అలా చేయడానికి సిద్ధంగా లేదు. ఇప్పటికే ఆమె తన పాత ప్రేమికుడితో మళ్లీ మాట్లాడటం ప్రారంభించింది. అతను ఇప్పుడు మంచి ఉద్యోగంలో ఉన్నాడని, తన దగ్గరకు రావాలని ఆమెను కోరుతున్నాడని చెప్పింది. అయితే ఆ అబ్బాయి తల్లిదండ్రులు ఈ పెళ్లిని ఒప్పుకోవడం లేదు. మా అమ్మాయి మాత్రం ఖచ్చితంగా అతనినే చేసుకుంటానని అంటోంది. ఒకవైపు మా అమ్మాయి మొండితనం, మరోవైపు మా అల్లుడి మంచితనం, ఇంకోవైపు పాత ప్రేమికుడి ఒత్తిడి – ఈ పరిస్థితిలో మాకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. మేమంతా తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉన్నాం. ఇలాంటి పరిస్థితుల్లో మేము ఎలా ముందుకు వెళ్లాలి? సరైన మార్గం చెబుతారని ఆశతో......

– ఒక సోదరి, హైదరాబాద్

మీ ప్రశ్న చదివాక నిజంగా చాలా బాధగా అనిపించింది. ఇక్కడ నాకు ఒక విషయం స్పష్టంగా అర్థమైంది – ఈ పెళ్లి మీ అమ్మాయి ఇష్టానికి విరుద్ధంగా, బలవంతంగా జరిగింది. అలాంటి పరిస్థితిలో ఆమెకు తన భర్తతో భావోద్వేగ అనుబంధం ఏర్పడటం చాలా కష్టం. ఆమె గతాన్ని పూర్తిగా వదలలేకపోతోంది. ఆమె మనసు ఇంకా అక్కడే ఆగిపోయింది. మానసికంగా బలమైన బంధం లేని చోట శారీరక బంధాన్ని ఆశించడం సరి కాదు. మీ మీద ప్రేమతో, మీరు చనిపోతారన్న భయంతో ఆమె మనసు నొప్పించి తీసుకున్న నిర్ణయం, ఈ రోజు మూడు కుటుంబాలకు ఇబ్బందిని కలిగిస్తోంది. ఇటీవలి కాలంలో ఇలాంటి సంఘటనలు కొంచెం ఎక్కువగా కనిపిస్తున్నాయి. అందుకే తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో కూడా కొంత మార్పు అవసరం. పిల్లలు తమ అభిప్రాయాన్ని చెప్పినప్పుడు వెంటనే తిరస్కరించకుండా, ఆ విషయాన్ని కుటుంబ పెద్దలందరూ కలిసి కూర్చొని ప్రశాంతంగా చర్చించడం మంచిది. అవసరమైతే ఫ్యామిలీ కౌన్సెలింగ్ ద్వారా సమస్యకు పరిష్కారం వెతకాలి. బెదిరింపులతో లేదా భావోద్వేగ ఒత్తిడితో సంసారాలు నిలబడటం కష్టం. ఈ సమస్యను ఒకే కోణంలో చూడలేం. ఇందులో సామాజిక, నైతిక, చట్టపరమైన అంశాలు కూడా ఉన్నాయి. కాబట్టి తొందరపడి నిర్ణయం తీసుకోవడం కంటే, సరైన మార్గదర్శకత్వం తీసుకోవడం మంచిది. ఒకసారి మీ అమ్మాయిని, ఆమె భర్తను కలిపి తీసుకువస్తే, వారితో విడివిడిగా మాట్లాడి సమస్య మూలాలను, తీవ్రతనూ అర్థం చేసుకోవచ్చు. అవసరమైతే ఆమె గతంలో ప్రేమించిన వ్యక్తితో కూడా మాట్లాడి స్పష్టత తీసుకురావచ్చు. ఈ ప్రక్రియకు కొంత సమయం పడుతుంది. ముఖ్యంగా, మీరు మీ అమ్మాయిని ఇకపై ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేయడం ఆపాలి. ''మేము చనిపోతాం'' అనే మాటలు సమస్యను పరిష్కరించవు. మీరు ఏదైనా తీవ్ర నిర్ణయం తీసుకుంటే పరిస్థితి మరింత క్లిష్టతరం అవుతుంది. మీరు ప్రాణం తీసుకోవటం సమస్యకు పరిష్కారం కాదు. నిపుణులైన వారితో ఫ్యామిలీ కౌన్సెలింగ్ తీసుకోవడం ఈ దశలో అత్యంత అవసరం. ఓపికతో, స్పష్టతతో ముందుకు వెళ్లాలి. ఒక విషయం గుర్తుంచుకోండి – కష్టాలు శాశ్వతం కావు. కష్టం తర్వాత సుఖం, చీకటి తర్వాత వెలుగు ఖచ్చితంగా వస్తాయి. కాస్త ఓపిక పట్టండి. మీ సమస్యకు ఒక మంచి పరిష్కారం తప్పకుండా దొరుకుతుంది. ఆల్ ది బెస్ట్!

**డా. ఇండ్ల విశాల్ రెడ్డి,**
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన
మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

# సినిమా

## జీవితాంతం కలిసుండాలి

### - విజయ్-రష్మికలకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు

● విజయ్ దేవరకొండ, రష్మికా మందన్నా

హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మికా మందన్నా నేడు వివాహం చేసుకోనున్న విషయం తెలిసిందే. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ ప్యాలెస్ వేదికగా జరగనున్న ఈ వివాహానికి ఇరు కుటుంబ సభ్యులతో పాటు ముఖ్యమైన సన్నిహితులు, స్నేహితులు హాజరు కానున్నారు. కాగా... విజయ్-రష్మికల వివాహానికి ఆహ్వానిస్తూ, పెళ్లి పత్రికను అతని తల్లిదండ్రులు భారత ప్రధాని నరేంద్ర మోదీకి పంపించారు. ఈ ఆహ్వాన పత్రికకు స్పందించిన మోదీ... వారికి శుభాకాంక్షలు తెలుపుతూ లేఖ పంపారు. ''విజయ్-రష్మికల జీవితంలో ఇదో అందమైన కొత్త అధ్యాయానికి నాంది. 'సప్తపది' అనే పవిత్రమైన సంప్రదాయ స్ఫూర్తితో ఏడడుగులు వేస్తోన్న ఈ జంట జీవితాంతం స్నేహితులుగా, తోడుగా కలిసుండాలని ఆకాంక్షిస్తున్నాను'' అంటూ మోదీ తన సందేశంలో దీవించారు. ప్రధాని కార్యాలయం నుంచి విడుదలైన ఈ లేఖ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 2025 అక్టోబరులో నిశ్చితార్థం చేసుకున్న విజయ్-రష్మిక నేడు ఏడడుగులు వేస్తున్నారు. మార్చి 4వ తేదీన హైదరాబాద్‌లో రిసెప్షన్‌ని ఏర్పాటు చేశారు. కాగా... 'గీత గోవిందం, డియర్ కామ్రేడ్' వంటి సినిమాల్లో నటించిన విజయ్ దేవరకొండ-రష్మికా మందన్నా ప్రస్తుతం 'రణబాలి' అనే చిత్రంలో మూడోసారి కలిసి నటిస్తున్నారు.

## భారతీయ సినిమా ప్రయాణంలో ఇది కీలక ఘట్టం

### - నాగార్జున

''ప్రపంచ స్థాయి కథలను చెప్పాలనుకునే భారతీయ దర్శకుల కలలకు అత్యాధునిక సాంకేతిక వసతులు కొరతగా ఉండేవి. ఇప్పుడు హైదరాబాద్‌లోనే ఆ సదుపాయం అందుబాటులోకి రావడం వల్ల ఎపిక్ అడ్వెంచర్ నుంచి సైన్స్ ఫిక్షన్ డ్రామాల వరకు ఎన్నో కథలను సులభంగా తెరకెక్కించవచ్చు. భారతీయ సినిమా ప్రయాణంలో ఇది ఒక కీలక ఘట్టం'' అని నాగార్జున అన్నారు. 'అవతార్, అవెంజర్స్' వంటి హాలీవుడ్ సినిమాల మేకింగ్‌లో మోషన్ క్యాప్చర్ టెక్నాలజీని ఉపయోగించారు ఆ చిత్రాల ఫిల్మ్ మేకర్స్. ఈ టెక్నాలజీ హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో అందుబాటులోకి వచ్చింది. అక్కినేని నాగార్జున అన్నపూర్ణ స్టూడియోస్, శోభు యార్లగడ్డ మిహిరా విజువల్ ల్యాబ్స్ కలిసి 'ఎ అండ్ ఎమ్ మోక్యాప్ ల్యాబ్'ను స్టార్ట్ చేశారు. 'అవెంజర్స్ ఎండ్‌గేమ్, స్పైడర్ మేన్: నో వే హోమ్' వంటి చిత్రాలకు వర్క్ చేసిన యానిమాట్రిక్ ఫిల్మ్ డిజైన్ కంపెనీ భాగస్వామ్యమైంది.

మోషన్ క్యాప్చర్ ల్యాబ్‌ను లాంచ్ చేసిన అనంతరం రాజమౌళి మాట్లాడుతూ– ''ఎ అండ్ ఎమ్' సంస్థ అద్భుతమైన టెక్నాలజీని అందిస్తుంది. 'వారణాసి' సినిమా చిత్రీకరణలో ఈ టెక్నాలజీని వినియోగించి, కొన్ని సన్నివేశాలను చిత్రీకరించాం... అద్భుతంగా వచ్చాయి. అంతర్జాతీయ సినీ నిర్మాణ సంస్థలకు భారత్ నుంచి అత్యుత్తమ సాంకేతిక నిపుణులు వర్క్ చేయడానికి వెళ్తున్నారు. అయితే ఆ ఆధునాతన సౌకర్యాలు మాత్రం మనకు అందుబాటులో ఉండటం లేదు. 'ఈగ, 'బాహుబలి, ఆర్ఆర్ఆర్' సినిమాల చిత్రీకరణ అప్పుడు ఇండియాలో మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ అందుబాటులో ఉండి ఉంటే... ఈ సినిమాలను ఇంకా బాగా ఎలా చేయవచ్చు? అని ఆలోచించేవాడిని. ఇప్పుడు అందుబాటులోకి వచ్చింది కాబట్టి ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ వారి ఆలోచనా ధోరణిని అత్యుత్తమ స్థాయికి తీసుకెళ్లవచ్చు'' అని చెప్పారు. ''మిహిరా ల్యాబ్స్ లక్ష్యం ఎప్పుడూ ఇండియన్ ఫిల్మ్ మేకర్లకు అంతర్జాతీయ ప్రమాణాల టూల్స్ అందించడమే'' అన్నారు శోభు యార్లగడ్డ. ''ఈ టెక్నాలజీ సదుపాయంతో వర్చ్యువల్ ఎన్విరాన్‌మెంట్‌లో కెమెరా బ్లాకింగ్, లెన్స్ ఎంపిక, కెమెరా మూమ్‌మెంట్స్, ఫ్రేమ్ రేట్స్ వంటి అంశాలను ముందుగానే పరీక్షించవచ్చు. దీనివల్ల టెక్నికల్, లాజిస్టి కల్ అవసరాలను ముందే అంచనా వేసి, లైవ్ షూట్‌లో సమయం, ఖర్చును తగ్గించుకోవచ్చు'' అన్నారు అన్నపూర్ణ స్టూడియోస్ సీటీవో సీవీ రావు. ''భారతీయ కథలు ఇప్పుడు ప్రపంచ స్థాయి సాంకేతికతతో మరింత గొప్పగా రూపుదిద్దుకోనున్నాయి'' అని చెప్పారు యానిమాట్రిక్ ఫిల్మ్ డిజైన్ అధ్యక్షుడు అండ్ సీటీఓ బ్రెట్ ఇన్‌సన్. భారతీయ సినిమా రంగంలో 50 సంవత్సరాల లెగసీని పూర్తి చేసిన సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్ ఈ మోషన్ క్యాప్చర్ ల్యాబ్‌ని ప్రారంభించింది.

## గ్లింప్స్‌కి వేళాయె

● నాగచైతన్య

'తండేల్' వంటి బ్లాక్‌బస్టర్ సినిమా తర్వాత నాగచైతన్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'వృషకర్మ'. 'విరూపాక్ష' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్న కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారు. బాపినీడు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ బి. నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ని మార్చి 5న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, నాగచైతన్య పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ''వృషకర్మ'లో తన పాత్ర కోసం నాగ చైతన్య మ్యాసీవ్‌గా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు. రా, రగ్డ్ లుక్ కోసం ప్రత్యేకంగా శిక్షణ తీసుకుని, థ్రిల్లింగ్ స్టంట్స్‌ను స్వయంగా చేస్తున్నారు. 'వృషకర్మ'ను మరింత అద్భుతంగా తీర్చిదిద్దడంపై కార్తీక్ దండు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. 'లాపతా లేడీస్' మూవీ ఫేమ్ స్పర్శ్ శ్రీవాస్తవ విలన్‌గా నటిస్తున్న ఈ సినిమాకి సంగీతం: అజనీష్ బి. లోక్‌నాథ్, కెమెరా: రాగుల్ డి. హెరియన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: నరసింహాచారి చెన్నోజు.

## ఆగస్టులో భోగి

● శర్వానంద్

ఆగస్టులో 'భోగి' సినిమా థియేటర్స్‌లోకి రానుంది. శర్వానంద్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ మూవీ 'భోగి'. ఈ చిత్రంలో అనుపమా పరమేశ్వరన్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. లక్ష్మీ రాధామోహన్ సమర్పణలో కేకే రాధామోహన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 1960 కాలంలో మహారాష్ట్ర – తెలంగాణ సరిహద్దు ప్రాంతం నేపథ్యంలో సాగే సినిమా ఇది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రత్యేకమైన సెట్‌లో స్టంట్ కొరియోగ్రాఫర్ దిలీప్ సుబ్బరాయన్ నేతృత్వంలో రెండు భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. కాగా, బుధవారం 'భోగి' సినిమా నుంచి శర్వానంద్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేసి, ఈ సినిమాను ఆగస్టు 28న రిలీజ్ చేయనున్నట్లుగా అధికారికంగా ప్రకటించారు. ''ఈ సినిమా కోసం శర్వానంద్ సరికొత్తగా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఏకకాలంలో ఈ సినిమాను విడుదల చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

## వంద శాతం నవ్వుకుంటారు

### - శ్రీ విష్ణు

● సుమంత్, యదునాథ్, శ్రీ విష్ణు, నయన్ సారిక, సుబ్రహ్మణ్యం

''విష్ణు విన్యాసం' సినిమా ఫస్టాఫ్ యూత్‌కి బాగా కనెక్ట్ అవుతుంది. సెకండ్ హాఫ్‌కి ఫ్యామిలీ డ్రామాగా మారుతుంది. సినిమా పూర్తయ్యేలోపు ఒక మంచి సినిమా చూసిన అనుభూతి కలుగుతుంది. హ్యాపీగా ఫ్యామిలీతో కలిసి నవ్వుకోడానికి రండి... వంద శాతం నవ్వుకుంటారు. ఆ బాధ్యత నాది'' అని హీరో శ్రీ విష్ణు తెలిపారు. యదునాథ్ మారుతీ రావు దర్శకత్వంలో శ్రీ విష్ణు, నయన్ సారిక జంటగా నటించిన చిత్రం 'విష్ణు విన్యాసం'. హేమ, షాలిని సమర్పణలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ పై సుమంత్ నాయుడు .జి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌కి అతిథిగా హాజరైన నిర్మాత కేకే రాధామోహన్ మాట్లాడుతూ– ''శ్రీ విష్ణు సినిమా చూస్తే మన కష్టాలు, బాధలను రెండు గంటలపాటు మర్చిపోతాం. అందుకే ఆయన కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్మెంట్. 'విష్ణు విన్యాసం' తప్పకుండా అందరికీ నచ్చుతుంది'' అని తెలిపారు. ''ఈ సినిమాలో మనీషా పాత్ర చేయడం నా లక్'' అన్నారు నయన్ సారిక. ''మా మూవీ చూస్తున్నంత సేపు నవ్వుతూనే ఉంటారు'' అని మారుతి రావు పేర్కొన్నారు. ''యూత్, ఫ్యామిలీ అందరికీ మా మూవీ కనెక్ట్ అవుతుంది'' అని సుబ్రహ్మణ్యం చెప్పారు. ''అందరూ మా సినిమా చూసి, సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను'' అని సుమంత్ నాయుడు .జి పేర్కొన్నారు. ఇంకా మ్యూజిక్ డైరెక్టర్ రధన్, నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడారు.

## జాగ్రత్త పడకపోతే ఏమీ మిగలదు!

● తమన్నా

'దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి' అనే మాట చిత్ర పరిశ్రమలో బాగా వినిపిస్తుంటుంది. ప్రత్యేకించి హీరోయిన్ల విషయంలో ఈ మాటని ఇంకాస్త ఎక్కువగా వాడుతుంటారు. హీరోయిన్ తమన్నా కూడా ఇదే విషయాన్ని ఫాలో అవుతున్నారు. ''నటీనటులకు దూరదృష్టి అవసరం. లేదంటే మనకంటూ చివరకు ఏమీ మిగలదు?'' అని చెబుతున్నారామె. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తమన్నా ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ గురించి మాట్లాడుతూ– ''నేను ఇండస్ట్రీకి వచ్చిన తొలి రోజుల్లో నా ఆర్థిక వ్యవహారాలన్నీ మా నాన్నగారే చూసుకునేవారు. రియల్ ఎస్టేట్, జ్యువెలరీ బిజినెస్ వంటి వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టడం నేర్పించడంతో పాటు మార్గనిర్దేశం చేశారు. ప్రస్తుతం నేను రియల్ ఎస్టేట్, నగల వ్యాపారాలతో పాటు ఇతర రంగాల్లో పెట్టుబడులు పెట్టాను. భవిష్యత్తులో అవే నాకు ఉపయోగపడతాయి. ఇండస్ట్రీలో ప్రతి శుక్రవారం ఒకరి తలరాత మారిపోతూ ఉంటుంది. అందుకే అవకాశాలు ఉన్నప్పుడే సంపాదించిన డబ్బును సరైన మార్గాల్లో ఆదా చేసుకోవాలి. గ్లామర్ ఉన్నప్పుడే భవిష్యత్తు కోసం పెట్టుబడులు పెట్టాలి. లేదంటే చివరకు ఏమీ మిగలదు. కెరీర్ ముగిశాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది'' అని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే... ప్రస్తుతం బాలీవుడ్‌లో వరుస అవకాశాలతో దూసుకెళుతున్నారు తమన్నా. 'వ్వాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్, రేంజర్, ఐపీఎస్ మారియా, వి. శాంతారామ్, రాగిణి 3, నో ఎంట్రీ 2, బోలే చూడియా' వంటి హిందీ సినిమాలు ఆమె చేతిలో ఉన్నాయి.

### OTT Click Look

ప్రేమలో మునిగిపోవాలని ఉందా? కుటుంబ అనుబంధాలను ఆస్వాదించాలని ఉందా? కాసేపు కామెడీతో రిలాక్స్ అవ్వాలని ఉందా? భయపడాలని ఉందా? యాక్షన్ మోడ్‌లోకి వెళ్లిపోవాలని ఉందా? అయితే... ఇంకెందుకు ఆలస్యం? రిమోట్ తీసుకుని 'ఓటీటీ ప్లాట్‌ఫామ్స్'లో ఓ లుక్ వేయండి. నచ్చిన జానర్‌ని క్లిక్ చేయండి... మీకు అందుబాటులో ఉన్న సినిమాలు, సిరీస్‌లను చూసేయండి.

| | | | |
|---|---|---|---|
| ఫిబ్రవరి 23 | సోమవారం | జియో హాట్ స్టార్ | ఎ నైట్ ఆఫ్ సెవెన్ కింగ్‌డమ్స్ ఫినాలే |
| ఫిబ్రవరి 25 | బుధవారం | ప్రైమ్ వీడియో | ది బ్లఫ్ |
| ఫిబ్రవరి 26 | గురువారం | నెట్ ఫ్లిక్స్ | బ్రిడ్జర్‌టన్ (సీజన్ 4 పార్ట్ 2) |
| ఫిబ్రవరి 26 | గురువారం | ప్రైమ్ వీడియో | ఇక్కీస్ |
| ఫిబ్రవరి 27 | శుక్రవారం | జీ5 | డాటర్ ఆఫ్ ప్రసాద్‌రావు |
| ఫిబ్రవరి 27 | శుక్రవారం | జీ5 | క్రాంతి జ్యోతి విద్యాలయ మరాఠీ మాధ్యమం |
| ఫిబ్రవరి 27 | శుక్రవారం | సన్ నెక్స్ట్ | హనీ |

### స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

**దేశీ సూచీలు**

| | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▲ | 50 | 82,276 |
| నిఫ్టీ ▲ | 58 | 25,483 |

**విదేశీ సూచీలు**

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 23,116 | ▲ | 252 |
| డోజోన్స్ | 49,437 | ▲ | 262 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 10,799 | ▲ | 118 |
| డాక్స్ | 25,211 | ▲ | 225 |
| షాంఘై | 4,147 | ▲ | 35 |
| నికాయ్ | 58,583 | ▲ | 1,262 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

### ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | థామస్‌కుక్ | 89.11 | 92.13 |
| £ | బ్రిటన్ పౌండ్ | థామస్‌కుక్ | 120.52 | 124.92 |
| € | యూరో | థామస్‌కుక్ | 104.96 | 108.93 |
| ¥ | జపాన్ యెన్ (100) | థామస్‌కుక్ | 47.00 | 60.00 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | థామస్‌కుక్ | 62.16 | 66.10 |
| S$ | సింగపూర్ డాలర్ | థామస్‌కుక్ | 69.58 | 73.33 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 23.36 | 24.86 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 23.87 | 25.13 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 12.36 | 14.19 |

# సోలార్‌పై సుంకాల మోత



- దేశీ ఉత్పత్తులపై 126 శాతం అమెరికా టారిఫ్‌లు
- 10 శాతం టారిఫ్‌కు ఇది అదనం
- భారత్ సబ్సిడీలు ఇస్తున్నట్టు ఆరోపణ
- ఇండోనేసియా, లోవాస్ ఉత్పత్తులపైనా వడ్డింపు

**న్యూఢిల్లీ:** భారత సోలార్ ఉత్పత్తులపై అమెరికా చర్యలకు దిగింది. భారత్ నుంచి వచ్చే సోలార్ విడిభాగాలపై 125.87 శాతం ప్రాథమిక కౌంటర్ వెయిలింగ్ (వ్యతిరేకంగా) సుంకం విధిస్తున్నట్టు ప్రకటించింది. ఈ ఉత్పత్తులకు భారత్ అనుచితంగా సబ్సిడీలు సమకూరుస్తున్నట్టు ఆరోపించింది. భారత్‌తోపాటు ఇండోనేసియా, లావోస్ నుంచి వచ్చే క్రిస్టలిన్ సిలికాన్ ఫొటోవోల్టాయిక్ సెల్స్‌పై (సోలార్ మాడ్యూళ్లలో అసెంబుల్ అయినా, కాకపోయినా) సుంకాలు విధిస్తూ అమెరికా వాణిజ్య శాఖ 24న ఆదేశాలు జారీ చేసింది. అధ్యక్షుడు ట్రంప్ విధించిన 10 శాతం సార్వత్రిక సుంకాలకు ఇది అదనమని పేర్కొంది. ఈ దేశాల నుంచి చౌకగా వస్తున్న దిగుమతులపై యాంటీ డంపింగ్ డ్యూటీ విచారణలు సైతం నిర్వహించనున్నట్టు తెలిపింది. భారత్ నుంచి అమెరికాకు సోలార్ ఎగుమతులు 2022లో 83.86 మిలియన్ డాలర్లుగా ఉంటే, 2024లో 792.6 మిలియన్ డాలర్లకు పెరిగినట్టు ప్రస్తావించింది. విదేశీ చౌక ఉత్పత్తుల నుంచి దేశీ పరిశ్రమను కాపాడుకునేందుకు ఈ చర్యకు ఉపక్రమించింది. సంప్రదాయ విద్యుత్ వనరులకు ప్రత్యామ్నాయంగా పర్యావరణ అనుకూలమైన సోలార్, పవన ఇంధన వనరులపై కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున దృష్టి సారించడం తెలిసిందే. సోలార్ విడిభాగాల కోసం చైనా తదితర దేశాలపై ఆధారపడడాన్ని తగ్గించి, దేశీయంగానే వాటి తయారీని ప్రోత్సహించేందుకు ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకం (పీఎల్‌ఐ) సైతం ప్రకటించింది. దీంతో 26.6 గిగావాట్ల సోలార్ పీవీ మాడ్యూళ్లు, 10.5 గిగావాట్ల సోలార్ పీవీ సెల్స్, 2 గిగావాట్ల ఇన్‌గాట్ వేఫర్ తయారీ సామర్థ్యాలు దేశీయంగా ఏర్పాటు కావడం గమనార్హం. దీంతో 2023–24లో 4.35 బిలియన్ డాలర్లుగా ఉన్న దిగుమతులు 2024–25లో 2.15 బిలియన్ డాలర్లకు తగ్గాయి.

**ప్రభావం పరిమితమే..**

భారత సోలార్ ఉత్పత్తులపై అమెరికా విధించిన ప్రతీకార సుంకాల ప్రభావం పరిమితమేనని విక్రమ్ సోలార్, వారీ ఎనర్జీస్, ప్రీమియర్ ఎనర్జీస్ తెలిపాయి. ''యూఎస్ ఏడీ/సీవీడీ సుంకాలు ప్రత్యేకంగా భారత తయారీ సెల్స్‌కు ఉద్దేశించినవి. అమెరికా ఆర్డర్లకు సంబంధించి చేసే సరఫరాల్లో భారత సెల్స్‌ను వినియోగించడం లేదు. తక్కువ టారిఫ్‌లున్న భౌగోళిక ప్రాంతాల నుంచి వాటిని సమకూర్చుకుంటున్నాం. కనుక ఈ సుంకాల వల్ల పడే ప్రత్యక్ష ప్రభావం పరిమితం'' అని విక్రమ్ సోలార్ సీఎండీ జ్ఞానేష్ చౌదరి స్పష్టం చేశారు. దేశీయంగా డిమాండ్ పుంజుకుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఇండియన్ ఆయిల్–ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ నుంచి ఇటీవలే 378.75 మెగావాట్ల మాడ్యూళ్ల ఆర్డర్‌ను గెలుచుకోవడాన్ని ప్రస్తావించారు. ప్రస్తుత యూఎస్ ఆర్డర్ల సరఫరాలపై తాజా సుంకాల ప్రభావం ఉంటుందని భావించడం లేదని వారీ ఎనర్జీస్ గ్రూప్ హెడ్ అభిషేక్ పరీక్ తెలిపారు. మరోవైపు వారీ ఎనర్జీస్ అమెరికాలోనే తన సోలార్ సెల్స్ తయారీ సామర్థ్యాన్ని మరింత పెంచుకునే ప్రణాళికతోనూ ఉంది. ''మా వ్యాపారంలో ఎగుమతుల వాటాను పూర్తిగా సున్నాకు తగ్గించుకున్నాం. కనుక అమెరికా సుంకాల ప్రభావం మాపై ఏమీ ఉండదు''అని ప్రీమియర్ ఎనర్జీస్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ వినయ్ రస్తోగి తెలిపారు.

# మార్కెట్‌కు సోలార్ సెగ

- కరిగిపోయిన ఇంట్రాడే లాభాలు
- 50 పాయింట్ల లాభంతో ముగిసిన సెన్సెక్స్
- ట్రేడింగ్‌లో 732 పాయింట్ల ర్యాలీ

**ముంబై:** భారతీయ సౌర విద్యుత్ పరికరాల దిగుమతులపై 126 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా వాణిజ్య శాఖ ప్రకటనతో దేశీయ మార్కెట్‌లో ఒక్కసారిగా లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఫలితంగా ఇంట్రాడే గరిష్టాల నుంచి వెనుదిరిగిన స్టాక్ సూచీలు చివరికి స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ట్రేడింగ్‌లో 732 పాయింట్లు బలపడి సెన్సెక్స్ చివరికి 50 పాయింట్ల పరిమిత లాభంతో 82,276 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 58 పాయింట్ల లాభంతో 25,483 వద్ద ముగిసింది. ఒక దశలో 228 పాయింట్లు ఎగసి 25,653 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఏఐ సంబంధిత ఆందోళనలు కొద్దిగా తగ్గడంతో అమెరికా టెక్ షేర్లు పుంజుకున్నాయి. బ్యాంక్ ఆఫ్ జపాన్ సరళతర ద్రవ్య విధాన వైఖరి సంకేతాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

➔ మెటల్, ఆటో, కమోడిటీస్, ఫార్మా, కన్జ్యూమర్ డిస్క్రెషనరీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. టెలికమ్యూనికేషన్, ఇంధన, ఎఫ్ఎంసీజీ, రియల్టీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్సు 0.59%, స్మాల్ క్యాప్ సూచీ 0.37 శాతం పెరిగాయి.

## షేర్లు షివర్!

**భా**రత్ నుంచి దిగుమతి చేసుకునే సౌర ఉత్పత్తులపై అమెరికా 126% సుంకం విధింపు తర్వాత దేశీయ సోలార్ కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.'భారత సోలార్ తయారీ సంస్థలు యూఎస్ ప్రభుత్వాల నుంచి సబ్సిడీలు పొందుతూ.., అమెరికాలోని స్థానిక తయారీదారులకు తీవ్రతర పోటీగా మారి వారి లాభాలకు గండి కొడుతున్నాయని విచారణలో తేలింది. ఈ కారణంతోనే భారీ పన్నులు విధించాల్సి వచ్చింది' అని అమెరికా వాణిజ్య శాఖ అధికారులు స్పష్టం చేశారు. అత్యధికంగా వారీ ఎనర్జీస్ 10.47% పతనమై రూ. 2709 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 14.99% క్షీణించింది. ప్రీమియర్ ఎనర్జీస్ 6.27% నష్టపోయి రూ.729 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 14.33% పతనమైంది. విక్రమ్ సోలార్ 5.45% పడిపోయి రూ.175 వద్ద నిలిచింది.

# కోల్ ఇండియా రేర్ ఎర్త్ మైనింగ్

## 2 రాష్ట్రాలలో 7 డంప్‌ల గుర్తింపు

**న్యూఢిల్లీ:** అనుబంధ కంపెనీ సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్(ఎస్ఈసీఎల్) తాజాగా రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌గల 7 మైన్ డంప్‌లను గుర్తించినట్లు ప్రభుత్వ రంగ దిగ్గజం కోల్ ఇండియా వెల్లడించింది. బొగ్గు గనుల వృథా నుంచి విలువను వెలికితీయాలన్న ప్రభుత్వ ప్రణాళికల్లో భాగంగా ఎస్ఈసీఎల్ చర్యలు చేపట్టినట్లు తెలియజేసింది. ఈ బాటలో ప్రధాన కోల్ ఫీల్డ్స్‌వద్ద భారీగా పేరుకుపోయిన డంప్స్ ద్వారా రేర్ ఎర్త్ ఎలిమెంట్స్(ఆర్ఈఈలు)ను గుర్తించినట్లు పేర్కొంది. దీంతో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవచ్చని ఎస్ఈసీఎల్ చైర్మన్, ఎండీ హరీష్ దుహన్ వివరించారు. వీటి వెలికితీత కోసం ఇప్పటికే టెండరింగ్ ప్రక్రియ ప్రారంభమైనట్లు వెల్లడించారు. వెరసి ఏడాదిలోగా ఇందుకు వీలున్న డంప్స్‌ను సైంటిఫిక్ పద్ధతిలో గుర్తించనున్నట్లు తెలియజేశారు. బొగ్గు శాఖ మార్గదర్శకత్వాల ప్రకారం రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ వెలికితీతకు 7 మైన్ డంప్స్‌ను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఏడాదిలోగా ఆర్థికంగా ఉపయుక్తమైన ప్రాంతాలను ఎంపిక చేయనున్నట్లు వివరించారు. ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధనం, రక్షణ రంగ పరికరాలు, ఎలక్ట్రికల్ వాహనాలు తదితర హైటెక్ పరిశ్రమలలో ఇవి కీలకంకాగా.. అంతర్జాతీయస్థాయిలో వీటి సరఫరాలకు చైనా ఆధిపత్యం వహిస్తున్న సంగతి తెలిసిందే.

ఈ వార్తలతో కోల్ ఇండియా షేరు 2% ఎగసి రూ. 438 వద్ద ముగిసింది.

# ఏఐకి భయపడం

- ఆదాయం తగ్గినా ఆందోళన లేదు
- ఉద్యోగులందరికీ ఏఐ శిక్షణనిస్తాం
- టీసీఎస్ సీఈవో కృతి వాసన్

**ముంబై:** కృత్రిమ మేధ (ఏఐ)తో నెలకొన్న రిస్కుల గురించి తమ సంస్థ భయపడబోదని దేశీ ఐటీ సర్వీసుల దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఎండీ కె. కృతి వాసన్ స్పష్టం చేశారు. కంపెనీ ఆదాయం తగ్గినా ఫర్వాలేదు కానీ ఏఐ సాధనాలను వినియోగించుకోవడాన్ని నేర్చుకునేలా ఉద్యోగులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. మొత్తం 6 లక్షల మంది ఉద్యోగుల్లో ప్రతీ ఒక్కరు కృత్రిమ మేధలో నిష్ణాతులుగా మారేలా ప్రయతిస్తున్నట్లు వివరించారు. ఇదే క్రమంలో కొంత భాగం ఆదాయాన్ని కోల్పోయినా, వివిధ ప్రాజెక్టుల్లో ఏఐని ఉపయోగించే విధానాలను అన్వేషించాలని సిబ్బందికి సూచించినట్లు కృతివాసన్ తెలిపారు. యువ సిబ్బందితో పోలిస్తే కృత్రిమ మేధ ఆధారిత సొల్యూషన్స్‌ని రూపొందించడంలో సీనియర్ ఉద్యోగులు కాస్త నెమ్మదిగా ఉంటున్న విషయాన్ని గమనించినట్లు వార్షిక నాస్కామ్ టెక్నాలజీ, లీడర్‌షిప్ ఫోరం (ఎన్‌టీఎల్ఎఫ్) సదస్సులో పాల్గొన్న సందర్భంగా చెప్పారు.

కొత్త ఏఐ నైపుణ్యాలు నేర్చుకునేలా ప్రోత్సహించేందుకు ప్రస్తుతం ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాల్సిన అవసరం ఉండటం లేదని, అందరూ వాటిపై ఆసక్తిగానే ఉన్నారని పేర్కొన్నారు. అయితే, నైపుణ్యాలంటే చాట్‌జీపీటీ లాంటి ప్లాట్‌ఫాంకి ప్రాంప్ట్‌లు ఇవ్వడం మాత్రమే కాదని, సిబ్బంది శ్రమించి ఏఐ సాధనాలతో కొత్త సొల్యూషన్స్‌ను రూపొందిస్తేనే ప్రయోజనకరమని కృతి వాసన్ చెప్పారు. ఏఐ ప్రస్తుతం బోర్డు స్థాయి సమావేశాల్లోను ప్రధాన ఎజెండాగా ఉంటోందన్నారు. కొత్త టెక్నాలజీతో ఉత్పాదకత పెరుగుతుందని, కానీ, అలాంటి సాంకేతికతలతో తమ కస్టమర్లకు ఏవిధంగా ప్రయోజనం చేకూర్చగలం అనే అంశంపై కూడా తాము ప్రధానంగా దృష్టి పెడతామని చెప్పారు.

| 'సాక్షి ప్లస్' | ఈ-పేపర్‌లో .. |
|---|---|
| జీసీసీలకు డిమాండ్ భళా | వెండి, బంగారం.. అదే జోరు |

## సాక్షి స్పోర్ట్స్

పై హోప్

### ఈ మ్యాచ్‌పై మన కన్ను... నేడు దక్షిణాఫ్రికాతో వెస్టిండీస్ సమరం

అహ్మదాబాద్: భారత్, జింబాబ్వే మధ్య మ్యాచ్‌కు ముందు జరిగే మరో సమరంపై కూడా టీమిండియా అభిమానుల దృష్టి నిలిచింది. 'గ్రూప్–1'లోనే దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ తలపడనున్నాయి. ఈ మ్యాచ్ ఫలితం భారత్‌పై ప్రభావం చూపించే అవకాశం ఉంది. సరిగ్గా చెప్పాలంటే ఇక్కడ దక్షిణాఫ్రికా గెలవాలని భారత్ కోరుకోవాలి. ఈ మ్యాచ్‌తో పాటు జింబాబ్వేపై కూడా దక్షిణాఫ్రికా గెలిస్తే భారత్‌కు రన్‌రేట్ లెక్కల అవసరం రాదు. జింబాబ్వేతో పాటు చివరి మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై భారత్ గెలిస్తే సరిపోతుంది. కానీ దక్షిణాఫ్రికాపై వెస్టిండీస్ గెలిస్తే మాత్రం... మనం మిగతా రెండూ గెలిచినా సెమీస్ స్థానం గ్యారంటీ లేదు. మూడు జట్లూ రెండేసి విజయాలతో సమానమైతే రన్‌రేట్‌తో దక్షిణాఫ్రికా, విండీస్‌లకు వెనక్కి నెట్టడం భారత్‌కు అంత సులువు కాదు!

మ. గం. 3 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో లైవ్

మార్క్‌రమ్

# భారీ విజయం కావాలి

## నేడు జింబాబ్వేతో భారత్ సూపర్-8 మ్యాచ్

**కచ్చితంగా గెలవాల్సిన స్థితిలో టీమిండియా • ఆత్మవిశ్వాసంతో జింబాబ్వే**

**రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం**

**టి20 ప్రపంచకప్‌లో ఒక్క మ్యాచ్‌లో పరాజయం భారత్ పరిస్థితిని ఒక్కసారిగా మార్చేసింది. ఇటీవలి ఫామ్‌ను బట్టి చూస్తే దర్జాగా సెమీఫైనల్ చేరాల్సిన టీమ్ ఇప్పుడు ఒత్తిడిని అధిగమించి తప్పనిసరిగా వరుస రెండు మ్యాచ్‌లు గెలవడంతో పాటు రన్‌రేట్‌పై కూడా ఆధారపడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో జింబాబ్వేతో పోరుకు టీమిండియా సిద్ధమైంది. ఒకవైపు మన బ్యాటింగ్‌లో తడబాటు కనిపిస్తుండగా, మరోవైపు లీగ్ దశలో ఆస్ట్రేలియా, శ్రీలంకలను ఓడించిన జింబాబ్వేను ఏమాత్రం తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. ఈ మ్యాచ్‌లో భారీ తేడాతో విజయం సాధిస్తేనే వెస్టిండీస్‌తో జరిగే తర్వాతి పోరులో వ్యూహాల గురించి చర్చించేందుకు భారత్‌కు ఇంకా అవకాశం మిగిలి ఉంటుంది!**

చెన్నై: వరల్డ్ కప్ 'సూపర్ ఎయిట్స్'లో భాగంగా తమ రెండో మ్యాచ్‌లో బరిలోకి దిగేందుకు టీమిండియా సన్నద్ధమైంది. నేడు జరిగే 'గ్రూప్–1' పోరులో జింబాబ్వేతో భారత్ తలపడుతుంది. ఇరు జట్లూ తమ తొలి మ్యాచ్‌ల్లో చిత్తుగా ఓడి రన్‌రేట్‌లో బాగా వెనుకబడిపోయాయి. ఓడిన జట్టు సెమీస్ ఆశలు ఇక్కడే ముగిసిపోతాయి. బలాబలాలపరంగా జింబాబ్వేకంటే భారత్ చాలా పెద్ద స్థాయిలో ఉంది. అయితే దక్షిణాఫ్రికా చేతిలో ఓటమితో టీమిండియా అజేయమేమీ కాదని తేలగా... పోరాడితే పోయేదేం లేదన్నట్లుగా ఆడే జింబాబ్వే మరో సంచలన ప్రదర్శనపై గురి పెట్టింది.

**సామ్సన్‌కు చాన్స్!**

గత మ్యాచ్ ఆడిన తుది జట్టు నుంచి కనీసం రెండు మార్పులతో భారత్ బరిలోకి దిగే అవకాశం కనిపిస్తోంది. టోర్నీలో ఆడిన ఒకే ఒక మ్యాచ్‌లో విఫలమైన సంజు సామ్సన్‌ను ఇప్పుడు టీమ్ వ్యూహంలో భాగంగా మళ్లీ ఆడించాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. భారత్ టాప్–3 ఎడంచేతి వాటం బ్యాటర్లే కావడం, ప్రత్యర్థి జట్లు ఆరంభంలోనే ఆఫ్ స్పిన్నర్‌తో బౌలింగ్ చేయించి కట్టడి చేస్తుండటం జట్టును ఇబ్బంది పెట్టింది. మూడు డకౌట్‌ల తర్వాత గత మ్యాచ్‌లో అభిషేక్ శర్మ కొన్ని పరుగులు చేసినా అతని బ్యాటింగ్‌లో తడబాటు కనిపించింది. మరోవైపు ఇషాన్ కిషన్ కూడా ఆఫ్ స్పిన్నర్‌కే అవుటయ్యాడు. దాంతో కుడిచేతి వాటం సామ్సన్‌ను టాపార్డర్‌లో ఆడించేందుకు టీమిండియా సిద్ధమైనట్లు తెలుస్తోంది. అయితే సామ్సన్‌ను ఆడించేందుకు తిలక్ వర్మ లేదా రింకూ సింగ్‌లలో ఎవరిని తప్పిస్తారనేది చూడాలి. దక్షిణాఫ్రికాతో అక్షర్ పటేల్‌ను కాకుండా వాషింగ్టన్ సుందర్‌ను ఆడించి తీవ్ర విమర్శలపాలైన మేనేజ్‌మెంట్ ఇప్పుడు మళ్లీ అక్షర్‌ను టీమ్‌లోకి తీసుకోవచ్చు. జింబాబ్వే బ్యాటర్లలో ఎక్కువ మంది కుడిచేతి వాటం వారే కావడం అక్షర్ రాకకు మార్గం సుగమం చేసింది. మళ్లీ ఫామ్‌లోకి వచ్చేందుకు అభిషేక్‌కు ఇది సరైన సమయం కాగా... సూర్యకుమార్, శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా ఎంత దూకుడుగా ఆడతారన్నది చూడాలి. బౌలింగ్ విషయంలో భారత్‌కు ఎలాంటి ఆందోళన లేదు. బుమ్రా, అర్ష్‌దీప్‌లతో పాండ్యా పేస్ భారం మోస్తుండగా... ప్రధానాస్త్రం వరుణ్ జింబాబ్వేను బాగా ఇబ్బంది పెట్టగలడు. సొంతగడ్డపై ఇప్పుడు వరుణ్ వరల్డ్ నంబర్‌వన్ బౌలర్‌గా బరిలోకి దిగనున్నాడు.

సూర్యకుమార్

రజా

**రజాపై భారం...**

జింబాబ్వే జట్టుపై ఈ మ్యాచ్‌కు సంబంధించి ఎలాంటి ఒత్తిడీ లేదు. లీగ్ దశలో ఆస్ట్రేలియాను, సొంతగడ్డపై శ్రీలంకను ఓడించిన సంతృప్తితో ఆ జట్టు స్వదేశానికి వెళ్లవచ్చు. అందువల్ల కూడా ఇప్పుడు జింబాబ్వే మరింత ప్రమాదకరం. పోరాడితే భారత్‌పై కూడా పైచేయి సాధించవచ్చనే ధైర్యం ఆ జట్టులో కనిపిస్తోంది. ప్రధాన పేసర్లయిన ఎన్‌గరవా, ముజరబాని పవర్‌ప్లేలో వికెట్లు తీసి శుభారంభం అందించగలరు. లెగ్ స్పిన్నర్ క్రీమర్ కూడా బ్యాటర్లను ఇబ్బంది పెట్టగల సమర్థుడు. టోర్నీలో జట్టు తరఫున టాప్ స్కోరర్‌గా ఉన్న బెన్నెట్‌తో పాటు ర్యాన్ బర్ల్ కీలకం కానున్నారు. జట్టులో ఇద్దరు ఆల్‌రౌండర్లు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. బ్రాడ్ ఇవాన్స్ తన మీడియం పేస్‌తో టోర్నీలో ప్రభావం చూపించగా, ప్రధాన గెలుపు భారం కెప్టెన్ సికందర్ రజాపైనే ఉంది. బ్యాటింగ్‌లో ముందుండి నడిపిస్తున్న రజా, తన ఆఫ్‌స్పిన్‌తో నిలకడగా రాణించాడు. విండీస్‌తో గత పోరులో భారీ తేడాతో ఓడినా... జింబాబ్వే పట్టుదలగా ఆడితే ప్రత్యర్థిని ఇబ్బంది పెట్టగలదు.

**భారత్:** సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్, సామ్సన్, ఇషాన్ కిషన్, దూబే, పాండ్యా, రింకూ/తిలక్, అక్షర్, అర్ష్‌దీప్, వరుణ్, బుమ్రా.

**జింబాబ్వే:** రజా (కెప్టెన్), మరుమని, బెన్నెట్, మైర్స్, బర్ల్, మున్‌యోంగా, ముసెకివా, ఇవాన్స్, క్రీమర్, ముజరబాని, ఎన్‌గరవ

**పిచ్, వాతావరణం**

చిదంబరం స్టేడియంలోని పిచ్‌లు ఈ టోర్నీ మొత్తంలో బ్యాటింగ్‌కు బాగా అనుకూలించాయి. బౌలర్లకు ఏమాత్రం సహకరించలేదు. కాబట్టి భారీ స్కోరుకు అవకాశం ఉంది. మ్యాచ్ రోజు వర్షసూచన లేదు.

**1** టి20 వరల్డ్ కప్‌లో భారత్, జింబాబ్వే మధ్య ఒకే ఒక మ్యాచ్ జరిగింది. 2022లో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 71 పరుగులతో గెలిచింది.

**1** భారత్‌లో భారత్‌తో టి20ల్లో జింబాబ్వే తలపడటం ఇదే తొలిసారి. గతంలో భారత గడ్డపై జింబాబ్వే 5 టెస్టులు, 19 వన్డేల్లో టీమిండియాను ఎదుర్కొంది.

రచిన్ రవీంద్ర

షనక

# శ్రీలంక ఖేల్ ఖతం

- న్యూజిలాండ్ చేతిలో 61 పరుగులతో ఓటమి
- సెమీస్‌కు చేరువైన కివీస్
- రచిన్ రవీంద్ర ఆల్‌రౌండ్ ప్రదర్శన

**కొలంబో:** టి20 ప్రపంచకప్‌కు సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న శ్రీలంక సొంతగడ్డపై కనీసం సెమీ ఫైనల్‌కు కూడా చేరకుండానే నిష్క్రమించింది. 'సూపర్ ఎయిట్స్'లో భాగంగా తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్ చేతిలో చిత్తయిన లంక... ఇప్పుడు న్యూజిలాండ్ చేతిలోనూ ఓడింది. ఫలితంగా రెండు పరాజయాలతో సెమీస్ అవకాశాలు కోల్పోయింది. బుధవారం జరిగిన 'గ్రూప్–2' మ్యాచ్‌లో న్యూజిలాండ్ 61 పరుగుల తేడాతో శ్రీలంకపై ఘన విజయం సాధించింది. ఈ గ్రూప్ నుంచి ఇంగ్లండ్ ఇప్పటికే సెమీస్ చేరగా, తాజా విజయంతో కివీస్ అవకాశాలు మెరుగయ్యాయి. శుక్రవారం ఇంగ్లండ్‌తో జరిగే మ్యాచ్‌లో గెలిస్తే కివీస్ కూడా సెమీస్‌లోకి అడుగు పెడుతుంది. ఓడితే శనివారం పాక్, లంక మ్యాచ్ ఫలితం కోసం ఎదురు చూడాల్సి ఉంటుంది. పాక్ ఓడితే కివీస్‌కు చోటు ఖాయమవుతుంది. పాక్ గెలిస్తే అప్పుడు రన్‌రేట్‌లో పోటీ పడాల్సి ఉంటుంది.

టాస్ గెలిచిన శ్రీలంక ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 268 పరుగులు చేసింది. కెప్టెన్ మిచెల్ సాంట్నర్ (26 బంతుల్లో 47; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), రచిన్ రవీంద్ర (22 బంతుల్లో 32; 3 ఫోర్లు, 1 సిక్స్), కోల్ మెక్‌కోన్‌కీ (23 బంతుల్లో 31 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడగా... ఫిన్ అలెన్ (13 బంతుల్లో 23; 3 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. 9.2 ఓవర్లు ముగిసేసరికి కివీస్ 75/2తో మెరుగైన స్థితిలోనే ఉంది. అయితే లంక బౌలర్లు చెలరేగడంతో 9 పరుగుల వ్యవధిలోనే ఆ జట్టు 4 వికెట్లు కోల్పోయి 84/6కు చేరింది. ఈ దశలో సాంట్నర్, మెక్‌కోన్‌కీ ఆదుకున్నారు. వీరిద్దరు ఏడో వికెట్‌కు 47 బంతుల్లో 84 పరుగులు జోడించి జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించారు. చివరి 4 ఓవర్లలో న్యూజిలాండ్ 6 సిక్స్‌లు, 4 ఫోర్లతో 70 పరుగులు రాబట్టడం విశేషం. ఆరు వికెట్లు కోల్పోయే సమయానికి 84 పరుగులు చేసిన కివీస్... తర్వాతి వికెట్ భాగస్వామ్యంలో సరిగ్గా అన్నే పరుగులు చేయడం విశేషం. టి20 వరల్డ్ కప్‌లో గతంలో ఏడో వికెట్‌కు అత్యుత్తమ భాగస్వామ్యం 74 పరుగులు (మైక్ హస్సీ, స్టీవ్ స్మిత్ మధ్య 2010లో) కాగా...సాంట్నర్, మెక్‌కోన్‌కీ దీనిని సవరించారు. మహీశ్ తీక్షణ, దుష్మంత చమీర చెరో 3 వికెట్లు పడగొట్టారు.

అనంతరం లక్ష్య ఛేదనలో లంక పూర్తిగా తడబడింది. 20 ఓవర్లలో 8 వికెట్లకు 107 పరుగులు చేసి ఓడిపోయింది. ఇన్నింగ్స్ తొలి బంతికే నిసాంక (0) బౌల్డ్ కావడంతో మొదలైన పతనం వేగంగా సాగింది. అసలంక (5), కుశాల్ మెండిస్ (11), పవన్ రత్నాయకే (10), షనక (3) వరుస కట్టి పెవిలియన్‌కు చేరడంతో 10.3 ఓవర్లలో 46 పరుగులకే జట్టు సగం వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత కమిందు మెండిస్ (31; 4 ఫోర్లు), వెలలాగె (29; 2 ఫోర్లు, 1 సిక్స్) పోరాడినా దాని ప్రభావం ఫలితంపై పడలేదు. రచిన్ రవీంద్ర (4/27) లంకను కుప్పకూల్చగా, హెన్రీకి 2 వికెట్లు దక్కాయి. రచిన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

**'సూపర్-8' గ్రూప్-2 పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | రద్దు | పా | నె.ర.రే |
|---|---|---|---|---|---|---|
| ఇంగ్లండ్ | 2 | 2 | 0 | 0 | 4 | 1.491 |
| న్యూజిలాండ్ | 2 | 1 | 0 | 1 | 3 | 3.050 |
| పాకిస్తాన్ | 2 | 0 | 1 | 1 | 1 | -0.461 |
| శ్రీలంక | 2 | 0 | 2 | 0 | 0 | -2.800 |

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

## క్లుప్తంగా...

### అసంబద్ధంగా 'పది' పర్యవేక్షణాధికారుల నియామకం

సాక్షి, అమరావతి: పదో తరగతి పరీక్షల పర్యవేక్షణ అధికారుల నియామకంలో సీనియారిటీని పట్టించుకోలేదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాలాజీ, జి.వి.సత్యనారాయణ ఆరోపించారు. డీఈవోలు, డీవైఈవోలు, ఎంఈవోలతో సంబంధం లేకుండా కమిషనరేట్ కేంద్రంగా చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమిస్తూ విడుదల చేసిన జాబితా అసంబద్ధంగా ఉందన్నారు. సీనియారిటీని పరిగణలోకి తీసుకోకుండా జూనియర్లకు విధులు కేటాయించారని ఆరోపించారు.ఒకే పాఠశాలలో ఎక్కువ మంది ఉపాధ్యాయులకు పరీక్ష విధులు అప్పగించడం వల్ల పాఠశాల నిర్వహణ ఇబ్బందిగా మారుతుందని పేర్కొన్నారు. ఈ జాబితాను సరిచేసి సీనియర్లకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

### ఆర్టీసీ డిపోలను ప్రైవేటుకు ఇవ్వొద్దు

**సీపీఎం, సీపీఐ డిమాండ్**

సాక్షి, అమరావతి: విద్యుత్ బస్సులను నడిపే ప్రైవేట్ సంస్థలకు ఆర్టీసీ డిపోలను అప్పగించడాన్ని ఆపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య సీఎం చంద్రబాబుకు బుధవారం లేఖ రాశారు. పీఎం ఈ–బస్సు పేరుతో ప్రైవేటు విద్యుత్ బస్సులను పుణేకు చెందిన పినకల్ కంపెనీ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. దాని కోసం 11 డిపోలకు చెందిన 12 స్థలాలను వారికి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. దీని వల్ల ఆర్టీసీ మనుగడకు, ప్రజల ప్రయోజనాలకు నష్టమన్నారు.

విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్న వీవోఏలు, యానిమేటర్లు

# అధికారమదంపై 'ధర్నా'గ్రహం

## బెజవాడలో కదం తొక్కిన చిరుద్యోగులు

అధికారపార్టీ అడ్డగోలు వేధింపులు, అక్రమ తొలగింపులపై చిరుద్యోగులు నిరసన గళమెత్తారు. రాష్ట్ర నలుమూలల నుంచీ తరలివచ్చి బెజవాడలో కదంతొక్కారు. రాష్ట్రస్థాయి ధర్నాలో చంద్రబాబు సర్కారు దుర్నీతిపై ధర్మాగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు చేయాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని దిక్కులుపిక్కటిల్లేలా నినదించారు.

- సర్కారు తీరుకు నిరసనగా రాష్ట్రస్థాయి ధర్నా
- బాబు పాలనపై వెలుగు వీవోఏ, డ్వాక్రా యానిమేటర్లు మెప్మా ఆర్పీల కన్నెర్ర
- ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్
- రెండేళ్ల బకాయిలు చెల్లించాలని నినాదాలు

సాక్షి, అమరావతి/గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్) : క్షేత్రస్థాయిలో పొదుపు సంఘాల కార్యక్రమాలను పర్యవేక్షించే గ్రామ సమాఖ్య సహాయకులు (వెలుగు వీవోఏ – డ్వాక్రా యానిమేటర్లు), మెప్మా రిసోర్స్ పర్సన్లు (ఆర్పీ)లు బుధవారం విజయవాడలో రాష్ట్ర స్థాయి ధర్నా చేపట్టారు. అధికార పార్టీ నేతల పెత్తనం పెరగడంతో పాటు నిబంధనలకు విరుద్ధ కార్యక్రమాల పేరిట వేధింపులు, అక్రమ తొలగింపులను నిరసించారు. తొలుత రాష్ట్ర నలుమూలల నుంచీ తరలివచ్చిన ఉద్యోగులు విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌కు చేరుకున్నారు. బాబు సర్కారుకు వ్యతిరేకంగా వారు చేసిన నినాదాలతో ధర్నాచౌక్ దద్దరిల్లింది. తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు కనీస వేతనాలు వర్తింపజేయాలని, అక్రమ తొలగింపులు, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో వీవోఏ–యానిమేటర్లతో పాటు ఆర్పీలకు ఇచ్చే నెలవారీ వేతనం రూ.8వేలు, రూ.పదివేలు ఏమాత్రం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు రూ.26 వేల చొప్పున చెల్లించాలని.. హెచ్ఆర్ పాలసీ అమలు, 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం, అర్హులైన వారికి పదోన్నతులు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వీవోఏ – యానిమేటర్లకు స్త్రీనిధి ప్రోత్సాహకాలు రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని, ఒక్కొక్కరికీ రూ. 30 వేల నుంచి రూ.లక్ష వరకు రావాల్సి ఉందని వివరించారు. ఆ బకాయిలు వెంటనే చెల్లించాలని నినదించారు. 60 ఏళ్లు నిండిన వీఓఏలకు నిలుపుదల చేసిన వేతనాలు చెల్లించాలని, మెప్మా ఆర్పీలకు గ్రేడింగ్ విధానం రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన మేరకు మహిళలు పొదుపు సంఘాల ద్వారా తీసుకునే రుణాలపై రూ.10 లక్షల వరకు వడ్డీ రాయితీలు చెల్లించాలని, మహిళా మార్టులు, స్వావలంబన, అభయహస్తం నగదును పొదుపు మహిళలకు తిరిగి చెల్లించాలని కోరారు. చిరుద్యోగుల ధర్నాకు సీపీఎం నేత వి. శ్రీనివాసరావు సంఘీభావం ప్రకటించారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. వారికి న్యాయం జరిగే వరకు మద్దతుగా పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే రాష్ట్ర స్థాయి ధర్నా అనంతరం యూనియన్ ప్రతినిధులు సెర్ప్ సీఈవో వాకాటి కరుణ, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్‌లను కలిసి వినతిపత్రాలను అందజేశారు.

## అంగన్‌వాడీల వినూత్న నిరసన

ఏలూరు కలెక్టరేట్ వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఏలూరు (టూటౌన్): ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పోస్టులు భర్తీ చేయాలని, అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని కోరుతూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ వద్ద తలపెట్టిన నిరాహార దీక్షలు రెండోరోజు బుధవారం కొనసాగాయి. జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది అంగన్‌వాడీలు తరలి వచ్చారు. కనీస వేతనం రూ.26,000, సంక్షేమ పథకాల అమలు, యాప్స్ అన్నీ కలిపి ఒకే యాప్‌గా మార్చాలని, మెనూ చార్జీలు పెంచాలని పెద్దపెట్టున నినదించారు. మోకాళ్లపై నిలిచి నిరసన గళం వినిపించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ , ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి.భారతి పాల్గొన్నారు.

## నామినల్ రోల్స్‌లో తప్పుల సవరణకు అవకాశం

- టెన్త్ విద్యార్థులకు ఆధార్ కార్డులోని వివరాలే ప్రామాణికం
- ఈనెల 28 వరకూ తప్పుల సవరణకు గడువు

సాక్షి, అమరావతి: పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు, పాఠశాలల యాజమాన్యాలకు ప్రభుత్వ పరీక్షల విభాగం కీలక సూచనలు చేసింది. నామినల్ రోల్స్‌లో విద్యార్థుల పేరు, పుట్టిన తేదీ వంటి వివరాల్లో తప్పులను సరిదిద్దుకునేందుకు ఈనెల 28 వరకు గడువు ఇచ్చినట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డాక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 614 మండలాల పరిధిలోని 3,497 పాఠశాలల నుంచి 9,986 మంది విద్యార్థుల వివరాల సవరణకు అభ్యర్థనలు అందాయని పేర్కొన్నారు. విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఆధార్ సంఖ్య వివరాల సవరణలు.. కేవలం ఆధార్ కార్డులోని డేటా ఆధారంగా మాత్రమే అనుసంధానం చేస్తామన్నారు. ఆధార్‌లో ధ్రువీకరించిన వివరాలు మాత్రమే ఈనెల 28 వరకు యూడైస్ ప్లస్ పోర్టల్‌లో అప్‌డేట్ చేసుకోవచ్చని గుర్తు చేశారు. ఈ వివరాలు ఆధారంగానే విద్యార్థుల మార్కుల జాబితా, ఇతర సర్టిఫికెట్లు జారీ అవుతాయని తెలిపారు. విద్యార్థుల వివరాలు తప్పు లేకుండా చూడాల్సిన బాధ్యత పూర్తిగా పాఠశాల ప్రధానోపాధ్యాయులదేనని ఆయన స్పష్టం చేశారు.

# ఎఫ్ఐఆర్ నమోదు చేయరేం!

- అజిత్ విమాన ప్రమాదంపై ఎన్సీపీ (ఎస్పీ) ఎమ్మెల్యే రోహిత్
- ఎమ్మెల్యేలం వెళ్లి డిమాండ్ చేసినా పోలీసులు పట్టించుకోలేదు
- దాంతో మా అనుమానాలు మరింతగా బలపడుతున్నాయి
- విమాన సంస్థ వీఎస్ఆర్‌కు టీడీపీ నేతలతో వ్యాపార లింకులు
- వీటన్నింటిపైనా లోతుగా దర్యాప్తు జరగాలని డిమాండ్

ముంబై: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ దుర్మరణానికి కారణమైన విమాన ప్రమాద ఉదంతంపై అనుమానాలు నానాటికీ బలపడుతున్నాయని ఎన్సీపీ (ఎస్పీ) ఎమ్మెల్యే రోహిత్ పవార్ అన్నారు. ఆ దుర్ఘటనపై కేసు నమోదు చేయడానికి ముంబై పోలీసులు నిరాకరించడమే ఇందుకు తాజా నిదర్శనమని ఆయన చెప్పారు. ఈ ఉదంతానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం, యంత్రాంగం ఎవరినో కాపాడేందుకు ప్రయత్నిస్తున్నాయంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ మేరకు బుధవారం ఎక్స్‌లో రోహిత్ పలు పోస్టులు పెట్టారు. ''అజిత్ ప్రయాణించిన లియర్‌జెట్ 45 (వీటీ–ఎస్ఎస్‌కే) విమానం సొంతదారైన వీఎస్ఆర్ వెంచర్స్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని డీజీసీఏ మంగళవారం తన నివేదికలో స్పష్టంగా పేర్కొంది. దాంతో ఈ ఉదంతంపై కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ దాఖలు చేయాల్సిందిగా సహచర ఎమ్మెల్యేలు అమోత్ మిత్కరీ, సందీప్ క్షీర్‌సాగర్, నేను మెరైన్‌డ్రైవ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి డిమాండ్ చేశాం. కానీ ఎఫ్ఐఆర్ నమోదుకు పోలీసులు నిరాకరించారు. లాంఛనంగా మా ఫిర్యాదును స్వీకరించడంతో సరిపెట్టారు. విమాన ప్రమాదంపై మాకిప్పటికే ఉన్న అనుమానాలను పోలీసుల తీరు మరింత బలపరుస్తోంది'' అని పేర్కొన్నారు. ఈ ఉదంతానికి సంబంధించి పూర్తి న్యాయం జరిగేదాకా తాము విడిచిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అజిత్ విమాన ప్రమాదంపై ఎఫ్ఐఆర్ దాఖలుకు డిమాండ్ చేసేందుకు గురువారం ఉదయం బారామతి పోలీస్ స్టేషన్‌కు వెళ్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో రోహిత్ ఫిర్యాదును దర్యాప్తు నిమిత్తం సీఐడీకి పంపినట్టు పోలీసులు తెలిపారు.

### వెనకేసుకొచ్చిన వైమానిక మంత్రి

వీఎస్ఆర్ వెంచర్స్‌కు క్లీన్‌చిట్ ఇచ్చేందుకు డీజీసీఏ తొలుత ప్రయత్నించిందంటూ రోహిత్ ఆగ్రహం వెలిబుచ్చారు. ప్రమాదం జరిగిన వెంటనే పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కూడా వీఎస్ఆర్ సంస్థను వెనకేసుకొచ్చారని ఆయన ఆరోపించారు. విమానంలో భద్రతా లోపాలేవీ లేవని, అన్ని పరీక్షల తర్వాత దానికి డీజీసీఏ అనుమతులిచ్చిందని చెప్పారని గుర్తు చేశారు. ''ఆ విమానంలో లోపాలున్నట్టు ఇప్పుడు డీజీసీఏ చెబుతోంది. అయినా అనుమతులిచ్చిందంటే ఇందులో ఆ సంస్థ తప్పు కూడా ఉన్నట్టే'' అంటూ దుయ్యబట్టారు. వీఎస్ఆర్ సంస్థకు చెందిన నాలుగు విమాన సర్వీసులను తక్షణం నిలిపేయాలని డీజీసీఏ మంగళవారం ఆదేశించడం తెలిసిందే. ఇది తమ పోరాటానికి లభించిన పాక్షిక విజయమని రోహిత్ అన్నారు. ''కానీ వీఎస్ఆర్ తప్పిదాలకు మా నాయకుడు బలయ్యారు. ఏదో ఒకనాటికి అజిత్ కచ్చితంగా ముఖ్యమంత్రి అయ్యేవారు'' అని ఆవేదన వెలిబుచ్చారు. వీఎస్ఆర్‌కు చెందిన ఇతర విమాన సర్వీసులను ఎందుకు కొనసాగిస్తున్నారని డీజీసీఏను ప్రశ్నించారు. వాటన్నింటినీ తక్షణం నిలిపేయాలని డిమాండ్ చేశారు.

### రామ్మోహన్ రాజీనామా చేయాల్సిందే

వీఎస్ఆర్ వెంచర్స్‌కు ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ నేతలతో సన్నిహిత వ్యాపార సంబంధాలున్నాయని రోహిత్ పవార్ ఆరోపించారు. వీటన్నింటిపైనా లోతుగా దర్యాప్తు జరగాలన్నారు. పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడుది కూడా అదే పార్టీ అని గుర్తు చేశారు. ఆయన రాజీనామా చేసి తీరాల్సిందేనని పునరుద్ఘాటించారు. అందుకోసం ఒత్తిడి తెస్తూనే ఉంటానని రోహిత్ స్పష్టం చేశారు. ''అంతేగాక వీఎస్ఆర్ వెంచర్స్ యజమానిపై తక్షణం కేసు నమోదు చేయాలి. డీజీసీఏలోని సంబంధిత అధికారులపైనా కఠిన చర్యలు తీసుకోవాలి. అజిత్ ప్రయాణించిన విమానం ఫిట్‌గా ఉందని మహారాష్ట్రకు చెందిన వైమానిక సమన్వయ కంపెనీ 'యారో' తప్పుడు ధ్రువీకరణకు పాల్పడింది. అంతేగాక ప్రమాదం జరిగిన రోజు వాతావరణ పరిస్థితులు విమాన ప్రయాణానికి అనువుగా ఉన్నాయని కూడా పేర్కొంది. కనుక ఆ కంపెనీపైనా కేసు పెట్టాలి'' అని డిమాండ్ చేశారు.

## ముందస్తు బెయిల్ మంజూరు చేయండి

- రాజకీయ కారణాలతో నిందితుడిగా చేర్చారు
- రఘురామకృష్ణరాజు ఆరోపణల్లో వాస్తవం లేదు
- హైకోర్టులో సునీల్ కుమార్ నాయక్ పిటిషన్

సాక్షి, అమరావతి: కస్టోడియల్ టార్చర్ ఆరోపణలతో శాసనసభ ప్రస్తుత డిప్యూటీ స్పీకర్, మాజీ ఎంపీ రఘురామకృష్ణరాజు 2024లో ఇచ్చిన ఫిర్యాదుపై గుంటూరు నగరంపాలెం పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని బిహార్ కేడర్ ఐపీఎస్ అధికారి మేఘావత్ సునీల్ కుమార్ నాయక్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం తేలేంత వరకు తనకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రఘురామకృష్ణరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు తనను నిందితునిగా చేర్చలేదని సునీల్ నాయక్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. రాజకీయ కారణాలతో తనను 7వ నిందితుడిగా చేర్చారన్నారు. అధికారుల ఆదేశాల మేరకు ప్రాథమిక విచారణ మాత్రమే నిర్వహించానని తెలిపారు. సాక్షుల వాంగ్మూలాల్లో కూడా కేవలం తాను అక్కడ ఉన్నట్టు మాత్రమే ఉందని, టార్చర్‌కు పాల్పడినట్లు ఆధారాలు లేవని వివరించారు.రఘురామకృష్ణరాజు ఆరోపణల్లో వాస్తవం లేదని పేర్కొన్నారు. ఎలాంటి ఫోర్జరీకి పాల్పడ లేదని వివరించారు. రఘురామకృష్ణరాజును బెదిరించలేదని తెలిపారు.

### నన్ను లక్ష్యంగా చేసుకున్నారు

ఇది వరకు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను గుంటూరు కోర్టు కొట్టేయడంతో సిట్ పోలీసులు తనను అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. అరెస్ట్ యత్నాలు విఫలం కావడంతో ఏపీ సిట్ పోలీసులు ట్రాన్సిట్ రిమాండ్ కోసం పాట్నా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారని వివరించారు. కోర్టు ఆ ట్రాన్సిట్ రిమాండ్‌ను కూడా తిరస్కరించిందని తెలిపారు. ఏపీ సిట్ పోలీసులు తనను లక్ష్యంగా చేసుకుని అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.అందుకే ముందస్తు బెయిల్‌కోసం పిటిషన్ దాఖలు చేసినట్టు సునీల్ కుమార్ నాయక్ పేర్కొన్నారు.

# కోర్టులను మూసేయండి

## కోర్టు ఆదేశాలు అమలు చేసే ఉద్దేశం లేకపోతే ఆ పనే చేయండి

## ప్రజలకు, కక్షిదారులకు న్యాయం చేయలేకపోతే ఇక కోర్టులెందుకు?

- సీఎస్‌పై నిప్పులు చెరిగిన హైకోర్టు
- సీఎస్‌ను నాలుగు రోజులు జైల్లో ఉంచితే అందరూ దార్లోకి వస్తారు
- గ్రూప్-1 ఉద్యోగులను నాన్ ఫోకల్ పోస్టులకు బదిలీ చేయాలన్న కోర్టు ఆదేశాలను సీఎస్సే అమలు చేయకపోతే ఎలా?
- మిగిలిన వారికేం గౌరవం ఉంటుంది.. తద్వారా ఏం సందేశం ఇస్తున్నారు?
- ప్రభుత్వాధికారుల వల్ల న్యాయ వ్యవస్థపై నమ్మకం కోల్పోయే పరిస్థితి దాపురించింది
- మేం ఉన్నది ప్రజలకు న్యాయం చేయడానికి, న్యాయ వ్యవస్థ ప్రతిష్ట కాపాడటానికే
- ఈ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదు..
- ఫోకల్.. నాన్ ఫోకల్ పోస్టుల నిర్వచనం లేదని ఎలా చెబుతారు?
- 1966లోనే కార్యనిర్వాహక ఉత్తర్వులు.. వాటి ఆధారంగానే బదిలీలు
- అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌కు సైతం ఫోకల్, నాన్ ఫోకల్ గురించి తెలుసు
- ఆ అధికారులతో కుమ్మక్కయ్యారు కాబట్టే మా ఆదేశాలు పట్టించుకోలేదు
- ఆ అధికారులను బదిలీ చేసి తీరాల్సిందే.. విచారణ నేటికి వాయిదా




సాక్షి, అమరావతి :ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) విజయానంద్‌పై హైకోర్టు నిప్పులు చెరిగింది. కోర్టు ఆదేశాలను అమలు చేసే ఉద్దేశం లేకపోతే కోర్టులను మూసి వేయడం మంచిదని ఘాటుగా వ్యాఖ్యానించింది. ప్రజలకు, కక్షిదారులకు న్యాయం చేయలేకపోతే ఇక న్యాయస్థానాలు ఎందుకని ప్రశ్నించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శే కోర్టు ఆదేశాలను అమలు చేయకుంటే అతని కింద పని చేసే ప్రభుత్వ ఉద్యోగులందరికీ కోర్టు ఆదేశాలంటే ఏం గౌరవం ఉంటుందని నిలదీసింది. కోర్టు ఆదేశాలను అమలు చేయకపోవడం ద్వారా మిగిలిన అధికారులకు ఏం సందేశం ఇస్తున్నారని ఆయన్ను ప్రశ్నించింది. ప్రజలకు న్యాయం చేయడానికి, న్యాయ వ్యవస్థ ప్రతిష్టను కాపాడటానికే తాము ఇక్కడ ఉన్నామని, ఈ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. ప్రభుత్వాధికారుల తీరు వల్ల న్యాయ వ్యవస్థపై ప్రజలు నమ్మకం కోల్పోయే పరిస్థితి దాపురించిందని ఘాటుగా వ్యాఖ్యానించింది. త్వరలో పదవీ విరమణ చేయనున్న విజయానంద్‌ను నాలుగు రోజుల పాటు జైల్లో ఉంచితే అధికారులందరూ దార్లోకి వస్తారంది. కోర్టు ఆదేశాలను అమలు చేయవద్దని సలహా ఇస్తే ఎంత మాత్రం సహించేది లేదని స్పష్టం చేసింది. గ్రూప్–1 ప్రధాన పరీక్షలో ఉత్తీర్ణులై ప్రస్తుతం వివిధ పోస్టుల్లో కొనసాగుతున్న అధికారులను నాన్ ఫోకల్ (ప్రాధాన్యత లేని) పోస్టులకు బదిలీ చేయాలన్న తమ ఆదేశాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉద్దేశ పూర్వకంగానే అమలు చేయలేదని హైకోర్టు ఆక్షేపించింది.

### నాన్ ఫోకల్ పోస్టులకు బదిలీ చేయాలంటూ ఆదేశం..

గ్రూప్–1 ప్రధాన పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయంటూ దాఖలైన పలు వ్యాజ్యాలపై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ దేవానంద్ నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం ఈ నెల 11న ప్రభుత్వానికి పలు ఆదేశాలు జారీ చేసింది. గ్రూప్–1లో ఇప్పటికే ఎంపికై ప్రస్తుతం పలు చోట్ల ఉద్యోగాలు చేస్తున్న అధికారులను తక్షణమే నాన్ ఫోకల్ (ప్రాధాన్యత లేని) పోస్టులకు బదిలీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఓ వారంలో ఆ అధికారుల బదిలీలకు సంబంధించిన వివరాలతో ఓ నివేదికను రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు అందచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను ఆదేశించింది. ఈ వ్యవహారంపై మంగళవారం విచారణ జరిపిన ధర్మాసనం.. తమ ఆదేశాల మేరకు ఆ అధికారులను నాన్ ఫోకల్ పోస్టులకు బదిలీ చేయకపోవడంతో విజయానంద్ వ్యక్తిగత హాజరుకు ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే.

### ఏఐని అడిగితే ఏంటో తెలిసేదిగా..

ఈ వ్యాజ్యాలపై న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా తమ ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, తమ ముందు వ్యక్తిగతంగా హాజరైన సీఎస్ విజయానంద్‌ను ప్రశ్నించింది. తక్షణమే బదిలీ చేయాలని తాము ఈ నెల 11న ఆదేశాలిస్తే, ఇప్పటి వరకు వాటిని అమలు చేయలేదని, దీని బట్టి 'తక్షణమే' అన్న పదానికి సీఎస్‌కు అర్థం తెలిసినట్లు లేదని పేర్కొంది. తమ ఆదేశాలను అమలు చేసి తీరాల్సిందేనని, లేని పక్షంలో తాము తీసుకునే కోర్టు ధిక్కార చర్యలకు సిద్ధంగా ఉండాలని విజయానంద్‌కు తేల్చి చెప్పింది. ఈ సమయంలో అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ జోక్యం చేసుకుంటుండగా, సీఎస్ స్వయంగా తమ ముందు ఉన్నారని, ఆయన్నే అడిగి వివరాలు తెలుసుకుంటామని, ఈ దశలో మీ జోక్యం అవసరం లేదని ఏజీకి తేల్చి చెప్పింది. సర్వీసు నిబంధనల్లో ఫోకల్, నాన్ ఫోకల్ పోస్టుల నిర్వచనం లేదని ఏజీ చెప్పగా.. 1966లోనే ప్రభుత్వ కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేసిందని ధర్మాసనం గుర్తు చేసింది. ఈ ఉత్తర్వుల ఆధారంగానే ఫోకల్, నాన్ ఫోకల్ పోస్టులకు బదిలీలు జరుగుతూ వస్తున్నాయని తెలిపింది. ఫోకల్, నాన్ ఫోకల్ పోస్టులకు అర్థం తెలియకుంటే, నిఘంటువును చూసినా, ఏఐని అడిగినా తెలుస్తుందని పేర్కొంది. ఫోకల్, నాన్ ఫోకల్ పోస్టుల గురించి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌కు కూడా తెలుసని, కానీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాత్రం తెలియదని చెబుతున్నారంది. గ్రూప్–1 ప్రధాన పరీక్షలో ఉత్తీర్ణులై వివిధ పోస్టుల్లో కొనసాగుతున్న అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కుమ్మక్కయ్యారని, అందుకే వారిని నాన్ ఫోకల్ పోస్టులకు బదిలీ చేయాలన్న తమ ఆదేశాలను కావాలనే అమలు చేయడం లేదని తీవ్ర వ్యాఖ్యలు చేసింది.

### అధికారులను సమర్థించొద్దు

1966 నాటి ఉత్తర్వుల గురించి తమ అధికారులకు తెలిసి ఉండకపోవచ్చునని ఏజీ చెప్పగా, కోర్టు ఆదేశాలను అమలు చేయని ఓ అధికారిని సమర్థించేందుకు ఎందుకింత తాపత్రయ పడుతున్నారని ఏజీని ప్రశ్నించింది. తమ ఆదేశాలను అమలు చేసి, ఆ వివరాలను తమ ముందుంచాలని సీఎస్‌ను ఆదేశిస్తూ తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ సమయంలో ఏజీ స్పందిస్తూ, వ్యక్తిగత హాజరు నుంచి సీఎస్‌కు మినహాయింపు కావాలని కోరారు. తమ ఆదేశాలను అమలు చేస్తే వ్యక్తిగతంగా హాజరు కావాల్సిన అవసరం లేదని, అమలు చేయకుంటే మాత్రం హాజరు కావాల్సిందేనని ధర్మాసనం స్పష్టం చేసింది.

## రైతులకు 'ఐఏఆర్ఐ-ఫెలో' పురస్కారం

కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ నుంచి అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడు గ్రామానికి చెందిన ప్రగతిశీల రైతు బండారు శ్రీనివాసరావుకు, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్, పద్మశ్రీ అవార్డు గ్రహీత యడ్లపల్లి వేంకటేశ్వరరావుకు భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐఏఆర్ఐ)ఫెలోఫార్మర్ 2026 పురస్కారాలు వరించాయి. బండారు శ్రీనివాసరావు రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరవేయడంలో చేస్తున్నకృషికి అవార్డు వచ్చింది. మిల్లెట్స్ ప్రాసెసింగ్, అదనపు విలువల జోడింపు కోసం రైతుల్లో అవగాహన కల్పించడంలో వెంకటేశ్వరరావు చేస్తున్న కృషికి గానూ ఈ పురస్కారం లభించింది.. ఈ మేరకు బుధవారం ఢిల్లీలోని పూసాలో 'పూసా కృషి విజ్ఞాన మేళా–2026' వేదికగా కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు పురస్కారాలను అందుకున్నారు.

## అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ దరఖాస్తుల్ని ఆపండి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అనధికార, అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ కోసం వచ్చిన దరఖాస్తులను నిలుపుదల చేయాలని, తదుపరి ఉత్తర్వులు జారీచేసే వరకు వాటిని ప్రాసెస్ చేయొద్దని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని బుధవారం ఆదేశించింది. క్రమబద్ధీకరణ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలంది. ఈ మేరకు సాధారణ పరిపాలన, పురపాలక, పంచాయతీరాజ్ శాఖల ముఖ్య కార్యదర్శులకు, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్‌లకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అనధికార, అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం పురపాలక చట్టానికి సవరణలు చేసింది. ఆ తరువాత గత ఏడాది నవంబర్‌లో జీవో 225 జారీ చేసింది. చట్ట సవరణను, జీవోను రద్దు చేయాలని కోరుతూ ప్రకాశం జిల్లాకు చెందిన సీహెచ్.హరికృష్ణ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై బుధవారం విచారణ జరిపిన సీజే ధర్మాసనం తదుపరి ఉత్తర్వులు జారీచేసే వరకు ఆ దరఖాస్తులను ప్రాసెస్ చేయొద్దని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

## 27 మంది గ్రూప్-1 అధికారుల బదిలీ

సాక్షి, అమరావతి: హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రంలో 27 మంది గ్రూప్–1 అధికారులను బదిలీ చేస్తూ బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. 2018 బ్యాచ్‌కు చెందిన, ప్రస్తుత ఆర్డీఓ కేడర్‌లో ఉన్న వీరిని జీఏడీలో రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## డీజీపీ కార్యాలయానికి 25 మంది డీఎస్పీలు అటాచ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 25 మంది డీఎస్పీలను ప్రభుత్వం పోలీసు ప్రధాన కార్యాలయానికి అటాచ్ చేసింది. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈమేరకు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

## క్లుప్తంగా...

### స్కిల్స్ సౌత్ రీజినల్ పోటీల్లో సత్తా చాటిన ఏపీ

**సాక్షి, అమరావతి:** ఇండియా స్కిల్స్ సౌత్ రీజినల్ 2025–26 పోటీల్లో ఆంధ్రప్రదేశ్ సత్తా చాటింది. హైదరాబాద్‌లోని కన్హా శాంతి వనం వేదికగా జరిగిన పోటీల్లో రాష్ట్రానికి 23 పతకాలు లభించాయి. వీటిలో 2 బంగారు, 8 వెండి, 3 కాంస్య పతకాలతో పాటు 10 మెడలియన్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఉన్నాయి. ఇండస్ట్రీ 4.0, ఇండస్ట్రియల్ మెకానిక్స్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, ల్యాండ్ స్కేప్ గార్డెనింగ్ వంటి రంగాల్లో సాధించిన విజయాలు నైపుణ్యాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ బలాన్ని ప్రతిబింబిస్తున్నాయని ఏపీఎస్ఎస్‌డీసీఎండీ సీఈవో గణేష్ కుమార్ అన్నారు. విజేతలకు అభినందలు తెలిపారు.

### మండలి చైర్మన్‌తో ఎమ్మెల్సీ జయమంగళం భేటీ

**సాక్షి, అమరావతి:** రాజీనామా అంశంపై ఎమ్మెల్సీ జయమంగళం వెంకటరమణ బుధవారం మరోవిడత మండలి చైర్మన్ మోషేన్‌రాజు ఎదుట హాజరయ్యారు. శాసన మండలి నుంచి అందిన నోటీసు మేరకు ఆయన బుధవారం మండలి సమావేశాలు ముగిసిన అనంతరం చైర్మన్ ఛాంబర్‌కు వెళ్లి తన రాజీనామాకు వివరణ ఇచ్చారు. భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజీనామాకు తనను ఎవరైనా ప్రలోభపెట్టారా, లేదంటే ఎవరైనా బెదిరించారా అని చైర్మన్ అడిగారని, తాను స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు వివరించానని పేర్కొన్నారు.

### పాల కల్తీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి**

**సాక్షి, అమరావతి:** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కల్తీపాలు సరఫరా చేసిన వారితో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి బీఎస్ అమర్నాథ్ డిమాండ్ చేశారు. పాలుతాగి ఐదుగురు మరణించడం, ఎనిమిది మంది పరిస్థితి విషమంగా మారడం చూస్తే రాష్ట్రంలో ఆహార కల్తీ ఏ స్థాయిలో జరుగుతుందో అద్దం పడుతోందని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాలు, పాలపదార్థాలఉత్పత్తి, అమ్మకాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు దృష్టిసారించకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు అధికారుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని మండిపడ్డారు.

### అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లకు ప్రణాళికలు

**ఇందుకోసం బోర్డు, కమిటీలు ఏర్పాటు**

**సాక్షి, అమరావతి:** ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, గుంటూరు, పశ్చిమగోదావరి, ప్రకాశం, పల్నాడు, బాపట్ల, మార్కాపురం జిల్లాలతో కలిపి అమరావతి ఎకనామిక్ రీజియన్.. తిరుపతి, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు, అనంతపురం, వైఎస్సార్ కడప, శ్రీ సత్యసాయి, కర్నూలు, చిత్తూరు, నంద్యాల, అన్నమయ్య జిల్లాలతో కలిపి తిరుపతి ఎకనామిక్ రీజియన్లుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికా బోర్డు ఏర్పాటు చేసింది. ప్రణాళిక తయారీ, మాస్టర్‌ప్లాన్ అమలు, సమస్యల పరిష్కారం, కేంద్ర ప్రభుత్వ శాఖలతో సమన్వయం తదితరాల కోసం సీఎం అధ్యక్షతన స్టీరింగ్ కమిటీ, సీఎస్ అధ్యక్షతన ఎగ్జిక్యూటివ్ కమిటీ, సీఈవోల అధ్యక్షతన అమలు కమిటీలను నియమించింది. ఈ మేరకు ప్రణాళికా శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

### 'అవుట్ సోర్సింగ్ సిబ్బందికీ పథకాలు ఇస్తున్నాం'

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో పొరుగు సేవల (అవుట్ సోర్సింగ్) సిబ్బందికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్టు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. బుధవారం శాసన సభలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ఓ ప్రశ్నకు బదులిస్తూ.. 2025–26లో 26,138 మంది పొరుగు సేవల సిబ్బందికి లబ్ధి తల్లికివందనం, ఆటోడ్రైవర్ సేవ, మత్స్యకార సేవలో లబ్ధి చేకూర్చామన్నారు. అయితే, సభ్యులు గల్లా మాధవి, పల్లె సింధూరరెడ్డి మాత్రం రూ.10 వేల జీతంతో కుటుంబాలను లాక్కొస్తున్న చిరుద్యోగులకు ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు కావట్లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు.

### పీపీపీ విధానంలో 12 రోడ్లు

**మంత్రి జనార్దన్‌రెడ్డి**

**సాక్షి, అమరావతి :** రాష్ట్రంలో 709 కి.మీ మేర 12 రోడ్లను పీపీపీ విధానంలో అందుబాటులోకి తీసుకురానున్నామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి జనార్దన్ రెడ్డి అన్నారు. దీనికి సంబంధించి డీపీఆర్‌లూ సిద్ధం చేశామని పేర్కొన్నారు. పీపీపీ రహదారులకు రూ.5231 కోట్లు వ్యయం అవుతోందని, భూసేకరణ, ఇతర వ్యయాలు రూ.3 వేల కోట్లు అవుతాయని వివరించారు. శాసన సభలో బుధవారం 2026–27 సంవత్సరానికి రోడ్లు, భవనాల శాఖ గ్రాంట్‌పై మంత్రి మాట్లాడుతూ.. నిర్దేశించిన కాలం కంటే ముందే రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లను తీర్చిదిద్దామని చెప్పుకొచ్చారు. ఆర్అండ్‌బీ శాఖలో టెండర్ల ప్రక్రియలో జాప్యం లేకుండా నిబంధనలన్నీ సవరించామన్నారు. రవాణా శాఖ గ్రాంట్‌పై రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి చేసే నిబంధనను ప్రవేశపెట్టాలని యోచిస్తున్నామని పేర్కొన్నారు.

---

**ప్రజలను పీడిస్తున్న అనుమానాలు**

**ఏ పాలను నమ్మాలో అర్థం కాని పరిస్థితి**

# ఎన్నాళ్లుగా.. ఈ పాపాలు?

## మనం తాగుతున్నవి పాలేనా?

**రాజమహేంద్రవరం రూరల్/కడియం:** 'గంగిగోవు పాలు గరిటెడైనను చాలు.. కడివెడైననేమి ఖరము పాలు' అని ప్రజాకవి వేమన ఏనాడో ప్రశ్నించాడు. అయితే పాలను విషపూరితం చేస్తారని ఆయన కూడా ఊహించలేదు. లేదంటే 'కడివెడైననేమి గరళ పాలు' అనే వాడేమో! రాజమహేంద్రవరంలో ఆరుగురు మృతి చెందడంతో పాటు, 15 మంది ఆస్పత్రిపాలు కావడానికి పాలే కారణమని తేలడంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. అసలు మనం ప్రతి రోజూ తాగుతున్నవి పాలేనా! అన్న అనుమానం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజలను పట్టి పీడిస్తోంది. ఎన్నాళ్లుగా లేక ఎన్నేళ్లుగా ఈ కల్తీపాలను మనం వినియోగిస్తున్నాం? మన ఆరోగ్యాలపై ఇప్పటికే వాటి ప్రభావం మొదలైందా? సంపాదనే ధ్యేయంగా ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టి పాలను విషపూరితం చేస్తూ ఎన్నాళ్ల నుంచి వ్యాపారులు ఈ పాపాలను కొనసాగిస్తున్నారు? అన్న సందేహాలు కలుగుతున్నాయి. కల్తీ ప్యాకెట్ పాల కారణంగా క్యాన్సర్ తదితర దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడతామన్న అభిప్రాయంతో.. ఎంతోమంది స్వచ్ఛమైన పాలకోసం ఆరా తీస్తుంటారు. తమ సమీపంలో పాల అమ్మకందారుల నుంచి కొనుగోలు చేసి వినియోగిస్తుంటారు. ఇంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నా ప్రస్తుతం కల్తీ పాలు మరణాలకు కారణమయ్యాయంటే.. అసలు ఏం చేయాలో పాలుపోని అయోమయ స్థితిలోకి ప్రజలు వెళ్లిపోయారు.

### కల్తీ కా నామ్ పాడి!

కల్తీ జరిగేదాన్నే పాడి అంటారు! అని జనం సరిపెట్టుకోవాలేమో! ఎందుకంటే జిల్లాలో ప్రజల అవసరాలకు సరిపడా పాల ఉత్పత్తి జరగడం లేదన్నది వాస్తవం. డిమాండ్, సప్లయిల మధ్య ఉంటున్న భారీ వ్యత్యాసాన్ని కల్తీ పాల ద్వారానే పూడుస్తున్నారన్నది పచ్చినిజం! వివిధ సంస్థల ద్వారా సరఫరా అయ్యే పాల ప్యాకెట్‌లను పక్కన పెడితే అనాపాల సరఫరాదారులు ఎంతమంది ఉంటారు? వారు ఎన్ని పాలు అమ్ము తున్నారు? వారు ఎక్కడ నుంచి ఆ పాలను సేకరిస్తున్నారన్న సమాచారం కూడా ప్రభుత్వ యంత్రాంగం దగ్గర లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

### అటకెక్కిన మిల్క్ యాక్ట్

వినియోగదారులు, సరఫరాదారుల ప్రయోజనాలు కాపాడేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మిల్క్ యాక్ట్‌ను రూపొందించారు. ఈ యాక్టు ద్వారా పాల సరఫరాదారులను గుర్తించడం, పాల స్వచ్ఛతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే వ్యవస్థను రూపొందించారు. స్వచ్ఛమైన పాలు వినియోగదారులకు చేరే విధంగా వ్యవస్థకు రూపకల్పన చేశారు. పాల సరఫరాదారులను ప్రోత్సహించేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో ఉండే అమూల్ సంస్థను రాష్ట్రానికి తీసుకొచ్చారు. మిల్క్ యాక్ట్ ద్వారా మహిళాసంఘాల బలోపేతానికి కృషి చేశారు. అయితే చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ యాక్టును అమలును పట్టించుకోలేదు. దీంతో ప్రజలు వినియోగించే పాలు ఎన్ని? వాటిని సరఫరా చేసేవారు ఎంతమంది? వీటి నాణ్యత ఏపాటిది? తదితర అంశాలన్నీ గాల్లో లెక్కలుగానే మిగిలిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యం కారణంగా ఇప్పుడు ప్రజల ప్రాణాల మీదకు వచ్చింది.

### బ్రాండెడ్ డెయిరీలు కొంత నయం

పాలను సేకరించే సమయంలో బ్రాండెడ్ డెయిరీలు పలు జాగ్రత్తలు తీసుకుంటాయి. వాటి సొంత ల్యాబ్‌లలో పరీక్షలు చేసి మాత్రమే పాలను సేకరిస్తాయి. దీంతో అక్కడికి చేరే పాలల్లో కల్తీ జరిగేది తక్కువేనంటున్నారు. అంటే ప్రజలకు మాత్రం కల్తీ పాలనే అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లుగా భావించాల్సి వస్తోంది.

### భారీ స్థాయిలో మోసం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గేదెలు 1,85,000, ఆవులు 74వేలు ఉన్నట్టుగా పశు సంవర్ధకశాఖ లెక్కలు చెబుతున్నాయి. అంటే మొత్తం 2,59,000కుగాను పాలిచ్చే పశువులు 50 శాతం మాత్రమే ఉంటాయని అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన 1,29,500 పశువుల నుంచి రోజుకు 4.61 లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయంటున్నారు. తూర్పుగోదావరి జిల్లా జనాభా సుమారు 22 లక్షలు. సరాసరిన ప్రతి ఒక్కరూ రోజుకు సుమారు 300 మిల్లీలీటర్ల పాలు వినియోగిస్తారని అంచనా వేస్తే.. జిల్లా ప్రజల అవసరాలకే 6.60 లక్షల లీటర్ల పాలు కావాల్సి ఉంటుంది. కానీ ఉత్పత్తి అవుతున్న పాలు 4.61 లక్షల లీటర్లు మాత్రమేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అంటే రెండు లక్షల లీటర్ల పాలు కల్తీ చేసే ప్రజలకు అందిస్తున్నట్టుగా తెలుస్తోంది. ఈ లెక్కలు ప్రజల రోజూ వినియోగించే పాలకు సంబంధించినవి. ఇవి కాకుండా ప్రయివేటు డెయిరీలు సేకరించేవి, ఇతరత్రా అవసరాలకు సరఫరా అయ్యే పాలను కూడా పరిగణనలోకి తీసుకుంటే కల్తీ మరింత భారీగా పెరుగుతుందంటున్నారు.

### సాధారణ కల్తీ ఇలా..

పాల లభ్యత తక్కువగా ఉన్న సమయంలో వ్యాపారులు కల్తీకి తెగబడుతున్నారు. పాలకు రంగు, చిక్కదనం, నురుగును రప్పించేందుకు యూరియా, మైదా, డిటర్జెంట్‌లను వినియోగిస్తున్నట్టుగా చెబుతున్నారు. ఇవి కాకుండా పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు కూడా పలు రసాయనాలను వినియోగిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇది కాకుండా వెన్న తీసేసిన పాలకు కూడా జిడ్డును రప్పించేందుకు కూడా పలు పదార్థాలను వాడుతున్నారంటున్నారు. ప్రస్తుతం ఈ కల్తీ గుట్టును తేల్చాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపైనే ఉంది.

---

## చట్టసభల సాక్షిగా పచ్చి అబద్ధాలు

- తప్పుడు సమాచారమిస్తున్న చంద్రబాబు ప్రభుత్వం
- వాస్తవాలు చెప్పకపోతే సభాహక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తాం
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీల హెచ్చరిక
- స్వర్ణమ్మ గురించి ఏం తెలుసని మాట్లాడుతున్నారంటూ నిలదీత

**సాక్షి, అమరావతి:** చట్టసభల సాక్షిగా చంద్రబాబు ప్రభుత్వం పచ్చి అబద్ధాలు చెబుతోందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు మండిపడ్డారు. తమ ప్రశ్నలకు పొంతనలేని తప్పుడు సమాచారం ఇస్తూ సభను తప్పుదోవపట్టించడం నియమాలకు విరుద్ధమని చెప్పారు. సరైన సమాధానం ఇవ్వకపోతే సభాహక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బుధవారం వారు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు ఏమన్నారంటే..

### రేపు సాయంత్రానికి సమాధానం రాకపోతే ఫిర్యాదు చేస్తా

పోర్టులకు ఎంత ఖర్చుచేశారని అడిగితే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారు. తప్పుడు సమాచారంతో సభను తప్పుదోవ పట్టిస్తున్నారు. గత ప్రభుత్వంలో చేసిన ఖర్చులనే వాళ్లవిగా చెబుతున్నారు. ప్రభుత్వం మారగానే అంచనాలు ఎందుకు మార్చారని అడిగితే వివరాలు లేవంటున్నారు. ఆరు ఫిషింగ్ హార్బర్లు అసలు మొదలు పెడతారా లేదా అంటే సమాధానం లేదు. గురువారం సాయంత్రానికి సమాధానం రాకపోతే ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేస్తా. పోర్టుల అనుసంధానం వల్లనే రహదారులు అభివృద్ధి చెందుతున్నాయి. గత ప్రభుత్వంలో 50–60 శాతం పనులు చేస్తే, ఈ ప్రభుత్వంలో 5 శాతం కూడా చేయలేదు. జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతో తీసుకున్న చర్యల వల్లే జామాయిల్‌కు రూ.2 వేల నుంచి రూ.10 వేలకు పెరిగింది.

– తూమాటి మాధవరావు

### రాష్ట్రంలో కల్తీ మాఫియా

రాష్ట్రంలో కల్తీ మాఫియా నడుస్తోంది. ఏ మున్సిపాలిటీలో చూసినా డయేరియా విజృంభిస్తోంది. అరికడుతున్నాం.. అధికారులను పంపించాం.. రక్తనమూనాలు సేకరిస్తున్నాం.. బ్లీచింగ్ చల్లుతున్నాం.. అనడం తప్ప ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. వైద్యాన్ని ప్రైవేటుకి అమ్మేయడం వల్ల ఈ పరిస్థితి వస్తోంది. కల్తీపాల వల్ల ఆరుగురు చనిపోయారు. తురకపాలెంలో 60 మంది చనిపోతే అంతుబట్టని వ్యాధి అని మంత్రి అంటున్నారు. గ్రామంలో సరఫరా చేస్తున్నా మంచినీరు క్వారీలో నిల్వచేసిన నీరని, అది వద్దని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నా వినే నాథుడు లేడు. వాటర్ ట్యాంకు ఎక్కి ధర్నా చేసినా ప్రభుత్వం స్పందించలేదు. చనిపోయిన 60 మంది 18–50 ఏళ్ల ఎస్సీ, బీసీ పేదలే కదా.. వారికోసం ప్రభుత్వం స్పందించలేదు. డ్రైనేజీలో వాటర్ లీకేజీ అవ్వడం వల్ల డయేరియా వచ్చిందంటున్నారు. ఆ నీరు తాగుతున్నారంటే జనం ఏ పరిస్థితుల్లో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు కల్తీ ఆహారం వల్ల చనిపోతున్నారు. ఆస్పత్రుల పాలవుతున్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నందుకు ప్రజలు బాధపడుతున్నారు. గత ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ ద్వారా ఫీవర్ సర్వే చేసేవారు. జనం చచ్చిపోయిన తర్వాత ప్రభుత్వం, మంత్రి చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. ఇంకెప్పుడు తీసుకుంటారు. కనీసం సంబంధిత శాఖల, జిల్లాల మంత్రులు, అధికారులు బాధితుల దగ్గరకు వెళ్లి వాస్తవాలను పరిశీలించారా? ఫోన్లో సంప్రదిస్తే సరిపోతుందా. రూ.10 లక్షలు పరిహారం కల్తీపాల వల్ల చనిపోయిన వారికి, రూ.5 లక్షలు శ్రీకాకుళం డయేరియా బాధితులకు ఇస్తామంటున్నారు. అదేమాత్రం సరిపోదు. జగన్ మీద కోపంతో సచివాలయ వ్యవస్థను పాడుచేయవద్దని ప్రభుత్వాన్ని కోరుతున్నా.

– మొండితోక అరుణ్‌కుమార్

### ఆరోగ్యశ్రీ బకాయిలేవి?

ఆరునెలల ముందు నెట్‌వర్క్ ఆస్పత్రులన్నీ ఆరోగ్యశ్రీ బకాయిల కోసం ఆందోళన చేస్తే వెంటనే విడుదల చేస్తామని ప్రభుత్వం చెప్పింది. ఇంత వరకు బకాయిలు విడుదల చేయలేదు. గత ప్రభుత్వంలో జగన్ కార్పొరేట్ వైద్యాన్ని పేదలకు అందేలా చేశారు. ఇప్పుడు ఆస్పత్రుల నిర్వహణకు డబ్బులు లేవు. రాష్ట్రంలో కల్తీపాలు, డయేరియా వల్ల పేదప్రజలు అనారోగ్యం పాలై ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. రూ.లక్షలు వెచ్చించాల్సి వస్తోంది. వారికి ఆరోగ్యశ్రీతో వైద్యం అందేలా చేయాలంటే ఆస్పత్రులకు బకాయిలు విడుదల చేయాలి.

– సిపాయి సుబ్రహ్మణ్యం

### స్వర్ణమ్మ గురించి మీకేం తెలుసు?

అసెంబ్లీ సాక్షిగా దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఆయన భార్య స్వర్ణమ్మ గురించి ప్రస్తావించారు. వారు హిందూ వ్యతిరేకులని, క్రిష్టియన్లని సీఎం స్థాయి వారు మాట్లాడటం దారుణం. స్వర్ణమ్మ గురించి మీకేం తెలుసని అడుగుతున్నాను. ఆమె నిత్యం పూజలెన్నో చేస్తారు. బైబిల్ పట్టుకుంటే క్రిస్టియన్ అయిపోయినట్టేనా? మీరెప్పుడూ పట్టుకోలేదా? హిందూ దేవాలయాల అభివృద్ధికి జగన్ ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. అనేక ఆలయాలు గత ప్రభుత్వంలో పునర్నిర్మించారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోను దేవాలయాలను కట్టించారు జగన్. అంతర్వేదిలో రథం కాలిపోతే ఆగమేఘాల మీద కొత్త రథాన్ని జగన్ తయారు చేయించారు. ఇలా అనేక విధాలుగా హిందూ సమాజాన్ని, సంప్రదాయాన్ని కాపాడారు. దివంగత వైఎస్సార్ 21 మందితో ధార్మికపరిషత్ ఏర్పాటుకు చట్టసవరణ చేశారు. ధూపదీప నైవేద్యాలు లేని దేవాలయాలకి నిధులు కేటాయించారు. అలాంటి వారిమీద అవాస్తవాలు మాట్లాడుతున్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు.

– కల్పలతరెడ్డి

### కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే దాన్ని విస్మరించారు. యాక్ట్ నం.30 ప్రకారం వారందరినీ పర్మినెంట్ చేయాలి.

– ఎం.వి.రామచంద్రరావు

### పిల్లల ఉసురు తగులుతుంది

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో ఆహారం కల్తీ గురించి సభలో ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. హాస్టళ్లలో ఎలాంటి ఆహార కల్తీ జరగలేదని, ఎవరికీ అనారోగ్యం కలుగలేదని సత్యదూరమైన మాటలు చెప్పారు. అయితే హోం మంత్రి స్వయంగా ఓ హాస్టల్‌లో తనిఖీకి వెళ్లి భోజనం చేస్తుండగా, అందులో బొద్దింక వచ్చిన వీడియో వెలుగులోకి వచ్చింది. నారావారి బొద్దింక భోజనం పెడుతూ అంతా బాగుందంటున్నారు. నేను స్వయంగా పలు హాస్టళ్లను పరిశీలిస్తే అక్కడ విద్యార్థులు ఉడికీ ఉడకని అన్నం, నీళ్లలా ఉండే పప్పు తింటున్నారు. వారికి ఎక్స్‌పెయిరీ అయిన మందులు ఇస్తున్నారు. ఆ పిల్లల ఉసురు చంద్రబాబు ప్రభుత్వానికి తప్పకుండా తగులుతుంది.

– రమేష్‌యాదవ్

### చంద్రబాబు హిందూద్రోహి

సుబ్బారెడ్డి భార్య పూర్తిగా హిందూ. కూటమి నేతల భార్యలుగానీ, టీటీడీ చైర్మన్ భార్యగానీ ఆమెలా తిరుమల కోసం మాట్లాడగలరా? తీసుకురండి చూద్దాం. సిట్ నివేదికలో జంతువుల కొవ్వు లేదని చెప్పిన తర్వాత కూడా డైవర్షన్ పాలిటిక్స్ చేశారు. ఇందాపూర్ సంస్థకు ఎక్కువ రేటుకు నెయ్యి కాంట్రాక్టు కట్టబెట్టారు. ఇందాపూర్ డెయిరీ చంద్రబాబు హయాంలో వచ్చినదే. లడ్డూ ప్రసాదంపై నిరాధారంగా తప్పుడు ప్రచారం చేసి చంద్రబాబు హిందూద్రోహిగా మిగిలారు.

–వరుదు కళ్యాణి

---

**నాటి ప్రణాళికలే..**

# నేటి ప్రగతికి బాటలు

## హార్బర్-భోగాపురం కోస్టల్ కారిడార్ పట్టాలెక్కేందుకు సిద్ధం

- రూ.6,289 కోట్లతో విశాఖ తీరాన ఆవిష్కృతమవుతున్న మెగా ప్రాజెక్టు
- ఆరు లేన్ల ఎక్స్‌ప్రెస్‌వేతో మారనున్న తీరప్రాంత రూపురేఖలు
- గత ప్రభుత్వ హయాంలో డీపీఆర్, మాస్టర్‌ప్లాన్‌లో రూపకల్పన

పట్టాలెక్కనున్న ప్రాజెక్టు

**విశాఖ సిటీ:** ఒక నగరం ప్రపంచస్థాయి మెట్రోపాలిటన్‌గా ఎదగాలంటే కేవలం ఆకాశహర్మ్యాలు ఉంటే సరిపోదు, పటిష్టమైన మౌలిక సదుపాయాలు ఉండాలి. సరిగ్గా ఇదే దూరదృష్టితో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశాఖ అభివృద్ధికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మార్చే కీలక ప్రాజెక్టులకు పునాదులు వేయగా, అవే ఇప్పుడు ప్రగతికి దిక్సూచిగా మారాయి. అందులో ప్రధానమైన 'వైజాగ్ కోస్టల్ హైవే' ప్రాజెక్టు ఇప్పుడు పట్టాలెక్కడానికి సిద్ధమవుతోంది. విశాఖ ఓడరేవు నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వరకు ఆరు వరుసల ఎక్స్‌ప్రెస్‌కు అడుగులు పడుతున్నాయి. ఈ ప్రాజెక్టు కేవలం ట్రాఫిక్ సమస్యలను తీర్చడమే కాకుండా, పర్యాటక, పారిశ్రామిక రంగాలకు కొత్త ఊపిరి పోయనుంది. సుమారు 55 కిలోమీటర్ల పొడవు, 60 మీటర్ల వెడల్పుతో తీరం వెంబడి సాగే ఈ రహదారి అభివృద్ధికి త్వరలోనే అంకురార్పణ జరగనుంది.

ప్రస్తుతం ఈ ప్రాజెక్టు అమలు దశలోకి అడుగుపెడుతోంది. హార్బర్ నుంచి కైలాసగిరి వరకు ఉన్న 30 మీటర్ల రహదారిని 40 మీటర్లకు, అక్కడి నుంచి భోగాపురం వరకు 60 మీటర్లకు విస్తరించనున్నారు. రుషికొండ సమీపంలో ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్ ఈ ప్రాజెక్టుకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. సముద్ర అందాలకు ఆటంకం కలగకుండా, భూసేకరణ సమస్యలు తలెత్తకుండా దీనిని రూపకల్పన చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇప్పటికి దీనిపై దృష్టి సారించింది. గతంలో ఉన్న ప్లాన్‌కు చిన్నపాటి సాంకేతిక మార్పులు చేస్తోంది. ముఖ్యంగా ఎలివేటెడ్ కారిడార్ పొడవును పెంచడం, భీమిలిలో నేరేళ్లవలస కొద్దిగా ముందగానే రహదారిని మళ్లిస్తూ డిజైన్లను మార్పు చేసింది. ఈ మార్పుతో ఇంకా కొంత మేర భూ సేకరణ చేపట్టాల్సి వస్తోంది. భీమిలి నుంచి భోగాపురం వరకూ 19.66 కిలోమీటర్ల మేర గ్రీన్ ఫీల్డ్ కారిడార్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం సుమారు 350 ఎకరాలు సేకరించాల్సి ఉంటుంది. ఈ కోస్టల్ కారిడార్ ప్రాజెక్టు భూసేకరణకు రూ.4,315 కోట్లు, నిర్మాణాలకు రూ.1,974 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టును రెండు లేదా మూడు రీచ్‌లుగా విభజించి పనులు చేపట్టనున్నారు. వైజాగ్ కోస్టల్ హైవే కేవలం ఒక రోడ్డు ప్రాజెక్ట్ మాత్రమే కాదని, ఇది విశాఖను గ్లోబల్ సిటీగా మార్చే క్రమంలో ఒక కీలక అడుగుగా పారిశ్రామికవేత్తలు అభివర్ణిస్తున్నారు. ఐటీ రంగానికి నిలయమైన రుషికొండ, పర్యాటక ప్రాంతమైన భీమిలి, అంతర్జాతీయ విమానాశ్రయం భోగాపురం.. ఈ మూడింటిని కలిపే ఈ రహదారి ఉత్తరాంధ్ర ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చేస్తుందని భావిస్తున్నారు.

### నాడు అంతర్జాతీయ ప్రమాణాలతో రూపకల్పన

విశాఖను గ్లోబల్ హబ్‌గా మార్చాలనే సంకల్పంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ కోస్టల్ కారిడార్‌కు అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. ఈ ప్రతిపాదనలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, వీఎంఆర్‌డీఏ బృహత్తర ప్రణాళికలో చేర్చింది. విశాఖ నగరం నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి వేగవంతమైన ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు 'సిక్స్ లేన్' డిజైన్లను ఖరారు చేసింది. భారీ వ్యయంతో కూడిన ఈ ప్రాజెక్టు కోసం భూసేకరణ విషయంలో గత ప్రభుత్వం సాహసోపేత అడుగులు వేసింది. వీఎంఆర్‌డీఏ ద్వారా సుమారు 55 కిలోమీటర్ల మేర సాగే ఈ కారిడార్ కోసం ల్యాండ్ పూలింగ్ పద్ధతిని అనుసరించి రైతులకు మేలు చేసేలా చర్యలు తీసుకుంది. క్షేత్రస్థాయిలో అడ్డంకులను తొలగించి ప్రాజెక్టు పనులు వేగవంతం చేసేందుకు ప్రత్యేక అధికారులను నియమించడమే కాకుండా, పారదర్శకమైన రీతిలో మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయించింది. కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరిపి, రూ. 6,289 కోట్ల వ్యయం అయ్యే ఈ రహదారిని జాతీయ రహదారిగా గుర్తింపజేయడంలో సఫలీకృతమైంది.

---

## పాలు తాగినా.. నీళ్లు తాగినా చనిపోతున్నారు

- ముందస్తు చర్యలు తీసుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలం
- 'మండలి' ప్రశ్నోత్తరాల్లో ప్రభుత్వ వైఫల్యాలపై ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ సభ్యులు ఫైర్

**సాక్షి, అమరావతి :** ఈ ప్రభుత్వంలో పాలు తాగినా.. నీళ్లు తాగినా జనం చనిపోతున్నారని, ముందస్తు చర్యలు తీసుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వం వైఫల్యం ఉందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పీవీవీ సూర్యనారాయణరాజు ఆరోపించారు. శాసన మండలి ప్రశ్నోత్తరాల్లో బుధవారం ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ సభ్యులు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. శ్రీకాకుళం జిల్లాలో నీటి కలుషితంతో 67 మంది ఆస్పత్రి పాలయ్యారని, ఇద్దరు మృతిచెందారని, అక్కడ ప్రభుత్వం ఇప్పటివరకు తీసుకున్న చర్యలేమిటని సూర్యనారాయణరాజు ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజలకు మేలుచేసే వ్యవస్థలను ప్రభుత్వాలు కొనసాగిస్తాయని, ఈ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను సరిగ్గా ఉపయోగించుకోకపోవడంతో కిందిస్థాయిలో సమస్యలు గుర్తించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

### నీటి నిర్వహణ లోపంవల్లే డయేరియా..

మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వం వచ్చాక తన నియోజకవర్గంలోని గుర్లలో డయేరియా వచ్చిందని, ఇప్పుడు శ్రీకాకుళంలో వచ్చిందని, నీటి నిర్వహణలో లోపంవల్లే ఈ సమస్య తలెత్తుతోందన్నారు. దీనిపై మండలి చైర్మన్ మోషేన్‌రాజు స్పందిస్తూ.. పైపులైన్ల లీకేజీలతో డ్రెయిన్ నీరు కలిసి ఎక్కువగా కలుషితం అవుతోందని.. నీటి నాణ్యతపై మున్సిపల్, పంచాయతీరాజ్, ఆరోగ్య శాఖలు సమన్వయంతో దృష్టిపెట్టాలన్నారు. డయేరియా నివారణకు ప్రతి మంగళవారం నీటి శాంపిల్స్ సేకరించి చర్యలు చేపడుతున్నామని మంత్రి సత్యకుమార్ బదులిచ్చారు.

### కిడ్నీ పేషెంట్లకు పెన్షన్ ఇవ్వడంలేదు : చైర్మన్

డయాలసిస్ చేయించుకునే కిడ్నీ పేషెంట్లకు సీరం క్రియాటినిన్ సాధారణంగా ఉందని చెప్పి పెన్షన్ ఇవ్వడంలేదని, డయాలసిస్ అయినప్పుడు సీరం క్రియాటినిన్ సాధారణంగానే ఉంటుందని, రెండ్రోజులకే అది పెరుగుతుందని, అది సాధారణంగా ఉందనే నెపంతో పెన్షన్ ఇవ్వకపోవడం సరికాదని మండలి చైర్మన్ మోషేన్‌రాజు ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి తెచ్చారు. రాష్ట్రంలో డయాలసిస్ యూనిట్లపై ప్రశ్న సందర్భంగా చైర్మన్ ఈ మేరకు స్పందించారు. కాగా, రాష్ట్రంలోని భోగాపురం విమానాశ్రయం విషయంలోను క్రెడిట్ చోరీ జరిగిందని, వాస్తవానికి ఆ విమానాశ్రయం పూర్తిచేయడంలో గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి ఉందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పీవీవీ సూర్యనారాయణరాజు స్పష్టంచేశారు. భోగాపురం విమానాశ్రయం శంకుస్థాపన నాటికి అన్ని అనుమతులు తీసుకున్నామని మంత్రి చెబుతున్నారని, వాస్తవానికి.. 2014–19 మధ్య టీడీపీ హయాంలో ఎన్నికల ముందు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా, భూసేకరణ చేయకుండా శంకుస్థాపన చేశారని ఆయన గుర్తుచేశారు.

# శ్రీకరము... శుభకరము యాదగిరీశుని కళ్యాణోత్సవము!

అభయ ప్రదాతగా... భక్తులను వెన్నంటి ఉండే ఆపద్బాంధవుడిగా యాదగిరీశుని భక్తులు కొలుస్తుంటారు. పిలిచిన వెంటనే పలికే ఆప్తుడిగా... అందరి స్వామిగా భక్త జనుల గుండెల్లో కొలువై ఉన్న యాదగిరీశుడు సౌభాగ్య ప్రదాయిని లక్ష్మీదేవితో సహా కొలువైన క్షేత్రం యాదగిరి నృసింహుడి సన్నిధి. ఈ క్షేత్రంలో గత బుధవారం ఫిబ్రవరి 18న ఆరంభమైన శ్రీస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 28 వరకు కొనసాగనున్నాయి. ప్రధాన ఘట్టాలైన శ్రీస్వామి వారి ఎదుర్కోలు మహోత్సవం మంగళవారం, శ్రీస్వామి వారి తిరు కల్యాణోత్సవం బుధవారం జరగగా శ్రీస్వామి దివ్య విమాన రథోత్సవం అర్చకులు నేడు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలతో యాదగిరి క్షేత్రం బ్రహ్మోత్సవ శోభను సంతరించుకోవడంతో పాటు ఆధ్యాత్మిక అనుభూతిని ఇస్తోంది.

యాదగిరి లక్ష్మీనరసింహుడి రూపం ఉగ్రం. మనస్సు నవనీతం. ఘనసింహం గర్జిస్తున్నట్లు.. ముల్లోకాలను వణికించే మృగరాజు పంజా విసురుతున్నట్లు హిరణ్య కశపుడిని రక్కి, చీల్చి చండాడిన ఆ దేవుడి చేతులు ఆది మహాలక్ష్మిని మాత్రం అతి సున్నితంగా అక్కున చేర్చుకున్నాయి. సృష్టికర్త బ్రహ్మకే ఆయువు పోసిన బ్రహ్మాండ నాయకుడని పురాణాలు ఘోషిస్తున్నాయి.

### బ్రహ్మోత్సవాల్లో అలంకార, వాహన సేవలు ఇవే...

శ్రీలక్ష్మీనరసింహస్వామి వారు అలంకార ప్రియుడు కావడంతో యాదగిరీశుడి క్షేత్రం అర్చకులు వార్షిక బ్రహ్మోత్సవాల్లో మూడవ రోజు నుంచి అలంకార సేవలను ప్రారంభిస్తారు. 20వ తేదీన ఉదయం మత్స్యావతార అలంకార సేవ, రాత్రి శేష వాహన సేవ, 21వ తేదీ ఉదయం వటపత్రశాయి అలంకార సేవ, రాత్రి హంసవాహన సేవ, 22వ తేదీ ఉదయం శ్రీ కృష్ణాలంకార సేవ, రాత్రి పొన్నవాహన సేవ, 23వ తేదీ ఉదయం గోవర్ధనగిరిధారి అలంకార సేవ, రాత్రి సింహ వాహన సేవ, 24వ తేదీ ఉదయం జగన్మోహిని అలంకార సేవ, రాత్రి అశ్వవాహన సేవలో శ్రీస్వామి వారి ఎదుర్కోలు ఉత్సవం, 25వ తేదీ ఉదయం శ్రీరామ అలంకార (హనుమంత వాహన సేవ), రాత్రి గజ వాహన సేవలో శ్రీస్వామి వారు పెండ్లి కొడుకుగా కల్యాణ వేదికపై తిరు కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగాయి. నేటి ఉదయం అంటే గురువారం శ్రీమహావిష్ణు వాహనమైన గరుడ వాహన సేవతో అలంకార సేవలు ముగుస్తాయి. రాత్రి దివ్య విమాన రథోత్సవం ఉంటుంది.

**చివరి రెండు రోజులు ఇలా..** ఉత్సవాల్లో చివరి రెండు రోజులు సైతం విశేష పర్వాలను చేపడతారు. 27వ తేదీన ఉదయం 10.30గంటలకు మహా పూర్ణాహుతి, చక్రతీర్థం, విష్ణు పుష్కరిణిలో అవభృదస్నానం జరిపిస్తారు. అదే రోజు రాత్రి వేళ శ్రీపుష్పయాగం, దేవతోద్వాసన, దోపు ఉత్సవాలను జరిపిస్తారు. చివరి రోజైన 28వ తేదీన ఉదయం 10 గంటలకు శ్రీస్వామి వారికి అష్టోత్తర శతఘటాభిషేకం జరిపించి, రాత్రి 9 గంటలకు శృంగార డోలోత్సవాన్ని నిర్వహించి ఉత్సవాలకు పరి సమాప్తి పలుకుతారు

### పురాణాల పరంగా...

యాదగిరి ప్రశస్థికి సంబంధించి ఎన్నో ఇతిహాసాలు రామాయణ మహాకావ్యంలోనూ ప్రస్తావనలున్నాయి. మహాజ్ఞాని విభాండకుడి కుమారుడు రుష్యశృంగుడు. అతడి పుత్రుడైన యాద మహర్షి తపో శక్తితోనే యాదగిరి గుట్ట వెలసిందంటారు. యాదుడు బాల్యం నుంచి మహా విష్ణుభక్తుడు. దేవదేవుడిని తిలకించాలన్న తపన నానాటికి పెరిగింది. అందులోనూ ఉగ్రరూపుడైన నృసింహావతారం పట్ల ఎనలేని మక్కువ కలిగింది. దైవసాక్షాత్కారం కోసం దట్టమైన అడవుల్లో తిరుగుతూ కొండజాతికి చిక్కాడు. ఆటవికులు యాదుడిని క్షుద్ర దేవతలకు బలి ఇవ్వబోయారు. ఆపద సమయంలో ఆంజనేయుడు అండగా నిలిచాడు. కీకారణ్యంలో సింహాకార గుట్టలు ఉన్నాయని, అక్కడికి వెళ్లి తపస్సు చేస్తే స్వామి సాక్షాత్కరిస్తాడని యాదుడికి ఆంజనేయుడు సూచించాడు. యాదర్షి దీర్ఘకాలిక తపస్సు ఫలించి స్తంభోద్భవుడు తొలుత జ్వాల, గండబేరుండ, యోగనంద, ఉగ్రసింహ, శ్రీలక్ష్మీ సమేతుడిగా (పంచరూపాలతో) దర్శనమివ్వడంతో ఈ క్షేత్రం పంచనారసింహ నిలయంగా పురాణాలకెక్కింది. యాద రుషి కోరిక ఫలితంగా వెలసిన ఈ క్షేత్రం యాదగిరిగుట్టగా ప్రసిద్ధి చెందింది.

### రక్షణగా సుదర్శన చక్రం...

తపోముద్రలో ఉన్న మహర్షిని మింగేయాలని ప్రయత్నించిన ఒక రాక్షసుడిని మరుక్షణమే విష్ణుమూర్తి సుదర్శన చక్రం అడ్డుకుని వధించింది. ఆటంకాలు, ఆపదలు కలగకుండా గుట్ట చుట్టూ సుదర్శనం రక్షా కవచంగా నిలిచి ఉంటుందన్నది భక్తుల అపార విశ్వాసం. ప్రస్తుతం ఈ విమాన గోపురం, సుదర్శన చక్రం స్వర్ణమై భక్తులను ఆకట్టుకుంటోంది. ఇక స్వామి పుష్కరిణి సాక్షాత్తూ బ్రహ్మ కడిగిన పాదాల నుంచే పుట్టిందంటారు. ఈ పుష్కరిణిలో పుణ్యస్నానం ఆచరిస్తే శారీరక రుగ్మతలు, గ్రహబాధల నుంచి విముక్తి కలుగుతుందని భక్తులు అంటుంటారు. ఎంతోకాలంపాటు మరుగున పడిపోయిన ఈ క్షేత్ర మహాత్మ్యాన్ని స్థానిక గ్రామాధికారి గుర్తించారు. స్వామి కలలో కనిపించిన తన అవతార రహస్యాన్ని చెప్పాడట. హైదరాబాద్ వాస్తవ్యుడు రాజామోతీలాల్ 1920లో ఆలయాన్ని నిర్మించి పూజాదికాలు పునరుద్ధరించారని చరిత్ర చెబుతోంది. ఆయన హయాంలోనే పాంచరాత్ర ఆగమ శాస్త్ర విధానంతో పూజలు మొదలయ్యాయని స్థానికులు చెబుతారు.

– ఫొటోలు, విశేషాలు
**-కల్లెం సంపత్,**
సాక్షి, యాదగిరిగుట్ట

---

● రంజాన్ కాంతులు

# రోజాతో దైవ క్షమాభిక్ష

**పవిత్ర రమజాన్ మాసం ముస్లింల ఆధ్యాత్మిక జీవితంలో అత్యంత పవిత్రమైన, పరమార్థభరితమైన కాలం. ఇది కేవలం ఉపవాసాల సమాహారం మాత్రమే కాదు; మనసును శుద్ధి చేసే సాధనం, సరైన జీవన దిశను సూచించే శిక్షణాకాలం. ఈ నెల మానవుల అంతరంగాన్ని మార్చే శక్తిని కలిగివుంది. ఖురాన్, హదీసుల వెలుగులో రమజాన్ అసలు ఉద్దేశాన్ని పరిశీలిస్తే, ఇది ఆత్మపరిశీలన, తఖ్వా, క్షమాభిక్ష, సమాజ శ్రేయస్సు కోసం వచ్చిన అరుదైన అవకాశమని అర్థమవుతుంది.**

పవిత్ర ఖురాన్ లో అల్లాహ్ ఇలా ప్రకటించాడు:

'విశ్వాసులారా! మీ పూర్వీకులపై ఉపవాసం ఎలా విధిగా నిర్ణయించబడిందో, అలాగే మీపై కూడా నిర్ణయించబడింది. దీనివల్ల మీలో భయభక్తులు (తఖ్వా) జనించే అవకాశం ఉంది. ( సూరె బఖరా 2 : 183)

దైవప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు: 'ఎవరైతే విశ్వాసంతో, ప్రతిఫలాపేక్షతో రమజాన్ ఉపవాసాలు పాటిస్తారో, వారి గత పాపాలు క్షమించబడతాయి.' (సహీహ్ బుఖారీ). ఇది ఎంతటి మహత్తర వాగ్దానం! మన గత తప్పిదాలు ఎన్ని ఉన్నా, నిజమైన తౌబాతో, నిజాయితీతో ఈ నెలను గడిపితే, దేవుని క్షమాభిక్ష ద్వారాలు మనకోసం తెరుచుకొని వుంటాయి.

రమజాన్ మనిషిలో కరుణను పెంచుతుంది. ఆకలితో అలమటించే పేదవాడి బాధను అర్థం చేసుకునే గుణం అలవర్చుతుంది. అందుకే ఈ నెలలో జకాత్, సదఖా, ఫిత్రా వంటి దాన ధర్మాలకు అత్యంత ప్రాధాన్యం ఉంది. ఉపవాసం వ్యక్తిగత ఆధ్యాత్మిక సాధన అయితే, దానం సామాజిక బాధ్యత. ఈ రెండూ కలిసినప్పుడు మాత్రమే రమజాన్ సంపూర్ణమవుతుంది.

అదే సమయంలో రమజాన్ ఆత్మపరిశీలనకు పిలుపునిస్తుంది. మన మాటల్లో, చేతల్లో, వ్యవహారంలో, ఆలోచనల్లో ఏ మేరకు మార్పు వచ్చిందో తెలుసుకునే అవకాశం కల్పిస్తుంది. కేవలం పగలు ఆకలితో ఉండి, రాత్రి కడుపునిండా తిని పడుకుంటే అది రమజాన్ ఆత్మకు విరుద్ధం. ఉపవాసం మన నాలుకను అబద్ధాల నుంచి, మన కళ్ళను అనుచిత దృశ్యాల నుంచి, మన హృదయాన్ని ద్వేషం నుంచి కాపాడాలి.

ప్రవక్త (స) హెచ్చరించారు: 'ఎవరైనా అబద్ధాన్ని, చెడు ప్రవర్తనను విడిచిపెట్టకపోతే, కేవలం తినడం, తాగడం మానుకోవడం వల్ల ఎలాంటి ఉపయోగంలేదు, అల్లాహ్‌కు అలాంటి ఉపవాసం అవసరం లేదు.' (సహీహ్ బుఖారీ). ఈ రమజాన్ మన జీవితంలో ఒక మలుపు కావాలి. ఖురాన్‌తో మన బంధాన్ని పునరుద్ధరించుకోవాలి. నమాజులను క్రమబద్ధంగా చెయ్యాలి. తహజ్జుద్, తరావీహ్ లతో రాత్రులను ప్రకాశవంతం చేయాలి. దేవుని ముందు మోకరిల్లి కడుదీనంగా దుఆ చేయాలి. సమాజంలో శాంతి, సహనం, సోదరభావం, పరస్పర గౌరవాన్ని పెంపొందించాలి.

ఈసారి రమజాన్ ఎలా గడపాలన్న దానిపై ఒక స్పష్టతకు రావాలి. ఖురాన్‌ను కేవలం పారాయణం చేయడమే కాదు, అర్థం చేసుకోడానికి, అమలు చేయడానికి ప్రయత్నించాలి. చెడు అలవాట్లు ఏమైనా ఉంటే వెంటనే విసర్జించాలి. మంచిని అలవాటు చేసుకోవాలి.

రమజాన్ కేవలం ముప్పై రోజులు కాదు; అది మిగిలిన పదకొండు నెలలకు దారి చూపే శిక్షణగా మలచుకోవాలి. ఈ నెలలో మనం నేర్చుకున్న నియంత్రణ, సహనం, దైవభీతి సంవత్సరం పొడవునా కొనసాగితేనే రమజాన్ ఆచరణలకు ఫలితం ఉంటుంది. అల్లాహ్ మనకు ఈ రమజాన్ లో పటిష్ట విశ్వాసం, పరిపూర్ణ ఆరోగ్యం ప్రసాదించి, తఖ్వాతో కూడిన జీవితం గడిపే భాగ్యాన్ని ప్రసాదించాలని కోరుకుందాం.

**- మదీహా అర్జుమంద్**

---

# గ్రహణంలోనూ తెరిచే ఉండే ఆలయాలు

**సాధారణంగా గ్రహణాల సమయంలో దేవాలయాలను మూసివేసి, గ్రహణం తర్వాత ఆలయాన్ని సంప్రోక్షణతో శుద్ధి చేసి భక్తుల సందర్శనార్థం అనుమతించడం అనేది ఆచారం. కానీ కొన్ని ప్రత్యేక నమ్మకాలు, ఆచారాల కారణంగా గ్రహణ సమయంలో సూతక కాలంలో కూడా కొన్ని దేవాలయాలు తెరిచి ఉంటాయి. ఆ ఆలయాలేమిటో తెలుసుకుందాం...**

గ్రహణసమయంలో కూడా తెరిచే ఉండే ఆలయాలలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయం, పెదకాకానిలోని కోటేశ్వర స్వామి ఆలయం ముఖ్యమైనవి. తమిళనాట గల అరుణాచల క్షేత్రం సరేసరి. ఈ దేవాలయాల్లో గ్రహణ కాలంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. అరుణాచలం, శ్రీకాళహస్తిలోని శివాలయాల్లోని శివలింగాలు స్వయంభువులు కావడం, ఇవి నవగ్రహాలను తమ ఆధీనంలో ఉంచుకోవడమే ఇందుకు కారణంగా పండితులు చెబుతారు. దైవిక శక్తి ఈ క్షేత్రాలను గ్రహణాల ప్రభావం నుంచి రక్షిస్తుందని విశ్వాసం.

మన పురాణాల ప్రకారం శ్రీకాళహస్తిలో కొలువై ఉన్న వాయులింగేశ్వరుడు సూర్యచంద్రులు, అగ్నిభట్టారడితో పాటు నవగ్రహాలు, 27 నక్షత్రాలతో కవచాన్ని ఏర్పాటు చేసుకుని దర్శనమిస్తాడు. అందువల్ల ఈ క్షేత్రానికి రాహు, కేతువుల వల్ల ఎలాంటి నష్టం ఉండదు. వాస్తవానికి గ్రహణాల సమయంలో రాహుకేతువులు బలమైన శక్తిని కలిగి ఉంటారని నమ్మకం.

గ్రహణం రోజు శ్రీకాళహస్తీశ్వరాలయంలో శ్రీజ్ఞాన ప్రసునాంబిక దేవి సమేత శ్రీకాళహస్తీశ్వరునికి గ్రహణ కాల అభిషేకాలు నిర్వహించడం కూడా సంప్రదాయంగా కొనసాగుతోంది. ఇక ఈ క్షేత్రంలోని స్వామి వారిని, అమ్మవారిని ఒక్కసారి దర్శనం చేసుకుంటే రాహుకేతు దోషాలే కాకుండా నక్షత్ర దోషాలు, నవ గ్రహ దోషాలు కూడా తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. ఇక్కడ రాహు కేతు, సర్ప దోష నివారణ పూజలకు దేశ విదేశాల నుంచి భక్తులు విచ్చేస్తారు.

### మహా కాళేశ్వర్ ఆలయం... ఉజ్జయిని

ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన ఉజ్జయిని శ్రీ మహాకాళేశ్వర ఆలయం గ్రహణ సమయంలో కూడా తెరిచే ఉంటుంది. ఇక్కడ శివుడు స్వయంభూ మహాకాళ రూపంలో కొలువై ఉంటాడు. ఈ ఆలయంపై గ్రహణం ప్రభావం ఉండనందువల్ల గ్రహణ సమయంలో కూడా ఆలయం తలుపులు తెరిచే ఉంటాయి.

★ **ఢిల్లీలోని కల్కాజీ ఆలయం:** ఈ ఆలయం కూడా గ్రహణ సమయంలోనూ తెరిచే ఉంటుంది. ఈ ఆలయంలో కొలువై ఉన్న కల్కా దేవి కాలచక్రానికి అధిపతి అని నమ్ముతారు. గ్రహాలు, నక్షత్రాలు ఆమె గుండా కదులుతాయని విశ్వాసం. కాబట్టి గ్రహణం కల్కా దేవిని ప్రభావితం చేయదని నమ్ముతారు. అంతేకాకుండా గ్రహణం సమయంలో ప్రత్యేక పూజల నిమిత్తం భక్తులు ఈ ఆలయానికి వస్తారు.

★ **కల్పేశ్వర్ ఆలయం - ఉత్తరాఖండ్ :** గ్రహణ సమయంలో కూడా ఉత్తరాఖండ్‌లోని కల్పేశ్వర్ ఆలయం తెరిచి ఉంటుంది. ఈ ఆలయంలో కొలువై ఉన్న శివుడు గంగామాత ప్రవాహాన్ని తగ్గించాడని చెబుతారు. ఈ ఆలయంలో గ్రహణ సమయంలో కూడా యథావిధిగా దర్శనాలు కొనసాగుతాయి.

★ **తిరువరప్పు శ్రీ కృష్ణ ఆలయం - కొట్టాయం**

★ కేరళ రాష్ట్రం కొట్టాయంలోని తిరువరప్పులో శ్రీ కృష్ణుడి ఆలయం ఉంది. ఇక్కడ శ్రీ కృష్ణుడికి రోజుకు పది సార్లు ఆహారం నైవేద్యంగా పెడతారు. ఇక్కడ స్వామి వారికి ఆకలి బాగా ఎక్కువగా ఉంటుందట. ఆకలి కారణంగా స్వామి వారి విగ్రహం సన్నగిల్లుతుందని నమ్ముతారు. దీంతో గ్రహణ సమయంలో కూడా ఈ ఆలయం తలుపులు మూసివేయకుండా స్వామి వారికి నైవేద్యాలు సమర్పిస్తూనే ఉంటారు.

★ **విష్ణుపాద ఆలయం - గయ:** ఈ ఆలయంలో గ్రహణం సమయంలో పిండ ప్రధానం చేయడం మంచిదని విశ్వసిస్తారు. అందుకే గయలోని విష్ణుపాద ఆలయం గ్రహణ సమయంలో కూడా తెరిచే ఉంటుందట.

★ **లక్ష్మీనాథ్ ఆలయం - బికనీర్, ★ రాజస్థాన్ రాష్ట్రం బికనీర్‌లోని లక్ష్మీనాథ్ ఆలయం.** దీన్ని కూడా గ్రహణాల సమయంలో మూసివేయరు. ఎందుకంటే ఓసారి గ్రహణ సమయంలో ఆలయం తలుపులు మూసివేసి దేవుడికి నైవేద్యం పెట్టలేదట. అప్పుడు ఆలయ సమీపంలోని మిఠాయి దుకాణంలోని వ్యాపారికి ఓ కల వచ్చిందట. ఆ కలలో దేవుడు ప్రత్యక్షమై తనకు బాగా ఆకలిగా ఉందని చెప్పాడట. అప్పటి నుంచి గ్రహణం సమయంలో కూడా ఈ ఆలయం తెరిచే ఉంటుంది.

*(మార్చి 3 బుధవారం సంపూర్ణ చంద్ర గ్రహణం)*

---

● సువార్త

# పరిశుద్ధుని ప్రేమ కథ



'యేసు అసాధారణ బోధనలు, కార్యములు' వెల్లడి చేసే గొప్ప విషయసారం ఏమంటే, ఎలాంటి ప్రతికూల పరిస్థితులలోనైన ప్రేమను ఘనంగా విజయవంతంగా, ప్రభావవంతంగా వ్యక్తంచేసి తీరాలన్నదే. వర్ణనకు అందని పరాకాష్ట ప్రేమకు అనగా సాటిలేని శిఖరాగ్ర ప్రేమకు సాదృశ్య రూపం యేసుక్రీస్తు ప్రేమ. చేతలలో చూపేదే అయినా ప్రేమను మించిన అత్యున్నత భావ ప్రకటన సామర్థ్యం అనేది మరొకటి లేనేలేదు. అనుకూల పరిస్థితులలో తమ అనుకూలురులను, సానుభూతిపరులను, ఇష్టులను ప్రేమించడం ఎవరికైనా సాధ్యమే. దీనికి భిన్నమైన వైవిధ్యమైన క్రీస్తు వారి ప్రత్యేక వ్యక్తిత్వపు జీవన శైలి గొప్ప ఉపదేశసారంగా సువాసన పరిమళంలా అంతటా వెదజల్లుతూ ఉంది. ఉన్నతంగా బహు బలంగా సమాజాలు, సంఘాలు కట్టబడుటకు ఇట్టి జీవనవిధానం తక్షణావసరం అన్నది ఆధ్యాత్మిక వేత్తలు తరచూ చెప్పే మాట.

'దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు'. ఇక్కడ 'తన ప్రేమ' అనగా యేసు క్రీస్తు. యేసును దేవుడు ఒక చెప్ప శక్యంకాని వరంగా అనుగ్రహిస్తూ ఒక మాదిరికరంగా ఆయన్ను మానవాళి ముందు పెట్టాడు. ఆయన్ను లోక రక్షకుడుగా కూడా నియమించాడు. ఈ విధానమంతా దేవుడు తన కుమారుని ద్వారా లోకమును ఎంతో ప్రేమిస్తున్నాడు అనునదే. ప్రేమంటేనే యేసు, యేసు అంటేనే ప్రేమ అన్నంతగా దేవుడు తనదైన సంకల్ప ప్రకారంగా ప్రేమతో ముడిపడే విధంగానే కాక, ఎప్పుడూ ప్రేమతోనే తలపడే విధంగా యేసు క్రీస్తు జీవితాన్ని ఉన్నతంగా రూపకల్పన చేసాడు. యేసు జీవిత విధానం ప్రేమ, క్షమాపణలకు పెట్టింది పేరుగా ఈ సర్వ ప్రపంచానికి తేటగా తెలిసిన విషయమే. అయితే అన్నిప్రేమతోనే ఎదుర్కొనే తెగువ, సాహసించే వైవిధ్య విధానం ఆయనదైన ప్రేమకు అసలైన అభరణాలు.

తమ అవిధేయతను బట్టి 'లోబడనొల్లని ప్రజల వైపు దినమంతయు నా చేతులు చాపుచున్నాను' అన్న దేవుని ప్రవచనం క్రీస్తునందు నెరవేరింది. యేసు తన తండ్రియైన దేవుని ప్రేమను లోకానికి వెల్లడిచేస్తూ ఆరు గంటల పాటు చాచిన చేతులతో సిలువలో దీనంగా వ్రేలాడాడు. 'నేను మీతో చెప్పునది ఏమనగా, మీరు పరలోకమందున్న మీ తండ్రికి కుమారులై ఉండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి. మిమ్మును హింసించు వారి కొరకు ప్రార్థన చేయుడి' అంటూ గొప్ప గొప్ప హితబోధలు చేసిన క్రీస్తు అక్షరాలా సిలువలో తనను హింసించే వారిని క్షమిస్తూ వారి కొరకు దేవుని వేడుకున్నాడు. 'తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము' అంటూ సిలువ అను బలి పీఠం నుండి దేవుని అర్థించడం గమనించదగ్గది.

తాను చేసిన అసాధారణ బోధలకు అనుగుణంగానే క్రీస్తు తనదైన జీవన శైలిని మానవాళి ముంగిట పెట్టి గొప్ప కార్యశూరుడిగా కీర్తి గాంచాడు. సువార్తరూపంలో ఈ పరిశుద్ధుని ప్రేమకథ ఎప్పుడూ ప్రచారానికి నోచుకోదగ్గ అర్హత కలిగినదే. అంతటి నాణ్యమైన విలువైన జీవితం ఆయనది. యేసుప్రేమ గూర్చి ఎవరైనా తెలుసుకోకుండా, అది ఈ భూమ్మీదనే రుచిచూడకుండా చనిపోతే అది వారికి ఎంతో నష్టం కలిగిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. సత్య సంబంధిత జీవిత కథ యేసుది. సమయం దొర్లించే కాలక్షేప కథ కాదిది. నిత్యజీవం వైపు అడుగులు వేయిస్తూ భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దే ఈ పరిశుద్ధుని ప్రేమకథ ఎల్లప్పుడూ మననం చేసుకోదగ్గది.

**- జేతమ్**

---

● బౌద్ధం

# పట్టు రుమాలు



బుద్ధుడిని చూడడంకోసం ఓరోజు అనేక మంది వచ్చారు. ఆ సమయంలో బుద్ధుడు ఓ చెట్టు కింద ఉన్న అరుగుమీద కూర్చుని ఉన్నారు. బుద్ధుడి చేతిలో ఓ పట్టు రుమాలు ఉండటం చూసి అక్కడున్న వారందరికీ ఆశ్చర్యం వేసింది. విలాసాలకూ ఖరీదైన వస్త్రాలకూ ఆమడదూరంలో ఉండే బుద్ధుడి దగ్గర పట్టు రుమాలు ఉండటమేమిటని అందరూ చెవులు కొరుక్కున్నారు. అక్కడ మౌనం ఆవరించిన తర్వాత బుద్ధుడు తన చేతిలో ఉన్న రుమాలుని చూపిస్తూ ఏమిటది అని ఆడిగారు. అందరూ ఒక్క మాటగా అది పట్టు రుమాలు అని చెప్పారు. అనంతరం బుద్ధుడు ఆ రుమాలులో అయిదు ముళ్ళు వేసి చూపిస్తూ ఇప్పుడిదేమిటీ అని అడిగారు. అందరూ ఒక్క మాటగా అది పట్టు రుమాలని చెప్పారు. అప్పుడు బుద్ధుడు 'అదే మీకూ నాకూ తేడా. ఆ తేడా వల్లే మీరక్కడా నేనిక్కడా ఉన్నాను' అంటూ తన మాటలు కొనసాగించారు. 'అయిదు ముళ్ళు ఏంటంటే హింసకు పాల్పడకపోవడం, చైతన్యం కలిగి ఉండటం, అత్యాశకు దూరంగా ఉండటం, అబద్ధం చెప్పకపోవడం, నిజాయితీతో కూడిన సత్ప్రవర్తన కలిగి ఉండటం. ఈ అయిదూ అనుసరించగలిగితే ఎవరితోనూ ఏ గొడవలూ రావని ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఈ అయిదు పురోగతికీ, మానసిక ప్రశాంతతకూ ఎంతో అవసరం. అందుకోసమే బుద్ధుడు అయిదు ముడులు వేసారు. కానీ ఆ ముళ్ళ విషయం ఆలోచించని వాళ్ళందరూ ఆ రుమాలు పట్టుదనే చెప్పారు తప్ప వాళ్ళెవరికీ బుద్ధుడెందుకు ముళ్ళు వేసారన్నది ఆలోచించలేదు.

**- యామిజాల జగదీశ్**

## బిజినెస్ రీల్

### ఐఐటీ హైదరాబాద్‌తో ఎన్‌ఎండీసీ ఆర్‌అండ్‌డీ జట్టు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ (ఐఐటీ హెచ్)తో మైనింగ్ దిగ్గజం ఎన్‌ఎండీసీ ఆర్‌అండ్‌డీ సెంటర్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఖనిజాల ప్రాసెసింగ్, సంబంధిత విభాగాల్లో దేశీ సాంకేతికతల వినియోగాన్ని పెంచేందుకు ఇది ఉపయోగపడనుంది. దేశీ ముడి వస్తువులను ఉపయోగించి పర్యావరణహితంగా ఉక్కును తయారు చేయగలిగే టెక్నాలజీలు, రేర్ ఎర్త్ మినరల్స్‌ని వెలికితీసేందుకు కొత్త విధానాలు మొదలైనవాటిపై పరిశోధనలు చేసేందుకు తోడ్పడనుంది. అలాగే స్వయం చాలిత వాహనాలు, కృత్రిమ మేధ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌లాంటి విషయాల్లోను అధ్యయనాలకు ఎంవోయూ సహాయకరంగా ఉంటుంది.

### హైదరాబాద్‌లో మైండ్‌స్పేస్ రీట్ రూ. 350 కోట్ల పెట్టుబడులు

చాలెట్ హోటల్స్‌కి ముందస్తుగా లీజుకి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్ హైదరాబాద్‌లో దాదాపు రూ. 350 కోట్లతో లగ్జరీ హోటల్‌ని అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించింది. దీన్ని చాలెట్ హోటల్స్‌కి ప్రీ-లీజుకి ఇచ్చినట్లు తెలిపింది. 5.3 లక్షల చ.అ. విస్తీర్ణంలో ఉండే ఈ ప్రాజెక్టులో 330 గదులు ఉంటాయి. 2027-28 నాలుగో త్రైమాసికంలో ఇది పూర్తయ్యే అవకాశం ఉందని మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్ తెలిపింది. ఇరు సంస్థల మధ్య ఒప్పందం ప్రకారం మైండ్‌స్పేస్ రీట్‌కి చెందిన స్పెషల్ పర్పస్ వెహికల్ సంస్థ సదరు ప్రాపర్టీని స్థూలంగా నిర్మించి ఇస్తుంది. ఇంటీరియర్స్, హోటల్ నిర్వహణ మొదలైన పనులను చాలెట్ చేపడుతుంది. ప్రస్తుతం చాలెట్‌కి మొత్తం మీద 3,300 గదుల పోర్ట్‌ఫోలియో ఉంది. మైండ్‌స్పేస్ రీట్‌కి హైదరాబాద్‌తో పాటు ముంబై, పుణె చెన్నైలలో ఆఫీస్ అసెట్స్, బిజినెస్ పార్క్‌లు ఉన్నాయి.

బుధవారం ఎన్‌ఎస్‌ఈలో మైండ్‌స్పేస్ రీట్ షేరు దాదాపు అర శాతం క్షీణించి సుమారు రూ. 481 వద్ద ముగిసింది.

### కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 26-2-2026 | |
|---|---|
| విశాఖ | 485-00 |
| చిత్తూరు | 533-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 480-00 |
| విజయవాడ | 500-00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| హైదరాబాద్ | 470-00 |
| వరంగల్ | 472-00 |
| రిటైల్ ధర | 5.30 |

### నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| HCLTECH | 1,375.90 | 2.74 |
| BAJAJ-AUTO | 10,098.50 | 2.74 |
| TATASTEEL | 214.22 | 2.43 |
| SHRIRAMFIN | 1,085.00 | 2.19 |
| TCS | 2,629.00 | 2.15 |

### నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| RELIANCE | 1,400.80 | -1.96 |
| SBIN | 1,199.30 | -1.96 |
| ADANIPORTS | 1,529.00 | -1.7 |
| ETERNAL | 250.1 | -1.54 |
| ITC | 319.2 | -1.33 |

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 10,464 |
| ఎన్ఎస్ఈ | 1,08,504 |
| ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్) | 1,64,200 |
| ఎఫ్ఐఐ | + 2,992 |
| డీఐఐ | + 5,118 |

### ముడిచమురు... (బ్యారల్)

| | రాత్రి 11.30కు | | క్రితం ముగింపు |
|---|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 65.46 | $ | 65.63 |
| బ్రెంట్ | 70.69 | $ | 70.58 |

# జీసీసీలకు డిమాండ్ భళా

- ఐదేళ్లలో 101 మిలియన్ ఎస్ఎఫ్‌టీ లీజు
- అమెరికా కంపెనీలదే ఆధిపత్యం
- మొత్తం ఆఫీస్ లీజింగ్ 280 మిలియన్ ఎస్ఎఫ్‌టీ
- కొలియర్స్ ఇండియా నివేదిక

న్యూఢిల్లీ: గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల (అంతర్జాతీయ సామర్థ్య కేంద్రాలు/జీసీసీలు) ఏర్పాటుకు అమెరికా కంపెనీలు భారత్‌ను ఎంతో కీలకంగా చూస్తున్నాయి. గడిచిన ఐదేళ్లలో 2020 నుంచి 2025 మధ్య హైదరాబాద్ సహా దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో.. 101 మిలియన్ చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) కార్యాలయ వసతులను జీసీసీల ఏర్పాటుకు విదేశీ సంస్థలు లీజుకు తీసుకోవడం గమనార్హం. **ఈ కాలంలో మొత్తం ఆఫీస్ లీజింగ్ 280.2 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉన్నట్టు** రియల్ ఎస్టేట్‌రంగ కన్సల్టెంట్ కొలియర్స్ ఇండియా తెలిపింది. బెంగళూరు, చెన్నై, ఢిల్లీ ఎన్‌సీఆర్, కోల్‌కతా, ముంబై, పుణె నగరాల డేటా ఆధారంగా ఒక నివేదికను విడుదల చేసింది. ఈ నగరాల్లో మొత్తం ఉపాధి డిమాండ్‌లో 36 శాతం జీసీసీల నుంచే వస్తున్నట్టు తెలిపింది. గత ఐదేళ్లలో 101 మిలియన్ ఎస్ఎఫ్‌టీల జీసీసీల లీజింగ్‌లో 71 మిలియన్ ఎస్ఎఫ్‌టీని అమెరికా కంపెనీలు తీసుకున్నాయి. ''భారత ఆఫీస్ మార్కెట్ ఇటీవలి సంవత్సరాల్లో పెద్ద ఎత్తున విస్తరించింది. కరోనా అనంతరం డిమాండ్ ఎప్పటికప్పుడు గరిష్టాలకు చేరుతోంది. ముఖ్యంగా జీసీసీలు ఈ విస్తరణకు చోదకంగా ఉన్నాయి. వ్యయాలు ఆదా చేసుకునే కేంద్రాలుగా కాకుండా.. **ఆవిష్కరణల ఆధారిత అంతర్జాతీయ అనుసంధాన విజ్ఞాన, పరిశోధన కేంద్రాలుగా అవతరించాయి''అని కొలియర్స్ ఇండియా తెలిపింది.**

**ఏటా 35–40 మిలియన్ ఎస్ఎఫ్‌టీ**

2025లో విదేశీ సంస్థలు భారత్‌లో 29.2 మిలియన్ ఎస్ఎఫ్‌టీలను తీసుకునేందుకు ఒప్పందాలు కుదుర్చుకోవడం గమనార్హం. ఈ ఏడు నగరాల్లో స్థూల ఆఫీస్ లీజింగ్ 71.5 మిలియన్ ఎస్ఎఫ్‌టీలో ఈ మొత్తం 41 శాతంగా ఉంది. విదేశీ సంస్థలు భారత్‌లో జీసీసీల ఏర్పాటుకు ఏటా 35–40 మిలియన్ ఎస్ఎఫ్‌టీని లీజుకు తీసుకుంటాయని కొలియర్స్ ఇండియా ఆఫీస్ సర్వీసెస్ ఎండీ అర్పిత్ మెహరోత్రా అంచనా వేశారు. ''యూఎస్ సంస్థల నుంచి టెక్నాలజీ ఆధారిత జీసీసీల ఏర్పాటు డిమాండ్ స్థిరపడొచ్చు. ఐరోపా సమాఖ్య, బ్రిటన్‌కు చెందిన సంస్థల నుంచి ఇంజనీరింగ్, తయారీ, బీఎఫ్ఎస్ఐ, కన్సల్టింగ్‌కు సంబంధించి జీసీసీల ఏర్పాటుకు డిమాండ్ పెరుగుతుంది''అని చెప్పారు. ఈ నివేదికపై భివ్ వర్క్‌స్పేస్ వ్యవస్థాపకుడు, సీఈవో సురేష్‌రావు పప్లికర్ స్పందిస్తూ.. భారత నైపుణ్యాలు, బిజినెస్ ఎకోసిస్టమ్ పట్ల అంతర్జాతీయ కంపెనీల్లో విశ్వాసానికి నిదర్శనమన్నారు. కోవర్కింగ్ సెంటర్లలో ఫ్లెక్సిబుల్ వర్క్‌స్పేస్‌ను జీసీసీల కోసం తీసుకోవడం పెరిగినట్టు చెప్పారు. భారత్‌పై దీర్ఘకాల దృష్టితో యూఎస్, యూరప్, బ్రిటన్ కంపెనీలు జీసీసీల ఏర్పాటుకు ఆఫీస్ వసతులను లీజుకు తీసుకోవడం పెరిగినట్టు 'స్పేస్‌వన్' ప్రాపర్టీ యాక్విజిషన్ విభాగం డైరెక్టర్ సిజోజోస్ తెలిపారు.

## ఐఆర్‌ఎఫ్‌సీ వాటా ఆఫర్.. స్పందించని ఇన్వెస్టర్స్

న్యూఢిల్లీ: పీఎస్‌యూ ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఆర్‌ఎఫ్‌సీ)లో ప్రభుత్వం ఆఫర్ చేసిన 2 శాతం వాటా విక్రయానికి సరైన స్పందన లభించలేదు. ఆఫర్‌లో భాగంగా ప్రభుత్వం సంస్థాగత ఇన్వెస్టర్లకు రిజర్వ్ చేసిన 23.52 కోట్ల షేర్లు విక్రయానికి ఉంచగా.. 22.34 కోట్ల షేర్లకు మాత్రమే బిడ్స్ దాఖలయ్యాయి. వెరసి 94.98 శాతం స్పందన నమోదైంది. సంస్థాగత ఇన్వెస్టర్లు షేరుకి రూ. 104.12 సంకేత ధరలో బిడ్స్ వేశారు. వీటి విలువ రూ. 2,326 కోట్లుకాగా.. రిటైల్ ఇన్వెస్టర్లకు గురువారం విండో ఓపెన్ కానుంది. కాగా.. ప్రభుత్వం 2 శాతం వాటాకు సమానమైన 26.13 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచనుంది. ఆఫర్‌కు అధిక డిమాండ్ కనిపిస్తే మరో 2 శాతం వాటాను సైతం విక్రయించేందుకు(గ్రీన్ షూ ఆప్షన్) అవకాశముంది. ఇందుకు ప్రభుత్వం షేరుకి రూ. 104 ఫ్లోర్ ధరను నిర్ణయించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం కంపెనీలో ప్రభుత్వానికి 86.36 శాతం వాటా ఉంది.

ప్రభుత్వ ఆఫర్ నేపథ్యంలో ఐఆర్‌ఎఫ్‌సీ షేరు బీఎస్ఈలో 4.4 శాతం పతనమై రూ. 105 దిగువన ముగిసింది. వెరసి 52 వారాల కనిష్టాన్ని తాకింది!

## షాపింగ్ బిల్లుకు నో ఫోన్‌నెంబర్!

న్యూఢిల్లీ: షాపింగ్ మాల్స్ ఎంట్రీ వద్ద.. రిటైల్ స్టోర్లలో బిల్లింగ్ దగ్గర మొబైల్ ఫోన్ నంబర్ అడుగుతున్నారా..? వారు అడిగిన వెంటనే చెప్పేస్తున్నారా..? అవసరం లేదు. వ్యక్తిగత మొబైల్ నంబర్‌ను వాణిజ్య కేంద్రాల వద్ద ఇవ్వాల్సిన అవసరం లేనే లేదు. ఈ విషయాన్ని చట్టాలు స్పష్టం చేస్తున్నాయి. షాపింగ్ మాల్స్, రిటైల్ స్టోర్లకు ఈ విషయమై ప్రభుత్వం ఏవైనా మార్గదర్శకాలు జారీ చేసిందా? అంటూ లోక్‌సభ ఎంపీ జనార్ధన్ సింగ్ సిగ్రివాల్ లోక్‌సభలో ఈ అంశాన్ని ప్రత్యేకంగా లేవనెత్తగా.. కేంద్రం బదులు ఇచ్చింది. రిటైలర్లకు వాటి అసోసియేషన్ల ద్వారా ఈ విషయంలో 2023 మే 26న సూచలను జారీ చేసినట్టు చెప్పారు. వీటి ప్రకారం.. వినియోగదారుల అభీష్టం మేరకే మొబైల్ నంబర్ తీసుకోవాల్సి ఉంటుంది. మొబైల్ నంబర్ వెల్లడించాలని ఏ నిబంధన కూడా నిర్దేశించడం లేదు. నంబర్ వెల్లడించేందుకు వినియోగదారులు తిరస్కరించొచ్చు. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ 2023, డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ రూల్స్ 2025 అన్నవి పౌరుల వ్యక్తిగత డేటా (మొబైల్ నంబర్లు సహా) దుర్వినియోగం కాకుండా, తగిన రక్షణ కల్పించాలని స్పష్టం చేస్తున్నాయి. ఒకవేళ తమ వ్యక్తిగత డేటా దుర్వినియోగం అయినట్టు గురిస్తే కేంద్ర వినియోగ వ్యవహారాల శాఖ హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి ఫిర్యాదు కూడా చేయొచ్చు.

## కిరాయిదారు-యజమాని మధ్య బంధం చెప్పాలి

ఆదాయపన్ను కొత్త పత్రాల్లో నిబంధన

న్యూఢిల్లీ: ఆదాయపన్ను ముసాయిదా పత్రాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఇంటి అద్దెపై పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసుకునే వారు ఇకపై ఇంటి యజమానితో చేసుకున్న ఒప్పంద రుజువును చూపించాల్సి ఉంటుంది. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపన్ను చట్టం అమల్లోకి రానుండడం గమనార్హం. దీంతో ముసాయిదా పత్రాలు, నిబంధనలపై భాగస్వాములకు ఆదాయపన్ను శాఖ పంపిణీ చేసింది. వేతన జీవులు హెచ్‌ఆర్‌ఏ క్లెయిమ్‌ను చేసుకునే విషయంలో యాజమాన్యానికి ధ్రువీకరణ ఇవ్వాల్సి ఉంటుంది. ఇకపై ఫారమ్ 124లో ప్రాపర్టీ యజమానితో ఉన్న సంబంధాన్ని (అసెసీ/పన్ను చెల్లింపుదారు/దాఖలుదారు) వెల్లడించాల్సి ఉంటుంది. కల్పిత, పెంచి చూపించే అద్దె మొత్తాలకు ఈ నిబంధన చెక్ పెడుతుందని పన్ను నిపుణులు అభిప్రాయపడుతున్నారు. విదేశీ ఆదాయంపై పన్ను జమ క్లెయిమ్‌లకు సంబంధించి ఆడిటర్లు, కంపెనీలపై బాధ్యతను పెంచడం కూడా కొత్త పత్రాల్లో భాగంగా ఉంది. భారత్‌కు వెలుపల ఏదైనా ప్రాంతానికి సంబంధించిన ఆదాయంపై ఫారిన్ ట్యాక్స్ విత్‌హోల్డింగ్ సర్టిఫికెట్లను అకౌంటెంట్లు స్వతంత్రంగా నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. చెల్లింపుల రుజువులు, కరెన్సీ మారకం లావాదేవీలు, పన్ను అర్హత నిబంధనలను, పన్ను చెల్లింపుదారు నివాస హోదాలను సైతం ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది.

## ఘనంగా జాతీయ ఆరోగ్య మేళా 2026 ప్రారంభం

ప్రధాన ప్రాయోజకులు (స్పాన్సర్‌షిప్)గా బైద్యనాథ్, సిద్ధాయి

హైదరాబాద్: ఆయుర్వేద వైద్య విధానాల ప్రాముఖ్యతను ప్రజలకు చేరవేయాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న జాతీయ ఆరోగ్య మేళా 2026ను దేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం అధికారికంగా ప్రారంభించారు. మహారాష్ట్రలోని బుల్ధానా జిల్లా షెగావ్ పట్టణం విశావా గ్రౌండ్, భక్తినివాస్ కాంప్లెక్స్‌లో ఈ మేళా ఫిబ్రవరి 25 నుంచి 28 వరకు కొనసాగనుంది. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ, అఖిల్ భారతీయ ఆయుర్వేద మహాసమ్మేళన సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ మేళాకు ప్రఖ్యాత ఆయుర్వేద సంస్థలు బైద్యనాథ్, సిద్ధాయి ప్రధాన ప్రాయోజకులు (స్పాన్సర్‌షిప్)గా వ్యవహరించాయి. తమ స్టాళ్లలో విస్తృత శ్రేణి ఆయుర్వేద ఔషధాలు, ఆరోగ్య ఉత్పత్తులను ప్రదర్శించడంతో పాటు, ఆయుర్వేదంపై అవగాహన కల్పించే పుస్తకాలను రాయితీ ధరలకు అందుబాటులో ఉంచాయి. ఈ మేళా ఆయుర్వేద ప్రాముఖ్యతను ప్రజలకు చేరవేయడంలో కీలకంగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర గవర్నర్ ఆచార్య దేవవ్రత్, కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ప్రతాప్‌రావు జాధవ్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

## ఇన్వెస్టర్ల ఓవర్ రియాక్షన్

ఐటీ షేర్ల అమ్మకంపై ఐటీసీ సీఎండీ సంజీవ్ పురి

ముంబై: కృత్రిమ మేధ (ఏఐ) భయాలతో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ స్టాక్స్‌లో అమ్మకాలు వెల్లువెత్తడమనేది ఇన్వెస్టర్ల 'ఓవర్‌రియాక్షన్' అని డైవర్సిఫైడ్ దిగ్గజం ఐటీసీ సీఎండీ సంజీవ్ పురి వ్యాఖ్యానించారు. తమ సంస్థ విషయానికొస్తే ఉత్పాదకత, సామర్థ్యాలను పెంచుకునేందుకు ఏఐని వినియోగించుకుంటున్నట్లు చెప్పారు. గతంలో ఉన్న సాధనాలతో తయారీ, సరఫరా వ్యవస్థ మొదలైన విభాగాల్లో పరిష్కరించలేకపోయిన సమస్యలను కూడా ప్రస్తుత సాంకేతికతతో పరిష్కరించగలుగుతున్నామని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయోత్పత్తుల విభాగానికి సంబంధించి పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావాలను మదింపు చేసేందుకు గత కొన్నేళ్లుగా వాతావరణ మార్పులను టెక్నాలజీతో అధ్యయనం చేస్తున్నట్లు పురి చెప్పారు. వ్యాపార ప్రణాళికల విషయానికొస్తే మధ్యకాలికంగా రూ. 20,000 కోట్ల పెట్టుబడి ప్రణాళికలు ఉన్నట్లు తెలిపారు. గతంలోలాగానే ఇతర సంస్థల కొనుగోలు అవకాశాలను కూడా పరిశీలిస్తుందని వివరించారు.

## సెమీకండక్టర్లకు దశాబ్దాలపాటు మద్దతు

కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ అదనపు కార్యదర్శి సిన్హా

బెంగళూరు: సంపన్న దేశాల తరహాలోనే వచ్చే 20–25 ఏళ్ల పాటు సెమీకండక్టర్ల వ్యవస్థకు మద్దతునిచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ (మెయిటీ) అదనపు కార్యదర్శి అమితేష్ సిన్హా తెలిపారు. చిప్‌ల తయారీ యూనిట్లలోని వెండార్లకు సింగిల్ విండో క్లియరెన్స్ సౌలభ్యం కోసం త్వరలో పోర్టల్ ప్రారంభించనున్నట్లు చెప్పారు. 'పరిశ్రమకు కావాల్సిన మద్దతు గురించి ప్రభుత్వానికి అవగాహన ఉంది. ఇదేదో కొన్నేళ్ల వ్యవహారం కాదు.. కనీసం 20–25 ఏళ్ల పాటు అవసరమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా అత్యంత అధునాతన సెమీకండక్టర్ వ్యవస్థలు ఉన్న దేశాల్లో రెండు నుంచి అయిదు దశాబ్దాల పాటు ప్రభుత్వాలు వాటికి మద్దతునిచ్చాయి. ఇది టీ20 కాదు. మారథాన్‌లాంటిది. మేము దీని కోసం సర్వసన్నద్ధంగా ఉన్నాం' అని ఐఈఎస్ఏ విజన్ సదస్సు 2026లో వర్చువల్‌గా పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాలు తెలిపారు. వచ్చే నెలలో ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం) 1.0 కింద మరికొన్ని సెమీకండక్టర్ ప్రాజెక్టులు ఖరారయ్యే అవకాశం ఉందన్నారు. ఆ తర్వాత ఐఎస్ఎం 2.0ని ఆవిష్కరించనున్నట్లు సిన్హా పేర్కొన్నారు.

## వెండి, బంగారం.. అదే జోరు

కేజీ వెండి ధర రూ. 5,900 అప్

- 10 గ్రా. పసిడి రూ. 1,000 ప్లస్

న్యూఢిల్లీ: అత్యంత విలువైన లోహాలు.. బంగారం, వెండి ధరల మెరుపు కొనసాగుతోంది. ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వివరాల ప్రకారం దేశ రాజధాని ప్రాంతంలో 2 శాతం చొప్పున బలపడ్డాయి. వెరసి కేజీ వెండి ధర రూ. 5,900 జంప్‌చేసి రూ. 2,77,900ను తాకింది. ఈ బాటలో పూర్తి స్వచ్ఛతగల బంగారం ధర సైతం 10 గ్రాములకు రూ. 1,000 పెరిగి రూ. 1,64,200కు చేరింది. మంగళవారం వెండి రూ. 2,72,000 వద్ద, పసిడి రూ. 1,63,200 వద్ద ముగిసిన విషయం విదితమే. వెరసి వరుసగా ఐదో రోజు వెండి, బంగారం ధరలు జోరు చూపాయి. కాగా.. యూఎస్ వాణిజ్య విధానాల అనిశ్చితి, మధ్యప్రాచ్యంలోని రాజకీయ భౌగోళిక ఉద్రిక్తతలు ప్రభావం చూపుతున్నట్లు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌లోని కమోడిటీల సీనియర్ విశ్లేషకులు సౌమిల్ గాంధీ పేర్కొన్నారు. దీంతో అనిశ్చిత వాతావరణంలో రక్షణాత్మక పెట్టుబడులుగా భావించే బంగారం, వెండిలో పెట్టుబడులు కొనసాగుతున్నట్లు తెలియజేశారు.

**విదేశీ మార్కెట్లోనూ**

అంతర్జాతీయ మార్కెట్లోనూ స్పాట్ ధరలు పుంజుకున్నాయి. వెండి ఔన్స్ 3 డాలర్లకుపైగా(3.6 శాతం) బలపడి 90.3 డాలర్లకు చేరింది. మరోపక్క పసిడి ఔన్స్ 1 శాతం మెరుగుపడి 5,181.5 డాలర్ల వద్ద కదులుతోంది. యూఎస్ డాలర్ బలపడటం, రిస్క్ సెంటిమెంట్ సానుకూలత వంటి అంశాలు బంగారానికి మద్దతిస్తున్నట్లు మిరాయ్ అసెట్ షేర్‌ఖాన్‌కు చెందిన కమోడిటీలు, కరెన్సీల హెడ్ ప్రవీణ్ సింగ్ తెలియజేశారు.

అంతేకాకుండా జెనీవాలో గురువారం యూఎస్, ఇరాన్ మూడో రౌండ్ చర్చలు నిర్వహించనుండటం సైతం ఇందుకు కారణమైనట్లు పేర్కొన్నారు. ఇక న్యూయార్క్ కామెక్స్‌లో బంగారం ఏప్రిల్ ఫ్యూచర్స్ 39 డాలర్లు పుంజుకుని ఔన్స్ 5,216 డాలర్లకు చేరగా.. వెండి ఔన్స్ మార్చి ఫ్యూచర్స్ 3 డాలర్లు ఎగసి 90.45 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# వోల్టాస్ ఏసీ ధరలు అప్!

- రాగి ధరల పెరుగుదల, రూపాయి బలహీనత ప్రభావం
- కంపెనీ ఎండీ ముకుందన్ మీనన్ వెల్లడి

ముంబై: రాగి ధరలు పెరగడం, డాలర్‌తో మారకంలో రూపాయి బలహీనతల కారణంగా ఈ ఏడాది ఎయిర్ కండిషనర్ (ఏసీ) ధరలు 5–15 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని వోల్టాస్ మేనేజింగ్ డైరెక్టర్ ముకుందన్ మీనన్ తెలిపారు. పీటీఐతో మాట్లాడుతూ..., ఏసీ యూనిట్ల సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ ఏడాది ఎనర్జీ లేబుల్ మార్పులు అమలు చేస్తున్నామని, దీనివల్ల ఉత్పత్తి వ్యయం పెరిగిందన్నారు. ''గత ఏడాది రాగి ధర టన్నుకు సుమారు 8,500 డాలర్లుగా ఉండగా, ఈ ఏడాది 12,000–13,000 డాలర్లకు చేరుకుంది. ఏసీల తయారీలో రాగి వినియోగం అధికంగా ఉండటంతో ఉత్పత్తి వ్యయంపై గణనీయ ప్రభావం పడుతోంది. అలాగే ఏసీల్లో వినియోగించే కొన్ని కీలక విడిభాగాలు ఇంకా దిగుమతులపై ఆధారపడటంతో, డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడటం కూడా వ్యయాలను పెంచింది. ఈ పరిస్థితుల్లో ఖర్చుల ఒత్తిడిని తగ్గించేందుకు ఏసీ ధరలను 5–15 శాతం వరకు పెంచే అంశాన్ని కంపెనీ పరిశీలిస్తోంది,'' అని మీనన్ తెలిపారు. దేశీయ ఏసీ మార్కెట్లో వోల్టాస్‌కు ప్రస్తుతం సుమారు 18 శాతం వాటా ఉందని ఆయన చెప్పారు. ఏసీల తయారీలో చైనా అగ్ర స్థానంలో ఉండగా, థాయిలాండ్ రెండో స్థానంలో ఉంది.

**2026లో అమ్మకాలు 15-20% పెరగొచ్చు:** గత ఏడాదితో పోలిస్తే 2026లో దేశీయ ఏసీ విక్రయాలు 15–20 శాతం పెరుగుతాయని మీనన్ అంచనా వేశారు. మార్కెట్లో పెరిగిన డిమాండ్‌ను ఎదుర్కొనేందుకు కంపెనీ సిద్ధంగా ఉందన్నారు. ఉత్తరాఖండ్, తమిళనాడులోని రెండు ప్లాంట్లలో కలిపి 30 లక్షల స్ప్లిట్ ఏసీ యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉందని తెలిపారు. నూతన ఉత్పత్తుల ఆవిష్కరణతో పాటు మెరుగైన అమ్మకాలు, సేవల మద్దతు ఆధారంగా దేశీయ ఏసీ విభాగంలో అగ్రస్థానాన్ని కొనసాగించడమే లక్ష్యమని చెప్పారు.

**లోకలైజేషన్‌పై దృష్టి:** రాబోయే రెండేళ్లలో ఏసీ యూనిట్లలో లోకలైజేషన్ స్థాయిని 70 శాతం నుంచి 90 శాతానికి పెంచే లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు మీనన్ తెలిపారు. తయారీలో వినియోగించే కంప్రెసర్లు, మోటార్లు, పీసీబీలు, రాగి, అల్యూమినియం భాగాల స్థానిక కొనుగోళ్లను విస్తరించడం ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించనున్నట్లు చెప్పారు. కొన్ని సంవత్సరాల క్రితం 35–40 శాతంగా ఉన్న లోకలైజేషన్ స్థాయి ప్రస్తుతం 70 శాతానికి చేరిందని వెల్లడించారు. లోకలైజేషన్ స్థాయి ప్రస్తుతం 70 శాతానికి చేరిందని తెలిపారు.

## నాసుని హైదరాబాద్ కేంద్రం విస్తరణ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ నాసుని హైదరాబాద్‌లోని తమ పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని విస్తరించింది. ఇందులోని ఉద్యోగులు అమెరికా, ఐర్లాండ్‌లోని సిబ్బందితో కలిసి ఏఐ ఇంటిగ్రేషన్, మౌలిక సదుపాయాల డిజైన్ తదితర అంశాలపై పని చేస్తారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో అగ్రగాములైన సమ్మిట్ కన్సల్టింగ్, ఏఎన్ఎస్ఆర్ భాగస్వామ్యంతో నాసుని దీన్ని ఏర్పాటు చేసింది. ప్రపంచవ్యాప్తంగా కంపెనీల ఆధునీకరణకు ఉపయోగపడేలా సురక్షితమైన ఫైల్ డేటా సర్వీసులను అందించేందుకు ఈ సెంటర్ ఉపయోగపడుతుందని కంపెనీ సీఈవో శామ్ కింగ్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 70 దేశాల్లో 800 పైగా ఎంటర్‌ప్రైజ్ క్లయింట్లకు సేవలు అందిస్తున్నట్లు వివరించారు.

## ఎగుమతులకు 'రాడ్‌టెప్' కోత

50 శాతానికి తగ్గింపు

న్యూఢిల్లీ: ఎగుమతులకు సంబంధించి 2021లో తీసుకొచ్చిన ద రెమిషన్ ఆఫ్ డ్యూటీస్ అండ్ ట్యాక్సెస్ ఆన్ ఎక్స్‌పోర్టెడ్ ప్రొడక్ట్స్ (రాడ్‌టెప్) కింద ప్రోత్సాహకాలను 50 శాతానికి తగ్గిస్తూ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారీన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) ప్రకటించింది. ఎగుమతిదారులు తయారీ, పంపిణీలో భాగంగా చెల్లించిన పన్నులను, సుంకాలను ఈ పథకం కింద వెనక్కి పొందొచ్చు. 0.3 శాతం నుంచి 3.9 శాతం మేర రిఫండ్‌లకు అవకాశం ఉంది. లోగడ ఈ పథకంలో భాగంగా ప్రకటించిన రేట్లపై ఇక నుంచి 50 శాతానికే ప్రయోజనాలు పరిమితం అవుతాయని డీజీఎఫ్‌టీ తన నోటిఫికేషన్‌లో పేర్కొంది. కాగా ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తిరిగి పరిశీలించాలని భారత ఎగుమతిదారుల సమాఖ్య (ఎఫ్ఐఈవో) ఎస్‌సీ రల్హాన్ కేంద్రాన్ని కోరారు.

## ఏఐతో తప్పుడు సమాచార వ్యాప్తి

సెబీ హోల్‌టైమ్ డైరెక్టర్ సింగ్ వెల్లడి

ముంబై: ఏఐ వినియోగించడం ద్వారా అనూహ్య లాభాలు పేరిట తెరతీసే మార్కెటింగ్ గిమ్మిక్స్‌పట్ల జాగ్రత్త వహించవలసిందిగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ హోల్‌టైమ్ డైరెక్టర్ అమర్‌జీత్ సింగ్ తాజాగా పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు స్టాక్ మార్కెట్లపట్ల ప్రజలలో విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని వ్యాఖ్యానించారు. ఏఐ వినియోగం ద్వారా అత్యుత్తమ రిటర్నులు ఆర్జించవచ్చంటూ మార్కెట్ పార్టిసిపెంట్లు కొంతమంది అతిచేయడాన్ని ఈ సందర్భంగా సింగ్ ప్రస్తావించారు. స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ, ఐఐఎంకే సంయుక్తంగా నిర్వహించిన ఈవెంట్‌లో సింగ్ పలు విషయాలను పేర్కొన్నారు. ఏఐ వినియోగించడం ద్వారా సాధించిన అంశాలను కంపెనీలు అర్ధవంత విధానంలో తెలియజేయవలసి ఉంటుందని సూచించారు. అతిగా ఆర్జించినట్లు లేదా కొన్ని రకాల క్లెయిముల ప్రకటనలు ఇన్వెస్టర్లను మార్కెట్లపట్ల తప్పుదోవపట్టించడంతోపాటు.. విశ్వాసాన్ని దెబ్బతీసే అవకాశమున్నట్లు హెచ్చరించారు. నిజానికి విద్య, పరిశోధన, సమాచారం తదితరాలకు ఏఐ శక్తివంతమైన టూల్ అని పేర్కొన్నారు. అయితే ఏఐతో తప్పుడు సమాచార వ్యాప్తికీ వీలున్నదని, వీటిపట్ల అప్రమత్తత అవసరమని తెలియజేశారు.

# తగ్గేదేలే!

## జమ్మూకశ్మీర్ జబర్దస్త్ ఆట

తొలి ఇన్నింగ్స్ 527/6

రాణించిన పారస్ డోగ్రా, కన్హయ్య, సాహిల్

ప్రసిధ్ కృష్ణకు మూడు వికెట్లు

కర్ణాటకతో రంజీ ట్రోఫీ ఫైనల్

**హుబ్లీ:** తొలిసారి రంజీ ట్రోఫీ ఫైనల్ ఆడుతున్న జమ్మూకశ్మీర్ జట్టు అద్వితీయ ఆటతీరు కనబరుస్తోంది. దేశవాళీల్లో అపార అనుభవం ఉన్న కర్ణాటకతో తుదిపోరులో జమ్మూ ప్లేయర్లు జోరు కొనసాగిస్తున్నారు. ఓవర్‌నైట్ స్కోరు 284/2తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన జమ్మూకశ్మీర్ జట్టు బుధవారం ఆట ముగిసే సమయానికి 156 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 527 పరుగులు చేసింది. కెప్టెన్ పారస్ డోగ్రా (166 బంతుల్లో 70; 8 ఫోర్లు), కన్హయ్య వాధ్వాన్ (109 బంతుల్లో 70; 9 ఫోర్లు), సాహిల్ లోత్రా (93 బంతుల్లో 57 బ్యాటింగ్; 7 ఫోర్లు) హాఫ్ సెంచరీలతో రాణించారు. ప్లేయర్లంతా బాధ్యతాయుతంగా ఆడటంతో జమ్మూ జట్టు భారీ స్కోరు చేయగలిగింది. ఓవర్‌నైట్ బ్యాటర్లు శుభమ్ పుండిర్ (247 బంతుల్లో 121; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు), అబ్దుల్ సమద్ (104 బంతుల్లో 61; 6 ఫోర్లు, 1 సిక్స్) ఎక్కువసేపు నిలవలేకపోయారు. బుధవారం ఆట ప్రారంభమైన కాసేపటికే శుభమ్ అవుట్ కాగా... తదుపరి ఓవర్‌లో అబ్దుల్ సమద్ సైతం పెవిలియన్ చేరాడు. ఈ దశలో తొలి రోజు రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగిన కెప్టెన్ పారస్ డోగ్రా క్రీజులోకి వచ్చాడు. సుదీర్ఘ అనుభవమున్న ఈ 41 ఏళ్ల బ్యాటర్... ప్రత్యర్థి బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా క్రీజులో పాతుకుపోయాడు. మరోవైపు నుంచి కన్హయ్య అతడికి చక్కటి సహకారం అందించాడు. ఈ జంట చాపకింద నీరులా పరుగులు రాబడుతుండటంతో... కర్ణాటక ప్లేయర్లలో అసహనం పెరిగిపోయింది. ఇది మైదానంలో స్పష్టంగా కనిపించింది. పలుమార్లు ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య వాగ్వాదాలు సైతం జరిగాయి. ఈ క్రమంలో కన్హయ్య 84 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకోగా... పారస్ డోగ్రా 140 బంతుల్లో హాఫ్‌సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఐదో వికెట్‌కు 192 బంతుల్లో 110 పరుగులు జోడించిన అనంతరం కన్హయ్య వెనుదిరిగాడు. ఆ తర్వాత కూడా అదే జోరు కొనసాగించిన జమ్మూకశ్మీర్... కర్ణాటక బౌలర్లను మరింత అసహనానికి గురిచేసింది. ఆరో వికెట్‌కు పారస్, సాహిల్ కలిసి 75 బంతుల్లో 54 పరుగులు జోడించగా... అబేధ్యమైన ఏడో వికెట్‌కు అబిద్ ముస్తాక్ (20 బ్యాటింగ్; 2 ఫోర్లు)తో కలిసి సాహిల్ 56 పరుగులు జత చేశాడు. కర్ణాటక బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ 3 వికెట్లు పడగొట్టగా... విద్యాధర్ పాటిల్, శ్రేయస్ గోపాల్, శిఖర్ షెట్టి తలా ఒక వికెట్ పడగొట్టారు. ఇప్పటికే మంచి స్కోరు సాధించిన జమ్మూకశ్మీర్ జట్టు... తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతోనే పైచేయి సాధించాలనే ఉద్దేశంతో సాగుతోంది. చేతిలో నాలుగు వికెట్లు ఉన్న ఆ జట్టు మూడో రోజు మరెన్ని పరుగులు జోడిస్తుందో చూడాలి.

### అదేం పెద్ద విషయం కాదు

ఫైనల్లో మా ప్లేయర్లు చక్కటి ప్రదర్శన కనబరుస్తున్నారు. జట్టు సమష్టిగా సత్తా చాటుతోంది. ప్రస్తుతానికి మా జట్టు మంచి స్థితిలో ఉంది. ఇలాంటి పెద్ద మ్యాచ్‌ల్లో ఆమాత్రం కోపోద్రేకాలు సహజం. అనీశ్‌తో వాగ్వాదం అప్పటివరకు మాత్రమే. ఆ తర్వాత అంతా సాధారణమే. మేం తర్వాత మాట్లాడుకున్నాం కూడా. కర్ణాటక జట్టులో నాణ్యమైన ప్లేయర్లు ఉన్నారు. వారి ముందు లక్ష్యాన్ని నిర్దేశించాలనే ఉద్దేశం లేదు. తొలి ఇన్నింగ్స్‌ను వీలైనంత వరకు కొనసాగించే ప్రయత్నం చేస్తాం. ఇప్పటి వరకు మా ప్లేయర్లు చక్కటి ఆటతీరు కనబర్చారు. ఇక ముందు కూడా అదే స్ఫూర్తితో సాగుతాం.

-పారస్ డోగ్రా, జమ్మూకశ్మీర్ కెప్టెన్

### స్కోరు వివరాలు

**జమ్మూకశ్మీర్ తొలి ఇన్నింగ్స్:** కమ్రాన్ ఇక్బాల్ (సి) కేఎల్ రాహుల్ (బి) ప్రసిధ్ 6; యావర్ హసన్ (సి) కేఎల్ రాహుల్ (బి) ప్రసిధ్ 88; శుభమ్ (సి) (సబ్) అనీశ్ (బి) విద్యాధర్ 121; పారస్ డోగ్రా (బి) శ్రేయస్ 70; అబ్దుల్ సమద్ (సి) కృతిక్ (బి) ప్రసిధ్ 61; కన్హయ్య (సి) రాహుల్ (బి) శిఖర్ 70; సాహిల్ (బ్యాటింగ్) 57; ఆబిద్ ముస్తాక్ (బ్యాటింగ్) 20; ఎక్స్‌ట్రాలు 34; **మొత్తం (156 ఓవర్లలో 6 వికెట్లకు) 527. వికెట్ల పతనం:** 1–18, 2–157, 3–303, 4–307, 5–417, 6–471. **బౌలింగ్:** విద్యాధర్ పాటిల్ 29–2–104–1; విజయ్ కుమార్ వైశాఖ్ 31–10–60–0; ప్రసిధ్ కృష్ణ 29–7–90–3; శ్రేయస్ గోపాల్ 33–2–130–1; శిఖర్ షెట్టి32–1–112–1; కరుణ్ నాయర్ 2–1–1–0.

## ‘తల’పడ్డ పారస్,అనీశ్

### కర్ణాటక ఫీల్డర్‌ను హెల్మెట్‌తో ఢీకొట్టిన జమ్మూకశ్మీర్ కెప్టెన్

రంజీ ట్రోఫీలో అపార అనుభవం ఉన్న పారస్ డోగ్రా... కర్ణాటక ప్లేయర్‌తో వాగ్వాదానికి దిగి వార్తల్లోకి ఎక్కాడు. దేశవాళీల్లో 21వ సీజన్ ఆడుతున్న జమ్ముకశ్మీర్ సారథి... బ్యాటింగ్ చేస్తున్న సమయంలో సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్ అనీశ్‌తో గొడవకు దిగాడు. పారస్ సంయమనంతో షాట్‌లు ఆడుతుండగా... కర్ణాటక ప్లేయర్లు అతడి ఏకాగ్రత దెబ్బతీసేందుకు ప్రయత్నించారు. సిల్లీ పాయింట్‌లో సబ్‌స్టిట్యూట్‌గా ఫీల్డింగ్ చేస్తున్న అనీశ్... పారస్‌ను పదే పదే కామెంట్ చేశాడు. దీంతో ప్రసిధ్ బౌలింగ్‌లో బౌండరీ కొట్టిన అనంతరం పారస్... అతడి వైపు దూసుకెళ్లి వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో అనీశ్‌ను పారస్ హెల్మెట్‌తో ఢీకొట్టినట్లు వీడియోల్లో కనిపించింది. అనీశ్ కూడా హెల్మెట్ పెట్టుకొని ఉండగా... ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఇది గమనించిన సీనియర్ ప్లేయర్ మయాంక్ అగర్వాల్ వారిద్దరినీ వేరు చేశాడు. ఫీల్డ్ అంపైర్లు రోహన్ పండిట్, ఉల్హాస్ గంధె కలుగచేసుకొని ఇద్దరికీ సర్దిచెప్పారు. మ్యాచ్ అనంతరం జమ్మూకశ్మీర్ సారథి పారస్ డోగ్రా మ్యాచ్ ఫీజులో 50 శాతం జరిమానా విధించినట్లు మ్యాచ్ రిఫరీ నారాయణ్ కుట్టీ వెల్లడించాడు.

## క్వార్టర్స్‌లో సాకేత్ జోడీ

**పుణే:** మహా ఓపెన్ ఏటీపీ చాలెంజర్–75 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్ మైనేని–దిగ్విజయ్ ప్రతాప్ సింగ్ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్ చేరింది. తొలి రౌండ్‌లో సాకేత్–దిగ్విజయ్‌ప్రతాప్ ద్వయం 6–3, 6–3తో మసామిచి–కొకోరో ఇసోమురా (జపాన్) జంటపై గెలిచింది. సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్ మానస్ ధామ్నె క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఇల్యా ఇవాష్కా (బెలారస్)తో బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో మానస్ తొలి సెట్‌ను 6–3తో గెల్చుకున్నాడు. ఈ దశలో గాయం కారణంగా ఇవాష్కా వైదొలిగాడు. దాంతో మానస్‌కు విజయం ఖరారైంది.

## చరిత్ర సృష్టించిన మానవ్–మనుశ్ ద్వయం

**సింగపూర్:** వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) గ్రాండ్ స్మాష్ లెవెల్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరిన తొలి భారతీయ జోడీగా మానవ్ ఠక్కర్–మనుశ్ షా చరిత్ర సృష్టించింది. సింగపూర్ స్మాష్ టోర్నీలో ఆరో సీడ్‌గా బరిలోకి దిగిన మానవ్–మనుశ్ ద్వయం సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో మానవ్–మనుశ్ 11–8, 11–9, 11–9తో మార్టిన్ అలెగ్రో–రొసెన్‌ఫోస్ (బెల్జియం)లపై విజయం సాధించారు. ఈ మ్యాచ్‌లో భారత జోడీ తమ సర్వీస్‌లో 18 పాయింట్లు, ప్రత్యర్థి సర్వీస్‌లో 15 పాయింట్లు స్కోరు చేసింది. తొలి రౌండ్‌లో ‘బై’ పొందిన భారత జంట రెండో రౌండ్‌లో 11–7, 11–5, 11–9తో గిలెర్మి టియోడోరో–లియోనార్డో ఇజుక (బ్రెజిల్) జోడీపై గెలిచింది. శుక్రవారం జరిగే సెమీఫైనల్లో ఫెలిక్స్–అలెక్సిస్ (ఫ్రాన్స్)లతో మానవ్–మనుశ్ తలపడతారు. మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో మనుశ్ షా–దియా (భారత్) ద్వయం 6–11, 9–11, 5–11తో హుగో కాల్డెరానో–బ్రూనా తకహాషి (బ్రెజిల్) జంట చేతిలో ఓడిపోయింది.

స్వదేశంలో గెలుపు ఖాతా తెరవడంలో విఫలమైన భారత పురుషుల హాకీ జట్టు విదేశీ గడ్డపై ఎట్టకేలకు గెలుపు బోణీ కొట్టింది. రెండో అంచె చివరి లీగ్ మ్యాచ్‌లో నిర్ణీత సమయంలో నేరుగా కాకపోయినా ‘షూటౌట్’లో విజయాన్ని అందుకుంది. ప్రపంచ, ఒలింపిక్ మాజీ చాంపియన్ ఆస్ట్రేలియాను వారి గడ్డపైనే ‘షూటౌట్’లో ఓడించిన భారత జట్టు మూడో అంచె మ్యాచ్‌లను జూన్‌లో నెదర్లాండ్స్‌లో ఆడనుంది.

## ‘షూటౌట్’లో గెలిచాం

### ప్రొ హాకీ లీగ్‌లో భారత్ గెలుపు బోణీ • ఎనిమిదో మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై ‘షూటౌట్’లో పైచేయి

**హోబర్ట్:** మొదటి ఐదు మ్యాచ్‌ల్లో నిర్ణీత సమయంలో పరాజయం... ఆ తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో ‘షూటౌట్’లో ఓటమి... ఎలాగైతేనేం వరుసగా ఏడు పరాజయాలు... కానీ ఎనిమిదో ప్రయత్నంలో భారత పురుషుల హాకీ జట్టు గెలుపు రుచి చూడటంలో సఫలమైంది. ఆస్ట్రేలియాలాంటి పటిష్ట జట్టును వారి గడ్డపైనే ‘షూటౌట్’లో ఓడించి రెండో అంచె లీగ్‌ను భారత జట్టు ముగించింది. బుధవారం జరిగిన ప్రొ లీగ్ ఎనిమిదో మ్యాచ్‌లో హార్దిక్ సింగ్ బృందం ‘షూటౌట్’లో 3–1 గోల్స్ తేడాతో ఆస్ట్రేలియాపై జట్టుపై గెలిచింది. భారత్‌కు రెండు పాయింట్లు, ఆస్ట్రేలియాకు ఒక పాయింట్ లభించాయి. నిర్ణీత సమయంలో రెండు జట్లు 1–1తో సమంగా నిలిచాయి. విజేతను నిర్ణయించేందుకు ‘షూటౌట్’ నిర్వహించగా... భారత్ తరఫున గోల్‌కీపర్ శశి కుమార్ మోహిత్ హొన్నేణహళ్లి హీరోగా అవతరించాడు. ముగ్గురు ఆస్ట్రేలియా ఆటగాళ్ల షాట్‌లను మోహిత్ అడ్డుకొని భారత్‌ను గెలిపించాడు. భారత్ తరఫున ‘షూటౌట్’లో శిలానంద్ లాక్రా, మణీందర్ సింగ్, విష్ణుకాంత్ సింగ్ సఫలంకాగా... అభిషేక్ విఫలమయ్యాడు. ఆస్ట్రేలియా తరఫున మొదటి మూడు షాట్‌లు తీసుకున్న టిమ్ బ్రాండ్, లియామ్ హెండర్సన్, కూపర్ బర్న్స్ విఫలమవ్వగా... నాలుగో షాట్‌లో జెరెమీ హేవార్డ్ సఫలమయ్యాడు. అంతకుముందు రెగ్యులర్ సమయంలోని మూడు క్వార్టర్స్‌లో రెండు జట్లు గోల్స్ చేయలేకపోయాయి. చివరి క్వార్టర్‌లోని 49వ నిమిషంలో జెరెమీ హేవార్డ్ పెనాల్టీ కార్నర్‌ను లక్ష్యానికి చేర్చాడు. దాంతో ఆస్ట్రేలియా 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే ఆ ఆనందం రెండు నిమిషాల్లో ఆవిరైంది. 51వ నిమిషంలో భారత ఫార్వర్డ్ శిలానంద్ లాక్రా గోల్ చేసి స్కోరును 1–1తో సమం చేశాడు. చివరి తొమ్మిది నిమిషాల్లో ఇరు జట్ల ఆటగాళ్లు మరో గోల్ చేయడానికి ప్రయత్నించి సఫలం కాలేకపోయారు. మ్యాచ్ మొత్తంలో భారత జట్టు తమకు లభించిన ఐదు పెనాల్టీ కార్నర్‌లను వృథా చేసింది. ఆస్ట్రేలియా తమకు దక్కిన ఏడు పెనాల్టీ కార్నర్‌లలో ఒక దానిని సద్వినియోగం చేసుంది. జూన్ 14 నుంచి 21 వరకు రోటర్‌డామ్‌లో మూడో అంచె మ్యాచ్‌లు జరుగుతాయి. భారత జట్టు జూన్ 14న నెదర్లాండ్స్‌తో... 17న జర్మనీతో... 18న మళ్లీ జర్మనీతో... 21న మళ్లీ నెదర్లాండ్స్‌తో ఆడుతుంది. అనంతరం 23 నుంచి 28 వరకు లండన్‌లో నాలుగో అంచె మ్యాచ్‌లు జరుగుతాయి. భారత జట్టు జూన్ 23న పాకిస్తాన్‌తో... 25న ఇంగ్లండ్‌తో... 26న మళ్లీ పాకిస్తాన్‌తో... 28న మళ్లీ ఇంగ్లండ్‌తో తలపడుతుంది.

### ‘షూటౌట్’ సాగిందిలా...

| ఆస్ట్రేలియా | స్కోరు | భారత్ |
|---|---|---|
| టిమ్ బ్రాండ్ ✗ | 0-1 | ✔ శిలానంద్ లాక్రా |
| లియామ్ ✗ | 0-2 | ✔ మణీందర్ సింగ్ |
| కూపర్ బర్న్స్ ✗ | 0-2 | ✗ అభిషేక్ |
| జెరెమీ హేవార్డ్ ✔ | 1-3 | ✔ విష్ణుకాంత్ సింగ్ |

నోట్: భారత్ గెలుపు ఖాయం కావడంతో ఐదో షాట్ తీసుకోలేదు

### ప్రొ హాకీ లీగ్ పాయింట్ల పట్టిక

| జట్టు | ఆడినవి | గెలిచినవి | షూటౌట్‌లో గెలిచినవి | షూటౌట్‌లో ఓడినవి | ఓడినవి | చేసిన గోల్స్ | ఇచ్చిన గోల్స్ | వ్యత్యాసం | పాయింట్లు |
|---|---|---|---|---|---|---|---|---|---|
| బెల్జియం | 8 | 7 | 0 | 1 | 0 | 30 | 14 | 16 | 22 |
| ఆస్ట్రేలియా | 8 | 6 | 1 | 1 | 0 | 21 | 8 | 13 | 21 |
| అర్జెంటీనా | 8 | 5 | 1 | 0 | 2 | 29 | 18 | 11 | 17 |
| నెదర్లాండ్స్ | 8 | 4 | 0 | 3 | 1 | 26 | 18 | 8 | 15 |
| ఇంగ్లండ్ | 8 | 3 | 3 | 0 | 2 | 20 | 17 | 3 | 15 |
| జర్మనీ | 8 | 3 | 0 | 0 | 5 | 20 | 22 | -2 | 9 |
| స్పెయిన్ | 8 | 1 | 1 | 0 | 6 | 12 | 21 | -9 | 5 |
| భారత్ | 8 | 0 | 1 | 2 | 5 | 9 | 25 | -16 | 4 |
| పాకిస్తాన్ | 8 | 0 | 0 | 0 | 8 | 13 | 37 | -24 | 0 |

## తరుణ్ ఓటమి



**ముల్హీమ్ అన్ డెర్ రుర్:** జర్మన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్ తరుణ్ మన్నేపల్లికి నిరాశ ఎదురైంది. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో ప్రపంచ 42వ ర్యాంకర్ తరుణ్ 18–21, 18–21తో ప్రపంచ 28వ ర్యాంకర్ వాంగ్ జు వె (చైనీస్ తైపీ) చేతిలో పోరాడి ఓడిపోయాడు. మరో మ్యాచ్‌లో కిరణ్ జార్జి 10–21, 20–22తో క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్) చేతిలో పరాజయం పాలయ్యాడు. మహిళల సింగిల్స్‌లో మాళవిక, రక్షిత శ్రీ, తస్నిమ్ మీర్ కూడా తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. మాళవిక 21–19, 9–21, 19–21తో బీవెన్ జాంగ్ (అమెరికా) చేతిలో, తస్నిమ్ 9–21, 14–21తో వాంగ్ జి యి (చైనా) చేతిలో, రక్షిత శ్రీ 18–21, 23–21, 16–21తో లినె క్రిస్టోఫర్సన్ (డెన్మార్క్) చేతిలో ఓడిపోయారు.

## పోరాడి ఓడిన రామ్–జీవన్ ద్వయం

**దుబాయ్:** క్వాలిఫయింగ్ నుంచి మెయిన్ ‘డ్రా’కు అర్హత సాధించిన రామ్‌కుమార్ రామనాథన్–జీవన్ నెడుంజెళియన్ (భారత్) జోడీ దుబాయ్ ఓపెన్ టెన్నిస్ చాంపియన్‌షిప్ నుంచి నిష్క్రమించింది. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో రామ్–జీవన్ జంట 6–4, 5–7, 3–10తో ‘సూపర్ టైబ్రేక్’లో థియో అరిబెగ్–అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ చేతిలో ఓడిపోయింది. 86 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో భారత ద్వయం 10 ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తొలి సర్వీస్‌లో 35 పాయింట్లు, రెండో సర్వీస్‌లో 8 పాయింట్లు స్కోరు చేసింది. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసింది. అయితే నిర్ణాయక టైబ్రేక్‌లో ఫ్రాన్స్ జోడీ పైచేయి సాధించింది. వేర్వేరు భాగస్వాములతో బరిలోకి దిగిన భారత్‌కే చెందిన యూకీ బాంబ్రీ, శ్రీరామ్ బాలాజీలు కూడా తొలి రౌండ్‌ను దాటలేకపోయారు. యూకీ బాంబ్రీ (భారత్)–ఆంద్రీ గొరాన్‌సన్ (స్వీడన్) జోడీ 1–6, 4–6తో హెలియోవారా (ఫిన్‌లాండ్)–హెన్రీ ప్యాటెన్ (బ్రిటన్) జంట చేతిలో... శ్రీరామ్ బాలాజీ (భారత్)–నీల్ ఒబెర్‌లెట్నర్ (ఆస్ట్రియా) ద్వయం 7–5, 6–7 (8/10), 5–10తో ‘సూపర్ టైబ్రేక్’లో సిమోన్ బొలెలీ–వావసోరి (ఇటలీ) జంట చేతిలో ఓడిపోయాయి. తొలి రౌండ్‌లో ఓడిన రామ్–జీవన్; యూకీ–గొరాన్‌సన్; బాలాజీ–ఒబెర్‌లెట్నర్‌లకు 14,200 డాలర్ల (రూ. 12 లక్షల 90 వేలు) చొప్పున ప్రైజ్‌మనీ లభించింది.

# ఎట్టకేలకు చిక్కిన పాలపుంత హృదయం!

కేప్ కెనావెరల్: మన పాలపుంత 'హృదయ' స్థానం ఎలా ఉంటుంది? ఇదుగో, అచ్చం ఇలా ఉంటుందట. సరిగ్గా పాలపుంత మధ్యలో ఉన్న ఈ ప్రాంతాన్ని సెంట్రల్ మాలిక్యులార్ జోన్ (సీఎంజెడ్)గా పిలుస్తున్నారు. సుదూరాల దాకా దట్టంగా పరుచుకుని సుడులు తిరుగుతున్న ఈ ప్రాంతం ఎప్పటికప్పుడు నూతన తారలకు జన్మనిచ్చే వాయువులు తదితరాలతో కళకళలాడిపోతూ కనిపిస్తోంది. ఈ హృదయ స్థానం వైశాల్యం ఏకంగా 650 కాంతి సంవత్సరాలట! ఒక్క కాంతి సంవత్సరమంటే దాదాపు 9.7 లక్షల కోట్ల కిలోమీటర్లన్నది తెలిసిందే. చిలీకి చెందిన అటకామా లార్జ్ మిల్లీమీటర్ అరే (ఏఎల్ఎంఏ) టెలిస్కోప్ దీన్ని తాజాగా అత్యంత స్పష్టతతో బంధించింది. ఇందుకు సంబంధించి ఫొటోలను యూరోపియన్ సదరన్ అబ్జర్వేటరీ బుధవారం విడుదల చేసింది. ఈ సీఎంజెడ్‌లో కొత్త నక్షత్రాలు ఎలా పురుడు పోసుకుంటున్నదీ మరింత లోతుగా అధ్యయనం చేసేందుకు ఈ ఫొటోలు ఎంతగానో దోహదపడతాయని సైంటిస్టులు చెబుతున్నారు. తద్వారా తారా మండలాల పుట్టుక, వికాసం తదితరాలపై మరింత స్పష్టత రానుంది.

**విపరీతాలకు నెలవు**

తారా మండలాల నాభి స్థానాలు (సీఎంజెడ్) పలు విపరీతాలకు కేంద్రమని యూరోపియన్ సదరన్ అబ్జర్వేటరీకి చెందిన ఆష్లీ బార్న్స్ వివరించారు. ''అక్కడ మన కంటికి చిక్కకుండా జరిగిపోయే పరిణామాలు అన్నీ ఇన్నీ కావు. వాటని ఇంత అసాధారణ స్పష్టతతో చూడగలగడం ఇదే మొదటిసారి''అంటూ హర్షం వెలిబుచ్చారు. ఏఎల్ఎంఏ బంధించిన అతి పెద్ద ఇమేజ్ ఇదేనని ఆయన వెల్లడించారు. పాలపుంతలోని సీఎంజెడ్ ప్రాంతంపై ఆయన సారథ్యంలోని అంతర్జాతీయ సైంటిస్టులు, పరిశోధకుల బృందం కొంతకాలంగా లోతైన పరిశోధనలు చేస్తోంది. తాజా ఫొటో తదితరాలపై వారి అధ్యయనాన్ని రాయల్ ఆస్ట్రానమికల్ సొసైటీ తన మంత్లీ నోటీసెస్‌లో ప్రచురించనుంది. సీఎంజెడ్ తాలూకు 650 కాంతి సంవత్సరాల విస్తీర్ణంలో కేవలం నాభి స్థానమే కనీసం 300 కాంతి సంవత్సరాల మేరకు విస్తరించి ఉంటుందని సైంటిస్టులు చెబుతున్నారు. సరిగ్గా దాన్ని ఆనుకుని ఉండే మిగతా ప్రాంతమంతా పాలపుంత మధ్య స్థానంలోని అత్యంత భారీ కృష్ణబిలమని బార్న్స్ వివరించారు. నాభి స్థానంలో సుడులు తిరుగుతున్న చల్లని వాయువులే నిరంతరం భారీ నక్షత్రాల పుట్టుకకు కారణమవుతున్నాయని చెప్పారు. ఏఎల్ఎంఏ అందజేసిన తాజా ఫొటోల్లో ఆ వాయు నిర్మాణాలు డజన్ల కొద్దీ కాంతి సంవత్సరాల మేరకు విస్తరించి అత్యంత స్పష్టతతో కన్పిస్తుండటం విశేషం. ఒక్కో నక్షత్రాన్నీ ఆవరించి ఉన్న చిన్నపాటి వాయు మేఘాలు కూడా అందులో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ''సిలికాన్ మోనాక్సైడ్ వంటి సాదాసీదా వాయువులతో పాటు మెథనాల్, ఇథనాల్ వంటి సంక్లిష్ట వాయువుల దాకా వీటిలో ఉన్నాయి. ఈ వాయువులన్నీ నూతన తారలకు ఎలా జన్మనిస్తున్నదీ తెలుసుకునేందుకు, అవి అంతిమంగా పాలపుంత కేంద్ర స్థానంలోని అతి భారీ కృష్ణబిలం వైపు ఎలా ఆకర్షితమవుతున్నదీ విశ్లేషించేందుకు, మొత్తంగా సీఎంజెడ్ నిర్మాణాన్ని మరింతగా అర్థం చేసుకునేందుకు ఈ ఫొటోలు ఎంతో ఉపయోగపడతాయి. పాలపుంత అంచుల్లోని నక్షత్రాలతో పోలిస్తే మధ్య ప్రాంతంలోని తారల జీవితకాలం చాలా తక్కువ. అవి యుక్తవయసులో ఉండగానే అత్యంత శక్తిమంతమైన సూపర్‌నోవాగా, ఒక్కోసారి హైపర్‌నోవాగా మారి పేలిపోతుంటాయి. వీటన్నింటికీ మరిన్ని కారణాలు తాజా ఫొటోలతో తెలిసే అవకాశముంది'' అని మరో పరిశోధకుడు స్టీవ్ లాంగ్‌మోర్ వివరించారు. ఇది ఇతర తారా మండలాలకు సంబంధించి కూడా మరింత అవగాహనకు దారి తీయవచ్చని ఆశాభావం వెలిబుచ్చారు.



మన పాల పుంత. (ఇన్‌సెట్లో) సెంట్రల్ మాలిక్యులార్ జోన్

బుధవారం యూపీలో గాజియాబాద్‌లోని గ్రీన్‌ఫీల్డ్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో సంచరిస్తున్న చిరుతపులి

## చదువుల బడిలో చిరుత

**యూపీలో మత్తు మందిచ్చి పట్టుకున్న అటవీసిబ్బంది**

గాజియాబాద్: పాఠాలు వినేందుకు విద్యార్థులు రావాల్సిన పాఠశాలకు వాళ్ల కంటే ముందే ఒక చిరుతపులి రావడంతో పాఠశాల యాజమాన్యం అవాక్కైంది. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చి దానిని పట్టుకునేందుకు కృషిచేసింది. ఉత్తరప్రదేశ్‌లోని గాజియాబాద్‌లోని గోవిందాపురం ప్రాంతంలో బుధవారం ఉదయం ఈ ఘటన జరిగింది. పాఠశాల వైపుగా ఒక చిరుత రావడం అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డయింది. ఇది చూసిన పాఠశాల యాజమాన్యం వెంటనే పోలీసులకు ఫిర్యాదుచేయడం, వాళ్లు వెంటనే బోను, మత్తుమందు ఇంజెక్షన్లతో అటవీశాఖ సిబ్బందిని వెంటేసుకుని రంగంలోకి దిగడం చకచకా జరిగిపోయాయి. ఎట్టకేలకు చిరుతను పాఠశాల టాయిలెట్ గదిలో గుర్తించారు. గది గోడకు నాలుగు అడుగుల రంధ్రం చేసి అందులోంచే మత్తు ఇంజెక్షన్‌ను చిరుత మీదకు ప్రయోగించి అది నిద్రపోయేలా చేశారు. బోనులోకి ఎక్కించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సహరన్‌పూర్‌లోని శివాలిక్ కొండల్లో చిరుతను వదిలేస్తామని సబ్ డివిజనల్ అధికారి డాక్టర్ సలోని చెప్పారు.

## అమెరికా.. మంచుమయం

న్యూయార్క్: ఈశాన్య అమెరికాను మంచు తుఫాను వణికిస్తోంది. వీధులు, రోడ్లపై మంచు పేరుకుపోవడంతో బుధవారం జనం ఇబ్బందులకు గురయ్యారు. మేరీలాండ్ రాష్ట్రం నుంచి మెయినే రాష్ట్రం దాకా ఎక్కడ చూసినా మంచు కనిపిస్తోంది. 2.5 సెంటీమీటర్ల నుంచి 7.6 సెంటీమీటర్ల దాకా మందంగా మంచు పేరుకున్నట్లు జాతీయ వాతావరణ సేవల విభాగం వెల్లడించింది. ప్రధానంగా నగరాల్లో మంచు కారణంగా విధులకు ఆలస్యంగా హాజరు కావాల్సి వస్తోందని జనం చెబుతున్నారు. పిల్లలు కూడా పాఠశాలలకు ఆలస్యంగా వెళ్తున్నారు. మంచును తొలగించడానికి చాలా శ్రమించాల్సి వస్తోంది. మంగళవారం సాయంత్రం న్యూయార్క్ సిటీలో 65 మిలియన్ కిలోల ఉప్పును రోడ్లపై చల్లినట్లు మేయర్ జోహ్రాన్ మమ్దానీ ప్రకటించారు. మంచును తొలగించి, రహదారులను రాకపోకలకు అనువుగా మార్చడానికి 3,500 మందిని రంగంలోకి దించామని చెప్పారు. వీరికి గంటకు 30 డాలర్ల చెల్లిస్తున్నారు. మంచు వల్ల దివ్యాంగులకు మరిన్ని కష్టాలు వచ్చిపడ్డాయి. రహదారులపై స్ట్రోలర్లు, రొలేటర్, వాకర్ లాంటివి ప్రయాణించే పరిస్థితి లేదు. జాగ్రత్తగా నడిచివెళ్లాల్సి వస్తోంది. అలా నడిచేవీలు లేని దివ్యాంగులు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. ప్రతికూల వాతావరణం వల్ల పెద్ద సంఖ్యలో విమానాలు రద్దవుతున్నాయి. రైళ్ల రాకపోకలకు సైతం అంతరాయం కలుగుతోంది. విద్యుత్ లైన్లు దెబ్బతింటున్నాయి మంచు సంబంధిత ఘటనలో కనీసం ఒకరు మరణించారని అధికార వర్గాలు తెలిపాయి. రోడ్ ఐలాండ్‌లో 0.9 మీటర్ల మేర మంచు పేరుకుపోయింది. ఇలాంటి పరిస్థితి ఏర్పడడం 1978 తర్వాత ఇదే మొదటిసారి కావడం గమనార్హం. మసాచుసెట్స్, న్యూజెర్సీ, డెలావెర్, రోడ్ ఐలాండ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొన్ని గంటల తర్వాత పునరుద్ధరించారు.

## జాతివివక్ష కేసులో ఢిల్లీ జంట అరెస్టు

న్యూఢిల్లీ: పొరుగునే ఉంటున్న ఈశాన్య రాష్ట్రాల యువతులపై వివక్షపూరిత వ్యాఖ్యల చేసిన భార్యాభర్తలను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. దక్షిణ ఢిల్లీలోని మాల్వియా నగర్ ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన ముగ్గురు యువతులు ఉంటున్నారు. ఫిబ్రవరి 20న వారు అద్దెకు ఉంటున్న ఇంట్లో మరమ్మతు పనులు చేయిస్తున్నారు. ఈ క్రమంలో వచ్చిన దుమ్ముధూళి కింద పోర్షన్‌లో పడింది. ఆ ఇంటి వాస్తవ్యులు రూబీ జైన్, ఆమె భర్త హర్ష్ ప్రియా సింగ్ యువతులతో ఘర్షణ పడ్డారు. మరమ్మతు చేస్తున్న వ్యక్తి వచ్చి క్షమించమని అడిగినా వినిపించుకోలేదు. ముగ్గురు యువతులను దుర్భాషలాడారు. వివక్షపూరిత, అవమానకరమైన వ్యాఖ్యలు చేశారు. ఈ గొడవ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఘర్షణపై మాల్వియా నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఘర్షణ వీడియోలు, ఇరుగుపొరుగు వాంగ్మూలాలను పరిశీలించిన పోలీసులు రూబీ జైన్, హర్ష్ ప్రియా సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఘటనపై ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా స్పందించారు. 'ఢిల్లీ అందరికీ చెందుతుంది. పోలీసులు పూర్తి బాధ్యతతో చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. దోషులపై సాధ్యమైనంత కఠినమైన చర్య తీసుకునేలా చూస్తాం. ఢిల్లీలో ఏ ఒక్క ఆడబిడ్డను వేధించడం, వివక్ష చూపడం లేదా అవమానించడం వంటి సంఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోము' అని అన్నారు.

## ఔషధ మొక్కలతో నేలకు, రైతుకు మేలు: రాష్ట్రపతి

షెగావ్ (మహారాష్ట్ర): ఔషధ మొక్కల పెంపకం రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడమే కాకుండా నేల సారాన్ని కూడా పెంచుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. మహారాష్ట్రలోని బుల్ఢానా జిల్లాలోని షెగావ్‌లో బుధవారం జరిగిన జాతీయ ఆరోగ్య ఉత్సవం–2026ను రాష్ట్రపతి ప్రారంభించారు. అనంతరం ముర్ము మాట్లాడుతూ, దేశాన్ని ఆరోగ్యంగా మార్చడంలో ఆరోగ్యకరమైన పౌరులు కీలక పాత్ర పోషిస్తారన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలకమైన ఔషధ మొక్కల పెంపకాన్ని ఎలా చేయాలో అందరూ ఆలోచించాలన్నారు. ఒత్తిడి లేని, ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం ప్రపంచవ్యాప్తంగా ప్రజలు యోగాను చేస్తున్నారని తెలిపారు. మంచి ఆరోగ్యానికి క్రమం తప్పకుండా వ్యాయామం, సరైన ఆహారం, సమతుల్య జీవనశైలి వంటివి ముఖ్యమైనవని చెప్పారు.

## బ్రెజిల్‌లో భీకర వరద

**40 మంది దుర్మరణం**

**పలువురి జాడ గల్లంతు**

జూయిజ్ డీ ఫోరా: బ్రెజిల్‌లోని ఈశాన్య రాష్ట్రం మినాస్ గెరాయిస్‌ను భీకర వరదలు ముంచెత్తాయి. దీంతో రాష్ట్రంలోని జూయిజ్ డీ ఫోరా, ఉబా నగరాల్లో లక్షలాది మంది ప్రజల జనజీవన అస్తవ్యస్థమైంది. వరద సంబంధ ఘటనల్లో ఇప్పటిదాకా 40 మంది చనిపోయారని అధికారులు ప్రకటించారు. ఇంకా చాలా మంది జాడ తెలీకుండా పోయిందని సహాయక బృందాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నాయని అధికారులు ప్రకటించారు. రాత్రిళ్లు సైతం రిస్క్యూ బృందాలు తమ విధుల్లో నిమగ్నమయ్యాయి. ముంపు ప్రాంతాల్లోని 3,000 మందిని బుధవారం ఉదయం అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మరి కొద్దిరోజులపాటు భారీ వర్షాలుకురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. 5,60,000 జనాభా ఉండే జూయిజ్ డీ ఫోరా నగర వీధులన్నీ బురదలో నిండిపోయాయి. సమీపంలోని కొండచరియలు మరోసారి విరిగిపడే ప్రమాదముందని అధికారులు హెచ్చరికలు జారీచేశారు. 1,07,000 జనాభా ఉన్న ఉబా నగరంలో జనజీవనం స్తంభించింది. పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. సోమవారం ఉదయం నుంచి మొదలైన వానలకు ఇప్పటిదాకా 20 కొండచరియలు విరిగిన ఘటనలు నమోదయ్యాయని మేయర్ మార్గరీడా సాలమావో చెప్పారు. వరదబాధిత ప్రాంతాల్లో సైన్యం సహాయక చర్యల్లో పాల్గొంటోందని, బాధిత కుటుంబాలకు తగుసాయం అందిస్తామని బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లాలూ డ సిల్వా భరోసా ఇచ్చారు. కొండలు, లోయలు, లోతట్టు ప్రాంతాలకు వైద్య బృందాలను పంపించారు.

నిరసన కార్యక్రమంలో తోపులాట

## కేరళ మంత్రి వీణా జార్జ్‌కు గాయాలు

కన్నూర్/తిరువనంతపురం: ఒక కార్యక్రమంలో పాల్గొని తిరిగివెళ్తున్న కేరళ ఆరోగ్య శాఖ మహిళా మంత్రి వీణా జార్జ్ విద్యార్థులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో గాయపడ్డారు. చేతికి, మెడకు స్వల్ప గాయాలైనట్లు తెలుస్తోంది. వెంటనే ఆమెను కన్నూర్‌లోని జిల్లా ఆస్పత్రిలో చేర్పించామని సీపీఐ(ఎం) సీనియర్ నేత పి. జయరాజన్ చెప్పారు. బుధవారం కన్నూర్ రైల్వేస్టేషన్‌లో ఈ ఘటన జరిగింది. కళ్యాద్ అంతర్జాతీయ ఆయుర్వేద పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించాక వందేభారత్ రైలులో తిరిగి వెళ్లేందుకు మంత్రి రైల్వేస్టేషన్‌కు రాగా అక్కడే ఉన్న విపక్ష కాంగ్రెస్‌కు చెందిన కేరళ స్టూడెంట్స్ యూనియన్(కేఎస్‌యూ) సభ్యులు నల్లజెండాలు పట్టుకుని మంత్రిని చుట్టుముట్టి నినాదాలు చేశారు. మంత్రికి రక్షణగా వచ్చిన పోలీసులతో విద్యార్థులకు వాగ్వాదం జరిగింది. ఈ తోపులాటలో మంత్రికి గాయాలయ్యాయని అక్కడే ఉన్న రాష్ట్ర శాసనసభ స్పీకర్ ఏఎన్ షంషీర్ చెప్పారు. ఈ ఘటనను సీపీఐ చేసిన డ్రామాగా కాంగ్రెస్ పార్టీ అభివర్ణించింది. రైల్వేస్టేషన్‌లో తగిలినట్లుగా చూపుతున్న గాయం వాస్తవానికి మూడు గంటల ముందే జరిగిన వేరే కార్యక్రమంలో ఎడమ చేతికి కన్పించిందని సంబంధిత వీడియోను కేఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫర్హాన్ ముండేరి షేర్ చేశారు. తోపులాట ఘటనలో ఐదుగురు కేఎస్‌యూ సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వందనం ప్రభుత్వాసుపత్రిలో 2021 మేలో మహిళకు సర్జరీలో నిర్లక్ష్యం విషయంలో తగు చర్యలు తీసుకోని మంత్రిపై నిరసన తెలిపేందుకు తాము ఆందోళనకు దిగామని, మంత్రికి గాయపర్చలేదని కేఎస్‌యూ తెలిపింది.

## నలుగురు కలిసి దోచేశారు!

**ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులోని ప్రభుత్వ సొమ్ము మాయంపై దర్యాప్తు ముమ్మరం**

- ఇద్దరు సూత్రధారులు సహా నలుగురి అరెస్టు
- స్వాహా చేసిన డబ్బులో రూ.300 కోట్లు మాజీ మేనేజర్ సంస్థలోకి..
- పూర్తి సొమ్ము వడ్డీతో సహా ప్రభుత్వానికి చెల్లించామన్న బ్యాంకు యాజమాన్యం

చండీగఢ్: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులోని ప్రభుత్వ ఖాతాల నుంచి రూ.590 కోట్లను స్వాహా చేసిన కేసులో సూత్రధారులు సహా మొత్తం నలుగురు వ్యక్తులు రిభవ్ రిషి, అభయ్ కుమార్, స్వాతి సింగ్లా, అభిషేక్ సింగ్లాను హరియాణా స్టేట్ విజిలెన్స్, యాంటీ కరప్షన్ బ్యూరో(ఎస్‌వీ, ఏసీబీ) అధికారులు అరెస్టు చేశారు. బ్యాంకు మాజీ ఉద్యోగి భార్యకు సంబంధించిన ఓ ప్రైవేట్ సంస్థ ఈ మోసంలో పాలుపంచుకున్నట్లు గుర్తించారు. అరెస్టయిన నలుగురు నిందితుల్లో ఇద్దరు బ్యాంకు మాజీ ఉద్యోగులే కావడం గమనార్హం. మరో ఇద్దరు ప్రైవేట్ వ్యక్తులు. వారిద్దరూ ఒక కంపెనీలో భాగస్వాములు. కొట్టేసిన డబ్బులో పెద్ద మొత్తం వారి జేబుల్లోకి వెళ్లినట్లు సమాచారం. మొత్తానికి ఈ వ్యవహారం హరియాణాలో సంచలనాత్మకంగా మారింది. అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. రిభవ్ రిషి ఆరు నెలల క్రితం దాకా చండీగఢ్‌లోని సెక్టార్ 32 బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేశాడు. రిలేషన్‌షిప్ మేనేజర్ అయిన అభయ్ గత ఏడాది ఆగస్టులో పదవీ విరమణ చేశాడు. ఈ కేసులో వీరిద్దరూ మాస్టర్ మైండ్స్ అని అధికారులు వెల్లడించారు. ఇద్దరూ కలిసి ప్రభుత్వ సొమ్మును దారి మళ్లించడంలో కీలకంగా వ్యవహరించారు. ఇక అభయ్ భార్య స్వాతి సింగ్లా, ఆమె సోదరుడు అభిషేక్ సింగ్లా కలిసి 'స్వస్తిక్ దేశ్ ప్రాజెక్టు' పేరిట ఓ సంస్థను నెలకొల్పారు. ఇందులో స్వాతికి 75 శాతం, అభిషేక్‌కు 25 శాతం వాటా ఉంది. దాదాపు రూ.300 కోట్లు స్వస్తిక్ దేశ్ ప్రాజెక్టు ఖాతాలోకి బదిలీ అయ్యాయి. ఆ తర్వాత ఆ సొమ్మును వేర్వేరు ఖాతాలకు మళ్లించారు.

**ఖాతాలు రద్దు చేసుకున్న రాష్ట్ర ప్రభుత్వం**

ప్రధాన నిందితుడిగా రిభవ్ రిషిని గుర్తించారు. బ్యాంకు మోసంపై ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. అంతేకాకుండా సమగ్ర దర్యాప్తు కోసం హరియాణా ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. సీనియర్ ఐపీఎస్ అధికారి గంగారామ్ పూనియా నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) సైతం ఏర్పాటు చేశారు. ఇది సంక్లిష్టమైన కేసు కావడంతో చార్టర్డ్ అకౌంటెంట్ల సాయం కూడా తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో ప్రభుత్వ అధికారుల హస్తం కూడా ఉందా? అనేది ఇప్పుడే చెప్పలేమని పేర్కొన్నారు. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు మోసం కేసులో వడ్డీ రూ.22 కోట్లు సహా దాదాపు రూ.556 కోట్లు తిరిగి వసూలు చేసినట్లు హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ మంగళవారం అసెంబ్లీలో ప్రకటించారు. చండీగఢ్‌లోని తమ శాఖలో రాష్ట్ర ప్రభుత్వ ఖాతాల్లోని రూ.590 కోట్ల సొమ్మును కొందరు ఉద్యోగులు మాయం చేసినట్లు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా, ఈ మోసంపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. తాజా మోసం నేపథ్యంలో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల నుంచి హరియాణా ప్రభుత్వం అధికారికంగా వైదొలిగింది. ఆర్థిక వ్యవహారాలను ఇకపై ఆయా బ్యాంకుల అప్పగించబోమని ప్రకటించింది. ఆయా బ్యాంకుల్లోని ఖాతాలను రద్దు చేసుకుంది.

**మోసం ఎలా బయటపడింది?**

చండీగఢ్ బ్రాంచ్‌లోని తమ ఖాతాను రద్దుచేసి, అందులోని సొమ్మును మరో బ్యాంకు ఖాతాకు బదిలీ చేయాలని హరియాణా ప్రభుత్వ విభాగం గతవారం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకును కోరింది. దాంతో సదరు ఖాతాను పరిశీలించగా, అందులో ఉండాల్సిన సొమ్మును, ఉన్న సొమ్ముకు మధ్య వ్యత్యాసాన్ని అధికారులు గుర్తించారు. కొంత సొమ్ము మాయమైనట్లు తేల్చారు. ప్రభుత్వానికి సంబంధించిన ఇతర విభాగాల ఖాతాలను తనిఖీ చేయగా, రూ.కోట్ల డబ్బు పక్కదారి పట్టినట్లు వెల్లడయ్యింది. దాంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఇద్దరు మాజీ ఉద్యోగులు, మరో ఇద్దరు ప్రైవేట్ వ్యక్తులు కలిసి.. ప్రభుత్వానికి చెందిన రూ.590 కోట్లు దోచేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. అయితే, మొత్తం రూ.590 కోట్లను వడ్డీతో సహా ప్రభుత్వానికి చెల్లించామని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు యాజమాన్యం తెలియజేసింది.

## రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వాళ్లు ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకోవద్దు

**సుప్రీంకోర్టు సూచన**

న్యూఢిల్లీ: రాజ్యాంగబద్ధ సంస్థలకు సారథ్యం వహించే వాళ్లు ఎవరైనా సరే మతం, కులం, భాష, ప్రాంతం ప్రాతిపదికన ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకోవద్దని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. బ్రాహ్మణవర్గాన్ని కించపరుస్తూ నిర్మించిన క్రైమ్ థ్రిల్లర్ 'ఘూస్‌ఖోర్ పండత్' చిత్రాన్ని నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదలచేయడాన్ని సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ బీవీ నాగరత్నల ధర్మాసనం పై విధంగా స్పందించింది. ఇటీవల ముస్లింలను లక్ష్యంగా చేసుకుంటూ అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ చేసిన వ్యాఖ్యానాలను జస్టిస్ ఉజ్జల్ భూయాన్ పరోక్షంగా ప్రస్తావిస్తూ విడిగా 39 పేజీల తీర్పు రాశారు. ''రాజ్యాంగబద్ధ సంస్థలకు సారథ్యం వహించే మంత్రుల వంటి వాళ్లు ఒక వర్గాన్ని ప్రసంగాలు, వ్యంగ్య చిత్రాలు, కార్టూన్లు, దృశ్య కళల ద్వారా కించపరచకూడదు. ప్రభుత్వ, ప్రభుత్వేతర వ్యక్తులు ఎవరైనా సరే మతం, కులం, భాష, ప్రాంతం ప్రాతిపదికన ఏ వర్గాన్నీ లక్ష్యంగా చేసుకోవద్దు. ఇది రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే అవుతుంది. కులం, భాష, మతాలతో సంబంధం లేకుండా తోటి పౌరులను గౌరవించాలి. సౌభ్రాతృత్వంతో మెలగాలి'' అని జస్టిస్ భూయాన్ తన తీర్పులో పేర్కొన్నారు.

## గుర్తింపు కార్డులుగా టెన్త్ పాస్ సర్టిఫికేట్

**ఎస్ఐఆర్‌పై వివరణ ఇచ్చిన సుప్రీంకోర్టు**

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) సర్వేలో అభ్యర్థులు తమ పాత పదో తరగతి సర్టిఫికేట్‌ను, అప్పటి ఐడీ కార్డును తమ గుర్తింపుగా ఉపయోగించుకోవచ్చని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఆయా కార్డులను ప్రామాణికమైన గుర్తింపు పత్రాలుగా పరిగణించవచ్చా? అంటూ సీనియర్ న్యాయవాది డీఎస్ నాయుడు వెలిబుచ్చిన సందేహాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం.పంఛోలీల ధర్మాసనం నివృత్తిచేసింది. ''మాధ్యమిక(పదో తరగతి) అడ్మిట్ కార్డు అనేది అనుబంధ డాక్యుమెంట్‌గా మాత్రమే లెక్కలోకి వస్తుందని పాస్ సర్టిఫికేట్‌తో కలిపి సమర్పిస్తే గుర్తింపు కార్డుగా పరిగణిస్తారు. ఇవి జనన ధృవీకరణ పత్రం, తల్లిదండ్రులు ఎవరనే విషయాలను రూఢీ చేస్తాయి''అని ధర్మాసనం పేర్కొంది.

## ప్రస్తుత పూజారులకే పూజ హక్కులు

**కర్ణాటకలో వందేళ్లనాటి కేసులో సుప్రీంకోర్టు తీర్పు**

న్యూఢిల్లీ: కర్ణాటకలో 600 ఏళ్ల చరిత్ర ఉన్న ప్రముఖ అమోఘసిద్ధ ఆలయంలో పూజా నిర్వహణ హక్కులు ప్రస్తుత పూజారుల వంశీకులకే దక్కుతాయని సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువర్చింది. ఆలయంలో పూజా హక్కులు, భక్తుల నుంచి కానుకలు స్వీకరించే హక్కు, ఆలయ నిర్వహణ యాజమాన్య హక్కులు, వార్షికోత్సవాలు జరిపే అధికారం తమ కుటుంబానికే ఉందంటూ మరో వర్గం వేసిన పిటిషన్‌ను జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం తోసిపుచ్చింది. దశాబ్దాలుగా ఆలయంలో పూజారులుగా కొనసాగుతున్న కుటుంబానికే ఈ హక్కులు ఉంటాయంటూ 2012 అక్టోబర్‌లో కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు బుధవారం సమర్థించింది.

## సమాధానం చెప్పకుండా పారిపోయారు

**ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ ఆగ్రహం**

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. భారత్–అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని తాము డిమాండ్‌చేస్తే ప్రధాని మోదీ దానిపై సమాధానం చెప్పకుండా నిశ్శబ్దంగా ఇజ్రాయెల్‌కు పారిపోయారని మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. ప్రధానమంత్రి నరేంద్ర సరెండర్ మోదీగా మారిపోయారంటూ విమర్శించారు. మన దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఇజ్రాయెల్‌తో ఒప్పందం చేసుకోవడానికి ఎవరి ఒత్తిడితో వెళ్లారో చెప్పాలని డిమాండ్ చేశారు. అమెరికా ప్రయోజనాల కోసమే మోదీ పని చేస్తున్నారని రాహుల్ పరోక్షంగా ధ్వజమెత్తారు. మరోవైపు రాహుల్ విమర్శలను బీజేపీ తిప్పికొట్టింది. థాయ్‌లాండ్, కొలంబియా లాంటి దేశాలకు రహస్యంగా వెళ్లే అలవాటు ప్రధాని మోదీకి లేదని తేల్చిచెప్పింది. విదేశీ గడ్డపై మనదేశాన్ని అప్రతిష్టపాలు చేయడానికి మోదీ వెళ్లలేదని పేర్కొంది. ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రధానమంత్రి ప్రసంగించారని తెలిపింది. సుదర్శన్ చక్ర లాంటి ఆయుధ వ్యవస్థలను తీసుకురావడానికి ఇజ్రాయెల్‌తో ఒప్పందాలు చేసుకుంటున్నారని తేల్చిచెప్పింది.

## పెళ్లివేడుకలో వధువుపై ప్రేమికుడి కాల్పులు

**బిహార్‌లోని బక్సర్ జిల్లాలో ఘటన**

బక్సర్(బిహార్): కాబోయే భర్తతో కలిసి వివాహ వేడుకలో ఆనందడోలికల్లో మునిగితేలుతున్న వధువు పైకి ఒక వ్యక్తి కాల్పులు జరిపాడు. పొట్టలోకి బుల్లెట్ దూసుకెళ్లడంతో ఆమె రక్తమోడుతూ కుప్పకూలింది. దీంతో హుటాహుటిన ఆమెను బక్సర్ జిల్లాలోని సదర్ ఆస్పత్రిలో చేర్పించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం వారణాసిలోని మరో ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఛౌసా పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ చందన్ తెలిపిన వివరాల ప్రకారం 18 ఏళ్ల ఆర్తీ కుమారిని పొరుగింట్లో ఉండే ధీనబంధు అనే వ్యక్తి ప్రేమించాడు. ఈ విషయం ఆర్తీకి కూడా తెలీదు. ఆర్తీని పెళ్లాడతానని కోరగా అందుకు ఆర్తీ కుటుంబం నిరాకరించింది. దీంతో కక్షపెంచుకున్న అతను నేరుగా వివాహవేడుకకు వచ్చి గన్‌తో షూట్‌చేశాడని ఆర్తీ కుటుంబసభ్యులు తెలిపారు. పెళ్లి కుమార్తెపై దాడి జరగడంతో ఉత్తరప్రదేశ్‌లోని బలియా జిల్లాలోని సులేమాన్‌పూర్ గ్రామం నుంచి వచ్చిన వరుడి కుటుంబం అసలేం జరుగుతుందో అర్థంకాక చేష్టలుడికి అలాగే చూస్తూ ఉండిపోయింది. కాల్పులు జరిపాక ధీనబంధు అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో అతని కోసం వేట మొదలెట్టామని పోలీసులు తెలిపారు.

## యూపీలో పెట్టుబడులు పెట్టండి: యోగి

లక్నో: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ జపాన్ చేరుకున్నారు. బుధవారం టోక్యోలో జరిగిన ఉత్తరప్రదేశ్ ఇన్వెస్ట్‌మెంట్ షోలో ఆయన మాట్లాడారు. భారత్‌లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ కలిగిన యూపీలో పెట్టుబడులు పెట్టాలని ఆయన జపాన్ కంపెనీలను కోరారు. గత తొమ్మిదేళ్లుగా యూపీ స్థూల దేశీయోత్పత్తి, తలసరి ఆదాయం మూడు రెట్లు పెరిగిందన్నారు. అపూర్వమైన వేగంతో విస్తరిస్తున్న ఎక్స్‌ప్రెస్‌వే, విమానాశ్రయ మౌలిక సదుపాయాలు దేశానికి కీలకమైన వృద్ధి ఇంజన్‌గా మారుతున్నాయన్నారు. నీటివనరులు కూడా సమృద్ధిగా ఉన్న యూపీలో పొలాల నుంచి మార్కెట్ వరకు పెట్టుబడులకు అవకాశాలున్నాయని చెప్పారు. ఆహార ప్రాసెసింగ్, గిడ్డంగులు, లాజిస్టిక్స్ వంటి విస్తారమైన రంగాలున్నాయని తెలిపారు. ఈ పెట్టుబడులు వ్యవసాయంతో పాటు గ్రీన్ హైడ్రోజన్, పంప్ స్టోరేజ్ ప్రాజెక్టుల వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలకు మద్దతు ఇస్తాయన్నారు. అన్ని రంగాల్లో నైపుణ్యం కలిగిన రాష్ట్ర జనాభాలో 56 శాతం యువ శ్రామికశక్తితో మానవశక్తిని కూడా అందిస్తుందని చెప్పారు.

## 'కాంగ్రెస్ నాయకుల అరెస్టు సిగ్గుచేటు'

న్యూఢిల్లీ: దేశరాజధాని ఢిల్లీలో ఇటీవల జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ సందర్భంగా నిరసన తెలిపిన యూత్ కాంగ్రెస్ నాయకుల అరెస్టును కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ ఖండించారు. ప్రజల గొంతు వినిపించిన నాయకులను అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రపంచ ఒత్తిడికి తలొగ్గి దేశ ప్రయోజనాలపై రాజీ పడ్డ ప్రధాని నరేంద్ర మోదీకీ, ఆయన ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారు దేశంలోని 140 కోట్ల ప్రజల గళాన్ని వినిపించారన్నారు. ''సత్యం కోసం శాంతియుత, అహింసా ప్రతిఘటన వారసత్వంలోనే ఉంది. ఇది మహాత్మా గాంధీజీ, లక్షలాది మంది భారతీయ పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చింది. ప్రపంచ ఒత్తిడికి తలొగ్గి దేశ ప్రయోజనాలను పణంగా పెట్టిన ప్రధానికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టడం మన గర్వించదగిన విషయం. ఈ నిరసన దేశంలోని 140 కోట్ల ప్రజల ప్రయోజనాలకు అనుకూలంగా జరిగింది. నిర్భయంగా నిలిచిన యువజన కాంగ్రెస్ నాయకులకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుంది' అని ఆమె అన్నారు.

# హిందూ వివాహ చట్టం ఎప్పుడు చేశారు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సోషియాలజీ

### వివాహం

1. వివాహం అంటే..?
   ఎ) మానవ సమాజానికి ఆధారం
   బి) వధూవరుల బంధువుల మధ్య సంబంధాలను నిర్వచిస్తుంది
   సి) విశ్వజనీన సామాజిక సంస్థ
   డి) పైవన్నీ
2. ప్రపంచమంతటా ప్రాచుర్యంలో ఉన్న వివాహ రూపం?
   ఎ) బహు భార్యత్వం బి) బహు భర్తృత్వం
   సి) ఏక వివాహం డి)సమూహ వివాహం
3. 'దూద్ లౌటానా' పేరుతో పిలిచే మేనరిక వివాహం ఏ తెగలో కనిపిస్తుంది?
   ఎ) గోండులు బి) సంతాల్‌లు
   సి) సవరలు డి) భిల్లులు
4. వెస్టర్ మార్క్ అభిప్రాయం ప్రకారం బహు భార్యత్వానికి కారణం?
   ఎ) బ్రహ్మచర్యాన్ని బలవంతంగా రుద్దడం
   బి) సంతానాపేక్ష
   సి) సామాజిక ప్రతిష్ట
   డి) పైవన్నీ
5. తమిళనాడులోని నీలగిరి పర్వతాల్లో ఎక్కువగా నివసించే తోడాలలో ఉండే వివాహ రూపం?
   ఎ) సోదర బహుభర్తృత్వం
   బి) బహు వివాహం
   సి) సోదరేతర బహుభర్తృత్వం
   డి) సమూహ వివాహం
6. ఉన్నత కులం అమ్మాయి తక్కువ కులం అబ్బాయిని వివాహం చేసుకునే పద్ధతిని ఏమంటారు?
   ఎ) దేవర న్యాయం
   బి) అనులోమ వివాహం
   సి) ప్రేమ వివాహం
   డి) ప్రతిలోమ వివాహం
7. 'మ్యారేజ్ అండ్ ఫ్యామిలీ ఇన్ ఇండియా' గ్రంథ రచయిత ఎవరు?
   ఎ) ఎం.ఎస్. శ్రీనివాస్
   బి) కె.ఎం. కపాడియా
   సి) టి.ఎస్. సుదాన్
   డి) ఐ. కార్వే
8. హిందువుల్లో ఎక్కువగా ప్రాచుర్యంలో ఉన్న ఆచారం ఏది?
   ఎ) గోత్రేతర వివాహం
   బి) సగోత్ర వివాహం
   సి) గ్రామానికి బయట వివాహమాడటం
   డి) సపిండ వివాహం చేసుకోవడం
9. మహమ్మదీయ పెళ్లి కుమార్తెకు చెల్లించే నగదును ఏమంటారు?
   ఎ) కట్నం బి) మెహర్
   సి) కన్యాశుల్కం డి) నష్టపరిహారం
10. కులం అనేది ఒక ..... సమూహం?
    ఎ) బహిర్వివాహిత బి) సంవృత
    సి) అంతర్వివాహిత డి) అనివార్య
11. స్మృతుల్లో పేర్కొన్న విధంగా హిందువుల్లో ఎన్ని రకాల వివాహాలున్నాయి?
    ఎ) 5 బి) 6 సి) 7 డి) 8
12. హిందూ వివాహ చట్టం ఎప్పుడు చేశారు?
    ఎ) 1955 బి) 1956 సి) 1954 డి) 1958
13. హైందవ వారసత్వ చట్టం ఎప్పుడు చేశారు?
    ఎ) 1955 బి) 1956 సి) 1957 డి) 1959
14. కింది వాటిలో ఏ తెగ బహు భర్తృత్వ విధానాన్ని పాటిస్తుంది?
    ఎ) తోడాలు బి) భిల్లులు
    సి) ఖాసీలు డి) గోండులు
15. భారతదేశంలో కులాంతర వివాహానికి శాసన పరమైన సదుపాయాన్ని ఏర్పరచిన తొలి చట్టం ఏది?
    ఎ) హిందూ వివాహ చట్టం–1955
    బి) ప్రత్యేక వివాహ చట్టం–1872
    సి) హిందూ కోడ్ బిల్లు–1956
    డి) అభ్యసన ప్రయోజనాల చట్టం–1930
16. సమాజంలో కింది వాటిలో దేని కోసం నిషిద్ధం పాటిస్తారు?
    ఎ) పెద్దల పట్ల గౌరవం ప్రదర్శించడానికి
    బి) మహిళల హోదా పెంచడానికి
    సి) కొంతమంది బంధువుల మధ్య లైంగిక సంపర్కాన్ని నివారించడానికి
    డి) విరోధుల పట్ల అయిష్టం ప్రదర్శించడానికి
17. నిషేధాలు (Taboos) వేటితో సంబంధం కలిగి ఉంటాయి?
    ఎ) ఆచారాలు బి) జానపద రీతులు
    సి) రీతులు డి) ఫ్యాషన్లు
18. వివాహం వల్ల కలిగే ప్రయోజనం?
    ఎ) అందమైన భార్య/భర్త లభిస్తారు
    బి) సమాజంలో చిన్నచూపు చూస్తారు
    సి) సంతోషకర వేడుకల్లో పాల్గొంటారు
    డి) చట్టపరమైన సామాజిక హక్కులు, బాధ్యతలు లభిస్తాయి
19. ఒక పురుషుడు ఒకే స్త్రీని వివాహం చేసుకోవడాన్ని ఏమంటారు?
    ఎ) బహు భర్తృత్వం బి) ఏక వివాహం
    సి) బహు భార్యత్వం డి) బహు వివాహం
20. పురుషులతో సమానంగా స్త్రీలకు హక్కులు కల్పించే స్పెషల్ మ్యారేజ్ చట్టాన్ని ఏ సంవత్సరంలో ప్రవేశపెట్టారు?
    ఎ) 1950 బి) 1954 సి) 1952 డి) 1951
21. భారతదేశంలో వివాహం అనేది ఒక ...?
    ఎ) సంస్కారం బి) ఒప్పందం
    సి) నమ్మకం డి) నీతి సూత్రం
22. ఒక పురుషుడు తన భార్యకు సంబంధించిన ఎక్కువ మంది అక్కాచెల్లెళ్లను వివాహమాడే పద్ధతిని ఏమంటారు?
    ఎ) దేవర న్యాయం
    బి) భార్యాభగినీ న్యాయం సి) హైపర్ గమీ
    డి) భార్యాభగినీ బహుభార్యత్వం
23. నిమ్న కులానికి చెందిన యువతి ఉన్నత కులానికి చెందిన పురుషుడిని వివాహమాడే పద్ధతిని ఏమంటారు?
    ఎ) బహిర్వివాహం
    బి) అనులోమ వివాహం
    సి) అంతర్వివాహం
    డి) ప్రతిలోమ వివాహం
24. ఒక వ్యక్తి (పురుషుడు) ఒకరి కంటే ఎక్కువ మంది స్త్రీలను వివాహం చేసుకోవడాన్ని ఏమంటారు?
    ఎ) బహు భర్తృత్వం బి) హైపర్ గమీ
    సి) బహు భార్యత్వం డి) పాలీగమి
25. ఒక స్త్రీ తన భర్త సోదరుడిని వివాహం చేసుకోవడాన్ని ఏమంటారు?
    ఎ) భార్యాభగినీ న్యాయం
    బి) బహు భర్తృత్వం
    సి) దేవర న్యాయం డి) ప్రేమ వివాహం
26. వివాహం వల్ల కలిగే బంధుత్వాన్ని ఏమంటారు?
    ఎ) వైవాహిక బంధుత్వం
    బి) ఏకరక్త బంధుత్వం
    సి) పునరుత్పత్తి బంధుత్వం
    డి) ఏక పత్నీత్వ బంధుత్వం
27. బాల్య వివాహ నిషిద్ధ చట్టం అమోదించిన సంవత్సరం?
    ఎ) 1947 బి) 1955 సి) 1929 డి) 1956
28. కింది వారిలో వితంతు పునర్వివాహ సంఘ సంస్కర్తగా ఎవరిని పేర్కొంటారు?
    ఎ) సరోజినీ నాయుడు
    బి) రాజా రామ్మోహన్‌రాయ్
    సి) దుర్గాబాయ్ దేశ్‌ముఖ్
    డి) అనిబిసెంట్
29. వివాహాల్లో ఒక పద్ధతైన 'మూతా' ఎవరిలో కనిపిస్తుంది?
    ఎ) హిందువులు బి) క్రైస్తవులు
    సి) ముస్లింలు డి) బౌద్ధులు
30. పరస్పర ప్రేమ వల్ల జరిగే వివాహాన్ని ఏమంటారు?
    ఎ) గాంధర్వ వివాహం
    బి) రాక్షస వివాహం
    సి) దైవ వివాహం డి) అసుర వివాహం
31. ఒక పురుషుడు ఒకసారి ఒక స్త్రీని వివాహం చేసుకుంటే ఆ వివాహాన్ని ఏమంటారు?
    ఎ) పాలీగమి బి) మోనోగమి
    సి) పాలియాండ్రి డి) పైవన్నీ
32. దేవర న్యాయ వివాహం అంటే?
    ఎ) మేనబిడ్డల మధ్య జరిగే వివాహం
    బి) సోదరి కూతురితో జరిగే వివాహం
    సి) సోదరుడి కూతురితో జరిగే వివాహం
    డి) భర్త మరణించిన తర్వాత అతడి సోదరుడిని వివాహం చేసుకోవడం
33. బహు భర్తృత్వం అనేది ఏ రకమైన వివాహం?
    ఎ) ఒక స్త్రీ ఎక్కువ మంది పురుషులను వివాహమాడటం
    బి) ఒక స్త్రీ ఒక వ్యక్తినే భర్తగా కలిగి ఉండటం
    సి) ఒక స్త్రీ పురుషుడితో తాత్కాలికంగా జీవనాన్ని గడపడం
    డి) పైవేవీ కాదు
34. కొత్తగా వివాహమైన దంపతులు పెళ్లి తర్వాత పురుషుడు తన భార్య కుటుంబంతో కలిసి నివసించే పద్ధతిని ఏమంటారు?
    ఎ) నూతన స్థానిక నివాస పద్ధతి
    బి) పత్నీ స్థానిక నివాస పద్ధతి
    సి) పతి స్థానిక నివాస పద్ధతి
    డి) మాతుల స్థానిక నివాస పద్ధతి
35. భారత్‌లో కులాంతర వివాహాలు జరుపుకోవడానికి సమ్మతిచ్చే నిబంధనలను మొదటిసారిగా ఏ చట్టం ద్వారా రూపొందించారు?
    ఎ) హిందూ వివాహ చట్టం–1955
    బి) విశేష వివాహ చట్టం– 1972
    సి) హిందూ కోడ్ బిల్ – 1956
    డి) పైవన్నీ
36. ఆదిమ సమాజాల్లో బాగా ప్రాచుర్యంలో ఉన్న వివాహ రూపం ఏది?
    ఎ) సేవా వివాహం బి) గాంధర్వ వివాహం
    సి) అసుర వివాహం డి) పరీక్షావధి వివాహం
37. 'సామాజిక, సాంస్కృతిక గతిశీలత' (Social and Cultural Dynamics) గ్రంథ రచయిత ఎవరు?
    ఎ) పి.ఎ. సోరోకిన్ బి) జార్జి సిమ్మెల్
    సి) వెలిస్ కోసర్ డి) మెల్విన్ ట్యూమన్
38. కన్యాశుల్కం అంటే ఏమిటి?
    ఎ) వధువు బంధువులు వరుడి బంధువులకు వివాహం సందర్భంగా చేసే చెల్లింపులు
    బి) వరుడి బంధువులు వధువు బంధువులకు చేసే వివాహ చెల్లింపులు
    సి) వధువు బంధువులు పురోహితుడికి చేసే చెల్లింపులు
    డి) వధువు బంధువులు తమలో తాము ఇచ్చుకునే బహుమతులు
39. కింది వాటిలో హిందూ వివాహానికి సంబంధించిన ప్రధాన లక్ష్యం ఏది?
    ఎ) విధినిర్వహణ ధర్మం
    బి) ప్రజోత్పత్తి సి) రతి
    డి) పైవన్నీ
40. హిందూ వివాహ సంస్కారాల్లో అతి ముఖ్యమైన అంశం?
    ఎ) కన్యాదానం
    బి) పాణిగ్రహణం సి) సప్తపది
    డి) పైవన్నీ
41. కింది వాటిని సరిగా జతపరచండి.
    గ్రూప్–ఎ
    1. బ్రహ్మ వివాహం
    2. రాక్షస వివాహం
    3. అసుర వివాహం
    4. గాంధర్వ వివాహం
    గ్రూప్–బి
    i. పెద్దలు నిర్ధారించి, శాస్త్రపరంగా చేసే వివాహం
    ii. వధువును వెతికి వెళ్లి పెళ్లి చేసుకోవడం
    iii. జీవిత భాగస్వామిని కొనుగోలు చేయడం ద్వారా వివాహం చేసుకోవడం
    iv. ఇరువురూ ప్రేమించుకొని పెళ్లి చేసుకోవడం

| | 1 | 2 | 3 | 4 |
|---|---|---|---|---|
| ఎ) | i | ii | iii | iv |
| బి) | iv | iii | ii | i |
| సి) | iii | iv | ii | i |
| డి) | iv | iii | i | ii |

42. శారదా చట్టం (Child Marriage Restraint Act) కింది వాటిలో దేన్ని ఏర్పరచింది?
    ఎ) హిందువుల్లో వితంతు పునర్వివాహాన్ని నిషేధిస్తుంది
    బి) హిందువులు విడాకులు తీసుకోవడాన్ని నిషేధిస్తుంది
    సి) హిందువుల్లో వధూవరుల కనీస వివాహ వయసు నిర్ధారిస్తుంది
    డి) స్త్రీలు ఉన్నత విద్య అభ్యసించడాన్ని అంగీకరిస్తుంది
43. భారతదేశంలోని దాదాపు అన్ని ఆదిమతెగలు పాటించే వివాహ విధానం?
    ఎ) బహిర్వివాహం బి) బహు భార్యత్వం
    సి) స్వైరితం డి) అంతర్వివాహం
44. ముస్లింలలో వివాహం రద్దు చేసుకోవడాన్ని ఏమంటారు?
    ఎ) తల్వాండి బి) తల్వార్
    సి) ఇద్దత్ డి) తలాఖ్
45. భారతీయ క్రైస్తవ వివాహ చట్టం ఎప్పుడు చేశారు?
    ఎ) 1872 బి) 1873 సి) 1874 డి) 1875
46. భారత్‌లో పార్శీల వివాహం, విడాకుల చట్టాన్ని ఏ సంవత్సరంలో చేశారు?
    ఎ) 1934 బి) 1939 సి) 1933 డి) 1936
47. ఏడు డిగ్రీల (Seven Degree) వివాహ నిబంధన ఏ మతంలో కనిపిస్తుంది?
    ఎ) ఇస్లాం బి) సిక్కు మతం
    సి) హిందూ మతం డి) క్రైస్తవ మతం
48. వివాహం అనేది ...?
    ఎ) ఒక రకమైన పరిచయం
    బి) ఒక సమితి సి) ఒక సంఘం
    డి) సాంస్కృతిక సంశ్లిష్టత (Cultural complex)
49. మానవ వివాహ చరిత్ర (History of Human Marriage) గ్రంథ రచయిత?
    ఎ) వెస్టర్ మార్క్ బి) ఏంగెల్స్
    సి) సర్ హెన్రీమెయిన్
    డి) టాల్కాట్ పార్సన్స్

### సమాధానాలు

| | | | | |
|---|---|---|---|---|
| 1) డి | 2) సి | 3) ఎ | 4) డి | 5) ఎ |
| 6) డి | 7) బి | 8) ఎ | 9) బి | 10) సి |
| 11) డి | 12) ఎ | 13) బి | 14) ఎ | 15) బి |
| 16) సి | 17) ఎ | 18) డి | 19) బి | 20) బి |
| 21) ఎ | 22) డి | 23) బి | 24) డి | 25) బి |
| 26) ఎ | 27) సి | 28) బి | 29) సి | 30) ఎ |
| 31) బి | 32) డి | 33) ఎ | 34) బి | 35) ఎ |
| 36) ఎ | 37) ఎ | 38) బి | 39) డి | 40) డి |
| 41) ఎ | 42) సి | 43) డి | 44) డి | 45) ఎ |
| 46) డి | 47) డి | 48) డి | 49) ఎ | |

# బహువ్రీహి సమాసానికి ఉదాహరణలు?

### ఏడో ప్రకరణం - సమాసాలు

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్స్, లాంగ్వేజీ పండిట్స్ అభ్యర్థులకు వ్యాకరణంలో సమాసాలు ముఖ్యమైనవి. గత డీఎస్సీ 2012లో, టెట్‌లో సమాసాలపై ఆరు ప్రశ్నలు అడిగారు. ఈ డీఎస్సీలో కూడా వీటికి ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. వీటిపై సమగ్రమైన అవగాహన కలిగే విధంగా సమాసం అంటే ఏమిటి? వీటిల్లో రకాలు మొదలైన అంశాలను పరిశీలిద్దాం.

**సమాసం అంటే:** 'సమర్థంబులగు పదంబు' లేదా 'పదం బగుట' సమాసమని చిన్నయసూరి నిర్వచించాడు. సమ ప్రాధాన్యం ఉన్న రెండు వేర్వేరు పదాలు కలిసి కొత్త అర్థాన్ని సూచిస్తే దాన్ని సమాసం అంటారు. **ఉదా:** 'పని, మనిషి' అనే రెండు పదాలు కలిసి 'పనిమనిషి' ప్రత్యేకార్థాన్ని సూచిస్తున్నందున ఇది సమాస పదం. వేర్వేరుగా ఉన్న పదాల అర్థాలకు ఒకే అర్థం ఏర్పడటాన్ని 'సామర్థ్యం' అంటారు. దీన్నే అర్థ సమ్మేళనమని కూడా అంటారు. రెండు పదాల అన్వయాన్ని తెలియజేసేది విగ్రహవాక్యం.పదాల సంబంధం విభక్తి ప్రత్యయాల మీద ఆధారపడి ఉంటుంది. సమాస సంబంధాలను వివరించి చెప్పేవి 'విగ్రహ వాక్యాలు'.

**ఉదా:** 'రామబాణము' సమాసానికి 'రాముని యొక్క బాణము' విగ్రహవాక్యం.

**సమాసాలు – భేదాలు:** తెలుగులో శబ్ద స్వరూపాన్ని బట్టి సమాసాలు మూడు విధాలు. అవి..
1) సాంస్కృతికం; 2) ఆచ్ఛికం; 3) మిశ్రమం

**1. సాంస్కృతికం:** ఇది రెండు విధాలు. అవి..
i) సిద్ధ సమాసం ii) సాధ్య సమాసం

**i. సిద్ధ సమాసం:** కేవలం సంస్కృత శబ్దాలతో ఏర్పడే సమాసం.. సిద్ధ సమాసం.

**ఉదా:** 'రాజాజ్ఞ' రాజః+ ఆజ్ఞః = రాజాజ్ఞః రెండు సంస్కృత శబ్దాలతో ఏర్పడిన సమాసం 'రాజాజ్ఞ'.

**ii. సాధ్య సమాసం:** తత్సమ పదాలతో ఏర్పడే సమాసం సాధ్య సమాసం.

**ఉదా:** రాజు + ఆజ్ఞ = రాజునాజ్ఞ, రాజు (తత్సమపదం) = ఆజ్ఞ (తత్సమం). ఈ పదాలు కలిసి 'రాజునాజ్ఞ' పదం ఏర్పడింది. ఇది సాధ్య సమాసం.

**2. ఆచ్ఛిక సమాసం:** కేవలం తెలుగు పదాలతో ఏర్పడే సమాసాన్ని ఆచ్ఛిక సమాసం అంటారు. ఆచ్ఛికం అంటే అచ్చ తెలుగు అని అర్థం. **ఉదా:**
- జేని ఆనతి= జేనియానతి. జేని, ఆనతి రెండూ తెలుగు పదాలు కాబట్టి ఇది ఆచ్ఛిక సమాసం.
- సిరి చెలువుడు – సిరి, చెలువుడు రెండూ అచ్చ తెలుగు పదాలు కాబట్టి ఇది ఆచ్ఛిక సమాసం.

**3. మిశ్ర సమాసం:** తత్సమ శబ్దాలు, ఆచ్ఛిక శబ్దాల కలయికతో ఏర్పడిన సమాసాన్ని 'మిశ్ర సమాసం' అంటారు. **ఉదా:**
- రాజుముదల – సమాసంలో 'రాజు' తత్సమ శబ్దం. 'ముదల' ఆచ్ఛిక పదం. ఈ రెండింటి కలయికతో ఏర్పడిన 'రాజుముదల' మిశ్ర సమాసం.
- 'సిరివల్లభుడు' – సమాస పదంలో 'సిరి' ఆచ్ఛిక పదం. 'వల్లభుడు' తత్సమ శబ్దం. ఈ రెండింటి కలయికతో ఏర్పడిన 'సిరివల్లభుడు' మిశ్ర సమాస పదం.
- పద ప్రాధాన్యాన్ని అనుసరించి సమాసాలు ప్రధానంగా నాలుగు రకాలు. అవి..
  1. అవ్యయీభావ సమాసం
  2. తత్పురుష సమాసం
  3. ద్వంద్వ సమాసం
  4. బహువ్రీహి సమాసం

**1. అవ్యయీభావ సమాసం:** అవ్యయం పూర్వ పదంగా గల సమాసం అవ్యయీభావ సమాసం.

**అవ్యయాలు:** లింగవచన, విభక్తి రహితాలు అవ్యయాలు. స్వర్, అంతర్, పునర్, ప్రాతర్, మిథ్యా, పురా, సర్వదా, ఆద్య, యథా, బహుశః, నిర్ మొదలైనవి అవ్యయాలు. అవ్యయాలు పూర్వ పదంగా ఉన్న సమాసాలు అవ్యయీభావ సమాసాలు. **ఉదా:**

| సమాస పదం | విగ్రహవాక్యం |
|---|---|
| యథాశక్తి | శక్తిని అనుసరించి |
| ప్రతిదినం | దినము, దినము |
| నిశ్చలం | చలనం లేనిది |
| నిరుపయోగం | ఉపయోగం లేనిది |
| ఆపూర్ణత | మిక్కిలి పూర్ణమైంది |

**2. తత్పురుష సమాసం:** ఉత్తర పద ప్రాధాన్యం ఉన్న సమాసం తత్పురుష. ఇది రెండు విధాలు. అవి..
ఎ) వ్యధికరణం బి) సమానాధికరణం

**ఎ) వ్యధికరణం:**(వి+ అధికరణం) = వ్యధికరణం. అధికరణం అంటే ఆధారం అని అర్థం. 'వి' అనే ఉపసర్గ భిన్న లేదా విరుద్ధ అనే అర్థంలో చేరింది. పూర్వ పదంలో విభక్తికి పరపదంలో ఉన్న విభక్తి భిన్నంగా ఉంటుంది. అందుకే దీనికి 'వ్యధికరణం' అని పేరు. ఇందులో విభక్తి ప్రత్యయాలు ఆధారంగా సమాసాన్ని నిర్ణయించవచ్చు. విభక్తులతోపాటు వ్యతిరేకార్థంలో విగ్రహ వాక్యాన్ని సూచించే నఞ్ తత్పురుషతో కలిపి మొత్తం ఎనిమిది విధాల తత్పురుష సమాసాలు వ్యధికరణంలో ఉంటాయి. పదాల మధ్య అన్వయాన్ని, సంబంధాన్ని తెలియజేసేవి విభక్తులు.

**i. ప్రథమా తత్పురుష సమాసం:** సమాసంలో పూర్వ పదం ప్రథమా విభక్తిలో (డు, ము, వు, లు) ఉండి, ఉత్తరపద ప్రాధాన్యం కలిగి ఉంటుంది. ఇందులో పూర్వ, ఉత్తర పదాలు రెండూ ప్రథమా విభక్తిలో ఉంటాయి. ప్రథమా తత్పురుష సమాసానికి ఏకదేశ సమాసం అనే పేరుంది. **ఉదా:**

| సమాస పదం | విగ్రహవాక్యం |
|---|---|
| మధ్యాహ్నం | అహ్నము మధ్య భాగం |
| అర్థ రాజ్యం | రాజ్యం అర్థ భాగం |
| నడిరేయి | రేయి నడిమి భాగం |

**ii. ద్వితీయా తత్పురుష సమాసం:** విగ్రహ వాక్యాల్లో పూర్వ పదం తర్వాత ద్వితీయా విభక్తి ప్రత్యయాలు నిన్, నున్, లన్, కూర్చి, గురించి ప్రత్యయాలు ఉంటాయి. **ఉదా:**
- ప్రాణిబాధకంబు – ప్రాణులను బాధించేది ('ను' – ద్వితీయ)
- బ్రహ్మవిత్తములు – బ్రహ్మను గురించి తెలిసిన వారు (గూర్చి – ద్వితీయ)
- వేదవిదులు – వేదాలను గురించి తెలిసిన వారు (గూర్చి – ద్వితీయ)
- దుఃఖాతీతుడు – దుఃఖాన్ని అతిక్రమించు వాడు ('ను' ద్వితీయ)

**iii. తృతీయా తత్పురుష సమాసం:** సమాసంలో పూర్వ పదానికి తృతీయావిభక్తి ప్రత్యయాలు చేతన్, చేన్, తోడన్, తోన్ వంటివి చేరితే అది తృతీయా తత్పురుష సమాసం. **ఉదా:**
- శోక సంతాపిత – శోకం చేత సంతాపిత (చేత – తృతీయా విభక్తి)
- గుణహీనుడు – గుణం చేత హీనుడు (చేత – తృతీయా విభక్తి)
- ఖడ్గ యుద్ధం = ఖడ్గంతో యుద్ధం (తో – తృతీయా విభక్తి)

**iv. చతుర్థీ తత్పురుష సమాసం:** సమాసంలో పూర్వ పదానికి చతుర్థీ విభక్తి ప్రత్యయాలైన 'కొరకు, కై' చేరితే అది చతుర్థీ తత్పురుష సమాసం. **ఉదా:**
- యూపదారువు–యూపము కొరకు దారువు (కొరకు)
- సభాభవనం – సభ కొరకు భవనం (కొరకు)

**v. పంచమీ తత్పురుష సమాసం:** సమాసంలో పూర్వ పదానికి వలనన్, కంటెన్, పట్టి ప్రత్యయాలు చేరితే అది పంచమీ తత్పురుష సమాసం.
**ఉదా:**
- దహనక్లేశం – దహనం వలన క్లేశం (వలన – పంచమీ)
- అగ్నిభయం – అగ్ని వల్ల భయం (వలన – పంచమీ)
- నిపాత దాహం = నిపాతం వల్ల దాహం (వల్ల – పంచమీ)
- జ్ఞానముక్తుడు – జ్ఞానం వలన ముక్తుడు (వలన – పంచమీ)

**vi. షష్ఠీ తత్పురుష సమాసం:** సమాసంలో పూర్వ పదానికి షష్ఠీ విభక్తి ప్రత్యయాలు (కిన్, కున్, యొక్క, లోన్, లోపల) చేరితే అది షష్ఠీ తత్పురుష సమాసం. **ఉదా:**
- శుక్రాజ్ఞ – శుక్రుని యొక్క ఆజ్ఞ (యొక్క)
- ధరణీపతి – ధరణికి పతి (కి–షష్ఠీ)
- అశ్వరాజము – అశ్వములలో రాజము ('లో') షష్ఠీ)

**vii. సప్తమీ తత్పురుష సమాసం:** సమాసంలో పూర్వ పదానికి సప్తమీ విభక్తి ప్రత్యయాలు(అందున్, నన్) చేరితే అది సప్తమీ తత్పురుష సమాసం. **ఉదా:**
- అరణ్య భూములు – అరణ్య మందలి భూములు (అందలి – సప్తమీ)
- శాస్త్ర కోవిదుడు – శాస్త్రమందు కోవిదుడు (అందు – సప్తమీ)
- పురుషోత్తముడు – పురుషలందు ఉత్తముడు (అందు – సప్తమీ)

**viii. నఞ్ తత్పురుష సమాసం:** సమాసంలో 'న' అనే అవ్యయం పూర్వపదంగా ఉంటుంది. విగ్రహ వాక్యం వ్యతిరేకార్థంలో ఉంటుంది.
- అసత్యము – సత్యము కానిది
- అధర్మము – ధర్మం కానిది
- అనుచితము – ఉచితము కానిది
- అసాధ్యము – సాధ్యం కానిది

**బి) సమానాధికరణం:** సమానమైన అధికరణలు కలది సమానాధికరణం. ఇది తత్పురుషలో ఒక భేదం. ఇది రెండు రకాలు. అవి..
1) కర్మధారయం 2) ద్విగువు

**1. కర్మధారయ సమాసం:** విశేషణ విశేష్యాలతో కూడింది కర్మధారయ సమాసం. ఇందులో విశేష్యం (నామవాచకం), విశేషణం ఉంటాయి. ఉపమాన, ఉపమేయాలు కూడా ఉంటాయి. ఇందులో ఏడు రకాలున్నాయి. అవి..
- విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం
- విశేషణ ఉత్తరపద కర్మధారయం
- విశేషణ ఉభయ పద కర్మధారయం
- ఉపమాన పూర్వ పద కర్మధారయం
- ఉపమాన ఉత్తరపద కర్మధారయం
- సంభావన పూర్వపద కర్మధారయం
- అవధారణ పూర్వపద కర్మధారయం

**ఎ. విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం:** విశేషణం పూర్వపదంగా, విశేష్యం (నామవాచకం) ఉత్తర పదంగా ఉండే సమాసం విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం. **ఉదా:**
- ఘోరవనము – ఘోరమైన వనము – (విశేషణం – పూర్వపదం)
- సచ్ఛాత్రులు – మంచివారైన ఛాత్రులు – (విశేషణం – పూర్వపదం)
- నల్లకలువ – నల్లదైన కలువ (విశేషణం – పూర్వపదం)

**బి. విశేషణ ఉత్తర పద కర్మధారయ సమాసం:** విశేషణం ఉత్తరపదంగా, విశేష్యం పూర్వపదంగా ఉన్న సమాసం విశేషణ ఉత్తర పద కర్మధారయం.

**ఉదా:**
- కపోతవృద్ధము – వృద్ధమైన కపోతము (విశేషణం– ఉత్తరపదం)
- పురుషోత్తముడు – ఉత్తముడైన పురుషుడు (విశేషణం–ఉత్తరపదం)
- పండిత శ్రేష్టుడు – శ్రేష్టుడైన పండితుడు (విశేషణం – ఉత్తర పదం)

**సి. విశేషణ ఉభయ పద కర్మధారయ సమాసం:** ఇందులో పూర్వ, పర పదాలు రెండూ విశేషణాలుగా ఉంటాయి. కాబట్టి ఇది విశేషణ ఉభయ పద కర్మధారయ సమాసం. **ఉదా:**
- ధీరోదాత్తుడు – ధీరుడు, ఉదాత్తుడు.
- శీతోష్ణము – శీతలమైనది, ఉష్ణమైనది.
- మృదుమధురం – మృదువైనది, మధురమైనది

(ఉదాహరణల్లో రెండు పదాలూ విశేషణాలే)

**డి. ఉపమాన పూర్వపద కర్మధారయ సమాసం:** ఉపమానం పూర్వపదంగా, ఉపమేయం ఉత్తర పదంగా ఉండే సమాసం ఉపమాన పూర్వపద కర్మధారయం. **ఉదా:**
- చిగురుకేలు– చిగురు వంటి కేలు (ఉపమానం పూర్వపదం), కేలు (ఉపమేయం). విగ్రహవాక్యాల్లో వంటి, లాంటి, వలె, పోలె వంటి ఉపమావాచకాలు వస్తాయి.
- జుంటిమోవి – జున్ను వంటి మోవి (పెదవి) (జుంటి, జున్ను – ఉపమానం పూర్వపదం)
- 'తేనే మాట' – తేనె వంటి మాట (ఉపమానం – పూర్వపదం)

**ఇ. ఉపమాన ఉత్తర పద కర్మధారయ సమాసం:** ఉపమానం ఉత్తర పదంగా, ఉపమేయం పూర్వపదంగా ఉండే సమాసం 'ఉపమాన ఉత్తరపద కర్మధారయ సమాసం'. **ఉదా:**
- పురుష సింహము – సింహము వంటి పురుషుడు (ఉపమానం– ఉత్తరపదం)
- తనూలత – లత వంటి తనువు (ఉపమానం –ఉత్తరపదం)

**ఈ. సంభావన పూర్వపద కర్మధారయ సమాసం**
ఈ సమాసంలో మొదటి పదం సంజ్ఞా వాచకంగా, రెండో పదం జాతి నామవాచకంగా ఉంటుంది. సంభావన అంటే సంజ్ఞ లేదా ఊహ అని అర్థం. **ఉదా:**
- గుంటూరు నగరం – గుంటూరు అనే పేరు గల నగరం(పూర్వపదం– సంజ్ఞావాచకం)
- పారిజాత వృక్షం – పారిజాతము అనే పేరు గల వృక్షం–(మొదటి పదం– సంజ్ఞావాచకం)
- మానస సరోవరం – మానసమను పేరు గల సరోవరం (మొదటి పదం– సంజ్ఞావాచకం)

**ఎఫ్. అవధారణ పూర్వపద కర్మధారయ సమాసం లేదా రూపక సమాసం:** అవధారణ అంటే నిర్ధారించడమని అర్థం. నిర్ధారించే పదం పూర్వపదంగా ఉండి, ఉత్తర పదంగా నామవాచకం ఉంటే దాన్ని అవధారణ పూర్వపద కర్మధారయం అంటారు. సంస్కృతంలో 'పివ' అవధారణార్థం. తెలుగులో 'అనెడి' అనేది అవధారణార్థం. విగ్రహ వాక్యంలో అనెడి వస్తుంది. ఉపమేయ, ఉపమానాలకు అభేదం చెప్పడం రూపకం. ఇందులో పూర్వ ఉత్తర పదాలకు అభేదం చెప్పడం ఉన్నందునే ఇది రూపక సమాసంగా రూఢమైంది. **ఉదా:**
- సంసార సాగరం – సంసారమనెడి సాగరం – ('సంసారానికి సాగరానికి అభేదం చెప్పినందున ఇది రూపక సమాసం')
- కోపాగ్ని – కోపమనెడి అగ్ని (కోపానికి, అగ్నికి అభేదం చెప్పినందున ఇది రూపక సమాసం)
- లతాలలనలు – లతలనెడి లలనలు (లతలకు, లలనలకు అభేదం చెప్పినందున ఇది రూపక సమాసం).

**2. ద్విగు సమాసం:** సమానాధికరణంలో (కర్మధారయం) ఒక భేదం ద్విగువు సంఖ్యా వాచకం పూర్వ పదంగా, నామవాచకం ఉత్తర పదంగా ఉంటే దాన్ని ద్విగు సమాసం అంటారు. **ఉదా:**
- నలుదిక్కులు – నాలుగు సంఖ్య గల దిక్కులు (సంఖ్యా పదం– పూర్వపదం)
- త్రిజగములు – మూడైన జగములు (సంఖ్యా పదం– పూర్వపదం)
- సహస్రాక్షులు – సహస్ర సంఖ్య గల అక్షులు – (సంఖ్యాపదం– పూర్వపదం)

**3. ద్వంద్వ సమాసం:** ఉభయ పదార్థ ప్రాధాన్యం కలది ద్వంద్వం. పూర్వ, ఉత్తర పదాలకు రెండింటికీ సమ ప్రాధాన్యం ఉంటుంది. **ఉదా:**
- తల్లిదండ్రులు – తల్లియును, తండ్రియును
- లక్ష్మీ సరస్వతులు – లక్ష్మియును, సరస్వతియును
- అన్నదమ్ములు – అన్నయును, తమ్ముడును

పై పదాల్లో పదాలు రెండింటికి సమ ప్రాధాన్యం ఉన్నందున ఇవి ద్వంద్వ సమాసాలు.

**బహు పద ద్వంద్వ సమాసం:** రెండు కంటే ఎక్కువ పదాలు సమ ప్రాధాన్యం కలవి ఉంటే అది బహుపద ద్వంద్వ సమాసం. **ఉదా:**
సీతారామలక్ష్మణులు – సీతయును, రాముడును, లక్ష్మణుడును.

**4. బహువ్రీహి సమాసం:** అన్యపదార్థ ప్రాధాన్యం కలది బహువ్రీహి. సమాసంలో ఉన్న రెండు పదాల అర్థం కాకుండా వాటి కలయిక వల్ల వేరొక అర్థం ఉంటే దాన్ని బహువ్రీహి సమాసం అంటారు. విగ్రహ వాక్యంలో 'కలది, కలవాడు' పదాలు వస్తాయి. **ఉదా:**
- కమలనాభుడు – కమలము నాభియందు కలవాడు (విష్ణువు)
- ముక్కంటి–మూడు కన్నులు కలవాడు(శివుడు)
- పూబోడి – 'పూవు వంటి శరీరం కలది' (స్త్రీ)
- మీనాక్షి–మీనముల వంటి అక్షములు గలది (స్త్రీ).

### గత డీఎస్సీ, టెట్‌లో అడిగిన ప్రశ్నలు

1. బహువ్రీహి సమాసానికి ఉదాహరణలు? (ఎస్ఏ–2012)
   1) మోటబరి, ముచ్చిచ్చు
   2) ముప్పాతిక, పాపరేడు
   3) చలివెలుగు, అక్కన్య
   4) వేవెలుగు, ముక్కంటి
2. నీ చేతి ప్రోపు? (ఎస్ఏ–2012)
   1) బహువ్రీహి 2) నఞ్ తత్పురుష
   3) అలుక్సమాసం 4) లుక్సమాసం
3. ఉత్తర పద ప్రాధాన్యం గల సమాసం? (ఎల్‌పీ –2012)
   1) ద్వంద్వ సమాసం 2) తత్పురుష సమాసం
   3) బహువ్రీహి సమాసం
   4) కర్మధారయ సమాసం
4. బహువ్రీహి సమాసం ఉదాహరణలు? (టెట్–2012 జనవరి)
   1) చక్రపాణి, కుంభకారుడు, నెలతాల్పు
   2) నలువ, చక్రపాణి, కమలాక్షుడు
   3) అతిరథుడు, చక్రపాణి, పీతాంబరుడు
   4) నలువ, సంసార సాగరం, పూబోడి
5. అవ్యయీభావ సమాసానికి ఉదాహరణలు? (టెట్–2012 జూన్)
   1) ఛాయావృక్షం, పూబోడి
   2) భూతబలి, వ్యాఘ్రభీతుడు
   3) ఆబాలము, యథాశక్తి
   4) కపోత వృద్ధము, సంసార సాగరం
6. అరుణాస్పద'పురం' – ఏ సమాసం? (టెట్–2014)
   1) విశేషణ పూర్వపద కర్మధారయం
   2) విశేషణ ఉత్తరపద కర్మధారయం
   3) సంభావన ఉత్తర పదకర్మధారయం
   4) సంభావన పూర్వపద కర్మధారయం

### సమాధానాలు

1) 4; 2) 3; 3) 2; 4) 2; 5) 3; 6) 4.

# శాతవాహనుల రాజభాష ఏది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

## శాతవాహన యుగం

1. శాతవాహనుల కాలంలో చాలా తక్కువగా వాడుకలో ఉన్న లోహం?
   1) వెండి 2) బంగారం
   3) రాగి 4) కంచు
2. శాతవాహనుల కాలం నాటికి ప్రధానంగా ఏర్పడిన వర్ణాలెన్ని?
   1) 4 2) 5 3) 6 4) 8
3. శాతవాహనుల శాసనాల్లో ఏ వర్ణం వారి ప్రస్తావన ఎక్కువగా కనిపించదు?
   1) క్షత్రియులు 2) వైశ్యులు
   3) శూద్రులు 4) బ్రాహ్మణులు
4. శాతవాహనులు మొదట అవలంబించిన మతం ఏది?
   1) వైదికం 2) జైనం
   3) బౌద్ధం 4) జొరాస్ట్రియన్
5. శాతవాహనుల రాష్ట్రాలను ఏ పేరుతో పిలిచే వారు?
   1) నిగములు 2) ఆహారాలు
   3) స్థలాలు 4) నాడులు
6. శాతవాహనుల కాలం నాటి సామాన్య ప్రజలు అవలంబించిన మతం?
   1) జొరాస్ట్రియన్ 2) వైదికం
   3) బౌద్ధం 4) జైనం
7. 'బుద్ధ పాదారాధన' గురించి ప్రస్తావించిన గ్రంథం ఏది?
   1) ఇండికా 2) గాథా సప్తశతి
   3) లీలావతి కావ్యం 4) బృహత్కథ
8. 'రోమన్ శాసనసభ'లో దక్షిణ భారతదేశ వస్త్రాల గురించి ప్రస్తావించింది ఎవరు?
   1) మెగస్తనీస్ 2) పెరిప్లస్
   3) ప్లీని 4) టాలమీ
9. కిందివారిలో బౌద్ధ భిక్షువులకు భూదానాలు అధికంగా చేసిన పాలకుడు ఎవరు?
   1) హాలుడు
   2) మొదటి శాతకర్ణి
   3) రెండో శాతకర్ణి
   4) గౌతమీపుత్ర శాతకర్ణి
10. క్రతు ప్రధానమైన మతం ఏది?
    1) జైనం
    2) వైదిక మతం
    3) బౌద్ధం
    4) పౌరాణిక హిందూమతం
11. కిందివాటిలో 'శివస్తోత్రం'తో ప్రారంభమైన గ్రంథం ఏది?
    1) గాథా సప్తశతి 2) బృహత్కథ
    3) లీలావతి కావ్యం 4) కాతంత్ర
12. దక్షిణాపథంలో 'పాశుపత శైవం' ప్రాచుర్యం పొందిన కాలం ఏది?
    1) క్రీ.శ. 4వ శతాబ్దం
    2) క్రీ.శ. 3వ శతాబ్దం
    3) క్రీ.శ. 2వ శతాబ్దం
    4) క్రీ.శ. 1వ శతాబ్దం
13. 'లకులీశ శివాచార్యుడు' వ్యాప్తికి తెచ్చిన మతం ఏది?
    1) వైదికం 2) పాశుపత శైవం
    3) వైష్ణవం 4) జైనం
14. 'లీలావతి కావ్యం'ను ఏ భాషలో రాశారు?
    1) పైశాచీ 2) సంస్కృతం
    3) తెలుగు 4) ప్రాకృతం
15. 'వాసుదేవుడు' ప్రధాన దైవంగా ఉన్న మతం ఏది?
    1) బౌద్ధం 2) జైనం
    3) శైవం 4) వైష్ణవం
16. 'వైష్ణవ మతం' ఎవరి కాలంలో ఉత్తర భారతదేశం నుంచి దక్షిణ భారతదేశానికి వ్యాప్తి చెందింది?
    1) ఇక్ష్వాకులు 2) శాతవాహనులు
    3) విష్ణుకుండినులు 4) చాళుక్యులు
17. సంస్కృతంలో గ్రంథాలు రాయడం ఏ రాజవంశ కాలంలో ప్రారంభమైంది?
    1) శాతవాహనులు 2) ఇక్ష్వాకులు
    3) విష్ణుకుండినులు
    4) బాదామీ చాళుక్యులు
18. సంస్కృతంలో 'కాతంత్ర' అనే వ్యాకరణ గ్రంథాన్ని రచించింది ఎవరు?
    1) హాలుడు 2) గుణాఢ్యుడు
    3) శర్వవర్మ 4) మెగస్తనీస్
19. శాతవాహనుల రాజభాష ఏది?
    1) తెలుగు 2) ప్రాకృతం
    3) పైశాచీ 4) సంస్కృతం
20. శాతవాహనుల కాలంలో 'ప్రాకృతం' స్థానాన్ని క్రమంగా ఆక్రమించిన భాష ఏది?
    1) తెలుగు 2) పైశాచీ
    3) ఉర్దూ 4) సంస్కృతం
21. పైశాచీ భాష నుంచే తెలుగు ఆవిర్భవించిందని అభిప్రాయపడింది ఎవరు?
    1) సంగనభట్ల నర్సయ్య
    2) డాక్టర్ పరబ్రహ్మశాస్త్రి
    3) తిరుమల రామచంద్ర
    4) డాక్టర్ దినేశ్ చంద్రసర్కార్
22. 'ప్రపంచ కథ'కు మూలం ఏది?
    1) బృహత్కథ 2) గాథా సప్తశతి
    3) లీలావతి కావ్యం 4) ఇండికా
23. గుణాఢ్యుడు 'బృహత్కథ' గ్రంథాన్ని ఏ ప్రాంతంలో ఉండి రాశాడని పరిశోధకుల అభిప్రాయం?
    1) కొలనుపాక 2) ద్రాక్షారామం
    3) కొండాపురం 4) విజయపురి
24. అత్త, పిల్ల లాంటి తెలుగు పదాలు కింది వాటిలో ఏ కావ్యంలో కనిపిస్తాయి?
    1) కాతంత్ర 2) గాథా సప్తశతి
    3) లీలావతి 4) మలయవతి
25. 'కవి వత్సలుడు' అనే బిరుదున్న రాజు?
    1) హాలుడు
    2) గౌతమీపుత్ర శాతకర్ణి
    3) మొదటి శాతకర్ణి 4) యజ్ఞశ్రీ శాతకర్ణి
26. హాలునితో సన్మానం పొందినవారెవరు?
    1) వాత్స్యాయనుడు, నాగార్జునుడు
    2) నాగార్జునుడు, శ్రీపాలితుడు
    3) కుమారీలుడు, శ్రీపాలితుడు
    4) కుమారీలుడు, నాగార్జునుడు
27. హాలుడు సింహళ రాకుమార్తె 'లీలావతి'ని వివాహమాడినట్లు ఏ గ్రంథంలో పేర్కొన్నారు?
    1) గాథా సప్తశతి 2) లీలావతి కావ్యం
    3) బృహత్కథ 4) కాతంత్ర
28. తెలంగాణలో తొలి లిఖిత కవి, ఆయన రాసిన గ్రంథానికి సంబంధించి కింది వాటిలో సరైన జత ఏది?
    1) హాలుడు – గాథా సప్తశతి
    2) గుణాఢ్యుడు – బృహత్కథ
    3) శర్వవర్మ – కాతంత్ర వ్యాకరణం
    4) కుతూహలుడు – లీలావతి కావ్యం
29. 'లీలావతి కావ్యాన్ని' రాసిందెవరు?
    1) హాలుడు 2) నాగార్జునుడు
    3) కుమారీలుడు 4) కుతూహలుడు
30. బహుభాషా కోవిదురాలైన 'మలయవతి' ఎవరి పట్టపురాణి?
    1) యజ్ఞశ్రీ శాతకర్ణి
    2) హాలుడు
    3) గౌతమీపుత్ర శాతకర్ణి
    4) రెండో శాతకర్ణి
31. శాతవాహనుల అధికార మతం ఏది?
    1) జైనం 2) బౌద్ధం
    3) శైవం 4) వైదికం
32. తొలిసారిగా ఏ వంశ పాలకులు వారి పేరుకు ముందు తల్లి పేరును చేర్చుకున్నారు?
    1) ఇక్ష్వాకులు 2) ఆర్యులు
    3) మౌర్యులు 4) శాతవాహనులు
33. తన పేరుకు ముందు తల్లి పేరు చేర్చుకొని పాలించిన మొదటి శాతవాహన చక్రవర్తి?
    1) యజ్ఞశ్రీ శాతకర్ణి
    2) గౌతమీపుత్ర శాతకర్ణి
    3) స్కందశ్రీ శాతకర్ణి
    4) విజయశ్రీ శాతకర్ణి
34. మొదటి శాతకర్ణి భార్య పేరేమిటి?
    1) దేవీ నాగానిక 2) గౌతమీ బాలాశ్రీ
    3) మలయవతి 4) రుద్రదమనిక
35. శాతవాహనుల రెండో రాజధాని ఏది?
    1) కొండాపురం 2) అమరావతి
    3) పైఠాన్ 4) కోటిలింగాల

### సమాధానాలు

1) 3; 2) 1; 3) 4; 4) 2; 5) 2; 6) 3; 7) 2; 8) 3; 9) 4; 10) 2; 11) 1; 12) 4; 13) 2; 14) 4; 15) 4; 16) 2; 17) 1; 18) 3; 19) 2; 20) 4; 21) 3; 22) 1; 23) 3; 24) 2; 25) 1; 26) 3; 27) 2; 28) 2; 29) 4; 30) 2; 31) 4; 32) 4; 33) 2; 34) 1; 35) 3.

## శాతవాహన అనంతర యుగం

1. సోమశేఖర శర్మ శాతవాహనుల తర్వాత ఏ పాలకుల కాలం వరకు 'అజ్ఞాత యుగం'గా పేర్కొన్నాడు?
   1) ఇక్ష్వాకులు
   2) బాదామీ చాళుక్యులు
   3) వాకాటకులు
   4) విష్ణుకుండినులు
2. హర్షుడికి సమకాలికంగా తెలంగాణ ప్రాంతాన్ని పులకేశి పాలించినట్లు పేర్కొన్నవారెవరు?
   1) మల్లంపల్లి సోమశేఖర శర్మ
   2) వట్టికోట ఆళ్వారుస్వామి
   3) ఆదిరాజు వీరభద్రరావు
   4) సురవరం ప్రతాపరెడ్డి
3. 'శ్రీ పర్వతీయులు' అని ఎవరిని పేర్కొంటారు?
   1) బాదామీ చాళుక్యులు
   2) వాకాటకులు
   3) ఇక్ష్వాకులు
   4) విష్ణుకుండినులు
4. ఇక్ష్వాకులు మొదట ఎవరికి సామంతులుగా ఉన్నారు?
   1) వాకాటకులు
   2) శాతవాహనులు
   3) విష్ణుకుండినులు
   4) బాదామీ చాళుక్యులు
5. స్వతంత్రంగా ఇక్ష్వాక రాజ్యాన్ని స్థాపించిన వారెవరు?
   1) వీరపురుషదత్తుడు
   2) ఎహుబల శాంతమూలుడు
   3) రుద్ర పురుషదత్తుడు
   4) వాసిష్ఠీపుత్ర శ్రీశాంతమూలుడు
6. పురాణాల ప్రకారం ఇక్ష్వాక రాజులు ఎంతమంది?
   1) 6 2) 7 3) 8 4) 4
7. ఇక్ష్వాక రాజుల పాలనా క్రమం?
   1) రుద్రపురుషదత్తుడు, శ్రీశాంతమూలుడు, వాసిష్ఠీపుత్ర శ్రీశాంతమూలుడు, వీరపురుషదత్తుడు
   2) వీరపురుషదత్తుడు, ఎహుబల శాంతమూలుడు, శ్రీశాంతమూలుడు, రుద్ర పురుషదత్తుడు
   3) వాసిష్ఠీపుత్ర శ్రీశాంతమూలుడు, వీర పురుషదత్తుడు, ఎహుబల శాంతమూలుడు, రుద్రపురుషదత్తుడు
   4) ఎహుబల శాంతమూలుడు, రుద్రపురుషదత్తుడు, వీరపురుషదత్తుడు, శ్రీశాంతమూలుడు
8. ఇక్ష్వాకుల రాజధాని ఏది?
   1) విజయపురి
   ) నేలకొండపల్లి
   3) ధాన్యకటకం
   4) కోటిలింగాల
9. బి.ఎస్.శాస్త్రి ప్రకారం 'దక్షిణాపథపతి' అనే బిరుదున్న రాజు ఎవరు?
   1) రుద్రపురుషదత్తుడు
   2) శ్రీశాంతమూలుడు
   3) ఎహుబల శాంతమూలుడు
   4) వీరపురుషదత్తుడు
10. ఉజ్జయినీ పాలకుడైన శకరాజు కుమార్తెను వివాహమాడిన రాజు?
    1) వీరపురుషదత్తుడు
    2) రుద్రపురుషదత్తుడు
    3) ఎహుబల శాంతమూలుడు
    4) శ్రీశాంతమూలుడు
11. ఏ రాజవంశ పాలనలో 'ఎలిసిరి' అనే ఉద్యోగి ఉండేవాడు?
    1) ఇక్ష్వాకులు
    2) వాకాటకులు
    3) విష్ణుకుండినులు
    4) బాదామీ చాళుక్యులు
12. 'హలసహస్త్ర' బిరుదాంకితుడెవరు?
    1) రుద్రపురుషదత్తుడు
    2) వీరపురుషదత్తుడు
    3) శ్రీశాంతమూలుడు
    4) ఎహుబల శాంతమూలుడు
13. ఇక్ష్వాకుల రాజ చిహ్నం ఏది?
    1) మయూరం
    2) గుర్రం
    3) వృషభం
    4) సింహం
14. వాసిష్ఠీపుత్ర శ్రీశాంతమూలుడు అవలంబించిన మతం ఏది?
    1) జైనం 2) వైదికం
    3) శైవం 4) బౌద్ధం
15. ఎవరి పాలనా కాలాన్ని 'బౌద్ధమతానికి స్వర్ణయుగం'గా పేర్కొంటారు?
    1) ఎహుబల శాంతమూలుడు
    2) శ్రీశాంతమూలుడు
    3) వీరపురుషదత్తుడు
    4) రుద్రపురుషదత్తుడు
16. ఇక్ష్వాకులు పోషించిన భాష ఏది?
    1) తెలుగు
    2) సంస్కృతం
    3) పైశాచీ
    4) ప్రాకృతం
17. ఇంద్రపాలనగర శాసనాన్ని ఎవరు వేయించారు?
    1) విక్రమేంద్రభట్టారక వర్మ
    2) విక్రమేంద్రవర్మ
    3) మూడో మాధవవర్మ
    4) రెండో మాధవవర్మ
18. మేనత్త కూతురును వివాహం చేసుకోవడం ప్రధానంగా ఏ రాజవంశంలో కనిపిస్తుంది?
    1) ఇక్ష్వాకులు 2) బాదామీ చాళుక్యులు
    3) విష్ణుకుండినులు
    4) శాతవాహనులు

### సమాధానాలు

1) 2; 2) 4; 3) 3; 4) 2; 5) 4; 6) 2; 7) 3; 8) 1; 9) 3; 10) 2; 11) 1; 12) 3; 13) 4; 14) 2; 15) 3; 16) 4; 17) 1; 18) 1.

# What is the full form of MSME?

BANK EXAMS

BANKING AWARENESS

## MODEL QUESTIONS

1. Which Bank has opened its first branch in South Korea (Seoul) on 13th Jan, 2016 ?
   a) ICICI
   b) Punjab National Bank
   c) Corporation Bank
   d) State Bank of India
   e) Indian Overseas Bank
2. The purpose of SARFAESI Act 2002 is:
   a) Recovery of dues in Education Loans only
   b) Recovery term loans sanctioned for construction of infrastructure projects
   c) Court permission is must before recovery of overudes in NPAs
   d) Recovery of dues classified as non-performing assets without intervention of court
   e) None of the above
3. A banknote, of which a portion is missing or which is composed of more than two pieces is called ?
   a) Soiled Note
   b) Cut Note
   c) Duplicate Note
   d) Bad Note
   e) Mutilated banknote
4. Consumption loan under priority sector can be granted to..
   a) Rural artisans
   b) Small/Marginal farmers
   c) Landless labourers
   d) All e) None
5. Which of the following is a borrowing facility/loan advance __?
   a) Term finance
   b) Performance guarantee
   c) Bill received under letter of credit
   d) All the above
   e) None of the above
6. Collateral securities can be ___?
   a) Tangible
   b) Intangible in the shape of personal guarantee of a third party
   c) Security given to get credit facilities/loan
   d) All of the above
   e) None of the above
7. A charge where there is neither the transfer of ownership nor the possession is called _____?
   a) Hypothecation
   b) Lien
   c) Pledge
   d) Mortgage
   e) None of the above
8. As per the directives of Reserve bank of India, 'Notice deposit' shall mean:
   a) The deposit withdrawable at the will of the depositor
   b) The deposit repayable only after the bank gives notice to the depositor
   c) Term deposit for specific period but with drawable on giving at least one complete banking day's notice
   d) None of the above
   e) All of the above
9. Regional Rural Banks have been permitted to pay ½% additional interest on ____?
   a) All deposits accounts except current deposits
   b) All deposits accounts including current deposits
   c) Saving account and time deposits of less than three years
   d) All deposit accounts except Recurring Deposit Scheme
   e) None of the above
10. Name the 9 digit numeric code that uniquely identifies a bank branch participating in electronic clearing scheme?
    a) MICR b) ECS c) NEFT
    d) IFSC e) INFINET
11. What is the full form of the CORE word in Core Banking Solutions?
    a) Core Online Real-time Exchange
    b) Centralized Online Real-time Exchange
    c) Central Online Real-time Exchange
    d) Centralized Online Retail Exchange
    e) None of the above
12. Which Bank scores a first, mortgage portfolio crossing Rs 1 lakh crore ?
    a) State Bank of India
    b) HDFC
    c) CORPORATION BANK
    d) ICICI
    e) Punjab National Bank
13. A part of the issued capital of the Regional Rural Banks is subscribed as under___?
    a) Fifty per cent by Central Government
    b) Fifty per cent by State Government
    c) Thirty per cent by sponsoring bank
    d) All the above
    e) None of the above
14. Which amongst the following is not term deposits issued by commercial banks?
    a) Current account
    b) Fixed deposit
    c) Recurring deposit
    d) Reinvestment deposit
    e) All the above
15. What is the main purpose of Open market o perations?
    a) A fiscal device which assists Government borrowing
    b) A monetary measure to regulate quantity of money in circulation and the cash reserves of the commercial banks
    c) A measure to counteract extreme trends in business
    d) A measure to influence the balance of payments position
    e) None of the above
16. What is the full form of MSME?
    a) Mini, Small and Medium Enterprises
    b) Micro, Small and Medium Enterprises
    c) Mini scale Marketing Enterprises
    d) Medium Scale Marketing Enterprises
    e) None of the above
17. A customer is required to maintain adequate balances in his/her accounts in order to use his ____ card in the merchant establishments?
    a) Smart Card
    b) Credit Card
    c) Add-on Credit card
    d) Debit Card
    e) None of the above
18. Which of the following are the latest guidelines issued by the RBI in respect of opening new branches in villages?
    a) To open more brick and mortar branches in villages where there are no banking facilities and population is more than 5,000.
    b) Banks to submit a roadmap on how many branches they will be opening by 31 March 2017.
    c) The roadmap by end of January 2016.
    d) BCBF Model to be discontinued
    e) Only a, b, c
19. Name the financial instrument which is/are issued for short term (up to one year) borrowing by RBI on behalf of the Government of India?
    a) Treasury Bills
    b) Commercial Paper
    c) Certificate of Deposit
    d) Non-convertible Debenture
    e) Only b & c
20. KYC (Know Your Customer) norms were implemented in the Indian banking system in 2002 as per the directive of ?
    a) SEBI b) RBI c) IBA
    d) IRDA e) None of these
21. Often, we read in the newspapers that several Indian companies are taking the FCCB route to raise capital. What does the term FCCB stand for?
    a) Foreign Currency Convertible Bond
    b) Foreign Convertible Credit Bond
    c) Financial Consortium and Credit Bureau
    d) Future Credit and Currency Bureau
    e) None of these
22. Account Holder of Which of the following accounts with a bank will be issued with ATM cards?
    a) Saving bank account
    b) Current accounts
    c) Term deposits
    d) Loan or cash credit accounts
    e) Either a or b
23. A commercial paper is
    a) A paper issued by Reserve Bank of India an trade and commerce
    b) An unsecured money market instrument issued in the form of promissory note
    c) A document issued by IDBI for seeking refinance facility from Reserve Bank India
    d) All of the above
    e) None of the above
24. Which of the following would fall under the category of retail banking?
    a) Home Loans
    b) Credit Cards
    c) Personal Loans
    d) Car Loans e) All of these
25. Who decides how much quantity of the coins to be minted?
    a) Reserve Bank of India
    b) Central Government
    c) Finance Ministry
    d) Both RBI and Central Government decide
    e) None of the above
26. What are the components of Foreign Exchange Reserves?
    a) Foreign currency assets
    b) Gold
    c) Special Drawing Rights
    d) Reserve Position in the IMF
    e) All the above
27. The chairman of Regional Rural Bank is appointed by _____?
    a) State Government
    b) Reserve Bank of India
    c) Central Government
    d) Sponsoring bank in consultation with NABARD
    e) None of the above
28. To control inflationary situation in the economy, RBI can increase one or more of these monetary tool?
    a) CRR-SLR-Bank Rate
    b) SLR-CRR-Base Rate
    c) CRR-SLR-Repo Rate
    d) CRR-SLR-Reverse Repo Rate
    e) CRR-SLR-BPLR
29. Who can open various types of non-resident accounts?
    a) Persons of Indian Nationality or person of Indian origin residing outside India
    b) Persons of foreign nationality or origin residing outside India
    c) Firms, companies and other organization resident outside India
    d) a, b and c
    e) None
30. ATMs which are set up, owned and operated by non-banks are called as?
    a) White Label ATMs
    b) Green Label ATMs
    c) Brown Label ATMs
    d) Red Label ATMs
    e) None of the above
31. What is the name of the asset which has remained NPA for a period exceeding 12 months?
    a) Sub-standard
    b) Doubtful asset
    c) Loss asset d) Critical Asset
    e) None of the above

### KEY

1) d; 2) d; 3) e; 4) d; 5) a; 6) d; 7) a; 8) c; 9) c; 10) a; 11) b; 12) d; 13) a; 14) a; 15) b; 16) b; 17) d; 18) e; 19) a; 20) b; 21) a; 22) b; 23) b; 24) e; 25) b; 26) e; 27) d; 28) a; 29) d; 30) a; 31) b.